గురువారం
8•2•2018

హైదరాబాద్
• వెల.5 రూ.

• సంపుటి 7 • సంచిక 242
• పేజీలు : 16 + (24/20/16)

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD




# కాంగ్రెస్‌ది.. హంతక చరిత్ర

■ 'అదో లోఫర్ పార్టీ'

- ఎమర్జెన్సీ విధించిన కాంగ్రెస్ ప్రజాస్వామ్యంపై మాట్లాడటమా?
- రాహుల్ పప్పు అని గూగుల్ ఘోషిస్తున్నది
- వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్‌దే విజయం
- లేదంటే రాజకీయాలనుంచి తప్పుకొంటా
- ఉత్తమ్‌కు దమ్ముంటే సవాలు స్వీకరించాలి
- అమలుస్థాయికి చేరుకుంటున్న పథకాలు
- తాగే ప్రతి నీటిచుక్కలో కేసీఆర్ కనిపిస్తారు
- కాంగ్రెస్ హయాంలో ఇచ్చింది ఐదారువేల ఉద్యోగాలే
- టీఆర్ఎస్ మూడున్నరేండ్లలో 30వేల ఉద్యోగాలు ఇచ్చింది
- ఏదైనా ప్రాజెక్టుకు జాతీయహోదా అడిగితే మోదీ నుంచి స్పందన లేదు
- ఐటీఐఆర్ ఊసే ఎత్తని కేంద్రమంత్రులు
- బీజేపీ సంగతిని ప్రజలే చూసుకుంటారు
- కేసీఆర్‌తో పోల్చుకునే సీన్ ఏ నేతకూ లేదు
- మీడియాతో ఇష్టాగోష్ఠిలో మంత్రి కే తారకరామారావు
- ఐటీ కాంగ్రెస్ ముగింపు వేడుకలకు రాష్ట్రపతికి ఆహ్వానం



## బాహుబలి కలెక్షన్ల కన్నా తక్కువే!

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించిన నిధులు బాహుబలి చిత్రం కలెక్షన్లకంటే తక్కువగా ఉన్నాయి. బడ్జెట్‌ను చూసి బీజేపీ ఎంపీలే అసంతృప్తిగా ఉన్నారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలే నిధులకోసం గొడవ చేస్తున్నాయి. శివసేన ఇప్పటికే బయటికివెళ్లింది. టీడీపీ అసంతృప్తితో ఉన్నది. శిరోమణి అకాలీదళ్ కూడా అసంతృప్తిగా ఉంది. **- మంత్రి కేటీఆర్**

### సీఎం పదవికోసం రాజధానిలో మారణహోమం సృష్టించారు

### చెన్నారెడ్డే ఈ మాట చెప్పారు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కాంగ్రెస్ నరహంతక పార్టీ అని, హత్యారాజకీయాల గురించి ఆ పార్టీ మాట్లాడటం విడ్డూరంగా ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు విమర్శించారు. సీఎం పదవికోసం రాష్ట్ర రాజధానిలో నరమేధాన్ని సృష్టించిన చరిత్ర కాంగ్రెస్ నాయకులకు ఉందని అన్నారు. ఇది తాము చెప్తున్న విషయం కాదని, మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డే చెప్పారని గుర్తుచేశారు. ప్రజాస్వామ్యం గురించి కాంగ్రెస్ నాయకులు మాట్లాడటాన్ని ఎద్దేవాచేసిన మంత్రి.. 'దేశంలో ఎమర్జెన్సీ విధించింది కాంగ్రెస్‌కాదా? దేశంలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన అనేక రాష్ట్ర ప్రభుత్వాలను 356 ఆర్టికల్‌ను ప్రయోగించి కూల్చింది కాంగ్రెస్‌కాదా? రాష్ట్రంలో ఎన్టీఆర్‌ను పదవి నుంచి దింపింది వాస్తవం కాదా?' అని ప్రశ్నించారు. గల్లీ హత్యను పెద్ద హత్యగా మార్చిన ఘనత కాంగ్రెస్ నాయకులకే దక్కుతుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీని పప్పు అని అభివర్ణించారు. గూగుల్‌లో పప్పు అని టైప్‌చేస్తే ఎవరి పేరు వస్తుందో అందరికీ తెలుసునని కేటీఆర్ వ్యాఖ్యానించారు. తనను బచ్చా అంటున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాహుల్‌గాంధీ కూడా ఉత్తమ్‌కన్నా బచ్చానే అన్న విషయాన్ని మరువద్దన్నారు. కాంగ్రెస్ లోఫర్ పార్టీ అని, ఆ పార్టీ నేతల మాటలను చూసి దయ్యాలు కూడా సిగ్గుపడాల్సిన పరిస్థితి ఉందని మంత్రి చెప్పారు. మీడియా గొంతు కూడా నొక్కారని విమర్శించారు. కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అనేకమార్లు టీఆర్ఎస్‌లో చేరడానికి తలుపు తట్టి పోయారని గుర్తుచేశారు. వచ్చే ఎన్నికల్లో టీఆర్ఎస్ ఘన విజయం


మిగతా 2వ పేజీలో


## కీలక వడ్డీరేట్లు మళ్లీ యథాతథం



ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటుపై ఆందోళనే కారణం

ఈసారి వృద్ధిరేటు 6.6 శాతమే.. ఆర్బీఐ ద్రవ్య సమీక్షలో అంచనా

ఎంసీఎల్ఆర్‌తో బేస్ రేటు అనుసంధానం

గృహరుణాలు తీసుకున్నవారికి ప్రయోజనం


13


## 22న ఐసెట్ నోటిఫికేషన్

మార్చి 6 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

మే 23, 24న ఆన్‌లైన్ పరీక్ష.. జూన్ 6న ఫలితాల విడుదల

షెడ్యూల్ విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి


2






- దళిత సీఎంను అవమానించిన చరిత్ర కాంగ్రెస్ నేతలది
- పటేల్ ప్రధాని అయి ఉంటే కశ్మీర్ మొత్తం మనవద్దనే ఉండేది
- ప్రజాస్వామ్యం గురించి మాకు పాఠాలు చెప్పవద్దు
- లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీని దుయ్యబట్టిన ప్రధాని మోదీ

# తలుపులు మూసి ఏపీని విభజించారు!

### కాంగ్రెస్ వల్లే ఆ రాష్ట్రంలో సమస్యలు: ప్రధాని మోదీ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:**

తెలంగాణ ఏర్పాటుపై ప్రధాని మోదీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ తలుపులు మూసేసి, ఆంధ్రప్రదేశ్‌ను విభజించి తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేశారని ఆయన కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు బుధవారం ఆయన సమాధానం ఇచ్చారు. రాష్ట్ర విభజన సందర్భంగా చేసిన వాగ్దానాలను నెరవేర్చాలని కోరుతూ మూడు రోజులుగా టీడీపీ, వైసీపీ సభ్యులు ఓవైపు లోక్‌సభలో ఆందోళన చేస్తుండగా, వారికెటువంటి హామీలివ్వని ప్రధాని కాంగ్రెస్‌పై విమర్శల దాడి చేశారు. ఆ రెండు పార్టీల ఎంపీలు తన ప్రసంగానికి అడ్డు తగులుతున్నా.. ఆయన తెలుగువారి ఆత్మగౌరవం గురించి మాట్లాడారు. రాజకీయ ప్రయోజనాల కోసం యూపీఏ ప్రభుత్వం తీసుకున్న తొందరపాటు నిర్ణయం వల్లనే ఆంధ్రప్రదేశ్ ఇబ్బందులకు గురవుతున్నదని మోదీ ఆరోపించారు. తెలంగాణ ఏర్పాటుకు తాము సానుకూలమని అంటూనే విభజన తీరు బాగాలేదని అన్నారు. విభజన జరిగి నాలుగేండ్లు గడుస్తున్నా సమస్యలు అలాగే ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ రాజకీయ అవినీతికి అతిపెద్ద


మిగతా 5వ పేజీలో




బుధవారం పోచంపల్లిలో చీర తయారీ విధానాన్ని ఆసక్తిగా గమనిస్తున్న గవర్నర్ నరసింహన్ దంపతులు

## పోచంపల్లి ఇమేజ్ పెంచాలి

చేనేత కార్మికులకు ప్రభుత్వం అండ: గవర్నర్ నరసింహన్


2




**ఆయుష్మాన్ భారత్**

## భారాన్ని కేంద్రమే భరించాలి

ఎంపీ జితేందర్‌రెడ్డి


2

# ఒక్కసారిగా మారిన వాతావరణం

**పెరిగిన తేమశాతంతో తగ్గిన ఎండ తీవ్రత • అక్కడక్కడా చిరుజల్లులు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పగలు ఎండ, రాత్రి చలి అన్న తీరుగా ఉన్న వాతావరణం బుధవారం ఒక్కసారిగా మారింది. వారంరోజులుగా మధ్యాహ్నం పూట ఎండవేడిమితో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రజలకు బుధవారంనాటి వాతావరణం ఆహ్లాదం కలిగించింది. ఉత్తర భారతదేశం నుంచి వీస్తున్న చలిగాలులకు తోడు బంగాళాఖాతంలో ఏర్పడిన ద్రోణి ప్రభావంతో తేమతో కూడిన గాలులు రాష్ట్రం వైపు వీస్తున్నాయని, దీంతో ఆకాశంలో మబ్బులు కమ్ముకున్నాయని తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టీఎస్‌డీపీఎస్) పేర్కొన్నది. బుధవారం హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లోనూ ఇదే రకమైన వాతావరణం ఉందని వాతావరణ కన్సల్టెంట్ రాంబాబు 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కాగా హైదరాబాద్‌లో పలుచోట్ల చిరుజల్లులు కురిశాయి. ఈ నెల 10 నుంచి రెండ్రోజులపాటు జల్లులు కురిసే అవకాశం ఉన్నట్టు టీఎస్‌డీపీఎస్ అధికారులు తెలిపారు.

**తగ్గనున్న చలి తీవ్రత..**

వాతావరణంలో వచ్చిన మార్పులతో చలి తీవ్రత తగ్గే అవకాశం ఉందని టీఎస్‌డీపీఎస్ అధికారులు తెలిపారు. ఆకాశం మేఘావృతమై ఉండటంతో పగటి ఉష్ణోగ్రతలు తగ్గాయని పేర్కొన్నారు. మబ్బుల కారణంగా భూవాతావరణం త్వరగా చల్లారక రాత్రి ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగే అవకాశం ఉన్నదని చెప్పారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మేడ్చల్-మల్కాజిగిరిలో 11.8 డిగ్రీలు, కామారెడ్డిలో 12.1, సంగారెడ్డిలో 12.6, రంగారెడ్డిలో 12.8, హైదరాబాద్‌లో 15.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు టీఎస్‌డీపీఎస్ నివేదిక వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా అత్యధికంగా వనపర్తిలో 17.9 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది.

# ఐసెట్-2018 షెడ్యూల్ విడుదల

- 22న నోటిఫికేషన్ జారీ
- మార్చి 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ
- మే 23, 24న ఆన్‌లైన్ పరీక్ష
- జూన్ 6న ఫలితాలు విడుదల
- ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి వెల్లడి



బుధవారం కేయూలో ఐసెట్-2018 షెడ్యూల్‌ను ప్రకటిస్తున్న తెలంగాణ ఉన్నత విద్యామండలి చైర్మన్ పాపిరెడ్డి

**హన్మకొండ, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీఎస్ ఐసెట్-2018 షెడ్యూల్ విడుదలైంది. మే 23, 24 తేదీల్లో ఆన్‌లైన్‌లో ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. బుధవారం కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్‌హాల్‌లో కేయూ వీసీ ప్రొఫెసర్ ఆర్ సాయన్న, ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్ వెంకటరమణ, ఐసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యశర్మతో కలిసి మీడియా సమావేశంలో టీఎస్ ఐసెట్-2018 షెడ్యూల్‌ను ఆయన ప్రకటించారు. మొదటిసారి పూర్తిగా ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించనున్నట్టు చెప్పారు. టీఎస్ ఐసెట్ -2018 నోటిఫికేషన్ ఈ నెల 22న జారీ అవుతుందని, మార్చి 6వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని చెప్పారు. ఏప్రిల్ 30వ తేదీన దరఖాస్తు గడువు ముగుస్తుందని తెలిపారు. రూ.500 అపరాధ రుసుముతో మే 5 వరకు, రూ.2 వేల రుసుముతో మే 10 వరకు, రూ.5వేల రుసుముతో మే 14 వరకు, రూ.10 వేల అపరాధ రుసుముతో మే 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. మే 7వ తేదీ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ ప్రారంభం అవుతుందని వివరించారు. మే 23, 24తేదీల్లో ఆన్‌లైన్‌లో పరీక్షను మూడు సెషన్లలో నిర్వహించనున్నట్టు పాపిరెడ్డి తెలిపారు. మే 27న ప్రిలిమినరీ 'కీ' ని విడుదల చేస్తామని, జూన్ 4వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించి, జూన్ 6వ తేదీన తుది ఫలితాలను ప్రకటిస్తామని చెప్పారు. ప్రవేశ పరీక్షకు హాజరయ్యే జనరల్, బీసీ అభ్యర్థులు రూ.650, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.450 ఫీజు చెల్లించాలని సూచించారు.

**పరీక్ష కోసం 16 రీజినల్ కేంద్రాలు**

టీఎస్ ఐసెట్-2018 పరీక్ష నిర్వహణ కోసం రాష్ట్రంలో 12, ఆంధ్రప్రదేశ్‌లో నాలుగు రీజినల్ పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు తుమ్మల పాపిరెడ్డి తెలిపారు.



# పోచంపల్లి ఇమేజ్ పెంచాలి

- అంతర్జాతీయస్థాయిలో వస్త్రాలు నేయాలి
- చేనేత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంది
- బ్యాంకులు చేనేతకు విరివిగా రుణాలివ్వాలి
- గవర్నర్ నరసింహన్ ఉద్బోధ
- నేత పనివారి సమస్యలు సీఎం దృష్టికి తెస్తానని హామీ
- కుటుంబసభ్యులతో కలిసి పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లో పర్యటన
- చేనేత సంఘాల ప్రతినిధులు, కార్మికులు, బ్యాంకర్లతో సమావేశం



బుధవారం పోచంపల్లిలో చేనేత వస్త్రాల నైపుణ్యాన్ని చూసి అబ్బురపడుతున్న గవర్నర్ నరసింహన్ దంపతులు. చిత్రంలో కలెక్టర్ అనితారామచంద్రన్, సీనియర్ ఐఏఎస్ అధికారి శైలజారామయ్యర్ తదితరులు కూడా ఉన్నారు

**యాదాద్రి భువనగిరి ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** చేనేత కార్మికులు అంతర్జాతీయ మార్కెట్‌ను ప్రభావితం చేసేవిధంగా వృత్తిలో రాణించాలని, పోచంపల్లికి చేనేతల బ్రాండ్ ఇమేజీని ఇంకా పెంచాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నేత కార్మికులు ఆకర్షణీయమైన సరికొత్త వస్త్రాల డిజైన్లు రూపొందించాలని చెప్పారు. బుధవారం గవర్నర్ కుటుంబసభ్యులతో కలిసి పోచంపల్లి, చౌటుప్పల్ మండలాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యటించి నేత కార్మికుల కష్టసుఖాలను తెలుసుకున్నారు. పోచంపల్లి గ్రామీణ టూరిజం పార్కులో చేనేత స్వయం సహాయక మహిళాసంఘాలు, బ్యాంకర్లు, మాస్టర్ వీవర్లు, సొసైటీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి మాట్లాడుతూ చేనేత కుటుంబాల జీవితాల్లో వెలుగులు నింపడానికి ప్రభుత్వం కృషిచేస్తున్నదని, నేత కార్మికులకు అండగా ఉంటున్నదని తెలిపారు. చేనేత పని చాలా అద్భుతమైనదని ఆయన అభివర్ణించారు. అయితే డిమాండ్‌కు తగినరీతిలో వస్త్రాలు నేయాలని, ఉత్పాదక సామర్థ్యాన్ని, అమ్మకాలు పెంచుకుని ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం కావాలని సూచించారు. మాల్‌ధరలు పెరిగినా ఆమేరకు చీరల ధరలు పెరుగకపోవడంతో ఆశించిన లబ్ధిచేకూరడం లేదని చేనేత కార్మికులు గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. ప్రభుత్వం చేనేతవస్త్రాలకు మార్కెటింగ్ సౌకర్యాలను పెంపొందించాలని కోరారు. చేనేత కార్మికుల పిల్లలకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఉచితంగా విద్యనభ్యసించే వెసులుబాటు కల్పించాలని అన్నారు. కాగా, వారానికి 7 చీరలు నేసే వారికి రూ. 20వేల వరకు ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని సహకార సంఘాల ప్రతినిధులను గవర్నర్ కోరారు. నిజమైన చేనేత కార్మికులు నష్టపోకుండా అన్ని మగ్గాలకు జియోట్యాగింగ్ సౌకర్యం కల్పించాలని అధికారులకు సూచించారు. నేత కార్మికుల సమస్యలు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తెచ్చి పరిష్కారానికి తగుచర్యలు తీసుకుంటానని చెప్పారు. నేత కుటుంబాలవారందరితో జన్‌ధన్ ఖాతాలు ప్రారంభించి వారికి విరివిగా ముద్ర రుణాలు అందించాలని బ్యాంకర్లకు సూచించారు. గవర్నర్ నరసింహన్ శ్రీరామనంద తీర్థసంస్థకు చేరుకుని అక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థుల నైపుణ్యాన్ని పరిశీలించారు. సంస్థ ప్రాంగణంలో గవర్నర్ దంపతులు మొక్కలు నాటారు. గవర్నర్ దంపతులు ముందుగా కనుముక్కులలోని మెగా చేనేత క్లస్టర్‌ను కూడా సందర్శించి అక్కడ నేత వస్త్రాలు కొనుగోలు చేశారు. మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, ఎంపీ బూర నర్సయ్యగౌడ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎలిమినేటి కృష్ణారెడ్డి, జిల్లాకలెక్టర్ అనితారామచంద్రన్, జాయింట్ కలెక్టర్ రవినాయక్ తదితరులు గవర్నర్‌కు స్వాగతం పలికారు. చౌటుప్పల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

**నేత కార్మికుని ఇంటికి గవర్నర్..**

ఈ పర్యటన సందర్భంగా గవర్నర్ నరసింహన్ పోచంపల్లిలోని చేనేత కార్మికుడు గొట్టిముక్కల ఇస్తారి ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ జీవన స్థితిగతులను గవర్నర్ స్వయంగా తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి ఎంత ఆదాయం వస్తున్నది.. ప్రభుత్వ పథకాలు ఏ మేరకు అందుతున్నదీ అడిగారు. తరువాత గవర్నర్ దంపతులు చౌటుప్పల్ మండలం దండుమల్కాపూర్‌లో మోడల్ అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి అక్కడ విద్యార్థులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూశారు. అనంతరం చౌటుప్పల్ కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని చెప్పారు.

## 'ఆయుష్మాన్ భారత్' ఖర్చును

# కేంద్రమే భరించాలి

- కనీస మద్దతు ధరను రాష్ట్రాలపై మోపొద్దు
- కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు అన్యాయం
- విభజన సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలుచేయాలి
- కేసీఆర్ సమర్థ నాయకత్వంలో అభివృద్ధి పథం
- లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత జితేందర్‌రెడ్డి



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆయుష్మాన్ భారత్ పాలసీ భారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని లోక్‌సభలో టీఆర్ఎస్ పక్షనేత ఏపీ జితేందర్‌రెడ్డి కోరారు. ఆయుష్మాన్ భారత్ ప్రకటనలో స్పష్టత లేదని, ఇందుకోసం కేవలం రూ.2 వేల కోట్లు మాత్రమే కేటాయించారని పేర్కొన్నారు. ప్రజారోగ్యానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించారని చెప్పారు. కేంద్ర బడ్జెట్‌పై బుధవారం లోక్‌సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడారు. 'కేంద్ర బడ్జెట్‌లో ఈసారి తెలంగాణకు అన్యాయం జరిగింది. కేంద్ర బడ్జెట్‌పై ఏ ఒక్కవర్గం సంతృప్తిగా లేదు. విభజన చట్టంలో తెలంగాణకు అనేక హామీలు ఇచ్చారు. విభజన సమయంలో తెలంగాణతోపాటు ఏపీకి కేంద్రం ఇచ్చిన హామీలను అమలుచేయాలి. తెలంగాణలో ఎయిమ్స్ ఏర్పాటుపై ఇప్పటివరకు స్పందన లేదు. రైతులకు మద్దతు ధర విషయంలో కేంద్ర బడ్జెట్‌లో స్పష్టత లేదు. వ్యవసాయ రంగానికి ప్రత్యేక కేటాయింపులు లేవు. వ్యవసాయ, సహకార రంగాలు, రైతుల సంక్షేమానికి గత ఏడాది కేంద్రం సవరించిన అంచనాల ప్రకారం రూ.46,105 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఆయా రంగాలకు బడ్జెట్ ప్రతిపాదనలు రూ.46,700 కోట్లు మాత్రమే ఉన్నాయి. నామమాత్రంగానే పెంపు జరిగింది. ఈ పరిస్థితుల్లో కనీస మద్దతు ధర విషయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలుచేయడానికి కేంద్రానికి ఎలా సాధ్యమవుతుంది?' అని ప్రశ్నించారు. రైతులపై, రాష్ట్రాలపై భారం పడకుండా కనీస మద్దతు ధరను అమలుచేయాలని కోరారు. 'చిన్న రాష్ట్రమే అయినా అభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నది. కేసీఆర్ సమర్థ నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం ముందుకు సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నది. ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా రైతులకు ఏడాదికి రెండు పంటలకు కలిపి రూ.8 వేలు పెట్టుబడి కోసం అందజేయనున్నది. ఈ కార్యక్రమాన్ని ఈ ఏడాది నుంచే అమలు చేయబోతున్నది. తెలంగాణ ప్రభుత్వం రైతులకు 24 గంటలపాటు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇది చాలా ఖర్చుతో కూడుకున్న పని. దీనివల్ల తెలంగాణ ప్రభుత్వంపై అదనపు ఆర్థికభారం పడుతున్నది. కేంద్రం ఇచ్చిన హామీలు నెరవేరిస్తే.. రాష్ట్ర సర్కార్‌పై ఈ ఆర్థికభారం ఉండదని భావిస్తున్నా' అని జితేందర్‌రెడ్డి పేర్కొన్నారు. రైతు రైతుగానే ఉంటాడని, ఆయనకు ఇవ్వకపోతే ఇంకెవరికి ఇస్తారని కేంద్రాన్ని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వ ప్రధానపథకాలైన ఉపాధి హామీ, స్వచ్ఛభారత్ మిషన్, జాతీయ గ్రామీణ తాగునీటి పథకం, ప్రధానమంత్రి ఆవాజ్‌యోజన పథకాలకు నిధులు తగ్గించారని ఆయన చెప్పారు.'శిశు, ఆరోగ్య పునరుత్పత్తికి ఈ ఏడాది బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గాయి. ఇది తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు భిన్నంగా ఉన్నది. తెలంగాణలో గర్భిణుల కోసం కేసీఆర్ కిట్ల పథకాన్ని ప్రవేశపెట్టాం. పథకంలో భాగంగా ఒక్కోగర్భిణికి రూ.12 వేల సాయం అందుతున్నది. ఆడ శిశువు జన్మించినప్పుడు అదనంగా మరో రూ.వెయ్యి అందజేస్తున్నాం. కేసీఆర్ కిట్‌లో 15 బ్రాండ్ల ఉత్పత్తులు పంపిణీ చేస్తున్నాం. ఇవి తల్లి, శిశువుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి' అని జితేందర్‌రెడ్డి వివరించారు.

## ఓటర్ల నమోదుకు రేపటి వరకు అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓటరు లిస్టు నమోదు ప్రక్రియలో భాగంగా కొత్త ఓటర్లకు 9వ తేదీవరకు అవకాశం కల్పించనున్నట్టు ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి, చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ అనూప్ సింగ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.49 గంటలకు

సూర్యాస్తమయం: 6.11 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, కృష్ణపక్షం అష్టమి ఉదయం 10.15 వరకు తదుపరి నవమి, నక్షత్రం: విశాఖ మధ్యాహ్నం 2.20 వరకు, తదుపరి అనూరాధ, అమృతఘడియలు: తె. 4.47 నుంచి ఉదయం 6.23 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.55 నుంచి 3.21 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 3.09 నుంచి 4.40 వరకు, వర్జ్యం: సాయంత్రం 6.46 నుంచి రాత్రి 8.22 వరకు.

**లోకం పోకడ**




# కాంగ్రెస్‌ది.. హంతక చరిత్ర

మొదటిపేజీ తరువాయి...

సాధిస్తుందని ధీమా వ్యక్తంచేసిన మంత్రి కేటీఆర్.. ఒకవేళ ఎన్నికల్లో టీఆర్ఎస్ ఓడిపోతే రాజకీయాల నుంచి తప్పుకొంటానని, పీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి దమ్ము ధైర్యం ఉంటే తన సవాలును స్వీకరించాలని అన్నారు. తన సవాలును స్వీకరించకుండా తమ కుటుంబానికి ఉత్తమ్ ముడిపెట్టడాన్ని ఆయన ఎద్దేవాచేశారు. కుటుంబాల వెనుక దాక్కోవద్దని హితవుపలికారు. బుధవారం బేగంపేటలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్ మీడియాతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సమకాలీన రాజకీయ పరిస్థితులు, పలు ఇతర అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఎకరానికి రూ.8వేల పెట్టుబడి పథకం ఒక యజ్ఞమని, ప్రతి రైతుకు చేరుతుందని చెప్పారు. నిరంతర విద్యుత్‌సహా అనేక కార్యక్రమాలను రైతులకోసం చేపడుతున్నామని తెలిపారు. వివరాలు ఆయన మాటల్లోనే..

**మా బలం ఇంకా పెరుగుతుంది**

ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ఇప్పుడే అమలుస్థాయికి చేరుకుంటున్నాయి. వాటి ఫలితాలు త్వరలో ప్రజలకు అందుతాయి. అప్పుడు ప్రజల స్పందన ఇంకా అద్భుతంగా ఉంటుందని అంచనావేస్తున్నాం. ఇంటింటికీ నల్లానీటిని అందించాలనే ఆలోచన గత పాలకులకు రాలేదు. కానీ కేసీఆర్ మది నుంచి వచ్చిన ఆలోచనకు త్వరలో ఫలితంరానుంది. తెలంగాణ ప్రజలు తాగే ప్రతీ నీటి చుక్కలో కేసీఆర్ కనిపిస్తారు. మహిళల నీటి కష్టాలకు తెరపడుతుంది. గత ఎన్నికలకంటే టీఆర్ఎస్ మరింత బలోపేతమవుతుంది. 2014లోనూ ఒంటరిగానే పోటీచేశాం. రాబోయే రోజుల్లో కూడా ఒంటరిగానే పోటీచేస్తాం.

**కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలు ఐదారువేలే..**

కాంగ్రెస్ 2004 నుంచి 2014 వరకు అధికారంలో ఉన్నప్పుడు ఐదారువేలకంటే ఎక్కువగా ఉద్యోగాలు ఇవ్వలేదు. కానీ టీఆర్ఎస్ ప్రభుత్వం మూడున్నరేండ్లలో 30వేల ఉద్యోగాలు ఇచ్చింది. ఎవరు దద్దమ్మనో దీనిద్వారా అర్థమవుతుంది. ఎవరు దద్దమ్మ అన్నది



ప్రజలు ఎన్నికల్లో తేలుస్తారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. ఇష్టారీతిన మాట్లాడితే సహించేదిలేదు.

**మిగిలినవి రెండే పార్టీలు..**

రాజకీయపార్టీలు ఎవరైనా పెట్టుకోవచ్చు. ప్రజలే అంతిమ తీర్పు ఇస్తారు. స్వాతంత్ర్యం వచ్చిననాటి నుంచి ఇప్పటివరకు ఉమ్మడి రాష్ట్రంలో అనేక పార్టీలు వచ్చాయి. అనేకమంది పార్టీలు పెట్టారు. కానీ వాటిలో రెండే మిగిలాయి. వీటిల్లో ఒకటి టీడీపీ అయితే రెండోది టీఆర్ఎస్. తెలంగాణ ప్రజలు సరైన సమయంలో సరైన తీర్పు ఇస్తారు. దేశంలో జాతీయపార్టీలు ఏవీ లేవు. కేవలం పెద్దసైజు ప్రాంతీయపార్టీలు, చిన్నసైజు ప్రాంతీయపార్టీలు మాత్రమే ఉన్నాయి. దక్షిణాదిలో ఏ మాత్రం ప్రభావంలేని పార్టీలు ఏ విధంగా జాతీయ పార్టీలు అవుతాయి? ప్రాంతీయ పార్టీలు ప్రజల అభిమానాన్ని చూరగొనడంలో, అభివృద్ధిలో ముందున్నాయి. ఎగుమతుల్లో టాప్ ఐదు రాష్ట్రాల్లో దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలే మూడు ఉన్నాయి. జీడీపీలోనూ, ఇతర ప్రామాణికాల్లోనూ దక్షిణాది రాష్ట్రాలే ముందున్నాయి.

**తెలంగాణకు బడ్జెట్ కేటాయింపులు.. బాహుబలి కలెక్షన్లకన్నా తక్కువే..**

బడ్జెట్‌ను చూసి బీజేపీ ఎంపీలే అసంతృప్తిగా ఉన్నారు. ఎన్డీయే భాగస్వామ్యపక్షాలే నిధులకోసం గొడవచేస్తున్నాయి. శివసేన ఇప్పటికే బయటికివెళ్లింది. టీడీపీ అసంతృప్తితో ఉన్నది. శిరోమణి అకాలీదళ్ కూడా అసంతృప్తిగా ఉంది. టీడీపీ తరపున కేంద్ర మంత్రివర్గంలో ఉన్నవారు క్యాబినెట్ సమావేశంలో బడ్జెట్‌ను ఆమోదించారు. ఆ పార్టీ ఎంపీలు సభలో గొడవచేస్తున్నారు. ప్రజలను, భాగస్వామ్యపక్షాలను, బయటిపక్షాలను సంతృప్తిపర్చక ఎవరికోసం బడ్జెట్ కేటాయించారు? కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు కేటాయించిన నిధులు బాహుబలి కలెక్షన్లకంటే తక్కువగా ఉన్నాయి.

**బీజేపీ సంగతిని ప్రజలే చూసుకుంటారు**

కేంద్రం రాష్ట్రానికి కేటాయించిన నిధులపై ప్రజలకు చెప్తాం. అప్పుడు ప్రజలు గర్జిస్తారు. ఐఐఎం, ఎన్ఐడీ, పసుపుబోర్డు అడిగాం. ఒక్కటి కూడా కేటాయించలేదు. రిజర్వేషన్ల పెంపు, ఎస్సీ వర్గీకరణపై అఖిలపక్షంతో కలువడానికి సమయం ఇవ్వాలని ప్రధాని మోదీ మెట్రో ప్రారంభానికి వచ్చిన సందర్భంగా అడిగితే నిరాకరించారు. గతంలో అపాయింట్‌మెంట్ ఇచ్చి రద్దుచేశారు. కేంద్రం తెలంగాణను దేశంలోని ఒక రాష్ట్రంగానైనా చూస్తుందో లేదోననే అనుమానం వస్తున్నది. కేంద్రంలో తెలంగాణ నుంచి ఉన్న ఒకే ఒక్క మంత్రి దత్తాత్రేయను తొలిగించారు. కిషన్‌రెడ్డి అంబర్‌పేట, లక్ష్మణ్ ముషీరాబాద్ దాటరు. వీరికి అక్కడ పరపతి లేక ఇక్కడ ఏదో ఒకటి మాట్లాడాలని మాట్లాడుతున్నారు. ఎన్నికల్లో రాష్ట్రానికి ఏం ఇచ్చారని బీజేపీ రాష్ట్ర నేతలు చెప్తారు?

**సీఎంగా కేసీఆర్ ప్రాతిపదికనే ఓట్లు..**

వచ్చే ఎన్నికల్లో సీఎంగా కేసీఆర్ ఉండాలా? లేక ఇంకా ఎవరైతే బాగుంటుందని ప్రజలు పోల్చుకొని చూసి ఓటువేస్తారు. సీఎం కేసీఆర్ కేంద్రంగానే ఓటింగ్ జరుగుతుంది. కేసీఆర్‌తో పోల్చుకునే సీన్ రాష్ట్రంలో ఇతరులకు ప్రస్తుతం లేదు. ప్రభుత్వ కార్యక్రమాలతో పార్టీకి లాభం జరుగుతుంది. టీఆర్ఎస్ క్యాడర్ బలంగా ఉంది. జీహెచ్ఎంసీలో రాత్రికి రాత్రే ఫలితాలు రావు. నగర శివారులోని గ్రామాలను మున్సిపాలిటీలుగా మార్చినా రెండు సంవత్సరాల వరకు ఎలాంటి పన్నులు విధించబోం. సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నాం. అసెంబ్లీ సీట్లు పెరిగినా పెరుగకపోయినా టీఆర్ఎస్‌కు ఎలాంటి ఇబ్బంది లేదు. విభజన చట్టంలో పెట్టిన అంశాలను అమలుచేయడానికి కేంద్రానికి అభ్యంతరమేంటి? ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నాం. కేసీఆర్‌కు ప్రస్తుతం 65 సంవత్సరాలే. మరో 10-15 సంవత్సరాలు రాజకీయాల్లో ఉండే సంపూర్ణ ఆరోగ్యం, సమర్థత ఉంది. ఆయన వారసత్వం సమస్య ఉత్పన్నం కాదు.

**కాంగ్రెస్‌లో టీఆర్ఎస్ విలీనమంటే రాజకీయాల నుంచి తప్పుకోవాలనుకున్నా..**

త్రివర్ణ పతాకాన్ని కూడా మలినంచేసిన ఘనత కాంగ్రెస్‌కు దక్కుతుంది. గతంలో టీఆర్ఎస్‌ను కాంగ్రెస్‌లో విలీనంచేయాలన్న ప్రతిపాదనలు వచ్చిన సందర్భంలో రాజకీయాల నుంచి తప్పుకోవాలని అనుకున్నాను. కాంగ్రెస్ పార్టీ దేశానికి పట్టిన దరిద్రం. టీఆర్ఎస్‌లో విలీనం చేయడానికి టీడీపీ ఇంకా ఎక్కడుంది? తెలంగాణ, హైదరాబాద్‌లో శాంతిభద్రతలు బ్రహ్మాండంగా ఉన్నాయి కాబట్టే పెట్టుబడులు పెద్దఎత్తున వస్తున్నాయి. రియల్‌ఎస్టేట్ రంగం పుంజుకుంది. 7.50 మిలియన్ చదరపు అడుగుల ఆఫీస్ స్పేస్ విక్రయాలు జరిగాయి.

## సవాలుకు స్పందించకుంటే ఉత్తమ్ తోకముడిచినట్టే

**నేను** ఇప్పటికి మూడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచాను. మూడున్నరేండ్లుగా మంత్రిగా పనిచేస్తున్నాను. ఉత్తమ్ కూడా మూడు నాలుగు సంవత్సరాలు మంత్రిగా చేశారు. ఉత్తమ్‌స్థాయికి నేను చాలు. ఒకవేళ సవాల్‌కు కేసీఆర్ స్పందించాలంటే మేము కూడా సోనియా, రాహుల్‌గాంధీ స్పందించాలని డిమాండ్‌చేయాల్సి వస్తుంది. నా సవాల్‌కు ఉత్తమ్ స్పందించకుంటే ఆయన తోకముడిచినట్టు భావించాల్సి ఉంటుంది. నేరుగా స్పందించకుండా ప్యాకేజీ మాదిరిగా మా కుటుంబం గురించి ఉత్తమ్ మాట్లాడటం ఛీప్ ట్రిక్. తెలంగాణ ప్రజలపై నాకు విశ్వాసం ఉంది. వారి చైతన్యంపై నమ్మకం, విశ్వాసం ఉన్నాయి. నా అనుభవపూర్వకంగా రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుస్తుందని చెప్తున్నాను. గతంలో వివిధ ఎన్నికల సందర్భంలోనూ సవాల్ విసిరినా కాంగ్రెస్ నేతలు స్పందించలేదు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బల్దియాపై గులాబీ జెండా ఎగురకుంటే మంత్రిపదవికి రాజీనామా చేస్తానని చెప్పాను. ఆనాడు కాంగ్రెస్ నాయకులు స్పందించలేదు. పాలేరు ఉప ఎన్నికలో ఆ ఎన్నిక ఇంచార్జిగా అక్కడ టీఆర్ఎస్ గెలువనుందని సవాల్ విసిరాను. అప్పుడు కూడా మాట్లాడలేదు. నా 20 ఏండ్ల రాజకీయ జీవితాన్ని పణంగా పెట్టి సవాల్ విసిరాను. నారాయణ్‌ఖేడ్, వరంగల్ లోక్‌సభ, కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను నిర్దాక్షిణ్యంగా తిప్పికొట్టారు. కాంగ్రెస్ పార్టీ సిట్టింగ్ స్థానాలనూ దక్కించుకోలేకపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రాబోయే ఎన్నికల్లో 70 స్థానాల్లో కాంగ్రెస్ గెలుస్తుందని చెప్పడానికి ఎలాంటి హేతుబద్ధత ఉంది?

## రాష్ట్రపతికి ఆహ్వానం

**హైదరాబాద్‌లో** ఈ నెల 19 నుంచి 21 వరకు జరిగే వరల్డ్ ఐటీ కాంగ్రెస్-2018 సదస్సు ముగింపు వేడుకకు హాజరుకావాల్సిందిగా రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌ను ఆహ్వానించనున్నట్టు మంత్రి కేటీఆర్ తెలిపారు. దీనికోసం గురువారం ఢిల్లీకి వెళుతున్నట్టు చెప్పారు. వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వీడియో లింక్ ద్వారా ప్రారంభిస్తారని మంత్రి వెల్లడించారు. శ్రీలంక ప్రధానమంత్రి రణిల్ విక్రమసింఘే హాజరవుతారని తెలిపారు. ఢిల్లీ పర్యటన సందర్భంగా మైనింగ్ టుడే సదస్సుకు కేంద్ర మంత్రులు తోమర్, హర్షవర్ధన్‌లను ఆహ్వానిస్తామన్నారు. ఈ నెల 22 నుంచి 24 వరకు జరిగే బయోఏషియా సదస్సుకు కేంద్రవాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభును ఆహ్వానిస్తున్నామని కేటీఆర్ వివరించారు.

## రాష్ట్రానికి కేంద్రం నిధులేవీ?

**కేంద్ర** బడ్జెట్‌లో అనేకపథకాలు తెలంగాణ రాష్ట్రాన్ని స్ఫూర్తిగా తీసుకొని పెట్టినవే. 500 పట్టణాలకు తాగునీటి అందించే పథకం మిషన్ భగీరథలాంటిదే. రాష్ట్రంలో చేపట్టిన మిషన్ భగీరథకు రూ.19వేల కోట్లు, మిషన్ కాకతీయకు రూ.5వేల కోట్లు కేటాయించాలని నీతి ఆయోగ్ సిఫార్సుచేసింది. కానీ ఒక్కపైసా కూడా కేంద్రం ఇవ్వలేదు. ఎయిమ్స్‌కు ఇంతవరకు నిధులివ్వలేదు. కేంద్రమంత్రులు ఇక్కడికి వచ్చి పథకాలను పొగుడుతారు కానీ వాటికి నిధులు కేటాయించమంటే ఒక్కపైసా అదనంగా ఇవ్వరు. రాష్ట్రానికి రాజ్యాంగం ప్రకారం రావాల్సిన నిధుల కంటే ఒక్కపైసా అదనంగా ఇవ్వలేదు. ఇస్తే వేటికి ఇచ్చారో బీజేపీ నేతలు చెప్పాలి. ఏదో ఒక ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని ప్రధాని మోదీని సీఎం కేసీఆర్ అనేకమార్లు కోరారు. ఐటీఐఆర్ ప్రాజెక్టు గురించి అనేకమార్లు కేంద్రమంత్రులను అడిగాం. బయ్యారం స్టీల్‌ఫ్యాక్టరీకి ఒక్కపైసా ఇవ్వలేదు. చెవిటివాడి ముందు శంఖం ఊదినట్టుగా కేంద్రం వ్యవహారం ఉంది.

# ఎస్సార్డీపీ పనుల్లో వేగం పెంచండి

- సమస్యలుంటే నేరుగా తెలుపండి
- శాఖల సమన్వయ సమావేశంలో మంత్రి కేటీఆర్



బుధవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో ఎస్సార్డీపీ పనుల పురోగతిపై జలమండలి, ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీశాఖల సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తారకరామారావు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్సార్డీపీ) పనులను వేగంగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను పురపాలక, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో ముందుకుసాగితేనే పనుల్లో వేగం పుంజుకుంటుందని చెప్పారు. బుధవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో ఎస్సార్డీపీ పనుల పురోగతిపై మంత్రి కేటీఆర్ అధ్యక్షతన జలమండలి, ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీ శాఖల సమన్వయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రాజెక్టు పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకొన్నారు. కామినేని, ఎల్బీనగర్, బయోడైవర్సిటీ పార్కు, చింతలకుంట, దుర్గంచెరువు వంటి ప్రాంతాల్లో చేపట్టిన పనులపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రాజెక్టు పనుల కోసం తరలించనున్న విద్యుత్, వాటర్‌వర్క్స్ లైన్ల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ ప్రాధాన్యం కలిగిన ప్రాజెక్టు అని చెప్పారు. శాఖల మధ్య సమన్వయం కోసం తరచూ సమావేశాలు నిర్వహించాలని, ఏవైనా సమస్యలుంటే నేరుగా తనకు తెలియజేయాలని సూచించారు. జలమండలి, విద్యుత్‌శాఖల లైన్ల తరలింపు పనులను సాధ్యమైనంత త్వరగా చేపట్టేందుకు టెండర్ గడువును తగ్గించాలని ఆదేశించారు. శాఖల మధ్య ఆర్థికపరమైన లావాదేవీలు (తరలింపు, రోడ్డు రిస్టోరేషన్ పనుల ఫీజులు) పూర్తయ్యే వరకు పనులు ఆపకుండా వెంటనే ప్రారంభించాలని పేర్కొన్నారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన భూసేకరణ సమస్యలను అధిగమించాలని జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ అధికారులకు మంత్రి కేటీఆర్ ఫోన్‌లో సూచించారు.

## ఏఎన్ఎంల వేతనాలు పెంపు

### ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలకు రాష్ట్ర ప్రభుత్వం వేతనాలు పెంచింది. వైద్య, ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి ఏ శాం తికుమారి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. వైద్యశాలల్లో యురోపియన్ ఏఎన్ఎం, అదనపు ఏఎన్ఎంల పేర పనిచేస్తున్న వారి వేతనం రూ.10,020 నుంచి రూ.21,230కి పెరుగుతుంది.

## మెడికల్ సీట్ల పెంపునకు ఎంసీఐ అనుమతి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో బోధనా సిబ్బంది, సౌకర్యాలు, వసతుల కల్పన, ఇతర అంశాల గురించి వివరిస్తూ రాష్ట్ర వైద్యారోగ్యశాఖ పంపిన ప్రతిపాదనలపై ఎంసీఐ స్పందించింది. స్పెషాలిటీ విభాగాల్లో ఆరు మెడికల్ పీజీ సీట్లు, గాంధీ దవాఖాన, వైద్య కళాశాల అడ్మినిస్ట్రేషన్ కోసం మూడు సీట్లు, నిజామాబాద్ ఫార్మా కళాశాలకు మరో మూడు సీట్లను మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మంజూరు చేసింది.

## కానిస్టేబుళ్ల ప్రమోషన్లకు లైన్ క్లియర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కానిస్టేబుళ్ల పదోన్నతుల నిబంధనలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఏఆర్ నుంచి సివిల్ విభాగానికి కన్వర్షన్‌పై వచ్చిన కానిస్టేబుళ్లకు పదోన్నతులు కల్పించడంలో కొన్ని సర్వీస్ నిబంధనల్లో స్వల్పమార్పులు చేస్తూ బుధవారం ఈ ఉత్తర్వులు జారీచేసింది. పదోన్నతుల్లో ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్ల మధ్య తలెత్తిన వివాదానికి మధ్యేమార్గంగా ప్రభుత్వం ఈ సవరణ తీసుకువచ్చింది. మూడున్నరేండ్లుగా ఆగిపోయిన కానిస్టేబుళ్ల పదోన్నతుల ప్రక్రియ దీంతో వేగం పుంజుకోనున్నది.

## ఆర్ఎస్సై అభ్యర్థులు 17, 18 తేదీల్లో రిపోర్టు చేయాలి

జోన్-6లో రిజర్వ్ సబ్‌ఇన్‌స్పెక్టర్ (ఆర్ఎస్సై) పోస్టుకు ఎంపికైన అభ్యర్థులు ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్‌లోని అంబర్‌పేట పోలీస్‌లైన్‌లో రిపోర్టు చేయాలని వెస్ట్‌జోన్ ఐజీ స్టీఫెన్‌రవీంద్ర తెలిపారు. అభ్యర్థులు తమ హాల్‌టికెట్, సెలక్షన్ మెమో, ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు.



# ఉల్పరతో ఒక్క ఎకరా మునుగదు

- 0.25 టీఎంసీల సామర్థ్యంతోనే రిజర్వాయర్ నిర్మాణం
- అచ్చంపేట నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరు
- అచ్చంపేట ప్రజాప్రతినిధులు, రైతులతో మంత్రి హరీశ్‌రావు



బుధవారం జలసౌధలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహిస్తున్న రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు. చిత్రంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు తదితరులు కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా తలపెట్టిన ఉల్పర రిజర్వాయర్‌తో ఒక్క ఎకరా ముంపు కూడా లేదని రాష్ట్ర నీటి పారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. అతితక్కువ ముంపుతో రైతులకు ఎక్కువ ప్రయోజనం కలిగేలా ముఖ్యమంత్రి కేసీఆర్ సాగునీటి ప్రాజెక్టులను రీడిజైనింగ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. బుధవారం జలసౌధలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గంలోని సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉల్పర రిజర్వాయర్ నిర్మాణంవల్ల ముంపునకు గురవుతామనే భయాందోళనలు అవసరంలేదని మంత్రి స్పష్టంచేశారు. ఈ రిజర్వాయర్ సామర్థ్యంపై వస్తున్న ఊహాగానాలను నమ్మొద్దన్న మంత్రి.. ఒకటి లేదా మూడు టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్‌ను నిర్మిస్తారన్న వార్తలను ఖండించారు. కేవలం 0.25 టీఎంసీ సామర్థ్యంతోనే ఉల్పర రిజర్వాయర్ నిర్మాణమవుతున్నదని తేల్చిచెప్పారు. దీనిపరిధిలో దాసరాజుపల్లి గ్రామం ముంపునకు గురవుతుందనే ప్రచారాన్ని నమ్మొద్దని, ఆ గ్రామంలో ఒక్క ఇల్లు కూడా ముంపునకు గురికాదన్నారు.

**మత్స్యకారులకు శాశ్వత ఉపాధి**

భూ నిర్వాసితులకు మార్కెట్ ధర ప్రకారం తగిన పరిహారం చెల్లిస్తామని మంత్రి హరీశ్‌రావు వారికి హామీ ఇచ్చారు. ఎన్ఎస్పీ చీఫ్ ఇంజినీర్ సునీల్, రెవిన్యూ అధికారులతో కలిసి స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను అంచనా వేస్తారని మంత్రి చెప్పారు. ఉల్పర రిజర్వాయర్ కింద రెండు పంటలకు నీళ్లు అందుతాయని, మత్స్యకారులకు శాశ్వత ఉపాధి లభించనున్నదని మంత్రి తెలిపారు. ప్రస్తుతం పంటలు వేసుకొని ఉన్నందున దిగుబడి వచ్చే వరకు కాల్వల తవ్వకం జరుగదని కూడా మంత్రి వారికి భరోసా కల్పించారు. రెండు, మూడునెలల తర్వాత ఆర్డీవో ఆధ్వర్యంలో ప్రజల సమక్షంలో చర్చించిన తర్వాతే నిర్ణయాలు తీసుకొంటామని హరీశ్‌రావు స్పష్టంచేశారు. కాల్వల వెడల్పు తగ్గించి, భూసేకరణ తగ్గించాలని రైతులు మంత్రికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ప్రత్యామ్నాయాలు పరిశీలించి, నిర్ణయం తీసుకొంటామని అన్నారు. సముద్ర మట్టానికి 680 మీటర్ల ఎత్తులో ఉన్న అమ్రాబాద్, పదర మండలాలకు సాగునీరు అందించాలని అచ్చంపేట శాసనసభ్యుడు బాలరాజు మంత్రికి విజ్ఞప్తిచేశారు. ఇప్పటికే కల్వకుర్తి ప్రాజెక్టు నుంచి అచ్చంపేట నియోజకవర్గానికి 50వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు మంత్రి వివరించారు. ఈ నియోజకవర్గంలో మొత్తం లక్ష ఎకరాలకు సాగునీరు అందించేలా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయనున్నట్టు మంత్రి తెలిపారు. సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, ఈఎన్సీ మురళీధర్‌రావు, సీఈ ఎస్ సునీల్, సర్పంచ్‌లు, రైతులు పాల్గొన్నారు.

## బోయినపల్లి, తిరుమలగిరిలలో కొత్త మార్కెట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో సిరిసిల్ల, సూర్యాపేట జిల్లాల్లో కొత్త వ్యవసాయ మార్కెట్ల ఏర్పాటుకు వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ బుధవారం ప్రాథమిక నోటిఫికేషన్ జారీచేసింది. సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని 24 గ్రామాలకు ప్రత్యేకంగా మార్కెట్‌ను ఏర్పాటుచేశారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరి కేంద్రంగా తిరుమలగిరి, నాగారం, జాజిరెడ్డిగూడెం మం డలాల్లోని 34 గ్రామాల పరిధితో కొత్తమార్కెట్‌ను ఏర్పాటుచేశారు. ఈ మేరకు వ్యవసాయ మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి సీ పార్థసారథి ప్రాథమిక ఉత్తర్వులు జారీచేశారు.



## తెలంగాణ సివిల్ సప్లై టెక్నాలజీ భేష్

### తమిళనాడు పౌరసరఫరాలశాఖ సీఐడీ, అదనపు డీజీపీ ప్రశంసలు



సివిల్ సప్లై కమిషనర్ సీవీ ఆనంద్‌ను కలిసిన తమిళనాడు పౌరసరఫరాలశాఖ సీఐడీ, అదనపు డీజీపీ ప్రదీప్ వీ ఫిలిప్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో పౌరసరఫరాలశాఖలో రేషన్ బియ్యం అక్రమ రవాణా కట్టడి లక్ష్యంగా ప్రవేశపెట్టిన టెక్నాలజీపై తమిళనాడు పౌరసరఫరాలశాఖ సీఐడీ, అదనపు డీజీపీ డాక్టర్ ప్రదీప్ వీ ఫిలిప్ అధ్యయనం చేస్తున్నారు. బుధవారం పౌరసరఫరాల భవన్‌లో కమాండ్ కంట్రోల్ సెంటర్, టీ-రేషన్ యాప్, హైదరాబాద్‌లోని పౌరసరఫరాల సంస్థ గోదాముల్లో సీసీ కెమెరాల పనితీరు, చింతల్‌బస్తీలోని రేషన్ దుకాణంలో ఈ-పాస్ యంత్రం పనితీరును ఆయన పరిశీలించారు. అనంతరం పౌరసరఫరాల భవన్‌లో సివిల్ సప్లై కమిషనర్ సీవీ ఆనంద్‌తో భేటీ అయ్యారు. తెలంగాణలో పౌరసరఫరాలశాఖ చేపట్టిన చర్యలు అద్భుతంగా ఉన్నాయని ప్రదీప్ కొనియాడారు.

## వజ్ర మినీ బస్సుల నిర్వహణ భేష్

### ఆర్టీసీకి సహకరిస్తాం: బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్



ఆర్టీసీ ఎండీ జీవీ రమణారావును కలిసిన బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రయాణికుల సౌకర్యార్థం టీఎస్‌ఆర్టీసీ ప్రవేశపెట్టిన వజ్ర ఏసీ మినీ బస్సుల నిర్వహణను బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ ఆండ్రూ ఫ్లెమింగ్ అభినందించారు. తొలి విడుత హైదరాబాద్ నుంచి వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, గోదావరిఖని ప్రాంతాలకు నడుపుతున్న బస్సుల నిర్వహణ బాగుందని ప్రశంసించారు. ఆర్టీసీకి తమ వంతు సహకారం ఇస్తామని ఆయన చెప్పారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేదిశగా సరికొత్త విధానాలను అమల్లోకి తీసుకురావడం అభినందనీయమని కొనియాడారు. ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ జీవీ రమణారావుతో బుధవారం బస్‌భవన్‌లో తమ ప్రతినిధి బృందంతో కలిసి సమావేశమయ్యారు. ఆర్టీసీ నూతన ప్రాజెక్టుల అమలుతీరును తెలుసుకోవడమేగాక ప్రజా రవాణా సదుపాయాలపై ఎండీతో చర్చించారు. ఆర్టీసీ కొత్తగా అమలుచేస్తున్న విధానాలపై వారు ఆసక్తి కనబరిచారని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

## మార్చి 15 నుంచి ఆక్వా ఎక్స్‌పో




సచివాలయంలో అంతర్జాతీయ ఆక్వా ఎక్స్‌పో-2018 ప్లకార్డును ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో చేపలవేటపై ఆధారపడి జీవిస్తున్న లక్షల మత్స్యకారులను సామాజికంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి మార్చి 15 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో నిర్వహించే అంతర్జాతీయ ఆక్వా ఎక్స్‌పో-2018 దోహదపడుతుందని పశుసంవర్ధక, మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ చెప్పారు. సొసైటీ ఫర్ ఇండియన్ ఫిషరీస్ ఆక్వా కల్చర్ (ఎస్ఐఎఫ్ఏ-సిఫా), తెలంగాణ మత్స్యశాఖ సంయుక్తంగా నిర్వహించనున్న అంతర్జాతీయ ఆక్వా ఎక్స్‌పో ప్లకార్డును మంత్రి తలసాని బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. దక్షిణాసియాలోనే మొట్టమొదటిసారిగా మత్స్యరంగ అభివృద్ధి కోసం నిర్వహిస్తున్న ఆక్వా ఎక్స్‌పో ఇదేనని మంత్రి చెప్పారు. సీఎం కేసీఆర్ మార్గనిర్దేశంలో రాష్ట్రంలో పెద్దఎత్తున చేపపిల్లలను పెంచుతున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో నీటివనరులు ఎక్కువగా ఉన్నందున చేపల పెంపకానికి ఎక్కువ అవకాశాలున్నాయని చెప్పారు. పశుసంవర్ధక, మత్స్యశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ, ఆక్వా ఎక్స్‌పో ఇండియా-2018 తెలంగాణ మత్స్యకారులకు, చేపల అభివృద్ధికి ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ ఫిషరీస్ ఆక్వా కల్చర్ (సిఫా) అధ్యక్షుడు రామచంద్రరాజు, సీఈవో వేణు దంతులూరి, డైరెక్టర్ సమీర్ పాత్ర తదితరులు పాల్గొన్నారు.

## 10న పీజీటీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఎస్‌పీఎస్సీ ద్వారా ఎంపికైన పీజీటీ అభ్యర్థుల సర్టిఫికెట్లను ఈ నెల 10న పరిశీలిస్తారు. ఉదయం 9.30 గంటలకు పీజీటీ రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని గురుకుల విద్యాలయాల సంస్థ డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

**15 నుంచి ఆబ్కారీ కానిస్టేబుళ్లకు శరీర సామర్థ్య పరీక్ష**

ఆబ్కారీ కానిస్టేబుల్ అభ్యర్థులకు ఈనెల 15 నుంచి ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పీఈటీ) ను హైదరాబాద్ బండ్లగూడలోని ఎక్సైజ్ అకాడమీలో నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 15న పురుషులకు, 16, 17 తేదీల్లో మహిళా అభ్యర్థులకు ఈ పరీక్ష ఉంటుందని వెల్లడించింది.

**ఫార్మాసిస్ట్ గ్రేడ్ 2 విద్యార్హతలు సవరణ**

ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టుల భర్తీకి విద్యార్హతల్లో సవరణలు చేసినట్టు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. ఇంటర్మీడియట్, డీ ఫార్మసీ సహా ఫార్మసీలోని ఉన్నత విద్యార్హతలను సైతం పరిగణనలోకి తీసుకుంటామని పేర్కొన్నది.



కాంగ్రెస్ ఒక కుటుంబం కోసం దేశ ప్రయోజనాలను బలిపెట్టింది. దేశాన్ని ముక్కలు చేసింది. దేశాన్ని బలోపేతంచేసే పనిని నిర్లక్ష్యం చేసింది. కాంగ్రెస్ పనుల కారణంగా దేశం ఇవ్వాళ ఫలితం అనుభవిస్తున్నది. కాంగ్రెస్‌ది ప్రజాస్వామ్య సంస్కృతి కాదు, వారసత్వ పరంపర.

**నరేంద్రమోదీ, ప్రధాని**

ప్రధాని మోదీ లోక్‌సభలో సుదీర్ఘంగా, ఆకర్షణీయంగా ప్రసంగించారు. ఆయన గొప్ప వక్త. కానీ ఆయన ప్రసంగం నిండా అర్ధ సత్యాలు, వక్రీకరణలు మాత్రమే ఉన్నాయి. ఆయన ఆకర్షణీయంగా మాట్లాడగలడు, కానీ అందులో అక్కరకొచ్చే మంచి ఏమీ ఉండదు.

**శశిథరూర్, సీనియర్ కాంగ్రెస్ నేత**



**చరిత్రలో నేడు**



**1600**
గియానో బ్రూనోను దోషిగా తేల్చి మరణశిక్ష విధించిన వాటికన్ సిటీ.

**1672**
కటక సిద్ధాంతాలను రాయల్ సొసైటీ ముందు ప్రవేశపెటి న్యూటన్.





**1849**
ఇటలీలో న్యూ రోమన్ రిపబ్లిక్ ప్రారంభం.

శాంతి కాలంలోని మిత్రులు యుద్ధ కాలంలో తోడుండాలి. బీజేపీకి ఈ అవసరం ఎక్కువగా ఉన్నది. కేంద్రంలో ప్రభుత్వం నిలువటానికి మిత్రపక్షాల సంఖ్యాబలం అవసరం లేకున్నా 2019 ఎన్నికలు ఎదుర్కొనేందుకు బీజేపీకి మిత్రపక్షాల సాయం అత్యవసరం. ఏపీలో చిరకాల మిత్రపక్షంగా ఉన్న టీడీపీ ఈ మధ్య కాలంలో దూరం జరుగుతున్నది. బడ్జెట్ కేటాయింపులపై గుర్రుగా ఉన్నది. కాంగ్రెస్ వ్యతిరేక పక్షాల మధ్య ఐక్యతాబంధం సన్నగిల్లుతున్నది. వైఎస్‌ఆర్‌సీపీతో బీజేపీ చెలిమి చేస్తుందా అన్నదే నేటి స్థితి. రాజస్థాన్ ఉప ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీజేపీ మిత్రపక్షాల కూటమి సూత్రాన్ని అనుసరించక తప్పని స్థితి.

**ది హిందూ**

దేశంలో ఉన్నత విద్య అంగట్లో సరుకైన స్థితిని చాటుతున్నది. విశ్వవిద్యాలయాల్లో పేరుకుపోయిన అవినీతితో విద్యాప్రమాణాలు కుంటుపడుతున్నాయి. ఉన్నత విద్యాలయాలే అవినీతి, పక్షపాతానికి కేంద్రంగా మారిన తీరు తమిళనాడులో వెలుగుచూసింది. భారతీయార్ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఒక అధ్యాపకున్ని క్రమబద్ధీకరించేందుకు 30 లక్షలు లంచం తీసుకుంటూ అడ్డంగా దొరికిపోయాడు. చరిత్రలో ఒక వీసీ లంచం కేసులో అరెస్టు కావటం విస్తుగొలుపుతున్నది. ఏదేమైనా విశ్వవిద్యాలయాల్లో అవినీతి, లంచగొండితనం విద్యావ్యవస్థకే మచ్చ.

**ది న్యూ ఇండియన్ ఎక్స్‌ప్రెస్**



# మోదీ ఆంధ్రా పాట!

పార్లమెంటు వంటి అత్యున్నత వేదికపై బడ్జెట్‌పై ప్రధాని మోదీ తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతినేవిధంగా, సీమాంధ్ర పెత్తందార్ల గొంతు వినిపించడం తీవ్ర అభ్యంతరకరం. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తుండటం, ఇటీవలి ఎన్నికలలో బీజేపీ ప్రాభవం తగ్గిన సూచనలు కనిపించడం మోదీపై ఒత్తిడిని పెంచి ఉంటాయి. ఐదేండ్ల పాలనలో ఎన్డీయే ప్రభుత్వం సాధించిన ఘనకార్యాలేమిటనే ప్రశ్న తలెత్తకుండా, ఈ పాపమంతా కాంగ్రెస్‌దే అంటూ ఆ పార్టీ మీదికి నెట్టడం ఆయన వ్యూహం అయి ఉంటుంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వలేదని ఎన్డీయే భాగస్వామ్య పక్షాలైన బీజేపీ, టీడీపీ మీద ఆ రాష్ట్ర ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ ఒత్తిడి ఆ రెండు పార్టీలపై తీవ్రంగానే ఉన్నది. ఈ అంశం నుంచి దృష్టి మరల్చడానికి రెండు పార్టీలు పార్లమెంటు వేదికగా ఆడిన రసవత్తర నాటకాన్ని ఆంధ్ర ప్రజలే కాదు, దేశమంతా తిలకించారు. ఈ విచిత్ర విన్యాసాలను ఏపీ ప్రజలు నమ్ముతారా లేదో కానీ, వారిని మెప్పించే క్రమంలో ప్రధాని పార్లమెంటులో తెలంగాణ వ్యతిరేక వ్యాఖ్యలు చేయడం మాత్రం సమర్థనీయం కాదు. మోదీ కాంగ్రెస్‌ను విమర్శించినట్టు కనిపిస్తున్నా, సీమాంధ్ర పాలకవర్గాల మెప్పుకోసం, రాష్ట్ర విభజనను తప్పుపట్టారనేది స్పష్టం. కేంద్రం ఏపీ అభివృద్ధి కోసం ఎంత తోడ్పాటు అందించినా తెలంగాణ ప్రజలకు అభ్యంతరం లేదు. ఏపీ అభివృద్ధి చెందితే తాము హర్షిస్తామని చెప్పడం ద్వారా తెలంగాణ నాయకులు పెద్దమనుసును చాటుకున్నారు. పలు సందర్భాలలో ఏపీకి మద్దతు ప్రకటించారు. ఇదే రీతిలో ప్రధాని కూడా దేశంలోని అన్ని రాష్ట్రాలను తనవిగా భావించాలని తెలంగాణ ప్రజలు కోరుకోవడంలో తప్పులేదు.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సందర్భంగా ఆంధ్రా పెద్దలు అనేక హేతు విరుద్ధమైన వాదనలను ముందుకు తెస్తూ, తప్పుడు ప్రచారం సాగించారు. ప్రధాని నోటి వెంట ఇవే మాటలు వెలువడ్డాయి. వాజపేయి ప్రభుత్వం మూడు రాష్ట్రాలను విభజించినా ఒక్క సమస్య రాలేదని, తెలంగాణ ఏర్పాటులో తొందరపాటుగా, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించడం వల్ల సమస్యలు వస్తున్నాయనేది మోదీ వాదన. కానీ వాజపేయి ప్రభుత్వం ఆ మూడు రాష్ట్రాలతో పాటే తెలంగాణను కూడా ఏర్పాటు చేయకుండా, ఆంధ్ర లాబీ ఒత్తిడికి లొంగిపోయి తెలంగాణ ప్రజలను మోసం చేసిన సంగతేమిటి? 2004 ఎన్నికలు జరిగిన వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయకుండా, ఆ తరువాత కాలంలో కేసీఆర్ దీక్ష సందర్భంగా నిండు సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా, ఆంధ్రా లాబీ ఒత్తిడి మూలంగా చివరిక్షణం వరకు సాగదీయడం- తొందరపాటు చర్యనా! తెలంగాణ ఏర్పాటు అనివార్యమైన దశలో, టీడీపీ లాబీని నెత్తికెక్కించుకొని వారిని ఒప్పిస్తేనే మద్దతు ఇస్తామంటూ అడ్డుపడ్డది బీజేపీ పెద్దలే కాదా? వారి కోర్కెలు తీర్చే క్రమంలోనే గతంలో ఏ రాష్ట్ర విభజన సందర్భంగా లేని నిర్హేతుక అంశాలను విభజన చట్టంలో చేర్చవలసి వచ్చింది. ఇప్పటికీ విభజన సమస్యలు తీరకపోవడానికి కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ కూడా బాధ్యత వహించాల్సిందే. పెప్పర్ స్ప్రే చిమ్మడం వంటి అసయ్యపు చేష్టల వల్ల ప్రపంచవ్యాప్తంగా నవ్వులపాలు కావలసి వచ్చింది. సీమాంధ్ర సభ్యులు కుచేష్టలకు పాల్పడకుండా అదుపు చేసే బాధ్యత బీజేపీకి లేదా? తలుపులు మూయవలసి రావడం ఒక ప్రాంతీయ లాబీని అదుపు చేసి, ధర్మాన్ని కాపాడలేని జాతీయ పార్టీల బలహీనతకు నిదర్శనం. తెలంగాణ బిడ్డడైన అంజయ్య నిరాడంబరతను, మాట తీరును అదేపనిగా అవమానించింది ఆంధ్రా నాయకులు, వారి పత్రికలు. ఆయనను గద్దె దింపడానికి ఆంధ్రా లాబీ చేసిన కుట్రపూరిత ప్రచారమే రాజీవ్ గాంధీ అనుచిత ప్రవర్తనకు దారితీసింది. తమ వ్యాపార, రాజకీయ అవసరాల కోసం తెలుగు దేశం పార్టీని స్థాపించుకున్న ఆంధ్రా పాలకవర్గం, దీనికి ఆత్మగౌరవమనీ, అంజయ్య కోసమని చెప్పుకుంటే చిన్నపిల్లలు కూడా నమ్మరు.

**వాజపేయి ప్రభుత్వం మూడు రాష్ట్రాలను విభజించినా ఒక్క సమస్య రాలేదని, తెలంగాణ ఏర్పాటులో తొందరపాటుగా, రాజకీయ ప్రయోజనాల కోసం వ్యవహరించడం వల్ల సమస్యలు వస్తున్నాయనేది మోదీ వాదన. కానీ వాజపేయి ప్రభుత్వం ఆ మూడు రాష్ట్రాలతో పాటే తెలంగాణను కూడా ఏర్పాటు చేయకుండా, ఆంధ్ర లాబీ ఒత్తిడికి లొంగిపోయి తెలంగాణ ప్రజలను మోసం చేసిన సంగతేమిటి? 2004 ఎన్నికలు జరిగిన వెంటనే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేయకుండా, ఆ తరువాత కాలంలో కేసీఆర్ దీక్ష సందర్భంగా నిండు సభలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోకుండా, ఆంధ్రా లాబీ ఒత్తిడి మూలంగా చివరిక్షణం వరకు సాగదీయడం- తొందరపాటు చర్యనా!**

సీమాంధ్రకు కాంగ్రెస్ ద్రోహం చేసిందనే సందేశాన్ని ప్రధాని నోటి ద్వారా అందించడం ఆంధ్ర లాబీ ఉద్దేశం. సీమాంధ్ర సంగతేమో కానీ తెలంగాణకు మాత్రం కాంగ్రెస్, బీజేపీ- రెండూ మోసం చేశాయి. నెహ్రూ హయాంలో – తెలంగాణ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించినప్పటికీ, ఆంధ్ర లాబీయింగ్‌కు తలొగ్గి బలవంతంగా విలీనం చేశారు. సొంత రాష్ట్రాన్ని పునరుద్ధరించాలని ఉద్యమించినందుకు ఇందిరాగాంధీ హయాంలో పిట్టల్లా కాల్చి చంపేయడం తెలంగాణ చరిత్రలోనే ఒక పెద్ద విషాదం. ముల్కీ రూల్స్ రద్దు వంటి అనేక తెలంగాణ వ్యతిరేక నిర్ణయాలను కేంద్రం తీసుకున్నది. బీజేపీ మొదటినుంచి ఆంధ్రాలాబీకి అండగా నిలుస్తూనే ఉన్నది. దశాబ్దాల సీమాంధ్ర పాలనలో నష్టపోయింది తెలంగాణ అయితే, ఏపీని బాధిత రాష్ట్రంగా చూపడంలోనే ఆంధ్రా లాబీ ఒత్తిడి, కాంగ్రెస్, బీజేపీల బాధ్యతారాహిత్యం ఉన్నది. ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ, భిన్నప్రాంతాల మధ్య వివాదంలో నిజాయితీ గల మధ్యవర్తిగా వ్యవహరించవలసిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిది. కానీ కాంగ్రెస్, బీజేపీలలో ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా కేంద్రం తెలంగాణ వ్యతిరేకతను చాటుకుంటున్నదనడానికి మోదీ ప్రసంగమే తాజా ఉదాహరణ.

**జనగళం**

### తప్పనిసరి చేయాలె

త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు పదవ తరగతి పాస్ నిబంధన తప్పనిసరి చేయాలి. గత కొన్నేండ్లుగా ఎలాంటి అర్హత లేకున్నా అభ్యర్థులు వారికున్న పలుకుబడితో సర్పంచులుగా గెలుపొందుతున్నారు. అలా గెలుపొందినవారిలో నిరక్షరాస్యులే ఎక్కువ మంది ఉంటున్నారు. తద్వారా ఆయా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిపోతున్నది. చదువులేని సర్పంచులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడంలో విఫలమవుతున్నారు. కాబట్టి సర్పంచ్ పదవి కోసం పోటీచేసే అభ్యర్థులు పదవ తరగతి పాస్ కావాలనే నిబంధన తప్పనిసరి చేయాలె.

- శ్రీనివాస్ చిరిపోతుల, వెంకటేశ్వర్లపల్లి

### సరైన నిర్ణయం

యూజీసీ, ఏఐటీసీ నిబంధనల ప్రకారం ఇతర రాష్ర్టాల యూనివర్సిటీలు జారీచేసే ధృవపత్రాలను పరిగణనలోకి తీసుకోవద్దని ఉన్నత విద్యా మండలి సూచిండం హర్షణీయం. ప్రైవేట్ కళాశాలలకు సైతం నిబంధనలు వర్తిస్తాయని మండలి చెప్పటం ముదావహం. ప్రత్యేక చట్టం ద్వారా ఏర్పడిన ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ వర్సిటీలు జారీచేసే ధృవపత్రాలకు అనుమతి ఇస్తామని చెప్పడం శుభసూచకం. దూరవిద్యలకు యూజీసీ, ఏజేసీటీల ద్వారా అనుమతి తెచ్చుకున్న యూనివర్సిటీలు ఆయా రాష్ర్టాల పరిధిలోనే స్టడీ సెంటర్లు ఏర్పాటుచేసుకోవాలనటం సరైనదే. తద్వారా స్థానిక యూనివర్సిటీలలోని దూర విద్యకు ప్రాధాన్యం పెరుగుతుంది.అందులో భాగంగానే ఇగ్నో, బీఆర్ అంబేద్కర్ వంటి దూర విద్యకు సైతం గతంలో కంటే ఈ నిర్ణయం ద్వారా విద్యార్థులు చేరే సంఖ్య పెరుగుతుంది. ఇతర రాష్ర్టాలలో 2013 వరకు వివిధ కోర్సులు చదివినవారికి అనుమతి ఉంటుందని, తర్వాత చదివినవారి ధృవపత్రాలను పరిగణనలోకి తీసుకోబమని ప్రక టించింది. ఈ నిర్ణయం మంచి పరిణామం.

- అయినం రఘురామారావు, ఖమ్మం

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

**ఆలోకన**



**టంకశాల అశోక్**

# సీపీఎంకు కొన్ని ప్రశ్నలు

**తెలంగాణ సమగ్రాభివృద్ధి, సామాజిక న్యాయం కోసం అంటూ సీపీఎం పార్టీ బహుజన లెఫ్ట్ ఫ్రంట్‌ను ఏర్పాటుచేసింది. అది వారి ప్రజాస్వామిక హక్కు. అదేవిధంగా ఒక వర్ధమాన సమాజంలో ప్రజల చైతన్యాన్ని పెంపొందించేందుకు, ప్రభుత్వాలను మునివేళ్లపై నిలిపేందుకు వామపక్ష భావజాలాల పాత్ర కాదనలేనిది. కాని తెలంగాణ సాధన కోసం ఇదే దళిత బహుజన ప్రజలు దశాబ్దాల పాటు పోరాడి ప్రాణత్యాగాలు చేసినప్పుడు వారి ఆకాంక్షను వ్యతిరేకించి ద్రోహం చేసిన సీపీఎంను ఇప్పుడు ఆ వర్గాలు ఎందుకు నమ్మాలి?**

ఇక్కడ వేస్తున్న ప్రశ్నలన్నీ పాతవే కావచ్చు. వారు ఒక ఫ్రంట్‌ను ఏర్పాటుచేసిన సందర్భంగా తిరిగి వేస్తున్నవి కావచ్చు. కాని ఆ పని ఎందుకు చేయవలసి వస్తున్నది? ఎందుకంటే, ప్రజల నుంచి ఎంతోకాలంగా వినవస్తున్న ఈ ప్రశ్నలకు సీపీఎం నాయకత్వం సమాధానాలు ఇవ్వటం లేదు. ఉద్యమకాలంలో ఇవ్వలేదు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన మూడున్నరేండ్ల తర్వాత కూడా నేటికీ ఇవ్వలేదు. ప్రశ్నల పట్ల మౌనం వహిస్తారు. లేదా, వెక్కిరింతలు కొక్కిరింతల వ్యాఖ్యలు చేసి, జవాబులు చెప్పలేని తమ బలహీనతను వాటి వెనుక కప్పి పెట్టుకోజూస్తారు. లేదా, గాయాలను కాలమే మాన్పుతుంది అనే పద్ధతిలో ఈ ప్రశ్నలు కాలగతిన మరపున పడిపోతాయనుకుంటున్నట్లు ప్రవర్తిస్తారు. లేదా, అదే దళిత బహుజనులలోకి పిడికెడు మందికి ఏవో పదవులు ఇచ్చి ఆ వర్గాలను భ్రమపెట్టి ఓట్లు సంపాదించవచ్చుననే బూర్జువా పార్టీల ఎత్తుగడలను తాము అనుసరిస్తారు. అంతే తప్ప ఏ కోణం నుంచి చూసినా నిజాయితీ ఉండదు.

బహుజన లెఫ్ట్ ఫ్రంట్ అనే రాజకీయ వేదికనే గమనించండి. సీపీఎం రాజకీయ ఐక్య సంఘటనలు ఇంతకాలం రెండు నమూనాలలో ఉంటూ వచ్చాయి. ఒకటి బెంగాల్, త్రిపుర తరహా లెఫ్ట్ ఫ్రంట్. అందులో అన్నీ లెఫ్ట్ పార్టీలుంటాయి. రెండు కేరళ తరహా లెఫ్ట్-డెమోక్రటిక్ ఫ్రంట్. అందులో డెమోక్రటిక్ పార్టీలు అనబడే బూర్జువా పార్టీలు కూడా ఉంటాయి గాని, నాయకత్వం లెఫ్ట్‌ది. అందుకు అనుగుణంగా లెఫ్ట్ అనే మాట ముందు వస్తుంది. ఇందుకు భిన్నమైన ఐక్యవేదికలను తాము బలపరచవలసి వస్తే ఆ పని బయటినుంచి చేస్తాము తప్ప వాటిలో చేరబోమన్నది సీపీఎం విధానం. తమ నాయకత్వాన బూర్జువాలు పనిచేస్తే సిద్ధమే గాని, బూర్జువాల నాయకత్వాన తాము పని చేయబోమంటారు వారు. లోగడ అట్లాగే చేశారు కూడా. అది వారి వ్యూహం, విధానం అయినందున ఇతరులు అభ్యంతరపెట్టగలిగింది ఏమీ లేదు. ఈ నేపథ్యంలో 'బహుజన-లెఫ్ట్ ఫ్రంట్'ను గమనించండి. ఇందులో బహుజన అనేమాట ముందుగా వస్తుంది. అనగా ఇది వారి సరికొత్త మూడవ నమూనా అనుకోవాలేమో తెలియదు. అది నిజమైతే సీపీఎం రాజకీయ చరిత్రలో ఆహ్వానించదగిన మార్పు అవుతుంది తప్ప, ఆక్షేపించవలసింది ఉండదు. ఇంతకూ వాస్తవ పరిస్థితి ఏమిటో తెలియవలసి ఉంది.

దానినట్లుంచి ఇదే ఫ్రంట్‌కు సంబంధించి ఇతర ప్రశ్నలు కొన్ని ఉన్నాయి. ఫ్రంట్‌ను ఏర్పాటుచేసింది సీపీఎం. ఇతర ముఖ్యమైన వామపక్షాలు సీపీఐ, న్యూ డెమొక్రసీలు ఈ ఫ్రంట్‌లో లేవు. మునుముందు చేరగల సూచనలు లేవు. ఫ్రంట్‌లో చేరిన వామపక్షాలు అనే వాటిలో ఎంసీపీఐకి బలం లేకున్నా గతకాలపు గుర్తింపు ఉంది. ఆర్‌ఎస్పీ వంటివి కేవలం లెటర్‌హెడ్ పార్టీలు. బహుజన పార్టీలు అనబడే ఇతర సంస్థలు అన్నీ కూడా ఇంచుమించు లెటర్‌హెడ్ పార్టీలే. వాటిలో సగానికి పైగా పేర్లను లోగడ విన్నట్లు గుర్తులేదు. దీనంతటి అర్థం ఏమంటే, బహుజన అనే మాటను వీరిపేరిట ముందట చేర్చి, తను వెనుకనుంచి వ్యవహారం తా నడుపటం సీపీఎం వ్యూహమన్నమాట. వారి మూడవ నమూనాలోని ప్రత్యేకత ఇది అనుకోవాలి. దళిత బహుజనులను కమ్యూనిస్టులు మొదటినుంచి బూర్జువా పార్టీల పద్ధతిలో ఉపయోగించుకోవటం తప్ప, వారికి నాయకత్వాలలో అవకాశం ఇవ్వరనే గట్టి విమర్శ ఒకటుంది. అందుకు సీపీఎం మినహాయింపు కాదు. ఈ సంప్రదాయాన్ని నెమ్మది నెమ్మదిగా మార్చుకోవాలనే నిర్ణయాన్ని ఆ పార్టీ జాతీయ నాయకత్వం తీసుకున్నదని ఇటీవల వినవస్తున్నది. బెటర్ లేట్ దేన్ నెవర్ అనే ఇంగ్లీష్ సామెత వలె వారు ఆ పని ఇప్పటికి చేసినా సంతోషించవచ్చు. కానీ ఆ పనిలో నిజాయితీ ఉండాలి. అది ఒక ఎత్తుగడ కాకూడదు. ఇప్పుడు తెలంగాణలో వారు ఏర్పాటుచేసిన బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ నిజమైన అర్థంలో మూడవ నమూనా అనగలమా? లేక దాని తీరుతెన్నులను చూడగా వారిని ఉపయోగించుకోవాలనే నిజాయితీలేని ఎత్తుగడగా మాత్రమే తోస్తున్నదా? మొత్తం తెలంగాణ ఉద్యమ నేపథ్యాన్ని, అందులో దళిత బహుజనుల ఆకాంక్షలను, పాత్రను అటువంటి ఉద్యమం పట్ల సీపీఎం వైఖరిని, ప్రస్తుతం పార్టీ సొంత రాజకీయ అవసరాలను గమనించినప్పుడు, ఇది ఎత్తుగడ మాత్రమేనని భావించకుండా ఉండగలమా?

ఇదే సందర్భంగా మరొక ముఖ్యమైన ప్రశ్న ఉంది. తెలంగాణను సీపీఎం మొదటినుంచి చిట్టచివరి వరకు వ్యతిరేకించింది. రాష్ట్రం ఏర్పాటు సరైనదేనని రాష్ట్రం ఏర్పడిన తర్వాత సైతం ఈనాటికీ ఒప్పుకోవటం లేదు. తెలంగాణ ఏర్పడటం తప్పని, అయినప్పటికీ ఆ రాష్ట్రం అభివృద్ధి కోసం, అక్కడ సామాజిక న్యాయం కోసం పాటుపడుతామని చిత్రమైన సూత్రీకరణలు చేస్తున్నది. మరొకవైపు కొంత ఆలస్యంగానైనా సీపీఐ పార్టీ తెలంగాణను బలపరిచింది. అటువంటి సీపీఐ మాత్రం ఈ ఫ్రంట్‌లో లేదు. అసలు ఈ ఫ్రంట్ ఏర్పాటులో సీపీఎం వారు సీపీఐని విశ్వాసంలోకి తీసుకోలేదు. తాము ఫ్రంట్ నిర్ణయం తీసుకొని తమ వెంట ఇతరులను చేర్చుకొని, అందులో చేరవలసిందిగా సీపీఐని అప్పుడు పిలిచారు. లెఫ్ట్ కూటమి మరొక విశాల కూటమిలో భాగం అయి కీలకపాత్ర వహించేందుకు అనుసరించవలసిన పద్ధతి ఇదేనా? లక్ష్యం పట్ల నిజాయితీ, పారదర్శకత లేనివారు చేసే పని ఇది. సీపీఎం నాయకత్వం తక్కిన వామపక్షాల పట్ల దాదా వైఖరి చూపుతుందనే విమర్శ స్వయంగా ఆ పార్టీల నుంచే చిరకాలంగా ఉంది. చింత చచ్చినా పులుపు చావలేదన్నట్లు సీపీఎంకు ఆ లక్షణం ఇప్పటికీ పోలేదు. అదే లక్షణం ఇప్పుడు తెలంగాణలో బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటులోనూ కనిపిస్తున్నది.

ఇంతకూ సీపీఎం వ్యూహరచనా దురంధరులు తెలంగాణ దళిత బహుజనులను విజయవంతమైన రీతిలో భ్రమ పెట్టగలరా అన్నది 2019 ఎన్నికల నాటికి తేలవలసిన డయలెక్టికల్ ప్రశ్న. ఇప్పటికైతే అటువంటి అవకాశం కల్పించటంలేదు. రాష్ట్రం ఏర్పడిన కొత్తలో సుమారు డజను వామపక్షాలు (అపుడు సీపీఐ, న్యూ డెమోక్రసీ కూడా ఉన్నాయి) ఒక ఉమ్మడి వేదిక ఏర్పాటుచేసిన తర్వాత కొద్దికాలం నుంచే సీపీఎం తన ఏకపక్ష దాదా గిరీ ధోరణులను చూపసాగింది. పాదయాత్రలు, టి-మాస్ ఏర్పాటువంటి క్రమాలలో వారంతా దూరం కాసాగారు. అయినా 'పులుపు' చావని సీపీఎం ఇప్పుడు ఒక సొంత ఫ్రంట్‌ను ముందుకు తెచ్చింది. నికరమైన రీతిలో చెప్పాలంటే సీపీఎం ఒంటరిదయింది. ఇది దాని సొంత ఫ్రంట్ మాత్రమే. ఏవో కొన్ని సంస్థల పేరిట కలిపి ఒక పెద్ద ఫ్రంట్‌ను చూపినంత మాత్రాన తెలంగాణ దళిత బహుజన సమూహాలు భ్రమ పడగలవనుకోవటం ఒక పెద్ద భ్రమ.

**సీపీఎంకు ఇప్పటికీ అంతా మించిపోలేదు. బెటర్ లేట్ దేన్ నెవర్ అనే సామెతను మళ్లీ ప్రస్తావించి చెప్పాలంటే, తెలంగాణ విషయ మై తమ పాత్రకు వారు క్షమాపణ ప్రకటించాలి. అది సూటిగా, ఎటువంటి మెలికలు లేకుండా పారదర్శకంగా ఉండాలి. తాము ఇంతకాలం తీసుకున్న వైఖరిని నిజాయితీగా సమీక్షించుకొని, అందులో లోపాలను గుర్తించుకొని, వాటిని సరిదిద్దుకుంటున్నట్లు వివరంగా తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. దానితోపాటుగా తమ ద్రోహపూరితమైన పాత్రకు క్షమాపణ చెప్పాలి.**

అయితే సీపీఎంకు ఇప్పటికీ అంతా మించిపోలేదు. బెటర్ లేట్ దేన్ నెవర్ అనే సామెతను మళ్లీ ప్రస్తావించి చెప్పాలంటే, తెలంగాణ విషయమై తమ పాత్రకు వారు క్షమాపణ ప్రకటించాలి. అది సూటిగా, ఎటువంటి మెలికలు లేకుండా పారదర్శకంగా ఉండాలి. తాము ఇంతకాలం తీసుకున్న వైఖరిని నిజాయితీగా సమీక్షించుకొని, అందులో లోపాలను గుర్తించుకొని, వాటిని సరిదిద్దుకుంటున్నట్లు వివరంగా తెలంగాణ ప్రజలకు తెలియజేయాలి. దానితోపాటుగా తమ ద్రోహపూరితమైన పాత్రకు క్షమాపణ చెప్పాలి. సీపీఐ వారు తాము భాషా రాష్ట్రాల సూత్రానికి ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని, కాని తెలంగాణ పరిస్థితిలోని ప్రత్యేకత దృష్ట్యా రాష్ట్ర విభజనను బలపరుస్తున్నామని అన్నారు. కనీసం అటువంటి వైఖరి నుంచి అయినా సీపీఎం నేర్చుకోవాలి. జ్యోతిబసును ప్రధాని కానివ్వకపోవటం చారిత్రక తప్పిదమని అధికార రాజకీయాల సందర్భంగా సవరణలు చేసుకున్నవారు, దళిత బహుజనులు దశాబ్దాల పాటు పోరాడి ప్రాణాలు అర్పించిన తెలంగాణ సందర్భంలో నిజాయితీతో తప్పును ఒప్పుకునేందుకు అడ్డువస్తున్నదేమిటి? ఇది చేయనంతకాలం, వారు ఏ ఎత్తుగడలు వేసినా ఉపయోగం ఉంటుందా?

# విశిష్ట అధికారి, ఆత్మబంధువు

**సందర్భం**

**డాక్టర్ పి.సావిత్రిసాయి**


మెదక్ జిల్లాలోని ఫతేనగర్ బస్తీలో సరిగ్గా 65 ఏండ్ల కిందట సంప్రదాయబద్ధమైన శ్రీవైష్ణవ కుటుంబంలో 'వెంకటరమణ' నామధేయంతో, 'పునర్వసు' నక్షత్రంలో జనియించిన ఒక ప్రతిభావంతుని చిత్తరువు నేడు అశేష తెలుగు ప్రజానీకం హృదయాల్లో శోభాయమానంగా, తేజోవంతంగా ప్రకాశిస్తున్నది.

బాలభానుడు లేలేత కిరణాలను విప్పుకుంటున్నట్లుగానే 'వెంకటరమణ'గారు బాల్యం నుంచే తన ప్రతిభాపాటవాలను కనబరుస్తూండేవారు. పంచకావ్యాలు, అమరకోశంతో పాటుగా శతకపద్యాలు, దేశభక్తిగీతాలు కంఠోపాఠంగాను, శ్రావ్యంగాను వినిపిస్తూ అందరి మన్ననలు అందుకునేవారు. ప్రతిభావంతులు పలువురిని ఆకర్షించడం సహజమే కదా!

విరిసీ విరియకముందే సౌరభాలను వెదజల్లుతూ వనాన్ని పరిమళవంతంచేసే విరుల మాదిరిగా కొందరు మహనీయుల జీవితాలు బాల్యం నుంచే తమ లక్ష్యంవైపు దృష్టిసారిస్తాయి. అవి తమ జీవనగతిని నిర్దేశించుకుంటూనే సమాజ శ్రేయస్సును ప్రభావితం చేస్తాయి. తదనుగుణంగా శ్రమైకజీవుల జీవిత చరిత్రలను మార్చే యత్నం చేస్తూనే.. తమ ఆశయ సాధనకు కూడా నిరంతరం యజ్ఞం సలుపుతుంటారు. అటువంటి మహనీయ చరితల్లో పేరెన్నికగన్నది డాక్టర్ కె.వి.రమణ (రిటైర్డ్ ఐఏయస్) గారి జీవన ప్రస్థానం.

ఎమ్మెస్సీ, యూనివర్సిటీ స్థాయిలో ప్రప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులై, లెక్చరర్ ఉద్యోగం చేపట్టిన తొలిదశలోనే జరిగిన ఒక చిన్న సంఘటన రమణ గారిలో అనేక ఆలోచనలను రేకెత్తించింది. ఒక అధికారి ఎలా వ్యవహరించాలి? విద్యాధికులు-లెక్చరర్ల పట్ల దుర్భాషలాడిన అధికారులు ఇక సామాన్యుని పట్ల ఎలా వ్యవహరిస్తారు? ఇటువంటి ఆలోచనలు తాను ఉన్నతాధికారిగా మారి, సాధ్యమైనంతవరకు ఆదర్శంగా నిలువాలని, సామాన్యుల కష్టాలను కొంతవరకైనా మెరుగుపర్చడం యువకునిగా తన కర్తవ్యమని భావించారు. వెంటనే గ్రూప్-1 పరీక్షలకు సిద్ధమవడం, ఉత్తీర్ణత పొందడం, వెనువెంటనే జరిగిపోయాయి. అక్కడ సాధించిన ఆ ఉత్తీర్ణత వారికి అంచెలంచెలుగా అన్ని శాఖల్లో అధికారిగా 'పెద్దపీట' వేసింది. పదవిని చేపట్టడం 'అందరు అధికారుల వలెనే' చేపట్టినా, కర్తవ్య నిర్వహణ విషయంలో విలక్షణత చూపించి తాను అధికారిగా వెళ్లిన ప్రతి శాఖకు కొత్త సొబగులద్దారు. ప్రభుత్వంపై ప్రజలకు అపారమైన విశ్వాసం కలిగేవిధంగా వ్యవహరించిన రమణగారి శైలి పలువురు ముఖ్యమంత్రులకు ఆయన్ని చేరువచేసింది. ఇక అక్కడినుంచి ఆయనెన్నడు వెనుదిరిగింది లేదు. అటు ప్రజలకు, ఇటు ప్రభుత్వానికి 'వారధి'గా నిలిచారు.

నారాయణపేటలో ఆర్డీఓ అంటే 'ఆత్మబంధువు' అనిపించారు. నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ సాంస్కృతిక సౌజన్యం ప్రదీప్తమయ్యే విధంగా అనేక కార్యక్రమాలు చేపట్టారు. గిరిజన సంక్షేమ పథకాలతో అటు గిరిజనులకు, ఇటు ప్రభుత్వానికి చేరువైనారు. పాతబస్తీలో 'పాత' తరానికి స్వస్తి పలికి నిత్యనూతనత్వం వెల్లివిరిసేలా చేశారు. 'సమాధుల సుందరీకరణ' పేరుతో పెద్దలను గౌరవించుకోవాలనే సంప్రదాయాన్ని పరోక్షం'గాను, విదేశీ పర్యాటకులకు ఆకర్షణ అనేది ప్రత్యక్షంగాను పాదుకొల్పారు. నాటకానికి అగ్రస్థానం కల్పించాలంటూ.. కళాకారునికి 'కనీస' గుర్తింపులేని పరిస్థితుల్లో, ఆర్టిస్ట్ గుర్తింపు కార్డులను, పింఛన్ సదుపాయాలను కల్పించడంతోపాటుగా 'నంది'లను రంగస్థలంపై రంకె వేయించారు. గ్రంథాలయోద్యమ' దిశగా దృష్టిసారించి 'శ్రీకృష్ణదేవరాయాంధ్రభాషానిలయాన్ని పునరుద్ధరించారు. 'సారస్వతపరిషత్'ను ప్రభుత్వం చేతి నుంచి తప్పించి సారస్వతాభిమానులకు అందించారు. హౌజింగ్ బోర్డు ద్వారా సింగపూర్-మలేషియన్స్ టౌన్‌షిప్ అంటూ భవిష్యత్తరాలకు మార్గదర్శకంగా, కొత్త గేటెడ్ కమ్యూనిటీలెన్నింటికో ఆదర్శప్రాయంగా, విదేశీ తరహాలో భవంతుల నిర్మాణాన్ని అందుబాటులోకి తెచ్చారు. అదీ ప్రభుత్వ- ప్రైవేట్ యాజమాన్యంలో.. స్వదేశీ వస్తు వినియోగం పట్ల, విక్రయం పట్ల ప్రాచుర్యాన్ని జన బాహుళ్యంలోకి తెచ్చి నష్టాల్లో కూరుకుపోతున్న ఖాదీ బోర్డును లాభాల అందలమెక్కించారు. భగవంతునికి, భక్తునికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గిస్తూ ఎస్వీబీసీ ఛానల్ ద్వారా శ్రీవేంకటేశ్వరుని నిత్య పూజలన్నింటినీ అశేష భక్తజనావళి ముంగిట్లోకి తెచ్చారు. ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ ద్వారా దేవాలయ భూముల ఆక్రమణపై కఠిన చర్యలు తీసుకున్నారు. ఇలా చెప్పుకుంటూపోతే ఎన్నో.. ఎన్నెన్నో.. ఇలా ఒక్కొక్క శాఖలో ఒక్కొక్కటి చొప్పున చెప్పినా దొంతరలు దొంతరలుగా ప్రజాహిత కార్యక్రమాలు దొరలుతాయి.



**అధికారిగా ఇన్ని ప్రత్యేకతలుంటే సద్గుణాలతో కూడిన అంతరంగం కలిగివుండటం ఆయనలోని విశిష్టత. అతి సామాన్యుల పట్ల ఆయన అనుపమానమైన ప్రేమాస్పదుడు. ఆయన అభిమానాన్ని, ఆదరణను ప్రత్యక్షంగా అనుభవించేవారికి వారెంతో 'ఆత్మీయులు'గా అగుపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వంలో సలహాదారునిగా వ్యవహరిస్తూ అనేకానేక ముఖ్య సందర్భాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నారు.**

ఇన్ని శాఖల్లో ఇంత ప్రతిభావంతంగా వ్యవహరించడానికి మూలకారణం ఆయనలోని 'ఆత్మశక్తి, ఆయనలో ఇనుమడించిన ఆత్మవిశ్వాసం'. ముక్కుసూటితత్వం, అనవసరమైన సంభాషణలకు అవకాశం ఇవ్వకపోవడం ఆయన విశిష్టత. ఆయనలోని ప్రజ్ఞ ఆయన్ని ప్రత్యేకంగా నిలబెడుతుంది అందరి నుంచి. ఆయనలోని విశేష గుణాలెందరో్ని ఆకర్షించినా కొందరిని బాధపెడ్తాయేమో కూడా! నిజానికి శత్రువులు లేని వ్యక్తి ఉండరేమో! మనకు తెలిసో, తెలియకో తప్పకుండా ఉంటారు. అందు కే రమణగారిని 'అజాతశత్రువు' అని చెప్పలేం కానీ ఆయనకు శత్రువులు ఉంటే ఎందుకు? అన్నదానికి కారణం మాత్రం చెప్పగలం. ఎందుకంటే ఆయన జీవితం తెరిచిన పుస్తకమంత పారదర్శకం కనుక. ఆయనలోని నిజాయితీ, ఆత్మవిశ్వాసం ఆయనకు శత్రువులను సమకూరుస్తాయని చెప్పవచ్చు. ఎందుకంటే ఆయనలోని సత్యనిష్ఠ, సూటిగా ప్రశ్నించడం, సామాన్యున్ని గౌరవించడం కొందరికి ఇబ్బంది కావచ్చు.

తను నమ్ముకున్న విలువలకు, నిర్వహించే బాధ్యతలకు మధ్య నిత్యం సంఘర్షణ ఎదురవుతున్నా సత్యానికి, న్యాయానికి తప్ప వేరెవ్వరికి తల వంచని దృఢ చిత్తుడాయన. ఇది ఆయన ప్రత్యేకత. అవినీతిని ప్రశ్నించేటప్పుడు ప్రచండభానుడిలా వ్యవహరించే రమణగారు సహాయార్థం తన వద్దకు వచ్చే సామాన్యుల పట్ల 'నవనీతం'లాగా కరిగిపోతారు. ఎవరిదగ్గర, ఎపుడెలా స్పం దించాలో వారికి తెలిసినట్లుగా బహుశా ఇంకెవరికీ పట్టుబడదేమో!

వివేకానందుడు, అబ్దుల్‌కలాం తనకు స్ఫూర్తిప్రదాతలం టూ చెప్పే కె.వి.గారు అధికారిగాను, ఒక ఆధ్యాత్మికవేత్త గాను భావితరాల వారెందరికో స్ఫూర్తిగా నిలుస్తారు. క్రియాశీలక అంశాల పట్ల ఎంతో నిశితదృష్టి, విషయ అవగాహన కలిగి కార్యనిర్వహణలో తనదైనశైలిలో వ్యవహరించడంలో ఆయనలోని ఒక ఐఏఎస్ అధికారి మనకు ప్రస్ఫుటంగా కన్పిస్తారు. శాఖల పనితీరును బాగా ఆకళింపుచేసుకున్న ఉన్నతాధికారిగా ఇప్పటికీ వారి క్యాంప్ ఆఫీసులో ఆయన వ్యవహరించేతీరు భావితరాలకు క్లాస్‌రూం పీరియడ్ లాంటిదనడంలో సందేహం లేదు.

అధికారిగా ఇన్ని ప్రత్యేకతలుంటే సద్గుణాలతో కూడిన అంతరంగం కలిగివుండటం ఆయనలోని విశిష్టత. అతి సామాన్యుల పట్ల ఆయన అనుపమానమైన ప్రేమాస్పదుడు. ఆయన అభిమానాన్ని, ఆదరణను ప్రత్యక్షంగా అనుభవించేవారికి వారెంతో 'ఆత్మీయులు'గా అగుపిస్తారు. రాష్ట్ర ప్రభుత్వంలో సలహాదారునిగా వ్యవహరిస్తూ అనేకానేక ముఖ్య సందర్భాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నారు. అటు కళా, సాహిత్య, సాంస్కృతిక, జానపద, ఆధ్యాత్మిక రంగాలన్నింటి పట్ల బహుముఖీనమైన ప్రజ్ఞను కనబరుస్తున్నారు. తెలంగాణ తేజంగా, తెలుగువారందరి మనోనాదంగా దినదిన ప్రవర్ధమానవుతున్న డాక్టర్ కె.వి.రమణ గారు తరగని కీర్తితో, చెరగని శోభతో శతాధిక సంవత్సరాలు తెలుగు ప్రజానీకానికి పెద్దదిక్కుగా నిలువాలి.

(నేడు ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.వి.రమణాచారి 66వ జన్మదినం)

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078,
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి వెళ్లిన కారు.. చిత్రంలో వెనుక కనిపిస్తున్న భూగ్రహం

# అంతరిక్షంలో కారు

## వందకోట్ల సంవత్సరాలపాటు రోదసిలో చక్కర్లు

- ఆరునెలల్లో అంగారకుడి కక్ష్యలోకి 'రోడ్‌స్టర్'
- కనీవినీ ఎరుగని ప్రయోగం చేసిన స్పేస్‌ఎక్స్
- ప్రపంచంలోనే శక్తిమంతమైన 'ఫాల్కన్ హెవీ' రాకెట్ ప్రయోగం విజయవంతం

**ఫ్లోరిడా, ఫిబ్రవరి 7:** అంతరిక్ష పరిశోధనల రంగంలోనే అరుదైన ఘట్టం బుధవారం ఆవిష్కృతమైంది. అంతరిక్ష పరిశోధన సంస్థ 'నాసా' కూడా ఇప్పటివరకు చేయనటువంటి ప్రయోగాన్ని ప్రైవేటు రంగంలోని అంతరిక్ష పరిశోధన సంస్థ 'స్పేస్ ఎక్స్' విజయవంతంగా చేసి చూపించింది. తొలిసారిగా అంతరిక్షంలోకి ఓ కారును పంపించింది. రోడ్‌స్టర్‌గా పిలుస్తున్న ఆ కారు వందకోట్ల సంవత్సరాలపాటు రోదసిలో ప్రయాణించనున్నది. ఈ ఎరుపు రంగు టెస్లా స్పోర్ట్స్ కారు 'స్పేస్ ఎక్స్' వ్యవస్థాపకుడు ఎలాన్ మస్క్ ఒకప్పుడు వాడిందే. ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన రాకెట్ 'ఫాల్కన్ హెవీ' ద్వారా మంగళవారం దీన్ని అంతరిక్షంలోకి పంపారు. ఫ్లోరిడాలోని కెన్నడీ స్పేస్‌సెంటర్ నుంచి 18,747 జెట్ లైనర్ల వేగంతో అట్లాంటిక్ సముద్రం మీదుగా రాకెట్ అంతరిక్షంలోకి దూసుకెళ్లింది. కారును అంగారక గ్రహం కక్ష్యలోకి ప్రవేశపెట్టడం లక్ష్యంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు. ఫాల్కన్ హెవీ రాకెట్‌కు ముందు భాగాన ఉన్న క్యాప్సూల్‌లో ఈ కారును అమర్చారు. డ్రైవింగ్ సీట్లో వ్యోమగామి దుస్తుల్లో ఓ డమ్మీ డ్రైవర్‌ను కూర్చోబెట్టారు. కారు వెనుక భాగంలో అమర్చిన శక్తిమంతమైన కెమెరాలతో కక్ష్యలో దాని ప్రయాణాన్ని భూమ్మీది నుంచి ఎప్పటికప్పుడు గమనించవచ్చు. అంగారక కక్ష్యలోకి చేరేందుకు ఆరునెలలపైనే పడుతుంది. అప్పటివరకు రోడ్‌స్టర్ రోదసిలో సెకనుకు 11కిలోమీటర్ల వేగంతో 40కోట్ల కిలోమీటర్లు తిరుగుతుంది. ఈ కారు నుంచి గాయకుడు డేవిడ్‌బోవీ 'స్పేస్ ఆడిటీ' ఆల్బమ్‌లోని 'లైఫ్ ఆన్ మార్స్' గీతం వినిపిస్తూ ఉంటుంది. కారు డాష్‌బోర్డ్‌పై 'భయపడొద్దు' (డోంట్ పానిక్) అని పెద్ద అక్షరాల్లో రాసి ఉంచారు. ఒకవేళ ఏలియన్స్ కారును గమనిస్తే, అది భూమ్మీద మానవజాతికి చెందినదని అర్థమయ్యేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

**నిప్పులు చిమ్ముకుంటూ**

చంద్రుడిపైకి అపోలో-11 అంతరిక్ష వ్యోమనౌకను ప్రయోగించిన కెనడీ స్పేస్‌సెంటర్ లాంచ్‌ప్యాడ్ నుంచే ఫాల్కన్ హెవీ రాకెట్‌ను ప్రయోగించారు. మూడు పునర్వినియోగ ఫాల్కన్-9 రాకెట్లతో ఈ భారీ రాకెట్‌ను రూపొందించారు. తొలిదశ బూస్టర్లు మూడింటిలో రెండు క్షేమంగా తిరిగివచ్చి కేప్ కెనవెరాల్ ఎయిర్ ఫోర్స్ స్టేషన్లో ల్యాండ్ అయ్యాయి. మరో బూస్టర్ మధ్యలోనే కూలిపోయింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంతో అంతరిక్ష రంగంలో స్పేస్‌ఎక్స్ కొత్త చరిత్ర సృష్టించింది. శక్తిమంతమైన రాకెట్‌ను ప్రభుత్వ స్పేస్ ఏజెన్సీ కాకుండా.. ఓ ప్రైవేటు సంస్థ నింగిలోకి పంపడం ఇదే తొలిసారి. టెస్లా ఇన్‌కార్పొరేషన్ సీఈవో ఎలాన్ మస్క్ 2002లో స్పేస్ ఎక్స్‌ను స్థాపించారు.



### ఫాల్కన్ హెవీ.. ప్రత్యేకతలివీ..

64టన్నుల పేలోడ్‌ను మోసుకెళ్లే ఫాల్కన్ హెవీ పునర్వినియోగ వాహక నౌక. మూడు ఫాల్కన్-9 రాకెట్లకు చెందిన 27 బూస్టర్ ఇంజిన్లను కలిపి దీన్ని రూపొందించారు. ప్రపంచంలోనే అత్యంత బరువైన 'డెల్టా-4' రాకెట్ కన్నా ఫాల్కన్ హెవీ రెట్టింపు బరువైనది. ఇది 18 బోయింగ్-747 విమానాల శక్తితో సమానం. 230 అడుగుల (23 అంతస్తుల భవనానికి సమానం) ఎత్తు ఉన్న ఫాల్కన్ హెవీ.. ఒకేసారి 64 టన్నుల బరువుండే ఐదు డబుల్‌డెక్కర్ బస్సులను అంతరిక్షంలోకి తీసుకెళ్లగలదు. ఈ ఫాల్కన్ హెవీ రాకెట్ ద్వారానే భవిష్యత్తులో చంద్రుడు, అంగారక గ్రహాలపైకి అంతరిక్ష యాత్రికులను తీసుకెళ్లాలని స్పేస్‌ఎక్స్ సంస్థ ప్రణాళికలు రచిస్తున్నది.

# వైదిక బ్రాహ్మణులకు మైనార్టీ హోదా ఇవ్వలేం

- సింధీలు, కొడవలకూ ఇవ్వటం కుదురదు
- జాతీయ మైనార్టీ కమిషన్ స్పష్టీకరణ



**న్యూఢిల్లీ:** వైదిక బ్రాహ్మణులు, సింధీలు, కొడవ సామాజికవర్గాలకు మైనార్టీ హోదా ఇవ్వలేమని జాతీయ మైనార్టీ కమిషన్ (ఎన్‌సీఎం) స్పష్టంచేసింది. ఆయా వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను తిరస్కరించింది. ఈ వర్గాలకు మైనార్టీ హోదా ఇస్తే అది హిందూ మతంలో చీలికలకు దారి తీస్తుందని పేర్కొన్నది. ఈ మేరకు 2016-17 వార్షిక నివేదికలో ఎన్‌సీఎం తన అభిప్రాయాలను పొందుపర్చింది. త్వరలో పార్లమెంట్ ముందుకు రానున్న ఈ నివేదిక వివరాలను న్యూస్18 వెబ్‌సైట్ బుధవారం వెల్లడించింది. 'వైదిక బ్రాహ్మణులు హిందూసమాజంలో విడదీయరాని భాగం. కొద్దిమందిమి మాత్రమే ఉన్నామనే వాదన.. మైనార్టీ హోదా ఇవ్వడానికి సరిపోదు. వేదాలను, వైదిక సంస్కృతిని పరిరక్షించాలని యునెస్కో చేసిన సూచనను పరిగణలోకి తీసుకొని.. తమ సంస్కృతిని కాపాడుకోవడానికైనా మైనార్టీ హోదా ఇవ్వాలని వైదిక బ్రాహ్మణులు కోరటం కూడా సమంజం కాదు. ఒకవేళ మైనార్టీ హోదా ఇస్తే రాజ్‌పుత్, వైశ్య తదితర సామాజికవర్గాలు కూడా హోదా డిమాండ్ చేస్తాయి' అని మైనార్టీ కమిషన్ తన నివేదికలో పేర్కొంది. భాషాపరంగా అల్పసంఖ్యాకులం కాబట్టి తమకు మైనార్టీ హోదా ఇవ్వాలన్న సింధీల, కొడవ వర్గాల వాదనను కూడా కమిషన్ అంగీకరించలేదు.

# కారు ప్రమాదంలో మోదీ భార్యకు గాయాలు

- ఒకరి మృతి: రాజస్థాన్‌లో పెండ్లికి వెళ్లి వస్తుండగా ఘటన

**జైపూర్:** రాజస్థాన్‌లోని చిత్తోర్‌గఢ్ జిల్లా కుతుందా ప్రాంతంలో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ భార్య యశోదాబెన్ గాయపడ్డారు. ఈ ప్రమాదంలో వారి బంధువు ఒకరు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. 'యశోదాబెన్‌తో కలిపి మొత్తం ఆరుగురు రాజస్థాన్‌లోని బరాన్ జిల్లాలో జరిగిన బంధువుల పెండ్లికి హాజరై.. కారులో తిరిగి గుజరాత్‌కు బయలుదేరారు. అదే సమయంలో ఇనుప పైపుల లోడ్‌తో వెళ్తున్న ట్రక్కును నిర్లక్ష్యంగా నడుపుతున్న డ్రైవర్.. ఒక్కసారిగా పక్కకు తిప్పడంతో ఆ వెనుకే వస్తున్న కారు దాన్ని ఢీకొట్టింది. ప్రమాదంలో యశోదాబెన్ బంధువు బసంత్‌భాయి మోదీ మృతిచెందారు. యశోదాబెన్‌తోపాటు మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొన్నాం' అని పర్సోలి పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో శ్యామ్‌సింగ్ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నామని, ప్రమాదంలో కారు నుజ్జునుజ్జయిందని చెప్పారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకొని ట్రక్కు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. క్షతగాత్రులను వైద్య చికిత్స కోసం చిత్తోర్‌గఢ్ జిల్లా కేంద్రానికి తరలించామని చెప్పారు.



దవాఖానలో యశోదాబెన్.. రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

# కుటుంబం కోసం దేశాన్ని ముంచారు

- నిరర్థక ఆస్తులు కాంగ్రెస్ పాపమే
- కాంగ్రెస్‌ను రద్దు చేయాలని గాంధీజీ ఆనాడే చెప్పారు
- దేశాన్ని దోచుకున్న వారిని ఎవరినీ వదిలిపెట్టం
- పార్లమెంట్ ఉభయసభల్లో ప్రధాని మోదీ
- రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని ఆమోదించిన పార్లమెంట్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** కాంగ్రెస్ పార్టీ దేశాభివృద్ధిని పణంగా పెట్టి నెహ్రూ, ఇందిరాగాంధీ కుటుంబాన్ని స్తుతించడంలోనే కాలం అంతా గడిపేసిందని ప్రధాని నరేంద్రమోదీ ఆరోపించారు. దేశంలో కుప్పలుగా పేరుకుపోయిన నిరర్థక ఆస్తులు యూపీఏ ప్రభుత్వాల పాప ఫలితమేనన్నారు. నిరుద్యోగంతోపాటు ఇతర అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను ఆయన తిప్పికొట్టారు. పార్లమెంట్‌లో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు ప్రధాని మోదీ బుధవారం సమాధానం ఇచ్చారు. మోదీ ప్రసంగం ఆసాంతం కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఈ గందరగోళం మధ్యనే మోదీ తన ప్రసంగాన్ని కొనసాగించారు. ఆయన ప్రసంగంలో అధిక భాగం ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల గురించే సాగింది.

**కాంగ్రెస్ వల్లనే మొండి బకాయిలు**

'దేశంలో నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా పేరుకుపోయిన మొండి బకాయిలు యూపీఏ ప్రభుత్వ పాపమే. వాటి వివరాలు మొదటిసారిగా వెల్లడిస్తున్నా. ముందుగానే ఆ వివరాలు వెల్లడించి ఉంటే ఆర్థిక వ్యవస్థకు తీవ్ర హాని జరిగేది. ఎంపిక చేసిన కొంతమందికి రుణాలు ఇవ్వాలని బ్యాంకులపై ఒత్తిడి తెచ్చారు. నిరర్థక ఆస్తులు 82 శాతం ఉన్నాయి. బ్యాంకుల రుణాలు రూ.18 లక్షల కోట్ల నుంచి రూ.52 లక్షల కోట్లకు పెరిగాయి. అప్పుడు అధికారంలో ఉన్నవారికి సన్నిహితులైన వారికే రుణాలు ఇచ్చారు. నిరర్థక ఆస్తులు పెరిగిపోవడానికి నూటికి నూరు శాతం కాంగ్రెస్‌దే బాధ్యత' అని ప్రధాని పేర్కొన్నారు.

**ఆధార్‌పై దుష్ప్రచారం**

'అవినీతిని పెకిలించి వేసేందుకే ఆధార్‌ను శాస్త్రీయంగా ఉపయోగిసున్నాం. మోదీ వస్తే ఆధార్‌ను రద్దు చేస్తారని అప్పుడు ప్రచారం చేశారు. ఇప్పుడు ఆధార్ వ్యవస్థను బలోపేతం చేసేసరికి వద్దంటున్నారు. బడ్జెట్‌లో మధ్యతరగతి వర్గాలకు ఎటువంటి ప్రయోజనం చేకూర్చలేదని అంటూ ప్రతిపక్షాలు అసత్యాలను ప్రచారం చేస్తున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాలను అభివృద్ధి చేస్తున్నాం' అని మోదీ తెలిపారు. 'కొన్ని దశాబ్దాలుగా ఒకే కుటుంబాన్ని గూర్చి స్తోత్రగీతాలు పాడేందుకే కాంగ్రెస్ తన శక్తినంతటినీ వినియోగించింది. ఒక కుటుంబం ప్రయోజనాల కోసం దేశ ప్రయోజనాలను పక్కనపెట్టారు. నేను అవినీతి, నల్లధనానికి వ్యతిరేకంగా పోరాడుతున్నందున ప్రతిపక్ష నేతలు నిద్రకు దూరమయ్యారు. అవినీతి కేసుల్లో నలుగురు మాజీ ముఖ్యమంత్రులు ఇప్పటికే జైలు ఊచలు లెక్కబెడుతున్నారు. ఎవరినీ వదిలిపెట్టం. దేశాన్ని దోచుకున్న వారు ఆ సొమ్మును తిరిగి సామాన్యులకు ఇవ్వాల్సిందే' అని మోదీ హెచ్చరించారు. ప్రధాని తాము లేవనెత్తిన అంశాలకు సమాధానం ఇవ్వలేదని పేర్కొంటూ కాంగ్రెస్, తృణమూల్, వామపక్ష సభ్యులు వాకౌట్ చేసిన అనంతరం లోక్‌సభ మూజువాణి ఓటుతో ధన్యవాదాల తీర్మానాన్ని ఆమోదించింది. రాజ్యసభలో కూడా ప్రధాని కాంగ్రెస్‌పై విమర్శలు సంధించారు. కాంగ్రెస్‌కు ఓ నూతన భారతదేశం అవసరం లేదని, వారికి ఎమర్జెన్సీ, కుంభకోణాలు, సిక్కు వ్యతిరేక హింస జరిగే దేశం కావాలని విమర్శించారు.



లోక్‌సభలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

## రేణుకా చౌదరికి మోదీ చురకలు

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా బుధవారం రాజ్యసభలో మాట్లాడిన ప్రధాని మోదీ తనకు పదే పదే అడ్డు తగిలిన కాంగ్రెస్ సభ్యురాలు రేణుకాచౌదరికి సున్నితంగా చురకలు అంటించారు. కాంగ్రెస్ ముక్త్ భారత్ అన్న నినాదం తాను ఇవ్వలేదని, అది గాంధీజీ కోరిక అని మోదీ చెప్తున్న సమయంలో రేణుకాచౌదరి పెద్దగా నవ్వారు. దీంతో ఆగ్రహించిన చైర్మన్ వెంకయ్యనాయుడు, ఆమెకు ఏదైనా సమస్య ఉంటే డాక్టర్ వద్దకు వెళ్లాలని సూచించారు. ఇంతలో జోక్యం చేసుకున్న మోదీ 'సభాపతీజీ మేరీ ఆప్‌సే వినతీ హై రేణుకాజీ కో కుచ్ మత్ కహియే. రామాయణ్ సీరియల్ కే బాద్ హఁసీ సున్నే కా సౌభాగ్య ఆజ్ మిలా హై (చైర్మన్‌గారు రేణుకాజీని ఏమీ అనవద్దని విజ్ఞప్తి చేస్తున్నాను. రామాయణ్ సీరియల్ తరువాత అటువంటి వికటాట్టహాసం చూసే సౌభాగ్యం నేడు కలిగింది) అన్నారు. రామాయణంలో శూర్పనఖ చేసిన వికటాట్టహాసాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాని మోదీ ఆ వ్యాఖ్యలు చేసినట్టు భావిస్తున్నారు.



# పృథ్వీ-2 అణు క్షిపణి ప్రయోగం విజయవంతం



**బాలాసోర్:** స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన అణు సామర్థ్యం కలిగిన పృథ్వీ-2 క్షిపణిని బుధవారం భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఉపరితలం పైనుంచి ఉపరితలంపైకి ప్రయోగించగల ఈ క్షిపణి 350 కి.మీ. దూరంలోని లక్ష్యాలను ఛేదించగలదు. దీన్ని చాందీపూర్ సమీపంలోని ఇంటిగ్రేటెడ్ టెస్ట్‌రేంజ్ లాంచ్ కాంప్లెక్స్-3 నుంచి ఉదయం 11.35 గంటలకు ప్రయోగించారు. క్షిపణి పరీక్ష విజయవంతమైందని రక్షణ శాఖ వర్గాలు తెలిపాయి. గత నెల 18న అగ్ని-5, మంగళవారం ఒడిశాలోని అబ్దుల్ కలాం ద్వీపం నుంచి అగ్ని-1 క్షిపణుల పరీక్షలు విజయవంతం కాగా, బుధవారం పృథ్వీ-2 కూడా అదే బాటలో దూసుకెళ్లింది. పృథ్వీ-2.. 500 నుంచి 1000 కిలోల వార్‌హెడ్స్‌ను తీసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉన్నది. సైన్యం శక్తి సామర్థ్యాల సన్నద్ధతలో భాగంగా ఈ ప్రయోగాన్ని చేపట్టారు.

# పార్లమెంట్ బహిరంగ సభ కాదు!

- సమస్యలకు సమాధానం చెప్పకుండా.. ప్రసంగాలు ఎందుకు?
- రాఫెల్ ఒప్పందంపై ఎందుకు నోరు విప్పడం లేదు?
- మోదీపై ధ్వజమెత్తిన రాహుల్



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ప్రధాని మోదీ బుధవారం పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సమాధానం చెప్పకుండా తప్పించుకుంటున్న మోదీ తిరిగి ఆయనే ప్రశ్నలను సంధిస్తున్నారని విమర్శించారు. మోదీ తాను ప్రధానినన్న విషయాన్ని మరిచి ప్రతిపక్ష నాయకుడిగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాహుల్ పార్లమెంట్ బయట విలేకరులతో మాట్లాడుతూ 'ప్రభుత్వం ఏర్పడి నాలుగేండ్లు గడిచినా ప్రధాని మోదీ ఇంకా ఆరోపణలకే పరిమితమయ్యారు. పార్లమెంట్ ఉన్నది రాజకీయ ఆరోపణలకా? లేక ప్రజా సమస్యలను పరిష్కరించడానికా? రాఫెల్ ఒప్పందం, రైతు సమస్యలు, దేశంలో సంక్షోభం, నిరుద్యోగం తదితర సమస్యలకు మొదట సమాధానం చెప్పండి. తప్పించుకొని తిరుగడం మానండి' అని రాహుల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంట్‌లో మోదీ దాదాపు 90 నిమిషాలు మాట్లాడారని, కానీ, రాఫెల్ ఒప్పందం గురించి ఒక్కమాట కూడా మాట్లాడలేదని రాహుల్ విమర్శించారు. 'ప్రధాని ఫ్రాన్స్‌లో పర్యటించినప్పుడు చొరవతీసుకొని రాఫెల్ ఒప్పందంలో మార్పులు చేశారా? లేదా?. ఈ ఒప్పందంలో అవినీతి జరిగిందా? లేదా?. ఈ ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పాలి' అని రాహుల్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నాయకురాలు సోనియాగాంధీ మాట్లాడుతూ ప్రధాని ప్రసంగంలో పాత విషయాలనే మళ్లీ ప్రస్తావించారని ఎద్దేవా చేశారు.

# కేంద్రంపై విపక్షాల ముప్పేట దాడి

- రాఫెల్ ఒప్పందం భారీ కుంభకోణం: కాంగ్రెస్
- ప్రశ్నిస్తే దాడులు చేస్తున్నారు: సీపీఐ

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** రాజ్యసభలో బుధవారం ప్రతిపక్షాలన్నీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డాయి. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా కాంగ్రెస్ ఉప నాయకుడు ఆనంద్ శర్మ మాట్లాడుతూ రాఫెల్ ఒప్పందంలో కచ్చితంగా కుంభకోణం చోటుచేసుకుందని ఆరోపించారు. 'ప్రైవేటు సంస్థలకు లబ్ధి చేకూర్చడానికి నాలుగు రెట్లు ధర పెంచారు. కనీసం మన దేశంలో ఉన్న హిందూస్థాన్ ఏరోనాటికల్ లిమిటెడ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోలేదు. 2015లో ఫ్రాన్స్ పర్యటన సందర్భంగా ప్రధాని మోదీ ఈ ఒప్పందాన్ని మార్చివేశారు' అని పేర్కొన్నారు. సీపీఐ ఎంపీ డీ రాజా మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మోదీ ప్రభుత్వం పని చేస్తున్నదని, విభజించు, పాలించు అన్న సూత్రాన్ని పాటిస్తున్నదని చెప్పారు. ఎవరైనా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే వారిపై దాడి జరుగుతున్నదని ఆరోపించారు. రాఫెల్ ఒప్పంద వివరాలను బహిర్గత పరచడమంటే దేశ భద్రతపై రాజీ పడటమేనని ప్రభుత్వం తెలిపింది. గతంలో యూపీఏ ప్రభుత్వం కూడా ఇలాంటి గోప్యతను పాటించిందని పేర్కొంది. రాఫెల్ కొనుగోలు వివరాలు వెల్లడించడం కుదరదని స్పష్టం చేసింది.

# తలుపులు మూసి ఏపీని విభజించారు!

మొదటిపేజీ తరువాయి...

బాధితురాలు ఆంధ్రప్రదేశ్ అని, ఆ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేదని అన్నారు. వాజపేయి ప్రభుత్వ హయాంలో మూడు రాష్ట్రాల విభజన జరిగిందని, అప్పుడు ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాలేదని గుర్తుచేశారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం స్వాతంత్రోద్యమ సమయంలో కూడా కాంగ్రెస్ ఇలాగే దేశాన్ని కూడా విభజించిందని దుయ్యబట్టారు. దేశానికి తొలి ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అయి ఉంటే నేడు జమ్ముకశ్మీర్‌లోని కొంతభాగం పాకిస్థాన్ నియంత్రణలో ఉండేది కాదని అన్నారు. నాడు 15 కాంగ్రెస్ కమిటీల్లో 12 కమిటీలు పటేల్‌ను ప్రధాని పదవికి ఎంపిక చేసినా నెహ్రూను ప్రధానిని చేశారని, అలాంటి పార్టీ తమకు ప్రజాస్వామ్యాన్ని గూర్చి తమకు పాఠాలు చెబుతున్నదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన దళిత ముఖ్యమంత్రి టీ అంజయ్యను రాజీవ్‌గాంధీ అవమానించారని చెప్పారు. రాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికైన నీలం సంజీవరెడ్డిని మాజీ ప్రధాని ఇందిరాగాంధీ వెన్నుపోటు పొడిచారని, తొలి తెలుగు ప్రధాని పీవీ నరసింహారావుకు కూడా అవమానాలు తప్పలేదని, ఇది కాంగ్రెస్ చరిత్ర అని విమర్శించారు. ఇలాంటి పార్టీకి ప్రజాస్వామ్యాన్ని గూర్చి మాట్లాడే అర్హత లేదన్నారు. తెలుగువారి ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్ దెబ్బతీయడం వల్లనే ఎన్టీఆర్ సినిమాలను వదిలి రాజకీయాల్లోకి వచ్చారని చెప్పారు. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో రాష్ట్రపతిపాలన విధించి పలుమార్లు ప్రజాస్వామ్యాన్ని కాంగ్రెస్ ఖూనీ చేసిందని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని తాము తెచ్చామని కాంగ్రెస్ చెప్పుకోవడం హాస్యాస్పదమని మోదీ ఎద్దేవా చేశారు.

## 24 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

**న్యూఢిల్లీ:** దేశంలో 24 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ఆరోగ్య రంగంలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి రూ.14,930 కోట్లు ఖర్చు చేయడానికి కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. 2021నాటికి ఈ కొత్త కాలేజీలు అందుబాటులోకి రావడంతోపాటు అండర్‌గ్రాడ్యుయేట్, పోస్టుగ్రాడ్యుయేట్ మెడికల్ సీట్లను 18,058కి పెంచనున్నట్లు కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రతి మూడు లేదా ఐదు పార్లమెంట్ నియోజకవర్గాల పరిధిలో ఒక మెడికల్ కాలేజీ, ప్రతి రాష్ట్రంలో ఒక ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొంది. అలాగే దేశవ్యాప్తంగా 248 నర్సింగ్, ప్రసూతి వైద్య పాఠశాలల ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని వివరించింది.

## దినకరన్‌తో విలీనం కుదురదన్న అన్నాడీఎంకే

**చెన్నై:** దినకరన్ చేసిన ప్రతిపాదనలను అన్నాడీఎంకే తిరస్కరించింది. అది జరగదు అని మంత్రి జయకుమార్ మీడియాతో చెప్పారు. పళనిస్వామి, పన్నీర్‌సెల్వం నేతృత్వంలోని పార్టీతో సంధి చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నానని టీటీవీ దినకరన్ మంగళవారం ప్రకటించారు. తంజావూర్‌లో పర్యటించిన దినకరన్, తనకు సీఎం కావాలన్న కోరిక లేదని, అయితే రెండు షరతులకు లోబడి తమ వర్గాన్ని అన్నాడీఎంకేలో విలీనం చేస్తానని ప్రకటించారు. పార్టీకి ద్రోహం తలపెట్టిన ఆరుగుర్ని కేబినెట్ నుంచి తొలగించాలని, తన వద్ద ఉన్న 18 మంది ఎమ్మెల్యేల్లో ఒకర్ని ముఖ్యమంత్రిగా నియమించాలని దినకరన్ షరతులు విధించినట్లు సమాచారం.

# భూకంపం ధాటికి కకావికలమైన తైవాన్!

- ఆరుగురు మృతి, 256 మందికి గాయాలు,
- గల్లంతైన వారి కోసం గాలిస్తున్న సహాయక బృందాలు

**హువాలిన్, ఫిబ్రవరి 7:** మంగళవారం అర్ధరాత్రి సంభవించిన భారీ భూకంపానికి తైవన్‌లోని ముఖ్య పర్యాటక నగరం హువాలిన్ కకావికలమైంది. రిక్టర్ స్కేలుపై 6.4గా నమోదైన భూకంప తీవ్రతకు నగరంలోని పలు భవనాలు నేలమట్టమయ్యాయి. పలు ప్రాంతాల్లోని రోడ్లు బీటలు వారాయి. పెద్దపెద్ద భవంతులు పక్కకు వంగిపోవడంతో ప్రజలు భయంతో వణికిపోయారు. భూకంపం కారణంగా ఇప్పటివరకు ఆరుగురు మృతిచెందినట్లు అధికారులు ధ్రువీకరించారు. అలాగే 256 మందికి గాయాలవగా, మరో 88మంది గల్లంతయ్యారు. గాయపడిన వారిలో ఆరుగురు తమ దేశ పౌరులు ఉన్నారని చైనా తెలిపింది. భవనాల శిథిలాల కింద పలువురు చిక్కుకుని ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. శిథిలాల తొలగింపు ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. భూకంపం సంభవించిన ప్రాంతాన్ని తైవాన్ దేశాధ్యక్షురాలు తాయ్ ఇంగ్ వెన్ పరిశీలించారు. సహాయకచర్యలను ముమ్మరం చేయాలని ఆమె సూచించారు.



కుప్పకూలిన భవనం వద్ద కొనసాగుతున్న సహాయ చర్యలు

# మోదీ సర్కార్‌కి పారిశ్రామికవేత్తల మీదే ప్రేమ!

- రైతుల గురించి పట్టించుకోవడం లేదు
- మార్చి 23 నుంచి ఢిల్లీలో ఉద్యమం: అన్నాహజారే



**సాత్నా (మధ్యప్రదేశ్), ఫిబ్రవరి 7:** ఇప్పుడున్న ఎన్డీయే ప్రభుత్వం రైతుల మీదకంటే పారిశ్రామికవేత్తల మీదనే ఎక్కువ ప్రేమ చూపుతున్నదని అవినీతి వ్యతిరేక ఉద్యమ నాయకుడు అన్నాహజారే విమర్శించారు. గత 70 ఏండ్లలో దేశంలో సుమారు 12 లక్షల మంది రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. బుధవారం మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లాకేంద్రంలో నిర్వహించిన సభలో హజారే మాట్లాడుతూ.. రైతుల కంటే అంబానీ, ఆదానీ వంటి పారిశ్రామికవేత్తల పట్ల కేంద్ర ప్రభుత్వం ఎక్కువ శ్రద్ధ చూపుతున్నదని విమర్శించారు. రైతులకు మద్దతు ధరపై తాను ప్రధానికి లేఖ రాశానని చెప్పారు. రెండు నెలలుగా దేశవ్యాప్తంగా పర్యటిస్తున్నానని, కఠినమైన లోక్‌పాల్ చట్టం కోసం, రైతు సమస్యలపై మార్చి 23 నుంచి ఢిల్లీలో ఆందోళనలు చేపట్టనున్నామని హజారే వెల్లడించారు.

# మైనింగ్ అంటే వనరుల విధ్వంసమేనా?: సుప్రీం

- 88 గోవా లైసెన్సులు రద్దు



**న్యూఢిల్లీ:** ఇనుప ఖనిజం గనుల పరిశ్రమ అంటే సహజ వనరుల్ని బలవంతంగా ధ్వంసం చేసేదిగా ముద్రపడిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. అక్రమార్కులు చట్టాన్ని అతిక్రమించి మరీ వనరుల్ని కొల్లగొడుతున్నా ప్రేక్షకపాత్ర వహించడంపై గోవా ప్రభుత్వాన్ని మందలించింది. ఎంత ఎక్కువ లాభాలను ఆర్జించగలమన్న ఒక్క ఆలోచనే తప్ప.. సామాజిక బాధ్యతనూ, ప్రజాసంక్షేమాన్ని మైనింగ్ కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదని జస్టిస్‌లు మదన్‌బీ లోకూర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనం పేర్కొన్నది. 88 గనుల లీజును రెన్యూవల్ చేస్తూ గోవా ప్రభుత్వం 2015లో తీసుకున్న నిర్ణయాన్ని సవాల్ చేస్తూ 'గోవా ఫౌండేషన్' అనే సంస్థ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం విచా రించింది. రెన్యూవల్ చేసిన 88 లైసెన్సులను రద్దు చేస్తూ బుధవారం తీర్పునిచ్చింది. మైనింగ్ కాంట్రాక్టర్లు, ప్రభుత్వం పరస్పరం అంగీకారానికి వచ్చినప్పుడు తాము ప్రేక్షకుడిలా మిగిలిపోవాల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తంచేసింది. దేశ సహజ వనరులు ఏ ఒక్కరి సొత్తు కాదని, వాటిని వాస్తవిక విలువ కన్నా తక్కువ ధరకు పొందడాన్ని ఎంతమాత్రం అంగీకరించబోమని మాజీ చీఫ్‌జస్టిస్ ఖేహర్ చేసిన వ్యాఖ్యల్ని కోర్టు ఈ సందర్భంగా గుర్తు చేసింది.

# పేరుకే ఎమర్జెన్సీ.. అంతా ప్రశాంతం!

- కావాలంటే వచ్చి చూసుకోవచ్చన్న మాల్దీవుల ప్రభుత్వం

**మాలె/ న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** పరిపాలనకు సంబంధించిన కొన్ని అంతర్గత అంశాలను సరిదిద్దేందుకే దేశంలో ఎమర్జెన్సీని విధించాల్సి వచ్చిందని.. రాజధాని మాలెలో కొన్ని ప్రాంతాలు మినహా దేశంమొత్తం ప్రశాంతంగా ఉన్నదని మాల్దీవుల ప్రభుత్వం పేర్కొన్నది. అభివృద్ధి భాగస్వాములు, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు తమ దేశానికి వచ్చి పరిస్థితులను తెలుసుకోవాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ దేశ విదేశాంగశాఖ బుధవారం ఓ ప్రకటనను విడుదల చేసింది. 'అత్యవసర పరిస్థితిని ప్రకటించినప్పటికీ ఎక్కడా కర్ఫ్యూ విధించలేదు. ప్రజలు సాధారణ జీవితాన్ని గడుపుతున్నారు. వివిధ రకాల సేవలు, వ్యాపారాలు నిరాటంకంగా కొనసాగుతున్నాయి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నది. 'పర్యాటక ప్రదేశాలు, ద్వీపాల్లో సాధారణ పరిస్థితులు కొనసాగుతున్నాయి. అంతర్జాతీయ సమాజ ప్రతినిధులు మాలె నగర రక్షణ గురించి, మా దేశంలో ఉన్న వివిధ దేశాల పౌరుల భద్రతకు సంబంధించిన పరిస్థితులను అంచనా వేయవచ్చు' అని వివిధ దేశాలు, సంస్థలను ఆహ్వానించింది. దేశీయ, అంతర్జాతీయ విమానాశ్రయాలతోపాటు ప్రభుత్వ సేవలు, రవాణా, వాణిజ్యం, పాఠశాలలు, సౌకర్యాలు అన్నీ సర్వసాధారణంగా కొనసాగుతున్నాయని ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

**మాల్దీవుల్లో భారత్ సైనిక జోక్యం వద్దు : చైనా**

అంతర్జాతీయ సమాజంలో భారతదేశ పరపతి పెరిగిపోతుండటంతో చైనా వెన్నులో వణుకు పుడుతున్నది. మాల్దీవుల్లో నెలకొన్న రాజకీయ సంక్షోభాన్ని పరిష్కరించాలని ఆ దేశ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ నషీద్ భారత్‌కు విజ్ఞప్తి చేస్తున్న నేపథ్యంలో చైనా స్పందించింది. మాల్దీవుల విషయంలో సైనిక జోక్యం చేసుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో తగదని.. సైనిక జోక్యం వల్ల పరిస్థితి మరింత సంక్లిష్టంగా మారుతుందని భారత్‌ను పరోక్షంగా హెచ్చరించింది.

# మాల్యా రుణాల వివరాలు మా వద్ద లేవు

- సీఐసీకి వెల్లడించిన ఆర్థికశాఖ



**న్యూఢిల్లీ :** పారిశ్రామికవేత్త విజయ్‌మాల్యా వివిధ ఆర్థికసంస్థల నుంచి పొందిన రుణాలకు సంబంధించిన సమాచారం తమ వద్ద లేదని ఆర్థికమంత్రిత్వశాఖ తెలిపింది. మాల్యా చేసిన అప్పుల వివరాలు కావాలని రాజీవ్‌ఖరే అనే వ్యక్తి కేంద్ర సమాచార కమిషన్(సీఐసీ)ని ఆశ్రయించగా, ఆయనకు ఆ సమాచారం అందజేయాలని సీఐసీ కేంద్ర ఆర్థికశాఖను కోరింది. అయితే ఆ సమాచారం తమ వద్ద లేదని, మాల్యాకు రుణాలు ఇచ్చిన బ్యాంకులు లేదా రిజర్వుబ్యాంకు వద్ద ఆ వివరాలు ఉండవచ్చునని ఆర్థికశాఖ అధికారి సమాధానం పంపారు. నిజానికి మాల్యా రుణాలకు సంబంధించిన వివరాలను ఆర్థికశాఖ లోగడ రెండుసార్లు పార్లమెంటులో వెల్లడించింది. అటువంటిది ఇప్పుడిలా పేర్కొనడంపై సీఐసీ అసంతృప్తి వ్యక్తం చేసింది. ఆర్థికశాఖ సమాధానం చట్టం ముందు నిలువదని పేర్కొంది.

## ఇక డ్రైవింగ్ లైసెన్స్‌కు ఆధార్ అనుసంధానం

**న్యూఢిల్లీ:** డ్రైవింగ్ లైసెన్స్‌లను కూడా ఆధార్‌తో అనుసంధానం చేసేందుకు ప్రయత్నిస్తున్నామని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది. నకిలీ లైసెన్సులను ఏరివేసేందుకు అన్ని రాష్ట్రాలను కలుపుతూ ఒక సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామని పేర్కొంది. రోడ్డు భద్రతకు సంబంధించి సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి కేఎస్ రాధాకృష్ణన్ నేతృత్వంలో కోర్టు ఏర్పాటు చేసిన కమిటీ ఈ విషయాన్ని న్యాయమూర్తులు మదన్ బీ లోకుర్, దీపక్ గుప్తాలతో కూడిన ధర్మాసనానికి వెల్లడించింది. తమ కమిటీ గత ఏడాది నవంబర్ 28న రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖకు చెందిన సంయుక్త కార్యదర్శితో సమావేశమై నకిలీ లైసెన్సులను ఏరివేయడం తదితర అంశాలను చర్చించిందని తెలిపింది. నకిలీ లైసెన్సులను ఏరివేసేందుకు సారథి-4ను సిద్ధం చేస్తున్నట్టు సంయుక్త కార్యదర్శి తెలిపారని పేర్కొంది. సారథి-4 కింద అన్ని లైసెన్సులను ఆధార్‌తో అనుసంధానం చేస్తారని తెలిపింది.



బుధవారం నగరంలోని భోజగుట్ట మురికివాడలో డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. 13ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.140కోట్ల వ్యయంతో 1824 ఇండ్లను నిర్మిస్తున్నట్టు అధికారులు వివరించారు. వివేకానందనగర్, శ్రీరాంనగర్, శివాజీనగర్ బస్తీల్లో నివసిస్తున్న1769 కుటుంబాలకు వీటిని కేటాయించనున్నారు. నగరమేయర్ బొంతురామ్మోహన్‌కు ఈ సందర్భంగా ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

- హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ

## స్క్రూడ్రైవర్లలో బంగారం అక్రమ రవాణా

### 2.5 కిలోల బంగారాన్ని పట్టుకున్న డీఆర్‌ఐ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్క్రూడ్రైవర్లలో పెట్టి బంగారాన్ని తరలిస్తున్న వ్యక్తిని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డీఆర్‌ఐ) హైదరాబాద్ జోనల్ అధికారులు పట్టుకున్నారు. రూ.77లక్షల విలువైన 2.496 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. గౌహతి నుంచి చెన్నై వెళ్తున్న డీబీఆర్‌జీ ఎక్స్‌ప్రెస్ రైలులో కొందరు టూల్ బాక్సుల్లోని స్క్రూడ్రైవర్లలో బంగారం పెట్టి అక్రమంగా తరలిస్తున్నట్టు డీఆర్‌ఐకి సమాచారం అందింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు రాజమండ్రి రైల్వేస్టేషన్‌లో మాటువేశారు. బుధవారం ఉదయం 10.30 గంటలకు రైలు రాజమండ్రికి చేరుకోగానే స్క్రూ డ్రైవర్లను పరిశీలించగా ఐదు స్క్రూడ్రైవర్లలో మూడు ఇంచుల పొడవైన బంగారం కడ్డీలను అమర్చినట్టు గుర్తించారు. ఆ బంగారాన్ని మయన్మార్ నుంచి చెన్నైకి తరలిస్తున్నట్టు అనుమానిస్తున్నారు.



లాల్‌దర్వాజలోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో బయటపడ్డ శివలింగం, వెండినాణేలు

## పురాతన శివలింగం, నాణేలు లభ్యం

**చాంద్రాయణగుట్ట, నమస్తే తెలంగాణ:** లాల్‌దర్వాజలో నాలుగు వందల ఏండ్లనాటి రామలింగేశ్వరస్వామి ఆలయంలో మరమ్మతు పనులు జరుగుతుండగా శివలింగం, నాణేలు బయటపడ్డాయి. త్వరలో మహాశివరాత్రి పర్వదినం ఉన్న సందర్భంగా శిథిలావస్థలో ఉన్న ధ్వజస్తంభాన్ని తొలగించి ఆ స్థానంలో కొత్తగా మరో ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించడానికి బుధవారం ఆలయంలో పనులు చేపట్టారు. ఈ క్రమంలో ధ్వజస్తంభం కింది భాగంలో శివలింగం.. అసఫ్‌జాహీలకాలం నాటి పురాతన వెండి నాణేలు లభ్యమయ్యాయి. నాణేలపై ఉర్దూలో రాసిఉండటంతో అవి 1794 సంవత్సరానికి చెందినవిగా భావిస్తున్నారు.





పోలీసులకు చిక్కిన నిందితులు

## 98.50 లక్షల రద్దయిన నోట్లు పట్టివేత

### నలుగురిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** రద్దయిన నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్న నలుగురిని హైదరాబాద్ వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధాకిషన్‌రావు కథనం ప్రకారం.. ఏపీలోని కర్నూలుకు చెందిన రవికిరణ్ ప్రైవేట్ ఉద్యోగి. కొన్నాళ్లు హైదరాబాద్‌లో ఉద్యోగం చేసి తర్వాత స్వస్థలానికి వెళ్లిపోయాడు. కర్నూలులో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసే జకీర్ హుస్సేన్‌తో పరిచయమయ్యింది. ఈ క్రమంలోనే తన వద్ద రద్దయిన నోట్లు రూ.98.50 లక్షలు ఉన్నాయని, వాటిని మార్చాలని కవికిరణ్‌కు హుస్సేన్ సూచించాడు. వాటిని మార్చేందుకు స్నేహితుడు శ్రీకాంత్‌తో కలిసి హైదరాబాద్‌కు వచ్చిన రవికిరణ్ మిత్రులు మహ్మద్ రజాక్, అబ్దుల్ రజాక్‌ను కలిసి విషయం వివరించాడు. అబ్దుల్ రజాక్ తనకు తెలిసిన ఖమ్మంకు చెందిన ప్రవీణ్‌సాగర్‌కు విషయం చెప్పాడు. ప్రవీణ్ తనకు ఆర్బీఐలో తెలిసిన వారున్నారని, వాటిని మార్చిస్తానని హామీ ఇచ్చాడు. దీంతో రవికిరణ్, మహ్మద్ రజాక్, శ్రీకాంత్, ప్రవీణ్‌సాగర్ బుధవారం మాసబ్‌ట్యాంక్ వద్ద కలుసుకొని రద్దయిన నోట్లను మార్చేందుకు ప్రయత్నిస్తున్నారు. సమాచారం అందుకున్న వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు బృందం ఆ నలుగురిని అదుపులోకి తీసుకొని నోట్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణకు ఈ కేసును హుమాయిన్‌నగర్ పోలీసులకు అప్పగించారు.

## భార్యాపిల్లల హత్య కేసులో నిందితుడి అరెస్ట్

**మన్సూరాబాద్:** మీర్‌పేట్ పీఎస్ పరిధిలో ఈ నెల 5న జరిగిన ముగ్గురి హత్య కేసులో నిందితుడిని బుధవారం పోలీసులు అరెస్ట్ చేశారు. డీసీపీ వెంకటేశ్వరరావు ఎల్బీనగర్‌లోని తన కార్యాలయంలో వివరాలు తెలియజేశారు. వికారాబాద్ జిల్లా కుల్కచర్లకు చెందిన నారాయణగౌడ్ రెండో కుమారుడైన మల్లె హరీందర్‌గౌడ్(35) మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన సత్యనారాయణగౌడ్ పెద్ద కుమార్తె జ్యోతి(35)తో 2009లో పెండ్లి జరిగింది. వీరు కుమారుడు అభితేజ్(6), కూతురు సహస్ర(4)తో కలలిసి రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం జిల్లెలగూడ సుమిత్ర ఎన్‌క్లేవ్‌లో నివాసముంటున్నారు. హరీందర్‌గౌడ్ మలక్‌పేటలో పళ్ల క్యాప్‌లను తయారు చేసే ల్యాబ్‌ను నడిపేవాడు. 2016 వరకు ల్యాబ్‌ను నడిపిన హరీందర్ అక్కడి డాక్టర్లతో ఏర్పడిన మనస్పర్థలతో ల్యాబ్‌ను మూసివేసి రెండేండ్లుగా ఖాళీగా ఉంటున్నాడు. కొన్నాళ్లుగా హరీందర్‌గౌడ్ కుటుంబ పోషణను అతని మామ సత్యనారాయణగౌడ్ చూసుకుంటున్నారు. ఏదైనా పని చూసుకోవాలని మరొకరిపై ఆధారపడి బతకడం సరికాదని భార్య జ్యోతి నిత్యం భర్తకు చెప్తుండేది. ఈక్రమంలో హరీందర్‌గౌడ్ ఉన్మాదిగా మారిపోయాడు. ఉద్యోగం విషయంలో ఈనెల 4న రాత్రి కూడా దంపతుల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో ఈనెల 5న తెల్లవారుజామున 4 గంటలకు భార్య జ్యోతిని నిద్రలేపి పక్కరూంలోకి తీసుకెళ్లి కొట్టి చంపాడు. ఆ తర్వాత కుమారుడిని, కుమార్తెను ముఖంపై దిండుపెట్టి ఊపిరి ఆడకుండా చేసి చంపి పారిపోయాడు. సమావేశంలో వనస్థలిపురం ఏసీపీ రవీందర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఏసీపీ పృథ్వీదర్‌రావు, మీర్‌పేట్ సీఐ మన్మోహన్ పాల్గొన్నారు.

## మహిళపై లైంగికదాడికి యత్నం

- ఘట్‌కేసర్ మండలంలో ఆలస్యంగా వెలుగుచూసిన ఘటన

**ఘట్‌కేసర్:** అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ భర్త చనిపోవడంతో అత్తమామలు, కుమారుడు, కుమార్తెతో కలిసి ఉంటున్నది. ఇదే గ్రామానికి చెందిన బాబురావు(40) అనే వ్యక్తి ఆ మహిళకు దగ్గరి బంధువు. గత నెల 10న సాయంత్రం ఇంటి ముందు కూర్చొని ఉన్న ఆమెను బాబురావు పొలం విషయం మాట్లాడుదామని చెప్పి ఇంట్లోకి పిలిచాడు. ఇంట్లోకి వెళ్లిన తర్వాత ఆమె అత్తమామల ముందే అసభ్యంగా మాట్లాడుతూ కొంగుపట్టి లాగి బెడ్‌రూంలోకి లాక్కెళ్లి తలుపులు వేశాడు. ఆమె కేకలు వేయడంతో కుమారుడు వచ్చి తలుపులు తన్ని తెరువగా, బాబురావు గదిలోని మరో తలుపు నుంచి బయట చీకట్లోకి పారిపోయాడు. ఈ విషయమై బాధితురాలు తల్లితండ్రులకు తెలిపింది. నిందితుడు ఉప్పల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. దీంతో గ్రామపెద్దలు జనవరి 25న సర్పంచ్ నాగరాజు సమక్షంలో పంచాయితీ పెట్టగా, నిందితుడు రాలేదు. దీంతో నిందితుడితో పాటు అత్తమామలపై చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆశ్రయించారు.

# మరుగునపడ్డ మహానటుడు

### 'ఇన్విన్సిబుల్ హీరో' పేరుతో పైడి జైరాజ్‌పై డాక్యుమెంటరీ

రవీంద్రభారతిలో ప్రదర్శన • తెలంగాణ ముద్దుబిడ్డను విస్మరించిన తెలుగుసినీ పరిశ్రమ

పరిశోధించి వెలుగులోకి తెచ్చిన సుపధా క్రియేషన్స్ • డాక్యుమెంటరీని తిలకించిన సినీప్రముఖులు



పైడి జైరాజ్ కుమార్తె దీప, మనుమడు రజన్‌షాహీని సన్మానిస్తున్న పర్యాటకశాఖ కార్యదర్శి వెంకటేశం, దర్శకుడు నర్సింగరావు, రచయిత విజయేంద్రప్రసాద్ తదితర సినీ ప్రముఖులు (ఇన్‌సెట్) పైడి జైరాజ్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** మరుగునపడ్డ మహానటుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత పైడి జైరాజ్ జీవిత విశేషాలను భావితరాలకు అందించేందుకు సుపధా క్రియేషన్స్ 'ఇన్విన్సిబుల్ హీరో' పేరుతో ఓ డాక్యుమెంటరీ రూపొందించింది. ఉమ్మడి ప్రభుత్వాలు, తెలుగు సినీపరిశ్రమ దశాబ్దాలుగా విస్మరించిన తెలంగాణ మహానటుడు పైడి జైరాజ్ జీవితం, వెండితెర విజయాలతో సుపధా క్రియేషన్స్ మొట్టమొదటిసారి ఓ డాక్యుమెంటరీ రూపొందించింది. ఈ డాక్యుమెంటరీని పైడి జైరాజ్ కుమార్తె దీప, పర్యాటకశాఖ కార్యదర్శి వెంకటేశం, దర్శకుడు నర్సింగరావు, సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ, సినీ రచయితలు విజయేంద్రప్రసాద్, వారాల ఆనంద్, టీయూడబ్ల్యూజే నాయకుడు పల్లె రవి, ఫిలిం జర్నలిట్టు రామ్మోహన్‌నాయుడు గురువారం ఆవిష్కరించారు. రవీంద్ర భారతిలోని పైడి జైరాజ్ ప్రివ్యూ థియేటర్‌లో దీన్ని ప్రదర్శించగా జైరాజ్ మనుమడు రజన్ షాహి, పలువురు సినీ ప్రముఖులు తిలకించారు. ఈ డాక్యుమెంటరీకి పొన్నం రవిచంద్ర నిర్మాతగా వ్యవహరించగా చేతన్, రవిచంద్ర, రాధిక దర్శకత్వం వహించారు.

**సినీరంగం ఇంతకాలం మరిచిపోయింది**

దర్శకుడు బీ నర్సింగరావు మాట్లాడుతూ.. డాక్యుమెంటరీని చూస్తుంటే తన మూలాలు గుర్తుకొచ్చాయన్నారు. సినిమా రంగం ఒక గొప్పవ్యక్తిని ఇంతకాలం మరిచిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పైడి జైరాజ్ సామాన్యుడి స్థాయి నుంచి అసామాన్యుడి స్థాయికి ఎదిగారని సాంస్కృతికశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం కొనియడారు. ఫిలిం జర్నలిస్ట్ రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. పోగొట్టుకున్న ఆత్మను అన్వేషిస్తూ విజయం సాధించిన వ్యక్తి పైడిరాజ్ అని పేర్కొన్నారు. డెబ్బై ఏండ్ల పాటు సినిమా రంగంలో రాణించిన ఏకైక నటుడని, ఆయనపై వివక్ష కొనసాగిందని రాష్ట్ర సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ పేర్కొన్నారు. పైడి జైరాజ్ గురించి గూగుల్‌లో చూస్తే ఒకటిన్నర పేజీకి మించిన సమాచారం లేదని.. ఆయనపై ఎంతో పరిశోధించి వివరాలను సేకరించామని డాక్యుమెంటరీ దర్శకురాలు రాధికారెడ్డి పేర్కొన్నారు. కుటుంబసభ్యులు, ప్రముఖ దర్శకులు శ్యాం బెనగళ్, రజా మురాద్, ఉడయవర్లు, వారాల ఆనంద్ విలువైన సమాచారం అందించారన్నారు. తెలుగు సినిమా చరిత్రలో పైడి జైరాజ్ పేరు లేకుండా తెలుగు మీడియా జాగ్రత్త పడిందని.. మూడు వందలకు పైగా సినిమాల్లో నటించిన మహానటుడిని విస్మరించారని వారాల ఆనంద్ ఆవేదన వ్యక్తంచేశారు.

**జైరాజ్ ప్రస్థానం**

1909 సెప్టెంబర్ 28న కరీంనగర్‌లో పైడి జైరాజ్ జన్మించారు. ఏడు దశాబ్దాల పాటు ఆయన సినీ ప్రస్థానాన్ని కొనసాగించారు. తెలుగు సినిమా పుట్టక ముందే జైరాజ్ హిందీ చిత్రాల్లో నటించారు. ఎల్వీ ప్రసాద్ బొంబాయిలో మూకీ సినిమాలో నటించకముందే పైడి జయరాజ్ సినిమా రంగంలో ఉన్నారు. మూకీ సినిమాలతో మొదలైన జైరాజ్ ప్రస్థానం టాకీ సినిమాలల్లోనూ ఓ వెలుగువెలిగింది. అనేక సినీ ప్రయోగాలతో వెండితెరపై రారాజుగా వెలుగొందారు. ఆయన సినీ ప్రస్థానాన్ని ఇన్విన్సబుల్ హీరో పేరుతో రూపొందించిన డాక్యుమెంటరీలో వివరించారు. 'గాడ్ ఆఫ్ గ్రీక్' వంటి శరీర ధారుడ్యంతో వున్న జయరాజ్ నటించిన సినిమాల వివరాలను సేకరించి ఈ డాక్యుమెంటరీలో పొందుపరిచారు. భారతీయ సినిమా మూకీ దశలో ఉన్నరోజుల్లోనే జైరాజ్ 11 సినిమాల్లో కథానాయకుడిగా నటించారు. సూపర్‌మ్యాన్‌గా, పురాణపాత్రల్లో, జానపదపాత్రల్లో, లవర్‌బాయ్‌గా ఆయన ప్రతి పాత్రలోనూ ఒదిగిపోయేవారు. చంద్రశేఖర్ ఆజాద్, పృథ్వీరాజ్ చౌహాన్, టిప్పు సుల్తాన్ వంటి చారిత్రక పాత్రల్లోనూ పరకాయ ప్రవేశం చేశారు. హైదరాబాద్ నగరంలో పైడి జయరాజ్ నటించిన చిత్రాలను ఏడో నిజాం పలుమార్లు తిలకించారు. అనేక కానుకలను అందజేశారు.

**నాన్న కోరిక నెరవేరింది**

మా నాన్నను తెలంగాణవాడిగా గుర్తుచేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉన్నది. చాలా కష్టపడి ఈ డాక్యుమెంటరీ రూపొందించారు. తనను తెలుగు వాళ్లు తమ వాడిగా గుర్తించాలని నాన్న కోరుకున్నారు. అది ఆయన ఉన్నప్పుడు నెరవేరలేదు. ప్రస్తుతం ఆయన జీవిత విశేషాలను పరిశోధించి ఓ డాక్యుమెంటరీ రూపొందించడం సంతోషాన్నిస్తున్నది. మా నాన్న పేరుతో సాంస్కృతిక శాఖ ఓ థియేటర్ ఏర్పాటు చేయడం చాలా ఆనందంగా ఉన్నది. ఆయన జీవిత విశేషాలతో పుస్తకాల ప్రచురణ సంతోషం కలిగించింది. ఈ నేలకు రావడం ఇదే తొలిసారి. నాన్న పుట్టిన పెరిగిన చోట ఆయనకు ఇంతటి ఆదరణ ఉంటుందని ఊహించలేదు.

– దీప, జైరాజ్ కుమార్తె

# జూన్‌నాటికి రోడ్ల పునరుద్ధరణ!

- అక్రమాలకు తావులేకుండా చర్యలు
- రూ.721.86 కోట్లతో పనులు
- టెండర్ల ప్రక్రియకు బల్దియా సన్నాహాలు

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** వచ్చే జూన్‌నాటికి హైదరాబాద్‌లోని రోడ్లను పునరుద్ధరించేందుకు జీహెచ్‌ఎంసీ ప్రణాళికలు సిద్ధంచేసింది. మొత్తం రూ.721.86 కోట్లతో పనులు చేపట్టేందుకు వీలుగా టెండర్ల ప్రక్రియ చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు. హైదరాబాద్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్(హెచ్‌ఆర్‌డీసీ) విడిగా తమ పరిధిలోని జాతీయ, రాష్ట్ర రహదారులను అభివృద్ధి చేయనుండగా, జీహెచ్‌ఎంసీ తమ పరిధిలోని రోడ్లను పునరుద్ధరించనున్నది. పీరియాడికల్ మెయింటెనెన్స్‌లో భాగంగా ఎంపికచేసిన రోడ్లను పునరుద్ధరించనున్నారు. డిఫెక్ట్ లయబులిటీ పీరియడ్(డీఎల్‌పీ) కింద రెండేండ్లవరకు వీటి నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్‌దే.

**సర్కిళ్లవారీగా ప్రణాళికలు**

రోడ్ల పునరుద్ధరణ, అభివృద్ధికోసం ప్రభుత్వం ఇటీవల రూ. 721.86 కోట్లు మంజూరుచేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 53 బీటీ, 51 సీసీ రోడ్లను అభివృద్ధి చేయడంతోపాటు అవసరమైన ప్రాంతాల్లో వైట్ టాపింగ్ రోడ్లు, ఇతర రోడ్లను వేసేందుకు అధికారులు సర్కిళ్లవారీగా ప్రణాళికలు సిద్ధంచేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఎక్కడా అక్రమాలకు తావులేకుండా ఉండేందుకు అధికారులు పక్కా ప్రణాళికలతో పనులు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వేసిన రోడ్లను మళ్లీమళ్లీ వేసినట్టు దొంగ బిల్లులు సృష్టించడం, వేసిన రోడ్డుపైనే మరో లేయర్ వేయడం, నిధులు స్వాహా చేయడం తదితరాలకు ఆస్కారం లేకుండా చీఫ్ ఇంజినీర్ జియావుద్దీన్ ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. పనులు చేపడుతున్న రోడ్లను సమగ్ర సర్వే నిర్వహించి ఫొటో ఆధారాలను కూడా ఉంచాలని స్పష్టమైన ఆదేశాలు జారీచేశారు. ఇప్పుడు ఇంజినీర్లందరికీ ట్యాబ్‌లను సమకూర్చుతున్నారు. పనుల పర్యవేక్షణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ఫొటోలతోసహా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. వాటిని జియోట్యాగింగ్ చేస్తున్నందున కచ్చితంగా పనులు జరిగే ప్రాంతాలను అధికారులు పర్యవేక్షించక తప్పని పరిస్థితి ఏర్పడుతుంది. కొన్ని రోడ్లు హెచ్‌ఆర్‌డీసీ, జీహెచ్‌ఎంసీ రెండింటి పరిధిలో ఉండటంతో ముందుగా వాటిని గుర్తించి హెచ్‌ఆర్‌డీసీ రోడ్లను వారికి అప్పగిస్తున్నారు. బీటీ రోడ్లలో కాస్త ఎక్కువ నాణ్యంగా ఉండేందుకు పాలీమర్ మోడిఫైడ్ బిటుమిన్‌ను ఉపయోగించాలని నిశ్చయించారు. ఫుట్‌పాత్‌లు, టేబుల్ డ్రైన్లు తదితర పనులు కూడా చేపట్టనున్నారు.

**నగరమంతా ఒకేవిధమైన ధర..**

రోడ్ల అభివృద్ధి పనులకు సంబంధించి ఇంతకాలం నగరంలో ఒక్కో ప్రాంతానికి ఒక్కో విధమైన ధరలు అమలవుతుండగా, ఇప్పుడు నగరమంతా ఒకే ధరలు అమలుచేయాలని నిర్ణయించారు. ఈ మేరకు అధికారులు అన్ని సర్కిళ్లకూ ఉత్తర్వులు జారీచేశారు. అధికారులు అంచనాల రూపకల్పనలో ఒకే విధమైన ధరలను పరిగణలోకి తీసుకోవాలని స్పష్టంచేశారు.

**హెచ్‌ఆర్‌డీసీ రోడ్లు వారికే అప్పగింత**

హెచ్‌ఆర్‌డీసీ పరిధిలో సుమారు 319 కిలోమీటర్ల మేర రోడ్లున్నాయి. ఇంతకాలం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలోనే వాటిని నిర్వహిస్తుండగా, ఇప్పుడు హెచ్‌ఆర్‌డీసీ అధికారులు తమ పరిధిలోని రోడ్లను అప్పగించాలని కోరడంతో పనులు జరుగుతున్న రోడ్లను కూడా నిలిపివేసి వారికి అప్పగిస్తున్నారు.

**అవకతవకలకు ఆస్కారం లేకుండా పనులు**



పనుల్లో ఎక్కడా అవకతవకలకు అవకాశం లేకుండా పక్కాగా చేపడుతాం. రెండేండ్ల పాటు నిర్వహించే బాధ్యత కాంట్రాక్టర్లపైనే ఉంటుంది. ఈ నిబంధనను ఈసారి పక్కాగా అమలుచేస్తాం. హెచ్‌ఆర్‌డీసీ రోడ్లను వారికి అప్పగిస్తున్నాం. సర్కిళ్లవారీగా త్వరలోనే టెండర్ల ప్రక్రియ చేపడుతాం. వర్షాకాలం మొదలయ్యేసరికి పనులు పూర్తిచేయాలని నిర్ణయించాం.

- జియావుద్దీన్, సీఈ

**జోన్లవారీగా అభివృద్ధికి ప్రతిపాదిత రోడ్ల వివరాలు..**

| జోన్ | ప్యాకేజీలు | నిధులు (రూ.కోట్లలో) |
|---|---|---|
| **బీటీ రోడ్లు...** | | |
| ఈస్ట్ | 9 | 59 |
| సౌత్ | 13 | 109 |
| సెంట్రల్ | 11 | 86 |
| వెస్ట్ | 14 | 130 |
| నార్త్ | 6 | 33 |
| మొత్తం | 53 | 417 |
| **సీసీ రోడ్లు...** | | |
| ఈస్ట్ | 11 | 58 |
| సౌత్ | 2 | 3.8 |
| సెంట్రల్ | 9 | 32 |
| వెస్ట్ | 14 | 81 |
| నార్త్ | 15 | 87 |
| మొత్తం | 51 | 261.8 |
| **వైట్ టాపింగ్...** | | |
| సెంట్రల్ | 2 | 11 |
| వెస్ట్ | 3 | 30 |
| మొత్తం | 109 | 719.8 |



జీహెచ్‌ఎంసీ ఏసీ మనోహర్‌కు చెక్కును అందజేస్తున్న ఎన్టీపీసీ ఆర్‌ఈడీ మూర్తి

## 'షీ-ఈ టాయిలెట్స్'కు 14.61 లక్షల విరాళం

### చెక్కును అందజేసిన ఎన్టీపీసీ రీజనల్ డైరెక్టర్ కేఆర్సీ మూర్తి

**బన్సీలాల్‌పేట్:** హైదరాబాద్ నగరాన్ని 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపేందుకు జీహెచ్‌ఎంసీ కృషిచేస్తున్నది. ఇందిరాపార్క్, భోలక్‌పూర్‌లో ప్రాంతాల్లో మహిళల కోసం ప్రత్యేకంగా రెండు 'షీ-ఈ టాయిలెట్స్' నిర్మిస్తున్నది. వీటి నిర్మాణానికి ఎన్టీపీసీ రూ. 14.61 లక్షలను విరాళంగా అందించింది. హైదరాబాద్‌లోని ఎన్టీపీసీ ప్రాంతీయ ప్రధాన కార్యాలయంలో సంస్థ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కే రామచంద్రమూర్తి జీహెచ్‌ఎంసీ అదనపు కమిషనర్ మనోహర్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కే రామచంద్రమూర్తి మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ వినూత్న తరహాలో మహిళల కోసం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మోడర్న్ ఎలక్ట్రానిక్ టాయిలెట్స్ ప్రతిపాదన తమకు నచ్చిందని అన్నారు. అందుకే తమ సంస్థ రెండు టాయిలెట్ల ఏర్పాటుకు అయ్యే ఖర్చును భరిస్తున్నదని తెలిపారు. ఈ టాయిలెట్లు 1, 2, 5 రూపాయల నాణేలను వేయడం ద్వారా ఆటోమెటిక్‌గా పనిచేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్టీపీసీకి చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## వీడని నరబలి చిక్కుముడి

- శిశువును వరంగల్ నుంచి తెచ్చారని అనుమానం
- నాలుగు జిల్లాల్లో ప్రత్యేక బృందాలతో గాలింపు
- మొండెం దొరికితే కొలిక్కి వస్తుందంటున్న అధికారులు

**హైదరాబాద్ సిటీబ్యూరో/ ఉప్పల్, నమస్తే తెలంగాణ:** ఉప్పల్ చిలుకానగర్‌లో వారంరోజుల కిందట చిన్నారి తల నరికిన కేసులో చిక్కుముడి ఇప్పటికీ వీడలేదు. విచారణ కీలకదశకు చేరుకున్నదని, మొండెం దొరికితే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్తున్నారు. ఈ దిశగా ప్రత్యేక బృందాలతో అన్వేషిస్తున్నారు. రెండురోజులుగా నాచారంలోని పారిశ్రామికవాడలో మూతపడి ఉన్న అన్ని కంపెనీ షెడ్డుల్లో ఆనవాళ్ల కోసం గాలిస్తున్నారు. సంఘటనా స్థలంలో అనుమానితులు ఒక్క క్లూ కూడా వదులకుండా పోలీసులను ముప్పు తిప్పులు పెడుతున్నారు. నరబలిగా దాదాపు నిర్ధారణ అవుతున్నా ఆధారాలు లేవని కొందరు పోలీసులు చెప్తున్నారు. ప్రాథమికంగా దొరికిన ఆధారాల మేరకు కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. హత్యకు గురైన శిశువును చోరీచేసి తీసుకువచ్చారనే కోణంలో మిస్సింగ్ కేసులను పరిశీలించినా ఎలాంటి ఆధారం దొరుకలేదు.

**పోలీసుల అదుపులో**

ఈ కేసులో పోలీసులు శిశువు తల దొరికిన ఇంటి యజమాని రాజశేఖర్, కాలనీలోని నరహరి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించారు. ప్రస్తుతం రాజశేఖర్ కుటుంబసభ్యులను, కాల్ డేటా ఆధారంగా వారి బంధువులను విచారిస్తున్నట్టు సమాచారం. రాజశేఖర్ కుటుంబసభ్యులు కొన్ని రోజుల కిందట పూజలు చేయించారని, కీసర ప్రాంతంలోని ఓ ఆలయంలో నిద్ర కూడా చేసి వచ్చారని వార్తలు వచ్చాయి. దీంతో ఆ ఆలయ పూజారితోపాటు, కొందరు పూజారులు, యంత్రాలు కట్టేవారిని అదుపులోకి తీసుకుని విచారించి వదిలివేసినట్టు తెలుస్తుంది.

**తండాల నుంచి తీసుకొచ్చారా?**

నరబలి అయితే చిన్నారిని ఎక్కడి నుంచి తీసుకువచ్చారనే కోణంలో పోలీసు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. చిన్నారిని కరీంనగర్ జిల్లాలోని గిరిజన ప్రాంతం నుంచి తీసుకువచ్చారనే ప్రచారం జరిగింది. దీంతో ఆ దిశగా విచారణకు వెళ్లారు. తాజాగా వరంగల్ జిల్లాలోని తండా నుంచి పాపను తీసుకువచ్చారనే ప్రచారం వెలుగులోకి వచ్చింది. ఈ నేపథ్యంలో పోలీసులు బృందాలుగా విడిపోయి వివరాలు సేకరిస్తున్నారు. మొండం లభిస్తేనే కేసు విచారణ ముగుస్తుందని, రెండు రోజుల్లో కొలిక్కి వస్తుందని భావిస్తున్నామని పోలీసులు తెలిపారు. ఉప్పల్ సీఐ వెంకటేశ్వర్లు, మల్కాజిగిరి ఎస్‌వోటీ ఇన్‌స్పెక్టర్ నవీన్, మరికొన్ని బృందాలు ఈ కేసు దర్యాప్తు చేస్తున్నాయి.

# దోపిడీ కాలేదు.. గొలుసు తెగలేదు

జరుగని నేరానికి క్రైం సీన్ సృష్టించారు ● సైబరాబాద్ పరిధిలో జరిగిన ఆసక్తికరమైన సంఘటనలు

- ఉద్యోగం నాటకం బయటపడుతుందని స్నాచింగ్ నాటకం ఆడిన ఇల్లాలు
- భార్య జీతం డబ్బులు తీసుకుంటుందని దోపిడీ నాటకానికి తెరలేపిన భర్త

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఓ భార్య తన జీతం డబ్బులు తీసుకుంటుంద కారణంతో ఓ భర్త.. లేని ఉద్యోగానికి జీతం తీసుకొచ్చేందుకు ఓ ఇల్లాలు ఆడిన నాటకాలు సైబరాబాద్ పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

**ఇంట్లోనే డబ్బు దాచిపెట్టి..**

రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌కు మంగళవారం సాయంత్రం ఓ ప్రైవేట్ ఉద్యోగి వచ్చి.. ఏటీఎం నుంచి నగదును డ్రా చేసుకుని వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దాడిచేసి ఎత్తుకెళ్లారని ఓ ప్రైవేటు ఉద్యోగి ఫిర్యాదు చేశాడు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు రంగంలోకి దిగి సీసీ కెమెరాలను పరిశీలించారు. ఆ ఉద్యోగి ఏటీఎం కేంద్రం నుంచి బయటికి వస్తున్న దృశ్యాలు ఉన్నప్పటికీ ఇంటికి వెళ్లే దారిలో ఎక్కడా అతడిపై దాడి చేసిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో కనపడలేదు. మరోవైపు ఆ ఉద్యోగి వ్యవహార శైలి అనుమానాస్పదంగా ఉండటంతో అతడిని విచారించారు. దీంతో అసలు విషయం బయటపెట్టాడు. తన భార్య ప్రతి నెల జీతం డబ్బులు రాగానే గుంజుకుంటున్నదని, నగదు ఇవ్వకపోయినా, తక్కువగా ఇచ్చినా సహించేది కాదని చెప్పాడు. ఈ విషయంలో భార్య పెట్టే వేధింపులు తట్టుకోలేకపోతున్నానని చెప్పాడు. స్నేహితులతో గడిపి డబ్బు ఖర్చు పెడుతాననే అనుమానంతో ఇలా వ్యవహరిస్తున్నదని వివరించాడు. ఈ నెల జీతాన్ని ఆమెకు ఇవ్వకుండా ఉండేందుకు దోపిడీ నాటకం ఆడానన్నారు. డబ్బును ఇంట్లోని విద్యుత్ సరఫరా వైర్ల సాకెట్ బాక్సులో దాచిపెట్టినట్టు చెప్పాడు. దీంతో పోలీసులు వెళ్లి సాకెట్ బాక్స్ నుంచి రూ.11,800 తీసి భార్య ముందే అతడికి అప్పగించారు.

**లేని ఉద్యోగానికి జీతం కోసం..**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధికి చెందిన ఓ మహిళ తన మెడలో నుంచి మూడు తులాల బంగారం గొలుసును గుర్తుతెలియని వ్యక్తులు తెంపుకెళ్లారని వారం కిందట పోలీసులను ఆశ్రయించింది. స్నాచింగ్ అనగానే పోలీసులంతా స్పాట్‌కు పరుగులు పెట్టారు. ఆ స్పాట్‌కు దారి తీసే ప్రతి మార్గాన్ని జల్లెడ పట్టారు. కానీ ఎక్కడా స్నాచింగ్ జరిగిన దాఖలాలు లభించలేదు. దీంతో ఫిర్యాదు చేసిన మహిళను గట్టిగా విచారించగా అసలు నిజం కక్కింది. ఆమె భర్త, అత్త కలిసి దాదాపు రెండు లక్షలు ఖర్చుపెట్టి ఆమెను కోర్సు చదివించారు. ఉద్యోగం ఎప్పుడు వస్తుందని ప్రశ్నిస్తుండడంతో ఉద్యోగం వచ్చిందని అబద్ధం చెప్పింది. రోజు ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సాయంత్రం ఇంటికి వెళ్తుండేది. నెలరోజులు కావడంతో జీతం అడుగుతారని భావించి వారం రోజుల కిందట గొలుసును కుదువ పెట్టి రూ.25 వేలు తీసుకున్నది. ఆరోజే సాయంత్రం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి స్నాచింగ్ నాటకం ఆడింది. ఆమె ఆడిన నాటకం తెలుసుకున్న పోలీసులు షాక్ గురయ్యారు. చివరకు ఆమె పరిస్థితిని అర్థం చేసుకొని ఎలాంటి చర్య తీసుకోకుండా వదిలేశారు.



రాజేంద్రనగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్న నగదు

జిందగీ పేజీ పై మీ అభిప్రాయాలు,
సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi
హైదరాబాద్
గురువారం 8 ఫిబ్రవరి 2018
WWW. NTNEWS.COM



అగ్గి పెట్టెలో అమిరే చీరలను నేసే చేతులవి.
మగ్గంపై విరిసిన పూల తరంగాలవి,
అందంగా పురివిప్పి ఆడిన నెమళ్లు..
విరగాసిన మామిడి పిందెలు.. ఏనుగులు.. పిట్టలు..
మనిషిని నిలబెట్టి వారి చిత్రాన్ని వస్త్రంపై నేయగల సమర్థులు
తెలంగాణలో అనేకం. అలాంటి చేనేత కళకు..
సమర్థతకు సార్థకత చేకూరింది. అహోరాత్రులు పడ్డ కష్టానికి..
ప్రతిభకు పట్టం కడుతున్నట్లు కేంద్ర చేనేత, జౌళి శాఖ ప్రకటించింది.
ఇన్నేండ్ల కష్టం ఫలించి.. అవార్డుల పంట పండి..
తెలంగాణ చేనేత పూదోట జాతీయస్థాయికి ఎదిగింది!

# చేనేత హస్తకళా కౌశలంలో ఆణిముత్యాలు

మగ్గమే కదా నేస్తున్నదని అనుకున్నోళ్లంతా ముక్కున వేలేసుకున్నారు. చీరలే కదా అని చిన్న చూపు చూసిన వ్యక్తులే హత్తుకొని ప్రశంసిస్తుంటే వారి కళ్లు చెమర్చాయి. అవార్డుల ప్రకటన మగ్గమే జీవనాధారంగా, నలుగురికి జీవితాన్ని కల్పించిన చేనేత కళాకారులను తలెత్తుకునేటట్లుగా చేసింది. చేనేత రంగమే అంతరించిపోతుందన్న విశ్లేషణ, సర్వేల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 49 అవార్డుల్లో ఆరు తెలంగాణకు దక్కడం హర్షించదగిన పరిణామం.

**ఆరుగురు ఆణిముత్యాలు! :** నూలు బట్టల మెత్తదనం, పట్టు వస్త్రాల మేళవం.. జలతారు చీరల సోయగం, దోతుల ఆర్భాటం.. ఎంతని చెప్పేది? ఎట్లని వర్ణించేది? ఎంత చెప్పినా తనివి తీరేనా? ఆ సొంపు సొగబు, ఆ సోయగం, ఆ సౌందర్యం.. అన్నింటికీ కలనేసిన ఆ చేనేత హస్త కళా కౌశలం. ఎంత మాధుర్యమో కదా! ఇదంతా మన వారసత్వమే. వారసత్వపు బాధ్యతను, వృత్తిని చేపట్టి దానికే వన్నె తేవడమంటే ఎంత అంకిత భావమో చెప్పనక్కరలేదు. తరతరాల భారతీయ సంస్కృతీ, సంప్రదాయాలతో పట్టు వస్త్రాలు, నూలు వస్త్రాలు పెనవేసుకున్నాయి. మగువల అందానికి మరింత శోభనిచ్చేవి ఇవే. సంప్రదాయ డిజైన్లల్లోనే అద్భుతాలు సృష్టించవచ్చు. ప్రపంచాన్నే తన వైపు తిప్పుకొంటున్నది. కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిన ఆరుగురు తెలంగాణ చేనేత కళాకారులను జాతీయ స్థాయి అవార్డులు వరించాయి. చేనేత వస్త్రాలకు, పట్టు చీరలకు ప్రతీకగా నిలిచిన తెలంగాణ పేరు ప్రఖ్యాతులు మరోసారి ఢిల్లీ (అవార్డుల కార్యక్రమం)లో వినిపించనున్నాయి. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఫ్యాషన్ డిజైనర్లు, ఆర్థిక బలోపేతం వెనుక చేనేత కళాకారుల నైపుణ్యం, కళాతృష్ణ కనిపించనిది. మగ్గంపై ఉత్పత్తులకు డిజైన్లు అద్ది, డ్రెస్సులుగా మలిచి కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న వ్యాపార వాణిజ్యం వెనుక ఇలాంటి వైవిధ్యభరిత వృత్తి దాగుందని కొందరికే తెలుసు. ఒక్కొక్కరు రెండు నుంచి మూడు దశాబ్దాలుగా ఈ రంగంలో పని చేస్తున్న వారే. నలుగురికీ పని కల్పిస్తూ వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుంటున్న వారే. అందుకే వారందరికీ 'నమస్తే తెలంగాణ' అభినందనలు తెలుపుతున్నది. మరిన్ని అవార్డులను, విజయాలను సొంతం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నది.

**శిరందాస్ ప్రవీణ్‌కుమార్,**
సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ

## టై అండ్ డై ఇక్కత్ చీర






టై అండ్ డై ఇచ్చంత్రం ఇక్కత్ చీరకు సంత్ కబీర్ అవార్డు వచ్చింది. తేలియా రుమాల్, ఇక్కత్ టెక్నిక్‌తో 23 రంగులు, 110 రంగుల ఇంటిగ్రేషన్, 32 డిజైన్లను కలిపి నేసిన చీర ఇది. వార్ప్, వెఫ్ట్, డబుల్ ఇక్కత్(ట్రిబుల్ ఇక్కత్)తో ఉత్పత్తి చేశారు. ఒక్క చీరలో 32 డిజైన్లను ఇక్కత్‌లో నేయడం అసాధారణమైనది. పైగా సహజ రంగులతో కూడినది. అత్యంత క్లిష్టమైన ఈ నమూనాను కేంద్ర ప్రభుత్వం గుర్తించింది. దీన్ని యాదాద్రి జిల్లా చౌటుప్పల మండలం కొయ్యలగూడెంకు చెందిన జెల్లా వెంకటేశం నేశారు. ఈ వృత్తిలో ఆరితేరిన వారు. 2010లోనూ జాతీయ స్థాయి అవార్డును పొందారు. 2014లో సూరజ్‌కుండ్‌లో హర్యానా సీఎం చేతుల మీదుగా కళామణి అవార్డు, 2004లో బెస్ట్ స్కిల్ అవార్డు, 2010లో ఇక్కత్ ప్రతిభా అవార్డు వంటి అనేకం సొంతం చేసుకున్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ఎగ్జిబిషన్లల్లో తన ఉత్పత్తులను ప్రదర్శించారు. జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లో చేనేత ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందన్నారు.

## చీరపై జమ్దానీ టెక్నిక్‌తో ఫ్లోరల్ డిజైన్



జమ్దానీ డిజైన్ అంటేనే ప్రఖ్యాతిగాంచినది, అత్యంత క్లిష్టమైనది. అలాంటిది పాన్ పటోలా చీరలో జమ్దానీ టెక్నిక్‌తో ఫ్లోరల్ డిజైన్ అంటే అద్భుతమే. నెలల తరబడి కష్టపడితే గానీ ఒక్క చీర నేయలేరు. నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన చిలుకూరు శ్రీనివాసులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. తనకున్న 15 ఏండ్ల అనుభవంతో చీర రూపొందించారు. సంప్రదాయ పద్ధతిలో ఆధునికతను జోడించి కొత్త తరహా చీరలను నేయడం, నేయించడంలో శ్రీనివాసులుది అందె వేసిన చేయి. అందుకే పలువురు సినీ స్టార్లు కూడా ఆయన మగ్గం దగ్గరికి వచ్చి అబ్బురపడ్డారు. అందుకే కష్టానికి తగిన ప్రతిఫలం అందింది. పలువురు కార్మికులకు పని కల్పిస్తూ యువ మాస్టర్ వీవర్‌గా చేనేత రంగంలో పేరు సంపాదించుకున్నారు. ఫ్లోరల్ డిజైన్ చీరకు జాతీయ స్థాయి మెరిట్ సర్టిఫికేట్ లభించింది. చేనేత రంగంలో నైపుణ్యం ఉంటే ఉపాధికి, సంపాదనకు కొదువ లేదంటున్నారు.


## తేలియా రుమాల్ డబుల్ ఇక్కత్ చీర





డబుల్ ఇక్కత్ చీరను తేలియా రుమా పద్ధతిన నేశారు. సహజ రంగులతో ఆకట్టుకునే డిజైన్లతో రూపొందించారు. కాటన్ యార్న్‌ను ముందుగా క్యాస్టర్ సీడ్‌లో కొన్ని గంటల పాటు నానబెడతారు. ఆ తర్వాత మేక గొందికల పౌడర్, నూనెలతో కూడిన దాంట్లో ఉంచుతారు. 15 రోజుల పాటు జరిగే ఈ ప్రక్రియ చాలా కష్టతరమైంది. నూనెను కూడా వినియోగించడం విలక్షణమైనది, సంప్రదాయబద్ధమైనది. కొలికి డైమాండ్ మోటిఫ్ డిజైన్‌లో నేశారు. పైగా కాటన్ చీర. దారం కూడా వార్ప్, వెఫ్ట్ 2/140తో కూడినది. ఎరుపు, నలుపు రంగులతో కూడిన ఈ తేలియా రుమాల్ డబుల్ ఇక్కత్ చీరను యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన గజం శ్రీనివాస్ నేశారు. దీనికి జాతీయ స్థాయి అవార్డు వచ్చింది.

## తేలియా రుమాల్ ఇక్కత్ చీర





టై అండ్ డై వృత్తిని తల్లి దండ్రుల నుంచే నేర్చుకున్నారు. 15వ ఏటనే మగ్గం నేయడం ఆరంభించారు. తేలియా రుమాల్ డైయింగ్, వీవింగ్, ఇక్కత్ విధానాల్లో సుదీర్ఘ అనుభవాన్ని సంపాదించారు. అందుకే తేలియా రుమాల్ ఇక్కత్ చీరనే ఎంపిక కమిటీకి పంపారు. జాతీయ స్థాయి మెరిట్ సర్టిఫికేట్‌కు యాదాద్రి జిల్లా సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకకు చెందిన చెరిపల్లి భావనారుషి ఎంపికయ్యారు. నవరత్న డిజైన్‌తో తేలియా రుమాల్ చీరను తయారు చేశారు. 9 గ్రహాలను చీరలో చూపారు. ఈ విధానం తెలంగాణకు ఓ ప్రత్యేకం. 53 ఏండ్ల చెరిపల్లి భావనారుషి తను కార్మికుడిగా, మాస్టర్ వీవర్‌గా సుదీర్ఘ అనుభవం గడించారు.

## సిల్క్ చీరపై భగవద్గీత శ్లోకాలు





ఏదైనా ఓ డిజైన్‌తో చీర నేయడమే ఎంతో నేర్పరితనం. అలాంటిది అక్షరాలను.. కాదు ఏకంగా శ్లోకాలనే చీరపై వచ్చేటట్లుగా నేతలోనే రూపొందించిన ఈ ప్రక్రియ ప్రశంసనీయం. సిల్క్ చీరపై భగవద్గీత శ్లోకాలు వచ్చేటట్లుగా నేసిన ఈ చీరను నల్లగొండ జిల్లా చండూరు (బంగారిగడ్డ శివాజినగర్)కు చెందిన గంజి యాదగిరి నేశారు. జమ్దానీ టెక్నిక్‌తో రూపొందించారు. 15 ఏండ్ల క్రితమే వచ్చిన ఐడియాను వృత్తిలో ప్రదర్శించేందుకు చాలా కష్ట పడ్డారు. భగవద్గీతలోని 7, 9, 10 అధ్యాయాల్లోని కొన్ని శ్లోకాలను చీరలో ప్రదర్శించారు. అలాగే బార్డర్‌లో శ్రీ మహావిష్ణువు పాదాలను చూపారు. వెండి జరిని వాడారు. శ్లోకాలకు జమ్దానీ, బార్డర్‌కు కుట్టు విధానాన్ని అనుసరించారు. ముంబై వంటి నగరాల నుంచి కూడా ఈయన దగ్గరికి వచ్చి శిక్షణ, సూచనలు పొందుతుండడం విశేషం.

## సహజ రంగులతో డబుల్ ఇక్కత్ చీర



30 ఏండ్ల అనుభవం కలిగిన నల్లగొండ జిల్లా చండూరుకు చెందిన మాస్టర్ వీవర్ కందగట్ల భావనారుషి సహజ రంగులతో డబుల్ ఇక్కత్ చీర జాతీయ స్థాయి మెరిట్ సర్టిఫికేట్‌కు ఎంపికైంది. పాన్‌పటోలా నమూనాతో కూడిన జనం కుండలిని రూపొందించారు. 12 డివిజన్లుగా ఉండే ఈ డిజైన్ ఆకట్టుకుంటుంది. మల్బరీ సిల్క్‌ను వినియోగించారు. రెడ్, మస్టర్డ్, ఇండిగో, బ్లూ, బ్లాక్ రంగులతో కూడిన ఈ చీర భలేగా ఉంది. పలువురు కార్మికులకు ఉపాధి కల్పిస్తూ మాస్టర్ వీవర్‌గా స్థిరపడ్డారు. టై అండ్ డై రంగంలో అందె వేసిన చేయిగా పేరు తెచ్చుకున్నారు. గతంలోనూ రాష్ట్ర స్థాయి అవార్డులు పొందారు.



# క్యాన్సర్ అంటువ్యాధా?



అడుగండి చెబుతా

**మా అమ్మ వయసు 47 సంవత్సరాలు. ఇటీవల జరిపిన పరీక్షలో క్యాన్సర్ మొదటి దశలో ఉన్నట్టుగా గుర్తించారు డాక్టర్లు. కీమోథెరపీ ప్రారంభించారు. వ్యాధి బయటపడినప్పటి నుంచీ ఇది మీకూ సోకుతుందంటూ మమ్మల్ని దూరంగా ఉండమంటున్నది. నాకు, అన్నయ్యకు కూడా రావచ్చని భయపడుతున్నది. నిజంగానే క్యాన్సర్ అంటువ్యాధా? వంశపారంపర్యంగా కుటుంబంలో అందరికీ వస్తుందా? అసలు చికిత్స ద్వారా క్యాన్సర్ నయం అవుతుందా? దయచేసి వివరంగా తెలియజేయండి.**

**- వి. మనోహరి, మధిర**

ఈ వ్యాధికి సంబంధించి మీ కుటుంబంలో లాగానే మన సమాజంలో చాలామంది కూడా అపోహలు, అనుమానాలు వ్యక్తం చేస్తుంటారు. క్యాన్సర్ అంటువ్యాధి కాదు. క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి సన్నిహితంగా ఉండడం, వారికి సేవలు చేయడం వల్ల ఎవ్వరూ ఈ వ్యాధి బారినపడే అవకాశాలు ఎంతమాత్రం ఉండవు. పలు సినిమాల్లో, నవలల్లో చూపించినట్లు క్యాన్సర్ సంపన్నులకు మాత్రమే వచ్చే వ్యాధి కాదు. అదే సమయంలో కేవలం వంశపారంపర్యంగా వచ్చే వ్యాధి మాత్రమే కాదు. కొన్ని కుటుంబాల్లో పలువురు ఈ వ్యాధికి గురవుతున్నప్పటికీ ఆ కుటుంబంలోని ప్రతి వ్యక్తికీ క్యాన్సర్ వస్తుందేమోనని భయపడడం సరికాదు. ఆర్థిక, సామాజిక, స్త్రీ-పురుష భేదం లేకుండా ఎవరైనా క్యాన్సర్ బారిన పడవచ్చు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, ఆహార పదార్థాల కల్తీ, సమతూకం కోల్పోయిన జీవనశైలి, అలవాట్ల కారణంగా మనదేశంలో క్యాన్సర్ వ్యాధి వేగంగా వ్యాపిస్తున్నది. పలు కారణాల వల్ల చిన్న వయసులో క్యాన్సర్ వ్యాధి వచ్చినంత మాత్రాన ఆ వ్యక్తులు వివాహానికి, దాంపత్య జీవితానికి అర్హులు కాదని భావించనవసరం లేదు. దానివల్ల జీవిత భాగస్వామికి క్యాన్సర్ రావడం గానీ, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తడం గానీ జరిగే అవకాశమూ ఉండదు. చికిత్స అనంతరం సంతానాన్ని కూడా పొందవచ్చు. ఇక క్యాన్సర్ చికిత్స విషయానికి వస్తే స్త్రీ, పురుషుల్లో ఇప్పటివరకూ గుర్తించిన క్యాన్సర్లలో అత్యధిక భాగం ముందుగా గుర్తించి చికిత్స ప్రారంభిస్తే పూర్తిగా నయం అవుతాయి. అయితే తొలిదశలోనే చికిత్స పొందితే క్యాన్సర్ వ్యాధిని ఎదుర్కొని విజయం సాధించామని చెప్పకుండా మౌనంగా ఉంటూ ఉండడం, చాలా ఆలస్యంగా చికిత్సకు రావడం చేత సరైన సమయంలో చికిత్స తీసుకోక మరణించిన వారి విషయం మాత్రమే ప్రచారంలోకి వస్తూ ఉండడం.. ఇలాంటి కారణాల వల్ల క్యాన్సర్ అంటేనే మరణం అన్న అపోహ కొనసాగుతున్నది. మీ అమ్మగారికి వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, వెంటనే చికిత్స ప్రారంభించడం ద్వారా మీరు మంచి అడుగు వేశారు. మొదటి దశలో క్యాన్సర్ పూర్తిగా తగ్గిపోతుంది. అనేక మంది క్యాన్సర్ వ్యాధిగ్రస్థుల మాదిరిగా కొంత నయం కాగానే చికిత్సను నిలిపివేయడం, మందుల పట్ల అశ్రద్ధగా ఉండడం వంటి పొరపాటు చేయకండి. క్రమం తప్పకుండా డాక్టర్‌కు చూపించుకుంటూ ఉంటే ఆమె పూర్తిగా కోలుకుంటారు.

**డాక్టర్ ఎం. జగన్మోహన్ రెడ్డి**
సీనియర్ రేడియేషన్ ఆంకాలజిస్ట్
యశోద హాస్పిటల్స్
హైదరాబాద్





# రోజాపువ్వుతో..

- గులాబీ రేకుల్ని గ్లాసుడు నీళ్లలో నానబెట్టి తేనెతో కలిపి ప్రతిరోజూ తీసుకుంటే శరీరంలో వేడి తగ్గుతుంది.
- గులాబీ రేకుల కషాయాన్ని ఆవుపాలతో కలిపి చక్కెర వేసి రోజూ తీసుకుంటే పైత్యం, వికారం, అరుచి పోతాయి.
- గులాబీ రేకుల పొడి, జాజికాయ పొడి నిమ్మకాయ రసంతో కలిపి తీసుకుంటే గుండె ఆరోగ్యంగా ఉంటుంది.

నమస్తే తెలంగాణ
విందు
హైదరాబాద్
గురువారం 8 ఫిబ్రవరి 2018
హైదరాబాద్
బుధవారం 6 డిసెంబర్
2017

# 8 లోపే కానిచ్చేస్తుంది!

ఇప్పుడు ఏ మీడియాలో చూసినా శ్రియ పెండ్లి గురించే వార్తలు. చివరకు ఆమె 'నా పెండ్లి కాదు.. నా ఫ్రెండ్‌ది' అని క్లారిటీ ఇచ్చేసింది. పదిహేడేళ్లుగా ఇండస్ట్రీలో రాణిస్తున్న ఈ సుందరాంగి అప్పుడు ఎలా ఉందో ఇప్పుడూ అలాగే మెరిసిపోతుంది. మరి ఆమె డైట్ సంగతులేంటో చూద్దాం!



శ్రియకు చపాతీ, కూర ఇచ్చి ఐల్యాండ్‌లో వదిలిపెట్టినా జీవితం వెళ్లదీస్తానంటున్నది. అది కాకుండా సాంబార్ రైస్ అంటే తెగ ఇష్టమని చెబుతున్నది. తను ఎప్పుడూ ఇలా ఉండడానికి కారణం డైట్, యోగానట. గ్లాసు ఆరెంజ్ జ్యూస్‌తో తన డైట్ మొదలవుతుంది. ఇక బ్రేక్‌ఫాస్ట్‌గా తెల్ల సొనతో వేసిన ఆమ్లెట్, పరోటా లేదా ఒక దోశతో ముగించేస్తుందట ఈ బ్యూటీ. మధ్యాహ్నం బెండకాయ కూర, పప్పు, చపాతీ ఉంటే చాలంటున్నది. చాలా తక్కువగా ఎక్కువసార్లు తింటే మంచిదంటున్నది శ్రియ. రాత్రి మాత్రం ఎట్టి పరిస్థితుల్లో 8 లోపే డిన్నర్ పూర్తి చేయాలన్నది ఆమె నియమం. సలాడ్స్‌తో డిన్నర్, ఆ తర్వాత కప్పు పాలతో డిన్నర్ పూర్తవుతుందట. మధ్యమధ్యలో జ్యూస్‌లు, నీళ్లు ఎక్కువ తాగుతానంటున్నది. మొలకెత్తిన విత్తనాలు, సలాడ్స్ కూడా ఎక్కువగా తీసుకుంటుంది. జంక్‌ఫుడ్ అసలు దరిచేరనీయదట. కాకపోతే సబ్‌వే, థాయ్ వంటకాలను మాత్రం ఎప్పుడో ఒకసారి రుచి చూస్తానని చెబుతున్నదీ ముద్దుగుమ్మ.




హైదరాబాద్ వచ్చే విదేశీయులను ఆకర్షించడంతో పాటు వారికి ఇష్టమైన రుచులను అందిస్తున్నది హైదరాబాద్‌కు చెందిన మెర్క్యూర్ హోటల్. భారతీయ సంప్రదాయ వంటకాలకు తోడు విదేశీ రుచులను కూడా అందిస్తూ పర్యాటకులను ఆకట్టుకుంటున్నది. మోడ్రన్ కమ్యూనిటీకి అందుబాటులో ఉండే వెజ్, నాన్‌వెజ్ వంటకాలతో పాటు హైదరాబాదీ రుచులను కూడా వడ్డిస్తున్న మెర్క్యూర్ హోటల్ సమీక్ష.

### ప్రతిష్ఠాత్మక అవార్డులు

దేశీయ వంటకాలతో పాటు విదేశీ వంటల తయారీలో అనుభవం ఉన్న వంటమాస్టర్లను నియమించుకుని అన్ని ప్రాంతాల పర్యాటకులను ఆకర్శించేలా ఇక్కడ వంటలు తయారు చేస్తున్నారు. ఆధునికతను కోరుకునే భోజనప్రియుల కోసం అవసరమైన కొత్త రుచులను అందిస్తూ రుచుల్లో కొత్తదనాన్ని చేర్చి అందరీ అభిరుచికి తగినట్లు సేవలందిస్తున్నామని హోటల్ మేనేజర్ దినేష్‌రాయ్ తెలిపారు. మెర్క్కరీ హోటల్ ప్రారంభించిన అనతికాలంలోనే బెస్ట్ డెబిసిటి అవార్డ్, బెస్ట్ మిడ్ మార్కెట్ అవార్డు, తెలంగాణ టూరిజం నుంచి టేస్ట్ ఆఫ్ తెలంగాణ అవార్డు, ఈ ఏడాది ది టైమ్స్ ఆఫ్ ఇండియా నుండి బెస్ట్ ఒన్లీ బఫెట్ ఇన్ క్యాసివల్ డైనింగ్ విభాగంలో టైమ్స్ ఫుడ్ నైట్ లైఫ్ అవార్డు –2018, ఇటీవలె భారతదేశంలో 8వ బెస్ట్ హోటల్‌గా ట్రావెలర్ చాయిస్ అవార్డ్ వంటి ప్రతిష్టాత్మక అవార్డులు అందుకున్నదీ హోటల్.



## ఎదిగే పిల్లలకు..



**ఈతరం పిల్లలకు పోషకాహారం కాకుండా ఎక్కువ క్యాలరీలు ఇచ్చే ఆహారాన్ని అలవాటు చేస్తున్నారు. దానివల్ల పిల్లల్లో ఎదుగుదల సమస్యలే కాదు.. బలహీనంగా మారడం, బరువు పెరుగకపోవడం, నేర్చుకోవడానికి కష్టాలుపడడం, దంత సమస్యలు మొదలవుతాయి.**

స్కూలుకెళ్లే వయసులోనే అంటే.. ఆరు నుంచి పన్నెండు సంవత్సరాల్లో డైట్ సరిగా ఉండాలి. ఎందుకంటే ఆ సమయంలో పిల్లలు ఎక్కువ ఆడుకుంటుంటారు. శారీరక శ్రమ ఎక్కువ ఉండడం వల్ల త్వరగా అలిసిపోతారు. కాబట్టి వారికి రోజులో 4 నుంచి 5సార్లు భోజనం తినిపించాల్సి ఉంటుంది. ఇందులో ఎక్కువ కూరగాయలు, పండ్లు, పాలు ఉండేలా చేస్తే మరింత మంచిది. అయితే స్కూలుకెళ్లే పిల్లలు ఎక్కువగా ఊబకాయంతో బాధపడుతున్నారు. అలా కాకుండా ఉండేందుకు పిల్లల విషయంలో ఈ డైట్ చాట్ ప్రిపేర్ చేసుకోండి.



డాక్టర్ మయూరి ఆవుల
న్యూట్రిషనిస్ట్
mayuri.trudiet
@gmail.com

- ధాన్యపు గింజలు.. అంటే గోధుమ, బియ్యం, ఓట్స్, కార్న్‌మీల్, బార్లీలాంటివి డైట్‌లో కచ్చితంగా వచ్చేలా చూడండి. ఇవికాకుండా బ్రౌన్ రైస్, ఓట్‌మీల్స్ పెడితే పిల్లల ఎదుగుదలకు మరింత ఉపయోగపడుతాయి.
- రంగురంగుల కూరగాయలతో వంటకాలను వండి పిల్లలకు వడ్డించండి. ఆకుపచ్చని, ఆరెంజ్, చిక్కుళ్లు ఇలాంటివి మధ్యాహ్న సమయంలో ఉండేలా చూసుకోవాలి.
- తాజా పండ్లు వందశాతం పిల్లలకు అవసరమైన న్యూట్రియంట్స్‌ని అందిస్తాయి. ఒకవేళ పిల్లలు పండ్లు తినకపోతే కనీసం వాటిని జ్యూస్ తీసి ఫ్రెష్‌గా చేతికందించండి.
- పాల ఉత్పత్తులను కూడా పిల్లలకు అలవాటు చేయాలి. అయితే ఇందులో ఫ్యాట్ ఫ్రీ ఉన్నవాటిని ఎంచుకోండి. వీటివల్ల వారికి కావాల్సిన క్యాల్షియం అందుతుంది.
- పిల్లలకు ప్రొటీన్ ఆహారం తప్పకుండా కావాలి. కాబట్టి చేపలు, నట్స్, బఠాణీలులాంటివి పెట్టండి. అలాగే తక్కువ కొవ్వు ఉండే మాంసాహారాన్ని అలవాటు చేస్తే మరింత మంచిది.

# దేశ.. విదేశీ రుచుల మేళవింపు

మిడిల్‌రేంజ్ బ్రాండ్‌లో 'మెర్క్యూర్ హైదరాబాద్ కెసిపి' పేరుతో పర్యాటకులను ఆకర్షించేలా అకార్ హోటల్స్ సంస్థ 128 రూమ్స్‌తో ఈ హోటల్‌ను ఏర్పాటు చేశారు. 2016లో ప్రారంభమైన ఈ హోటల్ అనతికాలంలోనే అతిథులకు ఉత్తమ సేవలందించే హోటల్‌గా గుర్తింపు పొందింది. మెర్క్యూర్ బ్రాండ్‌ను హైదరాబాదీలకు పరిచయం చేయడంతో పాటు హైదరాబాద్ బ్రాండ్ ఫుడ్‌ను విదేశీయులకు అందించడంలో తనదైన ప్రత్యేకతను చాటుకుంటున్నదీ హోటల్. నగరం నడిబొడ్డున సోమాజిగూడలో ఉన్న ఈ హోటల్ లీజర్, వ్యాపార, పర్యాటకులకు అనుకూలంగా ఉండి హైదరాబాద్ సంప్రదాయ రుచులతో పాటు విదేశీ రుచులను కూడా అందిస్తున్నది.

బంజారాహిల్స్‌లో అత్యంత ఎత్తయిన బిల్డింగ్‌తో 12 అంతస్తులతో కూడిన 128 గదులతో హోటల్ మెర్క్యూర్ ఆకట్టుకునే రీతిలో నిర్మించారు. హుస్సేన్‌సాగర్‌కు అభిముఖంగా నిర్మించడం వల్ల సాగర్ అందాలు హోటల్ నుండి వీక్షించడానికి అవకాశం ఉంది. ప్రధాన రెస్టారెంట్ ఉన్న రెండవ ఫ్లోర్ చుట్టూ ఆహ్లాదకరమైన వాతావరణంతో ఒకవైపు మెట్రో రైలు మార్గం, ప్రధాన రహదారులు కనిపించేలా అందంగా ఉంటుంది. అలాగే హోటల్‌లో అతిపెద్ద ఐక్యూ బార్ ఉంది. ఐదు సమావేశ హాల్స్ ఉన్నాయి. వీటిలో శిక్షణ తరగతులు, సమావేశాలు, కాన్ఫరెన్స్, చిన్న చిన్న ఫంక్షన్‌లు చేసుకోవడానికి అనుకూలంగా ఉన్నాయి. వినియోగదారులను సంతృప్తి పరిచే అన్ని రకాల వసతులు ఇక్కడ ఉన్నాయి. మధ్యతరగతి వారికి కూడా అందుబాటులో ఉండే ధరలతో సేవలందిస్తున్నట్లు మేనేజర్ తెలిపారు.
నగర అందాలు మరింత అందంగా కనిపించేలా బంజారాహిల్స్ రోడ్‌నెం–1 కార్నర్‌లో మెర్క్యూర్ హోటల్‌ను నిర్మించారు. ఈ హోటల్ రెండవ అంతస్తు నుంచి చూస్తే ఉదయం హుస్సేన్‌సాగర్ మీదుగా ఉదయించే సూర్యుడు పలుకరిస్తాడు. సాయంత్రం సాగర్ చుట్టూ ఉన్న రంగురంగుల విద్యుద్దీపాలతో నక్షత్రాలు మెరుస్తున్నట్లు కనిపించే సాగర్‌ను చూడడానికి రెండు కళ్లు సరిపోవు.

మెర్క్యూర్‌లో బఫెలతో కూడిన లంచ్, డిన్నర్‌ను ఆస్వాదించడానికి దేశీ, విదేశీ అతిథులు వస్తుంటారు. ప్రతిరోజు బఫెలో 50 రకాల వంటకాలను రుచి చూడచ్చుంటున్నారు హోటల్ చీఫ్ చెఫ్ వినయ్. మెర్క్యూర్ బిగ్‌స్కేల్ బిజినెస్ క్లాస్ ప్రాపర్టీ. అన్నిరకాల మోడరన్ కమ్యూనిటీకి అందుబాటులో ఉండే హోటల్. నేషనల్ హైవే–9 మీదా ఉండడం వల్ల ఎక్కువమంది ఇక్కడ విడిది చేయడానికి అసక్తి చూపుతారు. ఈ హోటల్‌కు ఉన్న కస్టమర్లలో 20 శాతం మంది విదేశీయులే. ఇక వ్యాపార నిమిత్తం హైదరాబాద్‌కు వచ్చేవారు కూడా మెర్క్యూర్‌ని ఆశ్రయిస్తున్నారు. ఇక ఉత్తరాది వారు కూడా మెర్క్యూర్‌నే ఆశ్రయిస్తున్నారు. దేశ, విదేశీయుల ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని వెస్టన్ ఫుడ్‌తో పాటు హైదరాబాద్ రుచులను కూడా చేర్చి ప్రతిరోజు మెనూను సిద్ధం చేస్తామని వినయ్ అంటున్నారు. క్వాలిటీ విషయంలో అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని ఫుడ్ తయారు చేస్తామని ఆయన తెలిపారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు అనుగుణంగా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుని ఫుడ్‌ను తయారు చేస్తామని ఆయన అంటున్నారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హైదరాబాద్ బిర్యానీని ఇష్టపడని వారుండరు. అయితే దానితో పాటు మరిన్ని వెరైటీలతో బిర్యానీలను తయారు చేస్తామని, ఎవరికీ ఇష్టమైన రీతిలోనైన తయారు చేసే అనుభవం ఉన్న చెఫ్‌లు మెర్క్యూర్‌లో ఉన్నారని వినయ్ అంటున్నారు. ఇక్కడికి వచ్చే విదేశీయులకు వారి రుచులు తెలిసిన చెఫ్‌లతోనే వంటలు చేయిస్తారు. మెర్క్యూర్‌లో పనిచేసే చెఫ్‌లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి ఎంపిక చేసుకుంటారు.

మెర్క్యూర్‌లో 300 మంది సామర్థ్యం కలిగిన బంకెట్, రెస్టారెంట్, బఫె, రూమ్స్, టేక్ అవె ఇలా విభిన్న రకాల పద్దతుల్లో సేవలందిస్తున్నారు. మెర్క్యూర్‌కి ప్రత్యేకంగా సిగ్నేచర్ ఫుడ్ ఉన్నాయి. అయితే ప్రతి వంటలోనూ మనదైన రుచి ఉండేలా జాగ్రత్త తీసుకుంటారు. కస్టమర్లను సంతృప్తిపరిచేందుకు అన్ని రకాల వసతులు ఈ హోటల్‌లో ఉన్నాయి. అదే సమయంలో పండుగలు, ప్రత్యేక దినాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకమైన వంటలను తయారు చేయడంతో పాటు ఆయా పండుగలను సెలబ్రేట్ చేయడం హోటల్ ప్రత్యేకత.

హోటల్‌లోని గోడలను అందమైన చిత్రాలతో అలంకరించారు. హోటల్‌లోకి ప్రవేశించగానే తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా డిజైన్ చేసి ఉంటుంది. అలాగే ప్రతి అంతస్తులోని గోడలకు ఎన్నో రకాల చిత్రాలు కనిపిస్తాయి. వాటిలో ఎం.ఎఫ్ హుస్సేన్ గీసిన చిత్రాలు కూడా ఉండడం విశేషం. నాటుకోడి పులుసు, తలకాయ మాంసం వంటి తెలంగాణ వంటలతో పాటు భిన్న రుచులతో తన ప్రత్యేకతను చాటుకుంటున్నదీ హోటల్.

### తెలంగాణ బ్రాండ్ వంటకాలు



విదేశీయుల ఆహారపు అలవాట్లను దృష్టిలో పెట్టుకుని వెస్టన్ ఫుడ్‌తో పాటు హైదరాబాద్ రుచులను కూడా చేర్చి ప్రతిరోజూ మెనూను సిద్ధం చేస్తాం. పండుగలు, ప్రత్యేక దినాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేకమైన వంటలను తయారు చేయడంతో పాటు ఆయా పండుగలను సెలబ్రేట్ చేస్తుంటాం. తెలంగాణ బ్రాండ్ వంటకాలతో పాటు విదేశీ వంటలను కూడా చేయడం హోటల్ ప్రత్యేకత.
**-వినయ్, చీఫ్ చెఫ్, మెర్క్యూర్ హోటల్**

### సాగర్ అందాలు



బంజారాహిల్స్‌లో అత్యంత ఎత్తయిన బిల్డింగ్‌తో 12 అంతస్తులతో కూడిన 128 గదులతో హోటల్ మెర్క్యూరీ ఆకుట్టుకునే రీతిలో నిర్మించాం. హుస్సేన్‌సాగర్‌కు అభిముకంగా నిర్మించడం వల్ల సాగర్ అందాలు హోటల్‌నుండి వీక్షించడానికి అవకాశం ఉంది. ప్రతిరోజు బఫెలో 50 రకాల వంటకాలను రుచి చూడవచ్చు.
**-దినేష్‌రాయ్, హోటల్ మేనేజర్**

## మంచి చేసే మినపప్పు!

**పోపు దినుసుల్లో మినపపప్పు కూడా ఉంటుంది. ఎన్నో ప్రోటీన్లు ఉన్న మినపపప్పు ఇంకా ఎలో పనిచేస్తుందో తెలుసా? తెలియక పోతే మినపప్పులో ఇంకెన్ని లాభాలో చదువండి..**



### పోపుల పెట్టె

- ఐరన్ మస్తుగా ఉండే మినపపప్పు ముఖ్యంగా ఆడవాళ్లు నెలసరి సమయంలో తీసుకోవాలట. బాలింతలకు మినపపప్పు తేనెతో కలిపితింటే పాలు పడుతాయి.
- ఇందులో ఎక్కువ ప్రోటీన్లు కలిగి ఉంటాయి. మినపపప్పు యాంటీ ఏజింగ్‌గా కూడా పనిచేస్తుంది. అందుకే ఎక్కువ ఫేస్ ప్యాక్స్‌లో మినపపప్పు వాడుతారు.
- కీళ్ల నొప్పులు ఉన్నవారు, తిన్నది అరుగకపోవడం సమస్య ఉన్నవారు తరుచుగా మినపప్పు తీసుకోవాలి. దీంట్లో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ బాగా పనిచేసేలా చేస్తుంది.
- ఇందులో ఉండే పీచు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరుస్తుంది. మలబద్ధకాన్ని తగ్గిస్తుంది. కొవ్వు తగ్గించడంలో మినపపప్పు బాగా పని చేస్తుంది.
- మినపపప్పులో ఉండే మెగ్నీషియం రక్తప్రసరణ బాగా జరిగేలా చూస్తుంది.
- వెన్నుపూసకు బలాన్నిస్తుంది, ఎముకల బలానికి ఇవి ఉపయోగపడుతాయి. అందుకే వారానికి రెండుసార్లు వంట్లో మినపపప్పు చేర్చుకోవాలంటున్నారు ఆరోగ్య నిపుణులు.
- మినపపప్పులో కార్బోహైడ్రేట్లూ అధికంగా ఉంటాయి. ఇది గుండెకు చాలా మంచిది. హాని చేసే కొలెస్ట్రాల్ తగ్గిస్తుంది.
- ఇందులో సోడియం, పొటాషియం అధిక మోతాదులో ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపు చేస్తాయి.

### గడ్డ పెరుగుతో..

**అన్నంలో పెరుగు వేసి కలుపుకోవడం కాదు. ఇప్పుడు వంట చేసేటప్పుడు పెరుగు ఎందులో కలిపితే టేస్టీగా ఉంటుందో చదువండి!**



- ఉప్మా తయారు చేశాక.. దించేముందు పావు కప్పు గడ్డ పెరుగును చేర్చితే ఉప్మా టేస్ట్ అదిరిపోతుంది.
- రోటీలు మెత్తగా రావాలంటే.. పిండిలో కాస్త పెరుగు వేసి చూడం. రొటీలు మృదువుగా రావడమే కాదు, టేస్టీగా ఉంటాయి.
- గ్రేవీ ఉండే కూరల్లో కాసింత పెరుగు వేస్తే కూర బాగుంటుంది.
- శనగపిండిలో పెరుగు కలిపితే పకోడీలు మెత్తగా వస్తాయి. పైగా రుచి బాగుంటాయి.

## అరటిపండ్లే ఆమె ఆహారం!

**అరటిపండ్లు ఆరోగ్యానికి మంచివని తెలుసు. కానీ ఒకావిడ పన్నెండు రోజుల పాటు మూడు పూటలా అరటి పండ్లను తిన్నది. ఎందుకంటే?**

ఎవరైనా అప్పుడప్పుడు పండ్లు తినడం తెలుసు. కానీ అదే పనిగా తినడమంటే కష్టం. కానీ యూలియా ఆ పనిచేసింది. పన్నెండు రోజుల పాటు మరేమీ తినకుండా కేవలం అరటిపండ్లు తిన్నది. దీని వల్ల ఆమె శరీరంలోని విష పదార్థాలన్నీ తొలిగిపోయాయని డాక్టర్లు చెప్పారు. పైగా ఆమెలో చురుకుదనం పెరిగింది. ఏ పనిపైనైనా దృష్టి పెట్టే శక్తి వచ్చిందట. మెదడు చురుగ్గా పనిచేస్తున్నట్లు చెప్పింది యూలియా. నీరసం, నిస్సత్తువ లేకుండా రోజంతా సంతోషంగా పని చేసుకున్నట్లు చెబుతున్నదీమె. చర్మం కూడా కాంతివంతమైనట్లు గమనించుకుంది. ఎంత ఎత్తయిన పర్వతాలను సునాయాసంగా ఎక్కగలిగే శక్తి వచ్చిందని చెబుతున్నది. అంతేకాదు.. శరీరంలో అన్ని అవయవాలు ఫ్లెక్సిబుల్‌గా మారిపోయాయంటున్నది. ఇంతకుముందు కన్నా ఆమె బరువులో చాలా మార్పు వచ్చిందట. నిత్యం మూడుపూటలా అరటిపండ్లు తింటూ, తగినంత నీరు తాగడం వల్ల ప్రాణం హాయిగా ఉందని చెబుతున్నది. మీరూ ట్రై చేసి చూడండి.



### సుడోకు

డైలీ సుడోకు 120 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 6 | 7 | 4 | 5 | 2 | 1 | 8 | 9 |
| 9 | 2 | 8 | 6 | 1 | 7 | 3 | 5 | 4 |
| 4 | 5 | 1 | 3 | 9 | 8 | 2 | 7 | 6 |
| 2 | 1 | 9 | 8 | 7 | 5 | 6 | 4 | 3 |
| 5 | 8 | 6 | 1 | 3 | 4 | 7 | 9 | 2 |
| 7 | 4 | 3 | 2 | 6 | 9 | 5 | 1 | 8 |
| 1 | 9 | 2 | 7 | 4 | 6 | 8 | 3 | 5 |
| 8 | 3 | 4 | 5 | 2 | 1 | 9 | 6 | 7 |
| 6 | 7 | 5 | 9 | 8 | 3 | 4 | 2 | 1 |

డైలీ సుడోకు -121

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | 9 | | | | | 8 | | 2 |
| | | | 4 | | | 6 | | |
| 7 | | | | | 3 | | | 5 |
| 4 | 8 | | | | 1 | 5 | | |
| | | | 6 | | 7 | | | |
| | | 1 | 2 | | | | 8 | 9 |
| 5 | | | 3 | | | | | 4 |
| | | 2 | | | 6 | | | |
| 8 | | 4 | | | | | 1 | |

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

### ట్వీట్



**అమ్మాయా? అబ్బాయా? ఎవరైతే ఏంటి? ఐ లవ్ యూ రౌడీ!**



**విజయ్ దేవరకొండ**
@TheDeverakonda

విజయ్ దేవరకొండని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య
130,172

### కామన్‌మ్యాన్ వాయిస్

ప్రతి రాయి తనలో ఒక శిల్పాన్ని దాచుకొని ఉంటుంది. సుత్తితో బద్దలు కొడితే శిల్పం రాదు. ఉలితో నెమ్మదిగా చెక్కాలి.
అలాగే ప్రతి మనిషిలోనూ ఒక శక్తి ఉంటుంది. ఏదో సాధిద్దామన్న ఊహల్లో బతికితే విజయం రాదు. కష్టమనే ఉలితో పట్టుదలగా చెక్కితే గెలుపు అనే శిల్పం బయటపడ్తుంది. ఆ తపన లేని మనిషి రాయిలాగానే బతుకుతాడు.
– Jyothi Valaboju

అచేతనంగా చతికిలబడ్డంత మాత్రాన శక్తి నిర్వీర్యం అవదు.
కాస్తంత విరామం సుదీర్ఘ ప్రయాణానికి ఎంతైనా అవసరం!
– Shresht Shreshta

### వైరల్ వీడియో



**'కొండవీటి దొంగ'లో చమక్ చమక్ చామ్ అనే పాట సూపర్ హిట్. ఆ పాటను సాయిధరమ్ తేజ నటించిన ఇంటిలిజెంట్ సినిమాలో రీమిక్స్ చేసి ప్రొమో విడుదల చేశారు.**

Chamak Chamak Cham Promo Song | Inttelligent | Sai Dharam Tej | VV Vinayak | Lavanya Tripathi
Total views : 741,603+
Published on Feb 4, 2018

నమస్తే తెలంగాణ
# రైతుబడి
[ హైదరాబాద్ ]
గురువారం 8 ఫిబ్రవరి 2018



## వృద్ధి నియంత్రకాలతో మంచి దిగుబడి

- చిలగడ దుంప నాటిన 15 రోజుల తర్వాత ఈ పదిహేను రోజుల వ్యవధిలో ఇథ్రెల్‌ను 250 పీపీయం పిచికారీ చేస్తే దుంపల దిగుబడి పెరుగుతుంది.
- బూడిద గుమ్మడి నాటిన 10-15 రోజుల తర్వాత నుంచి వారం రోజుల వ్యవధిలో నాలుగుసార్లు ఇథ్రెల్‌ను 250 పీపీయం చొప్పున పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది. అదే సొర, కాకర, పొట్ల మొక్కలపై అయితే ఇథ్రెల్‌ను 100 పీపీయం చొప్పున పిచికారీ చేయాలి.
- కొబ్బరిలో పూత వచ్చిన నెలకు 30 పీపీయంల 2,4-డి పిచికారీ చేస్తే 30 శాతం వరకు దిగుబడి పెరుగుతుంది.
- 1000 పీపీయం ఇథ్రెల్‌ను పిచికారీ చేస్తే ఏడు రోజుల్లో బత్తాయిలో పసుపు రంగు, అరటి రెండు రోజుల్లో రంగు మారుతుంది.
- 1000 పీపీయం ఇథెఫెన్ మామిడిపై పిచికారీ చేస్తే చర్మం రంగు మారుతుంది. త్వరగా పండిపోతుంది.



- పైనాపిల్ చెట్టు 35-40 ఆకుల దశలో ఉండి, పూతలో ఉన్నప్పుడు 10 పీపీయం ప్లానోఫిక్స్ 2 శాతం యూరియా, 0.04 శాతం సోడియం కార్బొనేట్, 20 పీపీయం ఇథ్రెల్‌ను మొక్కకు 50 మిల్లీలీటర్ల చొప్పున పువ్వు చివరన పిచికారీ చేయాలి. దీంతో పూత, కాయల పరిమాణం పెరుగుతుంది.
- సోడియం హైడ్రాక్సైడ్‌తో కలిపి 500 పీపీయం ఇథెఫెన్ ను సపోటాపై పిచికారీ చేస్తే రెండు రోజుల్లో పక్వానికి వస్తాయి. అదే బొప్పాయిలో అయితే 2000 పీపీయం వాడాలి.
- క్యారెట్, ఆలుగడ్డలలో పూత, గింజ ఏర్పడటానికి 500 పీపీయంల చొప్పున జిబ్బరెలిక్ ఆమ్లం పిచికారీ చేయాలి.
- వేరుశనగలో మెపిక్వాట్ క్లోరైడ్‌ను 125 పీపీయంల చొప్పున పిచికారీ చేస్తే దిగుబడి పెరుగుతుంది.



**డాక్టర్ అమరపల్లి గీత**
శాస్త్రవేత్త, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, పాలెం



# ఆస్ట్రేలియా ద్రాక్ష అనుకూలం ఇక్కడ

**ద్రాక్షలో రెడ్‌గ్లోబ్ రకం ఆస్ట్రేలియాలో పండుతుంది. పెద్దగా, మంచి ఎరుపు రంగు, తీయగా ఉంటుంది ఈ ద్రాక్ష. ప్రత్యేక వాతావరణ పరిస్థితిలో మాత్రమే పండే ఈ రకం ద్రాక్ష సాగుపై పరిశోధనలు చేసి విజయం సాధించాడు జయశంకర్ భూపాలపల్లి జిల్లా ములుగు మండలం అన్నంపల్లి గ్రామానికి చెందిన పోరిక హరికాంత్ నాయక్. ఆస్ట్రేలియా రకం ద్రాక్షను మనదేశ వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా మలిచి, అధిక దిగుబడులు సాధించి అందరిచేత శభాష్ అనిపించుకున్నాడు హరికాంత్.**

ద్రాక్షలో రెడ్‌గ్లోబ్ రకం ఆస్ట్రేలియాలో విరివిగా పండుతుంది. ఎన్నో ఔషధ గుణాలు ఉన్న ఈ ద్రాక్షను భారత్‌లో సాగు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ భావించింది. ఈ సాగుపై కోయంబత్తూరు, పూణె, బెంగళూరు, హైదరాబాద్, ఢిల్లీ నగరాల్లో పరిశోధనలు జరిగాయి. ఈ రకం పంటను అభివృద్ధి చేసే పనిని అక్కడి వ్యవసాయ విశ్వవిద్యాలయాలకు, ICAR పరిశోధనా సంస్థలకు అప్పగించింది. దేశవ్యాప్తంగా వర్సిటీల్లో ఈ సాగుపై పరిశోధనలు జరిగాయి. అయితే కోయంబత్తూర్‌లో మాత్రం మంచి ఫలితాలు వచ్చాయి. అక్కడ ఎమ్మెస్సీ చేస్తున్న హరికాంత్ నాయక్ వాళ్ల గైడ్ డాక్టర్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో ఆ సాగుపై పరిశోధన బాధ్యతలు స్వీకరించాడు. తనకు విశ్వవిద్యాలయంలో అప్పగించిన పరిశోధనా కేంద్రంలో ఆ అంటుకట్టిన మొక్కలను నాటి సాగు ప్రారంభించా డు. ప్రత్యేకమైన యాజమాన్య పద్ధతులు పాటించి ఆస్ట్రేలియా రకం ద్రాక్షను విజయవంతంగా సాగు చేశాడు నాయక్.

మన ద్రాక్షతో పోలిస్తే రెడ్‌గ్లోబ్ ఆకారంలో పెద్దగా ఉంటుంది. నీరు శాతం తక్కువగా ఉంటుంది. బరువు కూడా ఎక్కువగా తూగుతుంది. ఎక్కువ కాలం నిల్వ సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ద్రాక్షలో పొడి తెగులు సమస్య అధికంగా ఉంటుంది. కానీ ఈ రకం ద్రాక్ష ఆ తెగుళును తట్టుకునే సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. ఈ రకం ఆస్ట్రేలియాలోనే కాదు ఈ పంట సాగవుతున్న ఇతర దేశాల్లోనూ ఏడాదికి ఒక్కసారి మాత్రమే పంట కోతకు వస్తుంది. కానీ మన దగ్గర రెండు సార్లు పంటను తీసుకోగలము. దీన్ని కూడా ప్రయోగాత్మకంగా విజయవం తంచేసి చూపెట్టాడు హరికాంత్ నాయక్.



### పంట పద్ధతి

ఫీల్డ్‌లో నాటడానికి అంటుకట్టిన ఒక్కో మొక్కకు 150 రూపాయలు అవుతుంది. ఆ మొక్కలకు సపోర్టుగా పందిర్లు, నీటిని అందించడానికి డ్రిప్ సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఎకరానికి మొదటిదశలో సుమారు ఐదు లక్షల వరకు ఖర్చు అవుతుంది. అలాగే మొదటి మూడేండ్లు పంట చేతికి రాదు. నాలుగో ఏడాది నుంచి పంట చేతికి వస్తుంది. ఒక్కో చెట్టుకు సుమారు 15-20 గెలలు వస్తాయి. గెల బరువు సుమారు కనిష్ఠంగా 800 గ్రాముల నుంచి గరిష్ఠంగా రెండున్నర కిలోల దాకా ఉండొచ్చు. ఈ విధంగా ఎకరానికి ఒక్క సీజన్‌లో దాదాపు ఎనిమిది టన్నుల పంట వస్తుంది. అయితే నాలుగేండ్ల దాకా రైతులు పెట్టుబడి పెట్టి నిరీక్షించాల్సిన అవసరం లేదు. ద్రాక్ష తోటలో అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. బొప్పాయి, చామంతి, బంతి, అలోవేర్‌లతో పాటు ఆకుకూరలు కూడా సాగుచేసుకోవచ్చు. ఇవి ఏడాది కాలం పంటలు. కాబట్టి ద్రాక్ష తోటకు పెట్టిన ఖర్చును కొంత వరకు ఈ పంటల ద్వారా తిరిగి పొందవచ్చు. ముఖ్యంగా ద్రాక్షతోటల్లో అంతర పంటగా బొప్పాయి సాగు చేస్తే మంచి దిగుబడులు వస్తాయని హరికాంత్ తెలిపాడు.

### మార్కెటింగ్ ఇలా

ద్రాక్షలో ఈ రకం పండ్లు విదేశాలకు ఎగుమతి చేస్తే మంచి లాభాలు పొందవచ్చు. అక్కడ ఈ ద్రాక్షకు కిలో రూ.350 వరకు ధర పలుకుతున్నది. ఇన్ని సుగుణాలున్న ఆస్ట్రేలియా రకం ద్రాక్షకు విదేశాల్లోనూ మంచి డిమాండ్ ఉన్నది. అయితే కొంతమంది రైతులు రైతు ఉత్పాదక సంఘాలుగా ఏర్పడి సాగు చేస్తే ఇంకా బాగుంటుంది. ఎందుకంటే ఎకరానికి ఎనిమిది టన్నులు వస్తే కొంతమంది రైతులు కలిస్తే ఎక్కువ ఎకరాల్లో పెద్దమొత్తంలో పంట చేతికి వస్తుంది. అప్పుడు ఎగుమతి చేయడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడుతాయి. అలాగే క్షేత్రస్థాయిలో రైతులకు కిలోకు 150 వరకు ఆదాయం వస్తుంది. డిమాండ్‌ను బట్టి ఎకరం సాగు చేస్తే రూ.15 లక్షల వరకు ఆర్జించవచ్చని హరికాంత్ నాయక్ తెలిపాడు.

ఇజ్రాయిల్ దేశంలో రెడ్‌గ్లోబ్ ద్రాక్ష సాగు విరివిగా సాగు చేస్తారు. అక్కడ వందల ఎకరాల్లో ఈ ద్రాక్ష తోటలు ఉంటాయి. ఈ తరహా సాగు పద్ధతులు అనుసరిస్తే తెలంగాణ రైతులు రాజులు అవుతారు. ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే అరుదైన ఈ రకం ద్రాక్షతో పాటు తెలంగాణలో సాగు చేయవచ్చని తెలిపాడు.



హరికాంత్ హైదరాబాద్ ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ (హార్టీకల్చర్) చేశాడు. తర్వాత కోయంబత్తూరు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఎమ్మెస్సీ చేస్తూ జూనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యాడు. ప్రస్తుతం బెంగళూరులోని ఐఐహెచ్ఆర్ (భారతీయ ఉద్యాన పరిశోధన సంస్థ)లో పీహెచ్‌డీ చేస్తున్నాడు. తన పీహెచ్‌డీ పరిశోధన ద్రాక్ష సాగుపైనే చేస్తున్నాడు. ఒక్క తెలంగాణలోనే కాక తమిళనాడు, కర్ణాటకల్లో ద్రాక్షపై పరిశోధనలు చేసి ప్రశంసలు అందుకున్నారు. ద్రాక్షలో రెడ్‌గ్లోబ్ రకాన్ని మన దేశ వాతావరణ పరిస్థితిలో పండిం చి అధిక దిగుబడి సాధించిన నాయక్‌ను ఇజ్రాయిల్ ప్రభుత్వం తమ దేశానికి ఆహ్వానించింది. ఎడారి ప్రాంతమైన ఇజ్రాయిల్‌లో గ్రీన్‌హౌస్, బిందుసేద్యం, పూర్తి యాంత్రీకరణ పద్ధతుల్లో అధిక దిగుబడులు సాధిస్తున్న తీరును ఆయన అధ్యయనం చేశారు. హరికాంత్ నాయక్ సాధించిన విజయానికి హరితవిప్లవ పితామహులు డాక్టర్ ఎంఎస్ స్వామినాథన్ మొదలు వివిధ రాష్ట్రాల పెద్దల నుంచి అనేక ప్రశంసలు అందుకున్నాడు. అతని కృషికి అనేక అవార్డులు వచ్చాయి.

ఈ రకం ద్రాక్ష సాగుకు సంబంధించి మరిన్ని వివరాల కోసం 94406 91020 నంబర్‌కు ఫోన్ చేయవచ్చు. లేదా harikanthporika@gmail.com మెయిల్ ద్వారా సంప్రదించవచ్చు.

**- ఆసరి రాజు**

# మెట్ట రైతులకు వరం 'కీరదోస' సాగు



**విదేశాల్లో** మంచి డిమాండ్ ఉన్న కీరదోస సాగు మెట్ట ప్రాంత రైతులకు వరంగా మారుతున్నది. వరి, మక్కజొన్న, పత్తి పంటలను వేసి అంతంత మాత్రమే లాభాలు పొందుతున్న రైతులు.. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు అందించే కీరదోస (చిన్న దోస కాయలు) సాగుపై ఆసక్తి చూపుతున్నారు. వల్బీ ఫుడ్స్ ఇండియా కంపెనీ ప్రోత్సాహంతో సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్, అక్కన్నపేట, దుబ్బాక, గజ్వేల్, నంగునూరు, చిన్నకోడూరు తదితర మండలాల్లో రైతులు ఎక్కువగా కీరదోస సాగు చేస్తున్నారు. హుస్నాబాద్ మండలంలోని నాగారం, జిల్లెలగడ్డ, మీర్జాపూర్, గాంధీనగర్, అక్కన్నపేట మండంలోని అక్కన్నపేట, గొల్లకుంట, కేశవాపూర్, చాపగానితండా, తెనుగుపల్లి, గుడాటిపల్లి, దుబ్బాక మండలంలోని వెంకటాపూర్ తదితర గ్రామాలు, గజ్వేల్‌లోని కుకునూర్‌పల్లి తదితర గ్రామాల్లో కీరదోస సాగువుతున్నది. ప్రతి రెండు నెలలకోసారి జిల్లా నుంచి సుమారు మూడు వేల టన్నుల కీరదోస అమెరికా, రష్యా లాంటి దేశాలకు ఎగుమతి అవుతున్నది.



### వల్బీ ఫుడ్స్ కంపెనీ ప్రోత్సాహం..

విదేశాల నుంచి కీరదోస విత్తనాలు తెప్పించడం నుంచి మొదలు పంట చేతికి వచ్చి.. కొనుగోలు చేసే వరకు వల్బీ ఫుడ్స్ కంపెనీయే బాధ్యత వహిస్తుంది. ఎకరానికి రూ.5వేల విలువైన విత్తనాలను, సుమారు రూ.10 నుంచి 15వేల విలువైన ఎరువులను కూడా కంపెనీయే సరఫరా చేస్తుంది. కంపెనీ ప్రతినిధులు ఎప్పటికప్పుడు పంటల సాగును పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తారు. పండిన పంటను కూడా రైతు ముంగిట్లోనే కొనుగోలు చేస్తారు. రైతుల ఖాతాల్లోనే నేరుగా డబ్బులు జమచేస్తున్నారు. దీంతో ఎక్కువమంది రైతులు ఈ సాగు చేసేందుకు ముందుకొస్తున్నారు. రైతులు చేయాల్సింది పంటకు సకాలంలో నీళ్లు పెట్టడం, కాసిన కాయలను సరైన సమయంలో తెంపి కాంటాకు వేయాలి. పంట చేతికందే దశలో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా చేసిన ఫలితం ఉండదు.

### మంచి ఆదాయం

పంటను శ్రద్ధతో కాపాడుకుంటే.. రెండునెలల్లోనే ఎకరాకు పెట్టుబడి డబ్బులు పోను సుమారు రూ. 40 నుంచి 55వేల ఆదాయం వస్తుందని రైతులు అంటున్నారు. సస్యరక్షణ చర్యలను పాటించి సకాలంలో పంటను కోసినట్లైతే ఎకరాకు సుమారు 4 నుంచి 6టన్నుల దిగుబడి వస్తుందని చెబుతున్నారు. మార్కెట్లో పెద్ద కాయల కంటే చిన్న కాయలకే ఎక్కువ ధర (కిలో రూ. 20 నుంచి రూ. 30) పలుకుతుంది. కాబట్టి రైతులు కాయ పెద్దగా ఎదగకముందే.. సాధారణ సైజులో ఉండగానే కోస్తున్నారు.

### ఏడాదంతా సాగు చేసుకోవచ్చు

ఎండాకాలంలో మే నెల మినహా మిగతా సంవత్సరమంతా ఈ కీరదోస సాగు చేసుకోవచ్చు. చీడపీడల బెడద కూడా తక్కువగానే ఉంటుంది. సాగు నీటి ఇబ్బంది ఉన్న మెట్ట ప్రాంత రైతులు తక్కువ నీటి వినియోగం, తక్కువ పంట కాలం, తక్కువ పెట్టుబడికి అయ్యే కీరదోస సాగుపై మరింత దృష్టి సారించి అధిక లాభాలు పొందవచ్చు.

**-దరిపల్లి రాజు, 9182777240**

### ఇంటిల్లిపాది కష్టపడితే లాభం



కూలీల ద్వారా కాకుండా ఇంటిల్లిపాది కష్టపడి కీరదోస సాగు చేస్తే మంచి లాభాలుంటాయి. నేను నాలుగేండ్ల నుంచి కీరదోస సాగు చేస్తున్న. కష్టపడ్డ దానికి ఫలితం వస్తున్నది. వరి,మొక్కజొన్న పంటలు సాగు చేసి మూడు నుంచి నాలుగు నెలలు కష్టపడే బదులు ఈ పంటను సాగు చేసుకుంటే కేవలం రెండు నెలల్లోనే ఆదాయాన్ని పొందవచ్చు.

**-ఇజ్జగిరి సంపత్, రైతు, నాగారం**
**-హుస్నాబాద్ మండలం**

### కష్టానికి తగిన ఫలితం



కంపెనీ వాళ్లే వచ్చి విత్తనాలు ఇచ్చి ఎలా సాగు చేయాలో కూడా వాళ్లే చెప్తరు. సమయానికి నీళ్లు పెట్టి, ఎరువులు వేస్తే సరిపోతుంది. కాసిన కాయలను సకాలంలో తెంపితేనే ఏ గ్రేడ్ ధర వస్తుంది. ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా ధర పూర్తిగా పడిపోతుంది. కాత సమయంలో జాగ్రత్తగుండాలె. పంట కాలం రెండు నెలలే కాబట్టి సాగు చేయడం పెద్ద కష్టం కాదు. కష్టానికి తగిన ఆదాయం ఉంటుంది.

**-కాశబోయిన పోచయ్య, అక్కన్నపేట**



### ఆసక్తి ఉన్న రైతులకు అందిస్తున్నాం

కీరదోస విత్తనాలు మన ప్రాంతంలో అందుబాటులో ఉండవు. వీటిని యూరప్ దేశాల నుంచే తెప్పిస్తాం. ఈ సాగు చేపట్టేందుకు ఆసక్తి ఉన్న రైతులకు విత్తనాలను ఇస్తాం. సాగు పద్ధతులను కూడా వివరిస్తాం. పంటకాలమైన రెండు నెలల్లో మా ప్రతినిధులు వారానికోసారి వచ్చి రైతులకు సలహాలు, సూచనలు ఇస్తారు.

**జంపయ్య, వల్బీ ఫుడ్స్ కంపెనీ ప్రతినిధి**
**9912916836**

# నిమ్మతోటలో సస్యరక్షణ చర్యలు

నిమ్మ తోటలు కాపుకొచ్చినప్పటి నుంచి పలు సమస్యలు పట్టి పీడిస్తాయి. సమస్యాత్మక నేలల్లో నాటిన తోటలు, యాజమాన్యం సరిగా లేనివి, అశ్రద్ధ చేసిన తోటల్లో ఈ సమస్యలు ముందుగానే కనిపిస్తున్నాయి. చెట్ల ఆరోగ్యం దెబ్బతిని, నాణ్యతలేని పంట రావడంతో పాటు చెట్లు తొందరగా అంటే నాటిన 10-12 ఏండ్లకే క్షీణించి రైతులకు నష్టాన్ని కలుగజేస్తున్నాయి. ఆరోగ్యంగా ఉన్న మొక్కలను నాటకపోవడం, సాగుకు అనుకూలం కాని భూముల్లో నాటడం, సమగ్ర ఎరువుల యాజమాన్య పాటించకపోవడం, నీటి యాజమాన్య లోపం, అంతర కృషి చేయకపోవడం వల్ల ఇలాంటి సమస్యలు వస్తున్నాయి. అలాగే చెట్ల మధ్య పాదుల్లో జనుము, జీలుగ వంటివి సాగు చేయకపోవడం, తడుల మధ్య ఎక్కువ వ్యత్యాసం ఉండటం, చెద పురుగులు ఆశించడం, బెరడు, కాండం తొలిచే పురుగులు ఆశించడం కూడా ఇందుకు కారణాలు. మొదళ్లకు పుట్టగొడుగులు, కాండానికి బంక తెగులు రావడం, మొక్కకు వెర్రితెగుళ్లు , గజ్జితెగుళ్లు ఆశించడమే కాదు వేరుకుళ్లు సోకి చెట్లు తొందరగా చనిపోయే ప్రమాదం ఉన్నది.

### సమగ్ర ఎరువుల యాజమాన్యం

మొక్కలకు జనవరి, జూన్ నెలల్లో (కొత్త చిగుర్లు వచ్చేటప్పుడు) వాటి వయస్సును బట్టి ఎరువులు వేయాలి. ఏడాది మొక్కలకు 25 కిలోల పశువుల ఎరువులు, 2.5 కిలోల వేప/కానుగ పిండి, 400గ్రా. యూరియా, 600గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 250 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలి. 2 ఏండ్ల మొక్కలకు 50 కిలోల పశువుల ఎరువు, 5 కిలోల వేప/కానుగ పిండి, 800గ్రా. యూరియా, 1200గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 500 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్, 3 ఏండ్ల మొక్కలకు 75 కిలోల పశువుల ఎరువులు, 7.5 కిలోల వేప/కానుగ పిండి, 1200 గ్రా. యూరియా, 1800గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 750 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్, నాలుగు ఏండ్లు ఆపై ఉన్న మొక్కలకు 100 కిలోల పశువుల ఎరువులు, 10కిలోల వేప/కానుగ పిండి, 1600గ్రా. యూరియా, 2400గ్రా. సింగిల్ సూపర్ ఫాస్పేట్, 1000 గ్రా. మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులు వేయాలి. రెండు దఫాలుగా మొదటి సారి డిసెంబరు-జనవరి మాసాల్లో, రెండోసారి జూన్-జులై మాసాల్లో వేయాలి. సేంద్రియ ఎరువులను వాడడం వల్ల భూమిలో సత్తువతో పాటు తేమ నిలువ సామర్థ్యం పెరిగి చెట్లు ఏపుగా ఎదుగుతాయి.



### సూక్ష్మ పోషకాలను అందించడం

ఎరువులతో పాటు సూక్ష్మ పోషకాలను కూడా అందివ్వాలి. రసాయన ఎరువుల ఎక్కువగా వేయడం, నేలలో ఉదజని సూచిక 8 కంటే ఎక్కువగా ఉండటం, సాగు నీటిలో హానికర లవణాలు ఉండటం లాంటి పరిస్థితుల్లో సూక్ష్మధాతు లోపాలు కనిపిస్తాయి. సూక్ష్మ పోషకాల లోపం ఉన్నప్పుడు ప్రధాన పోషకాలు తగిన పరిమాణంలో వేసినా సరైన ఫలితాలుండవు. చాలా సందర్భాల్లో ఒకే తోటలో గాని, ఒకే చెట్టులో గాని పలు సూక్ష్మధాతులోపాలు కనిపిస్తాయి. ఇలాంటి సందర్భాల్లో సూక్ష్మధాతవుల మిశ్రమ ద్రావణం చెట్టుపై కొత్త ఆకు తొడితే సమయంలో 15 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలి. లీటరు నీటికి 5గ్రా. జింక్ సల్ఫేట్, 2 గ్రా. మెగ్నీషియం సల్ఫే ట్, 2గ్రా. మాంగనీస్ సల్ఫేట్, 2 గ్రా. ఫెర్రస్ సల్ఫేట్, 1గ్రా. బోరాక్స్, 6గ్రా. సున్నం, 10గ్రా. యూరియా, 0.5 మి. లీ. సబ్బు నీరు కలిపి పిచికారీ చేయాలి. లోపాన్ని బట్టి నీటిని విడివిడిగా కూడా పిచికారీ చేయవచ్చు.

**నీటి తడులు:** ఎండాకాలంలో 5-7రోజుల వ్యవధిలో నీరు కట్టాలి. నీరు కట్టడానికి 'డబుల్ రింగ్' పద్ధతిని తప్పనిసరిగా అనుసరించాలి. డ్రిప్‌ను అమర్చుకొని మొక్క వయ స్సు, నేల, వాతావరణం, వేరు మూలాన్ని బట్టి సిఫా ర్సు మేరకు నీరు అందించాలి. తోటలో గానీ, ముఖ్యం గా పాదుల్లో ఎక్కువ నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

**- గుండెల రాజు, 72889 85757**
**మహబూబాబాద్ అగ్రికల్చర్**

### తెగుళ్లు నివారణ

| తెగుళ్లు | నివారణ |
|---|---|
| **వేరుకుళ్లు :** ఇది మొదట పీచువేర్లను ఆశించి, తర్వాత మిగిలిన వేర్లకు పాకడం వల్ల వేర్లు కుళ్లిపోతాయి. తెగులు సోకిన చెట్లకు విపరీతంగా పూత, కాత వచ్చి, కాయలు ముదిరేలోపే చెట్లన్నీ చనిపోతాయి. నేలలో తేమ తక్కువగా ఉండటం వేరుకు గాయాలు కావడం, నీరు తడుల్లో ఎక్కువ వ్యత్యాసాలు ఉండడం ఈ తెగులు రావడానికి ముఖ్య కారణాలు. | **నివారణ:** నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి. ఏ రకంగానూ వేర్లకు గాయాలు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. వేసవిలో 'మల్చింగ్' చేయాలి. నీరు పాలించిన మరుసటి రోజు 1లీటరు నీటికి 2గ్రా. కార్బండిజం లేదా మెటలాగ్జిల్ లేదా క్లోరోథలోనిల్ కలిపి పాదు అంతా పోయాలి. ఏటా జీవన ఎరువును పశువుల ఎరువు + వేప పిండితో వృద్ధి చేసి మొక్క పాదుల్లో వేయాలి. |
| **బంక తెగులు:** బంక కారడం, బెరడు కుళ్లడం మొదలైనవి ఎక్కువగా చెట్ల మొదలు భాగం మీద కనిపిస్తున్నది. | **నివారణ:** తెగులు సోకిన చెట్టు పాదు నుంచి ఆరోగ్యంగా ఉన్న చెట్టు పాదులోకి నీరు పారకుండా చూడాలి. బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా తొలిగించి, బోర్డోపేస్టు పూత పూయాలి. |
| **గజ్జితెగులు:** ఈ తెగులు సాధారణంగా చెట్ల ఆకుల - పండ్లు మీద ఎక్కువగా కనిపిస్తుంది. మొదట ఆకుపై పసుపు పచ్చని చిన్న మచ్చలు కనిపిస్తాయి. తర్వాత మచ్చలు ఉబ్బెత్తుగా, గరుకుగా, గోధుమ రంగుకు మారి పండ్లకు కూడా వ్యాపించి పండ్లు నాణ్యత కోల్పోయి, ముదరక ముందే రాలిపోతాయి. | **నివారణ :** 10లీటర్ల నీటిలో 1 గ్రా. స్ట్రెప్టోసైక్లిన్ + 30 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్‌లను కలిపి నెలకు ఒకసారి చొప్పున మూడు సార్లు పిచికారీ చేయాలి. పైన తెలిపిన యాజమాన్య పద్ధతులతో పాటు వెర్రి తెగుళ్లు రావడానికి కారణమైన కీటకాలు నివారణకు పురుగుమందులను పిచికారీ చేయాలి. |

### సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలి

రైతులు నిమ్మ తోటను శుభ్రంగా ఉంచుకోవాలి. వ్యాధులను అదుపు చేసే జీవన ఎరువులు, వేప పిండి వేయాలి. సూచనలను నిమ్మ రైతులు పాటిస్తే దిగుబడులు, ఆదాయం పొందవచ్చు.

**- కె. సూర్యనారాయణ, జిల్లా ఉద్యాన శాఖ అధికారి, మహబూబాబాద్**
**83744 49066**
**టోల్ ఫ్రీ నెంబరు: 18004250519**


ఎన్టీఆర్

# మార్చిలో షురూ

ఎన్టీఆర్ కథానాయకుడిగా త్రివిక్రమ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతున్నది. ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. గత ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలు జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మార్చి నెల నుంచి ప్రారంభించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. త్రివిక్రమ్ శైలిలో కుటుంబ బంధాలు, వినోదం, భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమా సాగనున్నట్లు తెలిసింది. కథానాయికతో పాటు ఇతర ప్రధాన తారగణానికి సంబంధించిన పూర్తి వివరాల్ని త్వరలో వెల్లడిస్తామని చిత్రవర్గాలు పేర్కొన్నాయి. ఇందులో ఎన్టీఆర్ పాత్ర చిత్రణ స్టైలిష్‌గా సాగనున్నట్లు తెలిపారు. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా వైవిధ్యమైన లుక్‌లో ఆయన కనిపించనున్నట్లు తెలిసింది. హాలీవుడ్ చెందిన వాన్స్ హార్ట్‌వెల్ ఈ చిత్రానికి మేకప్‌మెన్‌గా పనిచేయనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బిగ్‌బాస్ రెండో సీజన్‌తో వ్యాఖ్యాతగా మరోమారు బుల్లితెర ప్రేక్షకుల్ని అలరించేందుకు ఎన్టీఆర్ సన్నద్ధమవుతున్నారు. ఒకవైపు త్రివిక్రమ్ సినిమాలో నటిస్తూనే ఈ రియాలిటీ షోకు వ్యాఖ్యాతగా వ్యవహరించ నున్నట్లు తెలిసింది.

# సుమోలు గాల్లోకి లేస్తేనే నేను తీసినట్టా..!?

**మాస్ మసాలా ఎంటర్‌టైనర్‌లను తెరకెక్కించడంలోనూ, హీరోలకు మాస్ ఇమేజ్‌ను ఆపాదించడంలోనూ దర్శకుడు వి.వి.వినాయక్ సిద్ధహస్తులు. ఆయనతో ఒక్క సినిమా అయినా చేయాలని, దానితో స్టార్‌డమ్‌ను సొంతం చేసుకోవాలని చాలా మంది హీరోలు కోరుకుంటుంటారు. వి.వి.వినాయక్ తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'ఇంటిలిజెంట్'. సాయిధరమ్‌తేజ్ కథానాయకుడిగా నటిస్తున్నారు. సి.కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం రేపు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో దర్శకుడు వి.వి.వినాయక్ పాత్రికేయులతో ముచ్చటించారు. ఆ విశేషాలివి.**


వి.వి.వినాయక్

**'ఇంటిలిజెంట్' ఎలా వుండబోతున్నది?**

• యాక్షన్‌తో పాటు మంచి హ్యూమర్ వున్న చిత్రమిది. పక్కా కమర్షియల్ ఎంటర్‌టైనర్‌కు కావాల్సిన అంశాలన్నీ వున్నాయి. ఆకుల శివతో కలిసి ఇప్పటి వరకు నేను రూపొందించిన మూడు చిత్రాలు మంచి విజయాల్ని సాధించాయి. ఈ సినిమా కూడా అదే స్థాయి సక్సెస్‌ని సాధిస్తుంది.

**'ఇంటలిజెంట్' అంటున్నారు మైండ్‌గేమ్ నేపథ్యంలో సినిమా సాగుతుందా?**

• సినిమాలో చిన్న మైండ్ గేమ్ వుంటుంది. అదేంటనేది సినిమా చూడాల్సిందే. అప్పట్లో హైదరాబాద్‌లో స్నేక్‌గ్యాంగ్ సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. అలాంటి ఓ అంశాన్ని తీసుకుని దానికి ఎంటర్‌టైన్‌మెంట్‌ను జోడించి అల్లుకున్న కథ ఇది. ఓ యువకుడు తనకు సహాయం చేసిన ఓ వ్యక్తి కోసం ఎలాంటి రిస్క్ చేశాడు? ఎంత వరకు వెళ్లాడు? తను నమ్మిన వ్యక్తి కుటుంబానికి ఎలా అండగా నిలిచాడు అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం.

**'ఛమక్..ఛమక్..' పాటను రీమిక్స్ చేయాలని ముందే అనుకున్నారా?**

• 'కొండవీటిదొంగ' చిత్రంలోని 'ఛమక్..ఛమక్...' అనే పాట అంటే నాకు చాలా ఇష్టం. తేజుతో ఈ కథ అనుకున్నప్పుడే ఇందులో ఆ పాటను రీమిక్స్ చేస్తే బాగుంటుందని భావించి సంగీత దర్శకుడు ఇళయరాజాను కలవడం జరిగింది. ఆయన సంతోషంగా అంగీకరించడం జరిగింది.

**సేఫ్ గేమ్‌లో భాగంగానే ఈ చిత్రాన్ని రెగ్యులర్ పంథాలో తెరకెక్కించారని వినిపిస్తోంది?**

• నా సినిమాలన్నీ రెగ్యులర్ పంథాలోనే సాగుతాయి. అందుకు భిన్నంగా వెళ్లాకూడదని కాదు. స్క్రిప్ట్ విన్నప్పుడే ఇది తప్పకుండా ఆడుతుందనిపించిన కథనే తెరపైకి తీసుకొస్తాను.

**ఎక్కువగా బయటి కథలపైనే ఆధారపడుతున్నారు కారణం?**

• సొంతంగా కథ చేసుకుని సెట్స్‌పైకి వెళ్లాలంటే ఎక్కువ సమయం పడుతుంది. రాఘవేంద్రరావు ఓ సందర్భంలో కలిసినప్పుడు 'బయటి కథలు కూడా తీస్తుండాలి. బయటికథ చేసినప్పుడే మనలో వున్న మరో కోణం బయటపడుతుంది' అన్నారు. ఆయన చెప్పినట్టే నేను బయటి కథలు చేశాను. అలా చేయకపోతే అంతా నన్ను ఓ ఫ్యాక్షన్ చిత్రాల దర్శకుడిగానే చూసేవారు.

**మీ దర్శకత్వంలో వచ్చిన కొన్ని సినిమాల్లో మీ మార్కు కనిపించలేదనే కామెంట్స్ వినిపించాయి?**

• అంటే ఏంటో నాకు అర్థం కాలేదు. సుమోలు గాల్లోకి లేస్తేనే నేను తీసినట్టా? లేకుంటే నేను తీసినట్లు కాదా? ఓ విమానాశ్రయంలో ఒకాయన 'ఈ సినిమాలోనూ సుమోలు గాల్లో లేస్తాయా?' అని అడిగాడు. ప్రతి సినిమాలోనూ సుమోల్ని గాల్లోకి లేపలేం కదా. దానికి సందర్భం, అందుకు తగ్గ సన్నివేశం కుదరాలి.

**ఈ మధ్య పెద్ద దర్శకులంతా బయటి కథల్ని కాపీ చేయడం ఎక్కువైపోతున్నది అనే టాక్ వినిపిస్తున్నది?**

• చాలా ఏళ్ల క్రితం నుంచే ఇతర భాషల కథల్ని స్ఫూర్తిగా తీసుకుని సినిమాలు చేయడం జరుగుతున్నది. అయితే ఇప్పుడు వున్నట్టుగా అప్పట్లో సోషల్ మీడియా లేదు. దాంతో ఏ కథను స్ఫూర్తిగా తీసుకుని సినిమా చేశారనేది పెద్దగా తెలిసేది కాదు. ఇప్పుడు ఏది చేసినా సోషల్ మీడియా ద్వారా తెలిసిపోతున్నది.

**రచయితల కొరత వల్లే ఇతర భాషల కథలపై ఆధారపడుతున్నామా? అందుకే తెలుగులో కొత్త కథలు రావడం లేదా?**

• కొత్త కథలు ఎందుకు రావడంలేదు. అర్జున్‌రెడ్డి, పెళ్లి చూపులు కొత్త కథలే కథా?. ప్రతీ సినిమాకు విమర్శ అనేది ఎప్పుడూ వుంటూనే వుంది. ఇక్కడ ప్రతిభ వున్న వాళ్లకు అవకాశాలు రావడం లేదు. అవకాశాలు వచ్చినవాళ్లేమో ప్రతిభను నిరూపించకోవడం లేదు.

**మీరు రాజకీయాల్లోకి ప్రవేశిస్తున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి?**

• అవన్నీ వట్టి పుకార్లే. ఇప్పట్లో రాజకీయాల్లోకి వెళ్లాలనే అలోచన నాకు లేదు. మా కుటుంబానికి రాజకీయ నేపథ్యం వుండటం వలన నాపై ఇలాంటి పుకార్లు వస్తున్నాయి. కొడాలి నాని ఓ ప్రెస్‌మీట్‌లో సరదాగా చెప్పిన విషయాన్ని చిలువలు పలువలు చేసి రాస్తున్నారు. ఎలా రాసిపెట్టి వుంటే అలా జరుగుతుంది.

**కొత్తవాళ్లతో కాన్సెప్ట్ నేపథ్యంలో సినిమా చేసే ఆలోచన వుందా?**

• రెండేళ్ల తరువాత కొత్త వాళ్లతో ఓ సినిమా చేయాలనుకుంటున్నాను.

**చాలా మంది హీరోలు 70 శాతం సినిమా పూర్తయిపోయాక 'ఈ సినిమా ఆడదు అని తెలిసి తప్పని సరి పరిస్థితుల్లో చేసేస్తాం' అని చెబుతుంటారు? అలా మీకు ఎప్పుడైనా అనిపించిందా?**

• ఒక సినిమా చేస్తున్నప్పుడు దానికి సంబధించిన లొకేషన్స్, అప్పుడు తెరకెక్కించాల్సిన దానిపైనే నా ఆలోచన వుంటుందే కానీ ఈ సినిమా ఆడుతుందా? ఆడదా? అనే ఆలోచన వుండదు. అలా ఎవరూ ఆలోచించరు. అలా ఆలోచిస్తే నా దృష్టిలో వాళ్లు బ్రహ్మ దేవుడితో సమానం.

**మీ పంథాకు భిన్నంగా కొత్త కథతో చేద్దాం అనే ప్రయత్నించాలని అనిపించలేదా?**

• నా పంథాకు భిన్నంగా చేయాలని చాలా సార్లు ప్రయత్నించాను. అలా ప్రయత్నించిన ప్రతీసారి ఫెయిలయ్యాను.

**మహేష్‌బాబుతో సినిమా చేయబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి?**

• మహేష్‌కు సరిపోయే కథను నేను చెప్పలేకపోయాను. కథ కుదిరినప్పుడు తప్పకుండా సినిమా చేస్తాను.

# నా తొలిప్రేమకథ విఫలమైంది!

**'నా హృదయానికి దగ్గరైన చిత్రమిది. 'ఊహలు గుసగుసలాడే' తర్వాత స్వచ్ఛమైన ప్రేమకథల్లో ఎక్కువగా నటించే అవకాశాలు రాలేదు. అలాంటి లవ్‌స్టోరీస్‌లోనే నన్ను చూడాలని ప్రేక్షకులు కోరుకున్నారు. ఆ కోరిక ఈ సినిమాతో తీరింది' అని తెలిపింది రాశీఖన్నా. ఆమె కథానాయికగా నటిస్తున్న చిత్రం 'తొలి ప్రేమ'. వెంకీ అట్లూరి దర్శకుడు. ఈ నెల 10న విడుదలకానున్నది. బుధవారం హైదరాబాద్‌లో రాశీఖన్నా చెప్పిన సంగతులివి..**


రాశీఖన్నా

వర్ష అనే అమ్మాయిగా భిన్న పార్శ్వాల్లో నా పాత్ర ఉంటుంది. మూడు కాలాల వ్యవధిలో సాగే కథ ఇది. అందుకు తగినట్లుగానే నా ఆహార్యం, నటన ప్రతిదీ భిన్నంగా ఉంటాయి. ప్రథమార్థంలో కళ్లద్దాలు పెట్టుకొని నేను కనిపించే సన్నివేశాల్ని చూసి సామాజిక మాధ్యమాల్లో హ్యారీపోటర్ చెల్లెలిలా ఉన్నావని అన్నారు. నా కెరీర్‌లో ఛాలెంజింగ్ పాత్ర ఇది. ఆద్యంతం భావోద్వేగ ప్రధానంగా సాగుతుంది. వరుణ్, నాకు మధ్య వచ్చే ప్రతి సన్నివేశం మనసుల్ని కదిలిస్తుంది.

**బరువు తగ్గాను...**

పవన్‌కల్యాణ్ 'తొలి ప్రేమ'తో మా సినిమాకు ఎలాంటి పోలికలు ఉండవు. కథ పూర్తి వైవిధ్యంగా ఉంటుంది. ప్రేమ, పరిణితి అంశాల చుట్టూ సినిమా సాగుతుంది. కాలేజీ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల కోసం దాదాపు ఐదు కేజీల బరువు తగ్గాను. డైట్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాను. రెండు నెలల పాటు ప్రతిరోజు జిమ్‌లో రెండు గంటలు వర్కవుట్స్ చేశాను. ఫిట్‌నెస్‌కు ఎక్కువగా ప్రాధాన్యతనిస్తున్నాను కానీ సైజ్‌జీరోపై నాకు పెద్దగా నమ్మకం లేదు.

**సీనియర్‌తో ప్రేమాయణం**

నా జీవితంలో తొలిప్రేమ తాలూకు అనుభవాలున్నాయి. స్కూల్‌లో చదివే రోజుల్లో పదిహేడేళ్ల వయసులో సీనియర్‌తో ప్రేమలో పడ్డాను. తొలుత అతడే నాకు ప్రపోజ్ చేశాడు. కానీ ఆ ప్రేమకథ విఫలమైంది. నా నిజజీవితంలో అలాంటి సంఘటనలు ఉండటంతో ఈ కథకు తొందరగా కనెక్ట్ అయ్యాను. తొలిప్రేమలోని అనుభూతులకు అందమైన దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. బాలీవుడ్‌లో సినిమాలు చేయాలనే కోరికలేమీ లేవు. అవకాశం వస్తే తప్పకుండా నటిస్తాను. ప్రస్తుతం తమిళంలో మూడు సినిమాలు చేస్తున్నాను. తదుపరి తెలుగు సినిమాకు సంబంధించిన విశేషాల్ని మరి కొద్ది రోజుల్లో వెల్లడిస్తాను.

# త్వరలో 1,551 అధ్యాపక నియామకాలు

- వర్సిటీల పటిష్ఠతకు సర్కార్ చర్యలు
- బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం
- నెలరోజుల్లో 1,061 పోస్టుల భర్తీకి వరుస నోటిఫికేషన్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని 11 యూనివర్సిటీలను పటిష్ఠ పరుచడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. అన్ని యూనివర్సిటీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రానున్న బడ్జెట్‌లో అత్యధిక కేటాయింపులు జరిపే అవకాశాలను విద్యాశాఖ పరిశీలిస్తున్నది. గత ఏడాది యూనివర్సిటీలకు కేటాయించిన రూ.420 కోట్ల వినియోగానికి సంబంధించిన యుటిలైజేషన్ సర్టిఫికెట్లను సమర్పించాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. ఈ సర్టిఫికెట్ల ఆధారంగా రానున్న బడ్జెట్‌లో యూనివర్సిటీలకు తగిన నిధులు కేటాయించే అవకాశం ఉంటుందని ఉన్నతవిద్యామండలి అధికారులు తెలిపారు. దీంతోపాటు చాలారోజులుగా యూనివర్సిటీలలో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి సన్నాహాలు జరుగుతున్నాయి. ప్రస్తుతం యూనివర్సిటీల్లో 1,551 పోస్టులు ఖాళీగా ఉండగా.. వాటిలో 1,061 పోస్టుల భర్తీకి నెలరోజుల వ్యవధిలో వరుస నోటిఫికేషన్లు ఇవ్వడానికి కసరత్తు జరుగుతున్నది. ఈ పోస్టుల భర్తీకి అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీలకు ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే. ఇందుకోసం పాటించాల్సిన రోస్టర్ పాయింట్ల వివరాల కోసం ఆయా సంక్షేమ శాఖ అధికారులకు యూనివర్సిటీలవారీగా లేఖ రాసినట్టు తెలిసింది. ఆయా శాఖల నుంచి రోస్టర్ పాయింట్ల వివరాలు వచ్చిన వెంటనే అధ్యాపకుల పోస్టుల కోసం యూనివర్సిటీల నుంచి నోటిఫికేషన్లు వెలువడే అవకాశాలున్నాయి.

# ఖనిజ అన్వేషణపై ప్రత్యేక దృష్టి

- మైనింగ్ సదస్సులో చర్చించనున్న అంతర్జాతీయ నిపుణులు
- ఈనెల 14 నుంచి 17 వరకు మైనింగ్ టుడే- 2018 సదస్సు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

హైదరాబాద్‌లో అంతర్జాతీయస్థాయిలో నిర్వహించనున్న మైనింగ్‌టుడే సదస్సులో ఖనిజాల అన్వేషణపై నిపుణులు విస్తృతంగా చర్చించనున్నారు. వరుసగా అంతర్జాతీయ సదస్సులకు ఆతిథ్యమిస్తున్న హైదరాబాద్ నగరం ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు హైటెక్స్‌లో మైనింగ్‌టుడే సదస్సుకు సన్నద్ధమైంది. దీనిని తెలంగాణ ప్రభుత్వం, ఫిక్కి, మైనింగ్ ఇంజినీర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి. టెక్నాలజీ, ఎక్విప్‌మెంట్, మెషినరీ, పాలసీ, ఓవర్సీస్ (టెంపో) ఇతివృత్తంగా సదస్సులో నిర్మాణాత్మక చర్చలు జరుగుతాయి. పవర్, సిమెంట్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఆయిల్, గ్యాస్ వంటి రంగాలను ప్రభావితం చేసే పలు అంశాలను ఈ సదస్సులో చర్చించనున్నారు. నాలుగురోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో ఖనిజాల అన్వేషణలో వస్తున్న మార్పులు, సాంకేతిక పరిజ్ఞానం, గనుల గుర్తింపులో రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ల వినియోగం, గనులకు రేటింగ్ ఇవ్వడం, గనుల పర్యవేక్షణ వంటి అంశాలపై వివిధ దేశాల నుంచి వచ్చే నిపుణులు ప్రసంగిస్తారు. వివిధ దేశాల మధ్య టెక్నాలజీ బదిలీ, ఆయా దేశాల్లోని మైనింగ్ విధానాలు తదితర అంశాలపై చర్చలు జరుగుతాయి. నూతన ఉత్పత్తులను ఆవిష్కరిస్తారు. ముఖ్యంగా ఇసుక ప్రొక్యూర్‌మెంట్ విధానాల అధ్యయనంలో భాగంగా బీచ్ సాండ్స్, రివర్‌సాండ్స్, క్రష్డ్ స్టోన్ సాండ్ (రాతి ఇసుక) వంటి అంశాలను ప్రత్యేకంగా చర్చిస్తారు. తెలంగాణలో మైనింగ్, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై ఈ సదస్సులో ఒక చర్చా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ సమావేశాలకు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, ఆసియా, ఆఫ్రికాలోని దేశ విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు. ఈ ప్రతినిధులు చర్చల్లో పాల్గొనడంతో పాటు ఆయా దేశాలకు చెందిన మైనింగ్, అనుబంధ కంపెనీల వారు వారి ఉత్పత్తులను ప్రదర్శిస్తారు. మైనింగ్‌టుడే కార్యక్రమ ప్రారంభోత్సవానికి రాష్ట్ర గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, కేంద్ర గనుల శాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్, పర్యావరణ, అటవీశాఖ మంత్రి హర్షవర్ధన్, ఆయా శాఖల కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులు హాజరుకానున్నారు.



బుధవారం బేగంపేట క్యాంపు కార్యాలయంలో గనుల శాఖాధికారుల 2018 డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాజీ మంత్రి వినోద్, మాజీ ఎమ్మెల్యే కవిత, గనులశాఖ డైరెక్టర్ సుశీల్‌కుమార్, ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్ కూడా ఉన్నారు.



# మా వాటా 574 టీఎంసీలు

## కృష్ణాలో ఇది తెలంగాణకు న్యాయమైన హక్కు

**బచావత్ కేటాయింపుల్లోనే అన్యాయం**

**సెక్షన్ 3 ప్రకారం జలాలను పెంచండి ■ ఏపీ పక్షపాతిగా కృష్ణా యాజమాన్య బోర్డు**

**జలాల పంపిణీ, టెలిమెట్రీలో నిర్లక్ష్యం ■ పట్టిసీమతో మాకు 90 టీఎంసీల వాటా**

**పోలవరంతో భద్రాద్రి ఆలయానికి ముంపు ప్రమాదం ■ కేంద్రానికి రాసిన లేఖలో తెలంగాణ**

**15న జరిగే సమావేశానికి అజెండా ఖరారు ■ కేంద్ర జల వనరుల శాఖ అత్యుత్సాహం**

**9వ తేదీన మరో సమావేశానికి రెండు బోర్డులకు ఆహ్వానం**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

కృష్ణాజలాల్లో తెలంగాణకు 574 టీఎంసీల న్యాయమైన వాటాకోసం కేంద్రంపై మరోసారి ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం సమాయత్తమవుతున్నది. ఇప్పటికే ఒకవైపు న్యాయపోరాటం, మరోవైపు ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపించడంతోపాటు అవకాశం వచ్చిన ప్రతిసారీ కేంద్ర సర్కారుపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్న తెలంగాణ ప్రభుత్వం తాజాగా కేంద్ర జల వనరుల శాఖ నిర్వహించనున్న సమావేశంలో గళమెత్తనుంది. రెండు రాష్ట్రాలతోపాటు కృష్ణా, గోదావరి నదీయాజమాన్య బోర్డులతో ఈ నెల 15న కేంద్ర జల వనరుల మంత్రిత్వశాఖ సమావేశం నిర్వహించనున్న విషయం తెలిసిందే. తెలంగాణకు కృష్ణా జలాల్లో రావాల్సిన న్యాయపరమైన వాటాపై వాదనలు వినిపించేందుకు రంగం సిద్ధమైంది. నీటిపారుదల శాఖలోని ఇంటర్‌స్టేట్ విభాగం అధికారులు అస్త్రశస్త్రాలను సిద్ధంచేశారు. ఇటీవల బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో వాదించినట్లుగానే ఉమ్మడి ఏపీకి బచావత్ చేసిన 811 టీఎంసీల కేటాయింపుల్లో తెలంగాణకు న్యాయంగా 574.60 టీఎంసీల మేర జలాలు దక్కాల్సిందేనని తెలంగాణ తరపున తేల్చిచెప్పనున్నారు. మరికొన్ని ప్రధాన అంశాలను సమావేశ ఎజెండాలో చేర్చాలని కేంద్ర జలవనరుల మంత్రిత్వ శాఖకు తాజాగా లేఖ రాశారు. బచావత్ ట్రిబ్యునల్ ఉమ్మడి ఏపీకి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు పరివాహక ప్రాంతం, బేసిన్‌లో సాగుయోగ్య భూమి తదితర సాంకేతిక అంశాల దృష్ట్యా 574.60 టీఎంసీల వాటా దక్కాలని స్పష్టం చేయనున్నారు. ఇప్పటికే బ్రిజేశ్ ట్రిబ్యునల్‌కు సమర్పించిన అఫిడవిట్‌లో ఈ అంశాన్ని చేర్చినప్పటికీ, సెక్షన్-3కు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో ప్రస్తుతం పెండింగులో ఉంది. సెక్షన్-3 ప్రకారం ఏదైనా ఒక రాష్ట్రం నదీజలాలకు సంబంధించి చేసిన విజ్ఞాపనపై ఏడాదిలోగా కేంద్రం స్పందించాల్సి ఉంటుంది. కానీ తెలంగాణ విజ్ఞాపనపై కేంద్రం స్పందించకపోవడంతో తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించింది. కేంద్రానికి సంబంధించిన అంశం పెండింగులో ఉన్న దరిమిలా ఈ నెల 15న జరుగనున్న సమావేశాన్ని వేదికగా చేసుకొని కేంద్రంపై మరోసారి ఒత్తిడి తెచ్చేందుకు ఇంటర్‌స్టేట్ విభాగం సమాయత్తమైంది. ఉమ్మడి ఏపీకి బచావత్ కేటాయింపు 811 టీఎంసీలు కాగా, అందులో ఏపీ 512 (63.13%), తెలంగాణ 299 టీఎంసీలు (36.87%) నీటిని ఉమ్మడి పాలకులు తమ సర్దుబాటుగా అధికారిక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ కేటాయింపుల్లో తెలంగాణ వాణి వినిపించలేదనేందుకు గణాంకాలతో సహా పేర్కొననున్నారు.

**కృష్ణా బోర్డు పనితీరుపై తీవ్రస్థాయి నిరసన**

కృష్ణా బోర్డు పలు అంశాల్లో ఏకపక్షంగా వ్యవహరిస్తుండటంపై ఆధారాలతో సహా ఈ నెల 15న జరిగే భేటీలో కేంద్రానికి తెలంగాణ అధికారులు ఫిర్యాదు చేయనున్నట్టు తెలిసింది. కేంద్ర జల వనరుల శాఖ 2016 జూన్ 21, 22న జరిగిన సమావేశాల్లో మూడునెలల్లో టెలిమెట్రీలను ఏర్పాటుచేయాలని ఆదేశించగా ఇప్పటికీ మొదటిదశ కూడా బోర్డు సక్రమంగా పూర్తి చేయలేకపోయిందని, రెండోదశ జాబితాను సిద్ధం చేయలేకపోయిందని ఫిర్యాదు చేయనున్నారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులకు ఏపీ ఉద్దేశపూర్వకంగా సహకరించకపోవడం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో కీలకమైన భద్రాచలం ఆలయం ముంపునకు గురవుతుండటం, బచావత్ అవార్డులోని ఏడో క్లాజు అమలు తదితరాలను ఎజెండాగా చేర్చాలని కేంద్రాన్ని తెలంగాణ ప్రభుత్వం కోరింది. పట్టిసీమ ద్వారా గోదావరిజలాలను కృష్ణా డెల్టాకు మళ్లిస్తుండటం, పోలవరం పనులు వేగంగా జరుగుతున్న నేపథ్యంలో బచావత్ అవార్డు ప్రకారం కృష్ణాజలాల్లో తెలంగాణకు 90 టీఎంసీల వాటా పెరుగాల్సి ఉంది. దీనిపై కేంద్రం వేసిన బజాజ్ కమిటీ పత్తా లేకపోవడం, గడువు తీరినా కేంద్రం నిర్ణయం తీసుకోకపోవడం వంటి అంశాలపైనా చర్చించాలని కోరింది.

**కృష్ణా పరివాహక ప్రాంతం వివరాలు**

| అంశం | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ |
|---|---|---|
| బేసిన్‌లో జనాభా (మిలియన్లలో) | 20.0 (71.9%) | 7.8 (28.1%) |
| సాగుభూమి (లక్షల హెక్టార్లలో) | 36.5 (70.4%) | 15.3 (29.6%) |
| బీడు భూములు (లక్షల హెక్టార్లలో) | 33.0 (72.5%) | 12.5 (27.5%) |
| పరివాహక ప్రాంతం (చదరపు కి.మీ.లో) | 52,232.0 (68.5%) | 24,018 (31.5%) |
| బచావత్‌లో రావాల్సిన న్యాయమైన వాటా (టీఎంసీల్లో) | 574.6 (70.8%) | 236.40 (29.2%) |
| బ్రిజేశ్ కేటాయింపులో రావాల్సింది (టీఎంసీల్లో) | 137.4 | 56.6 |

## పరిధిపై ఎందుకీ తొందర?

- అయోమయంగా కేంద్ర జలవనరుల శాఖ తీరు
- 15వ తేదీ భేటీకి ముందుగానే మరో సమావేశం
- 9న రావాలంటూ కృష్ణా, గోదావరి బోర్డులకు పిలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు దక్కాల్సిన వాటాపై కాలయాపన చేస్తున్న కేంద్ర జలవనరుల శాఖ అధికారులు తాజాగా కృష్ణా, గోదావరి నదీ యాజమాన్య బోర్డుల పరిధిపై (ఆయా నదులపై రెండు రాష్ట్రాల పరిధిలో ఉన్న ప్రాజెక్టుల నిర్వహణను బోర్డు చేతుల్లోకి తీసుకోవడం) హడావుడి ప్రదర్శిస్తుండటం అందరినీ విస్మయానికి గురిచేస్తున్నది. వాస్తవంగా మంత్రిత్వ శాఖ కార్యదర్శిగా గతంలో పనిచేసిన అమర్జీత్‌సింగ్ గత ఏడాది నవంబర్‌లో పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఉపేంద్రసింగ్ బాధ్యతలు చేపట్టారు. ఈ క్రమంలో రెండు రాష్ట్రాలకు జలాల అంశాలపై అవగాహన కోసమో, సాధ్యమైనంత మేరకు పెండింగ్ అంశాలకు పరిష్కారం చూపేందుకో ఈ నెల 15న సమావేశం ఏర్పాటుచేశారని అధికారికవర్గాలు భావించాయి. రెండు రాష్ట్రాల అధికారులతో పాటు కృష్ణా, గోదావరి బోర్డు అధికారులను సమావేశానికి ఆహ్వానించారు. ముందే ఎజెండా అంశాలను తీసుకున్నారు. కానీ హడావుడిగా రెండు బోర్డుల పరిధిపై ఈ నెల 9వ తేదీన సమావేశాన్ని నిర్వహిస్తున్నందున బోర్డు అధికారులు హాజరుకావాలని, మరుసటి రోజే అంటే బుధవారమే బోర్డు పరిధి అంశంపై నివేదిక (నోట్) పంపాలని మంగళవారం కేంద్ర జల వనరుల శాఖ నుంచి మరో లేఖ వచ్చింది. హడావుడిగా ఈ సమావేశాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. బోర్డు పరిధి అంశంపై రెండు తెలుగు రాష్ట్రాలకు భిన్నాభిప్రాయాలున్నాయి. ప్రాజెక్టులవారీగా కేటాయింపులు జరిగిన తర్వాతనే బోర్డు పరిధిలోకి తీసుకోవాలని, తద్వారానే రెండు రాష్ట్రాలకు ప్రయోజనం ఉంటుందని తెలంగాణ మొదటి నుంచి వాదిస్తున్నది.

## ఎత్తిపోతల పథకాలపై
# కరంటు భారం తగ్గేనా!

**యూనిట్ చార్జీ రూ.6.40 నుంచి రూ.4.88కి తగ్గించాలని వినతి**

**తగ్గిస్తే భారీ ఉపశమనం.. నేడు, 12న ఈఆర్సీ బహిరంగ విచారణ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రైతులందరికీ సాగునీరు అందించాలనే లక్ష్యంతో పెద్దఎత్తున ఎత్తిపోతల పథకాలను చేపడుతున్న నేపథ్యంలో కరంటు బిల్లుల భారం కూడా పెరుగనుంది. ఈ పథకాలకు విద్యుత్ చార్జీలను తగ్గించాలని చాలా కాలంగా విద్యుత్‌పంపిణీ సంస్థలు (డిస్కంలు), విద్యుత్‌నియంత్రణమండలి (టీఎస్‌ఈఆర్సీ)ని నీటిపారుదలశాఖ కోరుతున్నది. ప్రస్తుతం ఎత్తిపోతల పథకాలకు వినియోగించే కరంటుకు యూనిట్‌కు రూ.6.40 చార్జీని డిస్కంలు వసూలు చేస్తున్నాయి. చార్జిని రూ.4.88కి సవరిస్తే ఎత్తిపోతలపథకాల నిర్వహణపై భారం భారీగా తగ్గుతుంది. ఈ నేపథ్యంలో ఎన్పీడీసీఎల్‌కు సంబంధించి గురువారం కామారెడ్డిలో, ఎస్పీడీసీఎల్‌కు సంబంధించి 12వ తేదీన హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లోని ఎఫ్‌టాప్సీ భవనంలో బహిరంగ విచారణ జరుగనుంది. నీటిపారుదలశాఖ తరపున ఇడం ఇన్‌ఫ్రా అనే కన్సల్టెన్సీ, అడ్వయిజరీ ప్రైవేటు లిమిటెడ్ తరపున బల్వంత్‌జోషి వాదనలు వినిపించనున్నట్లు తెలిసింది.

**ఎత్తిపోతల పూర్తయితే 12 వేల మెగావాట్ల వినియోగం**

ఇప్పటివరకు కృష్ణానదిపై 14 ఎత్తిపోతల పథకాలకు 1,359 మెగావాట్ల కరంటును వినియోగిస్తున్నారు. వీటికి యూనిట్‌కు రూ.6.40 చొప్పున రూ. 1564.57 కోట్లు చెల్లించాల్సి వస్తున్నది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకాన్ని ప్రారంభిస్తే కరంటు వినియోగం 3,331 మెగావాట్లకు పెరుగనుందని అంచనా. సీతారామప్రాజెక్టు, పాలమూరు-రంగారెడ్డి పథకాలు అందుబాటులోకి వస్తే చార్జీల భారం ఎక్కువగా ఉంటుంది. ఈ పథకాలకు కరంటు వినియోగం 2018-19లో 5,869 మెగావాట్లు, 2019-20లో 8,389 మెగావాట్లు, 2020-21లో 10,089 మెగావాట్లు, 2021-22లో 12,091.92 మెగావాట్లకు పెరుగుతుందని అంచనా. దీంతో సీఎం కేసీఆర్ ఆదేశానుసారం యూనిట్ ధరను రూ.4.88కు తగ్గించాలని విద్యుత్‌పంపిణీ సంస్థలు కొన్నిరోజుల కిందట ఈఆర్సీకి ప్రతిపాదనలు పంపాయి. ప్రతిపాదనలను ఈఆర్సీ అంగీకరిస్తే కరంటు చార్జీలు రూ.1,565.57 కోట్ల నుంచి రూ.1193.75 కోట్లకు తగ్గనున్నాయి. అంటే రూ.371.82 కోట్ల మేర భారం తగ్గనుంది. నిర్మాణంలో ఉన్న అన్ని ఎత్తిపోతల పథకాలు పూర్తయితే కరంటువినియోగం 12వేల మెగావాట్లకు మేర పెరుగుతుంది. అప్పుడు యూనిట్‌కు రూ.6.40 ప్రకారం రూ.13,824 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. చార్జీలను సవరిస్తే వ్యయం రూ.10,540 కోట్లకు తగ్గనుంది. అంటే అప్పుడు రూ.3,284 కోట్ల మేర భారం తగ్గనుంది.

## పురుషోత్తంరెడ్డి కుటుంబీకులకు నోటీసులు

- ఖాళీగా కూతురు, అల్లుడి బ్యాంకు లాకర్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** ఆదాయానికి మించి ఆస్తుల కేసులో పరారీలో ఉన్న హెచ్ఎండీఏ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డిని పట్టుకునేందుకు గాలింపు ముమ్మరం చేసినట్టు ఏసీబీ డీఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏసీబీ ఎదుట హాజరుకావాలని కుటుంబసభ్యులు, బంధువులకు నోటీసులు జారీచేసినట్టు చెప్పారు. మంచిరేవులలో పురుషోత్తంరెడ్డి వియ్యంకుడు రాధాచరణ్‌రెడ్డి ఇంటితోపాటు, హైదరాబాద్‌లోని మేడిపల్లిలో బినామీ ఎర్రం సత్యనారాయణ ఇంట్లో బుధవారం ఏసీబీ అధికారులు సోదాలుచేశారు. పురుషోత్తంరెడ్డి కూతురు విదితారెడ్డి, అల్లుడు నిపున్‌రెడ్డి బ్యాంకులాకర్లను పరిశీలించారు. హైదరాబాద్‌లోని సన్‌సిటీ,తిలక్‌నగర్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో లాకర్లు ఖాళీగా ఉన్నట్టు గుర్తించారు. గతనెల 19న చివరిసారిగా లాకర్లను ఆపరేట్ చేసినట్టు తెలిసింది. ఏసీబీ అధికారుల సోదాలు, విచారణకు సహకరించాలని పురుషోత్తంరెడ్డి అల్లుడు నిపున్‌రెడ్డి, బావమరిది శ్రీనివాస్‌రెడ్డిలకు హైకోర్టు సూచించింది. దర్యాప్తు పేరుతో ఏసీబీ అధికారులు వేధిస్తున్నారంటూ వీరిద్దరూ కోర్టును ఆశ్రయించారు.

# దేశానికి తెలంగాణ రోల్ మోడల్

- సీఎం కేసీఆర్ ప్రణాళికతోనే రాష్ట్రం పురోభివృద్ధి
- అభివృద్ధిని అడ్డుకొంటున్న కాంగ్రెస్
- విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి
- టీఎస్ఐపాస్ అవార్డు అందుకొన్న అధికారులకు సత్కారం



బేగంపేట గ్రీన్ పార్క్ హోటల్‌లో ఎస్పీడీసీఎల్ సీఎండీ రఘుమారెడ్డిని సన్మానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో పీసీబీ సభ్యకార్యదర్శి పీ సత్యనారాయణరెడ్డి, ఫ్యాక్టరీస్ డైరెక్టర్ చంద్రమోహన్, పరిశ్రమలశాఖ జేడీ సంగ సురేశ్, అసిస్టెంట్ డైరెక్టర్ కే చంద్రశేఖర్‌బాబు, టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి కూడా ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కుట్రలు.. కుతంత్రాల నడుమ తెచ్చుకొన్న తెలంగాణలో టీఎస్ఐపాస్ అద్భుత ఫలితాలను అందిస్తున్నదని విద్యుత్‌శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి చెప్పారు. టీఎస్ఐపాస్‌కు అందించిన సేవలకుగాను జనవరి 26 న గవర్నర్ నుంచి పురస్కారం అందుకున్న అధికారులకు తెలంగాణ ఇండస్ట్రియలిస్ట్ ఫెడరేషన్, పాశమైలారం ఇండస్ట్రీస్ అసోసియేషన్ సంయుక్తంగా బుధవారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మంత్రి జగదీశ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో తెలంగాణ రాష్ట్రం యావత్ భారతదేశానికి రోల్‌మోడల్‌గా నిలుస్తున్నదన్నారు. సీఎం కేసీఆర్ తనదైన ప్రణాళికతో రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిస్తుండటం వల్లనే స్వరాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమైందన్నారు. వ్యవసాయానికి 24గంటల విద్యుత్ అందిస్తుంటే కాంగ్రెస్ నేతలు సహించలేక.. ప్రభుత్వంపై విమర్శలు చేయడం తగదన్నారు. కాంగ్రెస్ పాలిత కర్ణాటకలోని బెంగళూరులో పరిశ్రమలకు రోజు 3గంటల విద్యుత్‌కోతలున్న విషయాన్ని ఆ పార్టీ నాయకులు తెలుసుకోవాలన్నారు. తాత నెహ్రూ నుంచి మునిమనుమడు రాహుల్‌గాంధీ వరకు జన్మనిచ్చిన ఉత్తరప్రదేశ్‌లో చాలా గ్రామాల్లో కరంటు లేదని ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించాలన్నారు. తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి పనులకు కాంగ్రెస్ నాయకులు అడ్డుపడటమే లక్ష్యంగా పెట్టుకున్నారని మంత్రి పేర్కొన్నారు.

**అధికారులను సన్మానించిన మంత్రి**

టీఎస్ఐపాస్ అవార్డులు పొందిన పీసీబీ సభ్యకార్యదర్శి పీ సత్యనారాయణరెడ్డి, తెలంగాణ ఫ్యాక్టరీస్ డైరెక్టర్ పీఎం చంద్రమోహన్, టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జీ రఘుమారెడ్డి, పరిశ్రమలశాఖ జాయింట్ డైరెక్టర్ సంగ సురేశ్, అసిస్టెంట్ డైరెక్టర్ కే చంద్రశేఖర్‌బాబులను మంత్రి జగదీశ్‌రెడ్డి సన్మానించారు. టీఐఎఫ్ అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అవినీతికి అవకాశం లేకుండా పారిశ్రామికవేత్తలకు డిక్లరేషన్‌పై కేవలం 15 రోజుల్లో అనుమతులు ఇవ్వడం తెలంగాణ రాష్ట్ర సర్కారుకే చెల్లిందని కొనియాడారు.

# విభజన న్యాయం కోసం పోరుబాట

- త్వరలో ఉద్యమ కార్యాచరణ ప్రకటన
- ఉద్యోగులకు అండగానిలిచే నేత సీఎం కేసీఆర్
- టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**



సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్ లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి. చిత్రంలో శివాజీ, థామస్‌రెడ్డి, శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు.

విద్యుత్‌సంస్థలో జరుగుతున్న ఉద్యోగుల విభజనలో తెలంగాణ ప్రాంత ఉద్యోగులకు అన్యాయం జరిగితే మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతామని టీఎన్జీవో, విద్యుత్ జేఏసీ నేతలు హెచ్చరించారు. తెలంగాణ విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఉద్యోగుల విభజనపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు సమయంలో విభజన చట్టంలో పొందుపర్చిన నిబంధనలతో ఉద్యోగులకు నష్టం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల పక్షాన నిలబడే నాయకుడే ముఖ్యమంత్రి కావడం తమకు గొప్ప వరమని రవీందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యోగులపై ఈగ వాలనివ్వకుండా సీఎం కేసీఆర్ కాపాడుకున్నారని గుర్తుచేశారు. విద్యుత్తు ఉద్యోగుల జేఏసీ చైర్మన్ శివాజీ, కన్వీనర్ పీ అంజయ్య మాట్లాడారు. విద్యుత్ ఉద్యోగుల సమస్యలను సీఎం కేసీఆర్ నాయకత్వంలోనే పరిష్కారం అవుతుందని తెలంగాణ రిటైర్డ్ ఇంజినీర్ల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్యాంప్రసాద్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ టీఎంయూ వర్కింగ్ ప్రెసిడెంట్ థామస్‌రెడ్డి, ఇంజినీర్ ఉద్యోగుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ ఇంజినీర్ అసోసియేషన్ అధ్యక్షుడు మేడి రమేశ్, విద్యుత్‌శాఖ మహిళా ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు వాణి, రిటైర్డ్ ఇంజినీర్ సంఘం నాయకుడు చంద్రమౌళి, జేఏసీ అడ్వైజర్ జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## 400 కేవీ లైన్ల అనుసంధానం సక్సెస్

- గడువుకన్నా ముందుగానే పూర్తిచేసిన స్టెర్‌లైట్ పవర్
- తెలంగాణకు అందుబాటులోకి 1000 మెగావాట్ల విద్యుత్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర విద్యుత్ అవసరాలు తీర్చడానికి వెయ్యి మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందని, నిజామాబాద్-శంకర్‌పల్లి 400 కేవీ డీసీ, మహేశ్వరం-మహబూబ్‌నగర్ 400 కేవీ లైన్ల అనుసంధానం పూర్తయిందని స్టెర్‌లైట్ సంస్థ అధికారికంగా ప్రకటించింది. ఈ రెండు లైన్లను గడువుకన్నా ముందుగానే స్టెర్‌లైట్ ఏర్పాటుచేసింది. 236 కిలోమీటర్ల పొడవైన ఈ రెండు లైన్ల నిర్మాణం, నిర్వహణ, యాజమాన్యం ప్రాతిపదికన 35 ఏండ్లపాటు మహేశ్వరం ట్రాన్స్‌మిషన్ లి.(ఎంటీఎల్) నిర్వహించనున్నది. స్టెర్‌లైట్ పవర్ ట్రాన్స్‌మిషన్ లి. (స్టెర్‌లైట్ పవర్), గ్లోబల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బీయూ సీఈవో వేద్ తివారీ మాట్లాడుతూ.. సమయానికి తెలంగాణకు వెయ్యి మెగావాట్ల విద్యుత్ అందుబాటులోకి వచ్చిందన్నారు. 2018-19లో 21 వేల మెగావాట్ల డిమాండ్‌ను తీర్చేలా ఇది ఉపయోగపడుతుందని తెలిపారు. 6016 మెగావాట్ల రెన్యూవబుల్ ఎనర్జీకూడా అందుబాటులో ఉంటుందన్నారు. దేశంలోనే తొలిసారిగా.. ఇంటర్‌స్టేట్ పవర్ ట్రాన్స్‌మిషన్ అసెట్స్ ఏర్పాటు కోసం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్ (ఇన్విట్)ను ఏర్పాటుచేసింది.

## సర్వేలో పాల్గొంటేనే కేంద్ర ప్రయోజనాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉన్నత విద్యా స్థితిగతులపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సర్వేలో పాల్గొన్న కళాశాలలకే కేంద్రం నుంచి అందించే ప్రయోజనాల్లో ప్రాధాన్యం కల్పిస్తామని కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ తెలిపింది. సర్వేలో పాల్గొనడానికి ఆల్ ఇండియా సర్వే ఆన్ హయ్యర్ ఎడ్యుకేషన్ (ఏఐఎస్‌హెచ్‌ఈ) వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. సర్వేలో పాల్గొనడాన్ని కళాశాలలకు భవిష్యత్తులో న్యాక్ గుర్తింపు పొందడానికి కనీస అర్హతగా పరిగణిస్తామని, ఈ కాలేజీల విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తామని, ఇతర ప్రయోజనాల్లో అవకాశం కల్పిస్తామన్నారు.

## 9 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షల ఫీజు చెల్లించండి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఏప్రిల్/మేలో నిర్వహించనున్న తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు రాసేందుకు ఈ నెల 9 నుంచి 20వ వరకు పరీక్ష ఫీజు చెల్లించాలని ఓపెన్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ వెంకటేశ్వరశర్మ తెలిపారు. ఆలస్య రుసుంతో మార్చి 6 వరకు చెల్లించవచ్చన్నారు. మీసేవా/ఈసేవా, టీఎస్‌ఆన్‌లైన్, ఏపీఆన్‌లైన్ ద్వారా ఫీజులను చెల్లించాలన్నారు.

## దక్షిణమధ్య రైల్వేలో వందశాతం ఎల్ ఈడీ లైట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విద్యుత్ పొదుపుపై దక్షిణమధ్య రైల్వే దృష్టిసారించి, వందశాతం ఎల్ఈడీ లైట్లను ఏర్పాటుచేసిందని జీఎం వినోద్‌కుమార్ యాదవ్ తెలిపారు. రైల్వే చరిత్రలో ఎల్ఈడీ లైట్లను ఉపయోగించడంలో దక్షిణమధ్య రైల్వే రికార్డు సృష్టించిందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జోన్ పరిధిలోని ఆరు డివిజన్లలో 733 రైల్వేస్టేషన్లలో వందశాతం ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుచేసినట్టు చెప్పారు. దీనితో 32 లక్షల యూనిట్ల విద్యుత్ ఆదా అవుతుందని, ఏడాదికి రూ. 2.70 కోట్లు రైల్వేకి మిగులుతుందని పేర్కొన్నారు.

## ప్రధానితో విద్యార్థుల ముఖాముఖికి ఏర్పాట్లు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పరీక్షల ఒత్తిడిని తగ్గించే అంశంపై ఈ నెల 16న ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ 6వ తరగతి, ఆపై తరగతుల విద్యార్థులతో ముఖాముఖి నిర్వహిస్తారని, ఇందుకు ఏర్పాట్లు పూర్తిచేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ .. డీఈవోలను ఆదేశించారు. బుధవారం డీఈవోలతోపాటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాళ్లకు మార్గదర్శకాలు జారీచేశారు.

## ఏపీలో జాక్ నేతృత్వంలో పోరాటం

- జనసేన నేత పవన్‌కల్యాణ్ ప్రకటన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో జేఏసీ నేతృత్వంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేస్తామని జనసేన అధినేత, సినీనటుడు పవన్‌కల్యాణ్ ప్రకటించారు. బుధవారం హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమం స్ఫూర్తినిచ్చిందని, అదేస్ఫూర్తిని ఏపీలో చూపడం కష్టమన్నారు. ఉండవల్లి, జయప్రకాశ్ నారాయణ వంటివారిని కలుపుకొని జనసేనతోపాటు జేఏసీ ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విభజన హామీలపై కేంద్రం స్పందించడం లేదని, టీడీపీ, బీజేపీతో దోస్తీపై భవిష్యత్‌లో నిర్ణయం తీసుకుంటానని చెప్పారు. ప్రత్యేకహోదాపై బీజేపీ సర్కారు మభ్యపెడుతున్నదని విమర్శించారు.

## హుక్కా సేవలపై హైకోర్టులో వ్యాజ్యం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లోని రెస్టారెంట్లలో హుక్కా సేవలపై పోలీసులు నిషేధం విధించడాన్ని సవాల్ చేస్తూ అర్బన్ గ్రిల్ డైన్ అండ్ కాఫీ షాప్‌తోపాటు మరిన్ని రెస్టారెంట్లు కలిసి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశాయి. ఈ వ్యాజ్యంపై బుధవారం జస్టిస్ ఏవీ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. హుక్కాపొగతాగడంలాగానే పరిగణిస్తారని, స్మోకింగ్‌జోన్‌లో హుక్కా సేవలను కొనసాగనివ్వాలని పిటిషనర్లు కోరారు. హుక్కాపై నిబంధనలను ప్రభుత్వం మార్చిందని అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. హుక్కా పేరిట మాదకద్రవ్యాల సేవనం జరుగుతున్నదని వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. ప్రమాణపత్రం దాఖలుచేయాలని పోలీసులను ఆదేశిస్తూ, విచారణను రెండువారాలకు వాయిదావేసింది.

**సకల నేరస్థుల సర్వేను దుర్వినియోగం చేయవద్దు**

సకల నేరస్థుల సర్వే దుర్వినియోగం కాకుండా చూడాలని పోలీసులకు ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. నేరస్థుల పేరిట అనవసర విషయాలపై ఆరాతీసి వేధింపులకు గురిచేయొద్దని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన మాజీ కార్పొరేటర్, టీడీపీ నేత బద్రీనాథ్ యాదవ్ దాఖలుచేసిన పిటిషన్‌పై బుధవారం జస్టిస్ ఏవీ శేషసాయి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది.ప్రభుత్వం తరపున సహాయ ప్రభుత్వ న్యాయవాది(ఏజీపీ) అశోక్ వాదనలు వినిపిస్తూ.. ఐడెంటిఫికేషన్ ఆఫ్ ప్రిజనర్స్ చట్టంలోని నిబంధనల ప్రకారం నేరస్థుల వివరాల సేకరణకు అవకాశముంటుందని తెలియజేశారు.

**గ్రామసభ తర్వాతే భూసేకరణ చేపట్టాలి**

భూసేకరణ చట్టం ప్రకారం గ్రామసభ నిర్వహించి అభిప్రాయాలు సేకరించిన తర్వాతే కొండపోచమ్మసాగర్ రిజర్వాయర్ కోసం సిద్దిపేట జిల్లాలోని మామిడ్యాలలో భూసేకరణ చేపట్టాలని ఉమ్మడి హైకోర్టు స్పష్టం చేసింది. భూసేకరణ అధికారులు ఇప్పటికే జారీచేసిన ఫైనల్ డిక్లరేషన్‌ను రద్దు చేసింది. గ్రామసభ నిర్వహించకుండానే ఫైనల్ డిక్లరేషన్ జారీచేయడాన్ని సవాల్‌చేస్తూ 30 మంది గ్రామస్థులు హైకోర్టును ఆశ్రయించారు.

**అమెరికా సంస్థ వెరిజోన్‌కు నోటీసులు**

బౌన్సర్ల సహాయంతో బలవంతంగా రాజీనామాలు చేయించారంటూ అమెరికా బహుళజాతి కంపెనీ వెరిజోన్ డాటా సర్వీసెస్‌పై ఆ సంస్థకు చెందిన 51 మంది ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. గత ఏడాది డిసెంబర్ 12, 13 తేదీల్లో 200 మంది ఉద్యోగులను నిర్బంధించి బౌన్సర్లతో బెదిరించి లేఖలపై సంతకాలు తీసుకున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు. విచారణ చేపట్టిన జస్టిస్ ఎంఎస్ రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం.. వెరిజోన్ సంస్థతోపాటు కార్మిక శాఖకు నోటీసులు జారీచేసింది.

# ఐటీ కాంగ్రెస్ నిర్వహణకు వేగంగా ఏర్పాట్లు

**నాస్కాం, ఐటీ కాంగ్రెస్ ప్రతినిధులతో చర్చించిన మంత్రి కేటీఆర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌తోపాటుగా నాస్కాం ఇండియా లీడర్‌షిప్ ఫోరం సదస్సు ఏర్పాట్లను వేగంగా పూర్తిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ తెలిపారు. నాస్కాం ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్, సైయంట్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టెక్ మహీంద్రా ఎండీ, సీఈఓ సీపీ గుర్నానీతో మంత్రి కేటీఆర్ క్యాంప్ ఆఫీస్‌లో సమావేశమై ఏర్పాట్ల గురించి చర్చించారు. ఐటీ రంగంలోనే కీలకమైన సదస్సుగా పేరొందిన వరల్డ్ ఐటీ కాంగ్రెస్‌కు ఆతిథ్యం ఇవ్వడం తమకు దక్కిన గౌరవంగా మంత్రి పేర్కొన్నారు. ఈ సదస్సును విజయవంతంగా పూర్తిచేసేందుకు ఇప్పటికే అన్ని ప్రభుత్వ విభాగాలు క్రియాశీలంగా పనిచేస్తున్నాయని మంత్రి కేటీఆర్ వివరించారు. ఈ ప్రతిష్ఠాత్మక సదస్సుకు హాజరయ్యే అతిథులను సాదరంగా ఆహ్వానించేందుకు, వారికి అన్నిరకాల సౌకర్యాల కల్పన ఏర్పాట్లు పూర్తయినట్టు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని టీవీ, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా సహా సోషల్ మీడియాలో ప్రచారం చేసేందుకు కృషిచేయాలని సంబంధిత వర్గాలకు మంత్రి సూచించారు. నాస్కాం లీడర్‌షిప్ సమ్మిట్‌తోపాటుగా వరల్డ్ ఐటీ కాంగ్రెస్ నిర్వహించేందుకు సాగుతున్న సన్నాహాలను ఈ సందర్భంగా నాస్కాం ప్రతినిధులు మంత్రి కేటీఆర్‌కు వివరించారు. ఈ సదస్సుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ప్రత్యేకంగా ఆహ్వానించామని పేర్కొంటూ, ఆయన రాకకు సంబంధించి ప్రధాన మంత్రి కార్యాలయం నుంచి సమాచారం రావాల్సి ఉన్నదన్నారు.



ఐటీ కాంగ్రెస్ ఏర్పాట్లపై బుధవారం బేగంపేట క్యాంప్ కార్యాలయంలో నాస్కాం ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్, సైయంట్ వ్యవస్థాపకుడు బీవీఆర్ మోహన్‌రెడ్డి, టెక్ మహీంద్రా ఎండీ, సీఈవో సీపీ గుర్నానీ తదితరులతో భేటీ అయిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్. చిత్రంలో ఐటీశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్



బుధవారం హైదరాబాద్‌లో ట్రెజరీశాఖ ఉద్యోగుల డైరీని ఆవిష్కరిస్తున్న ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ తదితరులు

## ట్రెజరీ ఉద్యోగుల డైరీ ఆవిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ ట్రెజరీ ఉద్యోగుల సంఘం ప్రచురించిన డైరీని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి ఈటల రాజేందర్ బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తమ శాఖలో దాదాపు 40 శాతం ఉద్యోగ ఖాళీలున్నాయని, వీటిని భర్తీచేసి ఉద్యోగుల పనిభారం తగ్గించాలని ఆ సంఘం నాయకులు మంత్రి ఈటల దృష్టికి తెచ్చారు. సీఎం కేసీఆర్‌తో మాట్లాడి త్వరలో ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్థికశాఖ ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, కార్యదర్శి శివశంకర్, ట్రెజరీస్, అకౌంట్స్ సంచాలకుడు కేఎస్సార్సీ మూర్తి, ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కర్నాటి విజయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, కోశాధికారి ఏకే శుభాచార్యులు, సహ అధ్యక్షుడు పీ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు కే యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# మాజీమంత్రి గాలి ముద్దుకృష్ణమ మృతి

**నేడు ఏపీలోని వెంకట్రామాపురంలో అంత్యక్రియలు**



బుధవారం కేర్ దవాఖానలో గాలి ముద్దు కృష్ణమనాయుడు భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, ఎంపీ గుత్తా తదితరులు

**హైదరాబాద్/ శేరిలింగంపల్లి, నమస్తే తెలంగాణ:** టీడీపీ సీనియర్ నేత, ఏపీ ఎమ్మెల్సీ, మాజీమంత్రి గాలి ముద్దుకృష్ణమనాయుడు మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. ఆయన వయస్సు 71 సంవత్సరాలు. భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. జ్వరంతో బాధపడుతున్న ముద్దుకృష్ణమ సోమవారం గచ్చిబౌలిలోని కేర్ దవాఖానలో చేరారు. ఆరోగ్యం విషమించి మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. గురువారం ఆయన స్వగ్రామం వెంకట్రామాపురంలో అధికారలాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు ఏపీ ప్రభుత్వం ప్రకటించింది. 1947 జూన్9న చిత్తూరు జిల్లా రామచంద్రాపురం మండలం వెంకట్రామాపురంలో ముద్దుకృష్ణమనాయుడు జన్మించారు. ఎన్టీఆర్ పిలుపుతో 1983లో రాజకీయాల్లోకి వచ్చారు. ఐదుసార్లు టీడీపీ నుంచి ఒకసారి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో మంత్రిగా పనిచేశారు.

**గవర్నర్ సహా పలువురి సంతాపం**

ముద్దు కృష్ణమ మృతిపట్ల గవర్నర్ నరసింహన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన సేవలు మరువలేనివనిపేర్కొంటూ కుటుంబసభ్యులకు సంతాపం ప్రకటించారు. వెంకట్రామాపురంలో ముద్దుకృష్ణమ భౌతికకాయానికి ఏపీ సీఎం చంద్రబాబు నివాళి అర్పించారు. ఆయన మృతి వ్యక్తిగతంగా తనకు, పార్టీకి తీరని లోటుఅని చెప్పారు. తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ గుత్తా సుఖేందర్‌రెడ్డి కేర్ దవాఖానలో ముద్దుకృష్ణమ మృతదేహానికి నివాళి అర్పించారు. తెలంగాణ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి, మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, జోగురామన్న, డాక్టర్ సీ లక్ష్మారెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజేశంగౌడ్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

# పదేండ్లలో ఎన్ని ఉద్యోగాలిచ్చారు?

- కాంగ్రెస్ నిరుద్యోగయాత్రపై ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ధ్వజం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రం ఏర్పడడానికి ముందు పదేండ్లపాటు అధికారంలోఉన్న కాంగ్రెస్ పార్టీ ఎంతమందికి ఉద్యోగాలిచ్చింది? ఎక్కువ కాలం అధికారంలో ఉన్న ఆ పార్టీ నాయకులు రాష్ట్రాన్ని దోచుకుతిన్నారు తప్ప ఏనాడైనా నిరుద్యోగులను పట్టించుకున్నారా? అని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ ప్రశ్నించారు. 2004 నుంచి పదేండ్లపాటు అధికారంలో ఉన్న కాంగ్రెస్ 24 వేలకు పైగా ఉద్యోగ నియామకాలు మాత్రమే చేపట్టిందని, అందులోనూ సింహభాగం సీమాంధ్రులకే కట్టబెట్టిందని ఆరోపించారు. తెలంగాణ నిరుద్యోగులకు కాంగ్రెస్ ప్రభుత్వం మొండిచేయి చూపుతుంటే నాడు ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు నోరుమెదుపలేదని ప్రశ్నించారు. బుధవారం టీఆర్‌ఎల్పీ కార్యాలయంలో ప్రభాకర్ మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నిరుద్యోగయాత్రపై మండిపడ్డారు. కాంగ్రెస్ నేతలు ఇప్పుడు ఉద్యోగ నియామకాల గురించి మాట్లాడటం 'వంద ఎలుకలను తిన్న పిల్లి కాశీకి పోయినట్టు' ఉన్నదని ఎద్దేవా చేశారు. రాష్ట్రం ఆవిర్భవించాక అధికారంలోకి వచ్చిన టీఆర్‌ఎస్ మూడున్నరేండ్ల కాలంలోనే 81,739 ఉద్యోగ నియామకాల ప్రక్రియ చేపట్టిందన్నారు. వీటికి పాలనాపరంగా, ఆర్థికశాఖ పరంగా అన్ని అనుమతులు ఉన్నాయని చెప్పారు. ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల కాగానే తప్పుడు కేసులు వేయిస్తున్న చరిత్ర కాంగ్రెస్ నాయకులదని పేర్కొన్నారు.

## టెర్రరిస్టు కస్టడీ కోరిన సీఐడీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** దిల్‌సుఖ్‌నగర్ సాయిబాబా ఆలయం వద్ద 2002 నవంబర్‌లో జరిగిన బాంబుపేలుళ్ల కేసులో సోమవారం అరెస్టయి, జైలులో ఉన్న ఉగ్రవాది మహమ్మద్ షఫీక్ ముజావర్‌ను విచారించేందుకు కస్టడీకి ఇవ్వాలని కోరుతూ సీఐడీ అధికారులు బుధవారం కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. రాష్ట్ర సీఐడీ పోలీసులు సోమవారం ఢిల్లీలో అతడిని అదుపులోకి తీసుకొని హైదరాబాద్‌కు తరలించిన సంగతి తెలిసిందే.



బుధవారం సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి

# సమన్వయంతో ఫలితాలు సాధించండి

- అధికారులకు సీఎస్ ఆదేశం


**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల చెంతకు చేర్చడానికి అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు మరింత సమన్వయం, సహకారంతో పనిచేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి సూచించారు. వివిధ శాఖల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు, పథకాలు సత్ఫలితాలివ్వాలన్నా, అసలైన లబ్ధిదారులకు మేలు చేకూరాలన్నా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరముందని తెలిపారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, ఆర్థికశాఖ, అటవీ, సాధారణ పరిపాలన, పరిశ్రమలు, ఐటీ, నీటిపారుదలశాఖల ఉన్నతాధికారులతో చీఫ్ సెక్రటరీ బుధవారం సచివాలయంలో సమీక్ష జరిపారు. ప్రభుత్వం ఉన్నతాశయాలతో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను, ప్రాజెక్టులను చేపడుతున్నదని వాటి లక్ష్యం నెరవేరేందుకు అందరూ కలిసి కృషిచేయాలని ఆయన సూచించారు. వ్యవసాయం, పంటలు, పాల ఉత్పత్తి, చేపల పెంపకం, ఎరువులు, విత్తనాల పంపిణీ, మార్కెటింగ్ సౌకర్యాలు, పశుగ్రాసం వంటి అంశాలపై చర్చించిన సీఎస్.. సూక్ష్మ, బిందు సేద్యాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో పంటల దిగుబడి పెరుగుతున్నందున వాటి నిల్వకు సరిపడే విధంగా గోదాముల సామర్థ్యాన్ని పెంచాలని ఆదేశించారు. సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ, ముఖ్య కార్యదర్శులు అధర్ సిన్హా, రామకృష్ణారావు, సోమేశ్‌కుమార్, రజత్‌కుమార్, రాజీవ్‌త్రివేదీ, వికాస్‌రాజ్, జయేశ్‌రంజన్, శాలినీమిశ్రా, కార్యదర్శులు సందీప్‌కుమార్ సుల్తానియా, శివశంకర్, పార్థసారథి, నదీం అహమ్మద్, ఆర్వీ చంద్రవదన్, శ్రీలక్ష్మి, అటవీశాఖ పీసీసీఎఫ్ పీకే ఝా, పౌరసరఫరాలశాఖ కమిషనర్ సీవీ ఆనంద్, పోలీస్ ఉన్నతాధికారులు అంజనీకుమార్, తేజ్‌దీప్‌కౌర్ మీనన్, ప్రోటోకాల్ డైరెక్టర్ అర్విందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్‌కు బిల్డర్స్ అసోసియేషన్ అభినందన



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన ఎస్కే జోషికి బుధవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ చాప్టర్ స్టేట్ చైర్మన్ బీ సుగుణాకర్‌రావు, మాజీ అధ్యక్షుడు శీనయ్య, వైస్ ప్రెసిడెంట్ ఎస్ఎన్‌రెడ్డి తదితరులు.


## నాలుగో తరగతి ఉద్యోగులను తీసుకొస్తాం



**బేగంబజార్:** ఏపీకి కేటాయించిన 650 మంది నాలుగో తరగతి ఉద్యోగులను స్వరాష్ట్రానికి తీసుకురావడానికి కృషి చేస్తున్నట్టు సీఎస్ ఎస్కే జోషి పేర్కొన్నారు. బుధవారం నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండూరు గంగాధర్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు సీఎస్‌ను సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందించారు. ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి డీ రాముడు పాల్గొన్నారు.

# ఈ-నామ్‌కు పంజాబ్ బృందం ఫిదా

- సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ సందర్శన
- మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి పార్థసారథితో భేటీ



బుధవారం సచివాలయంలో పంజాబ్ అధికారులను సత్కరిస్తున్న మార్కెటింగ్‌శాఖ కార్యదర్శి పార్థసారథి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీల్లో అమలవుతున్న ఈ-నామ్ విధానానికి పంజాబ్ వ్యవసాయ మార్కెటింగ్ బోర్డు అధికారుల బృందం ఫిదా అయింది. ఆ బోర్డు చైర్మన్ లాల్‌సింగ్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల బృందం బుధవారం సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీని సందర్శించింది. రైతుల కోసం గేటు వద్దే కాకుండా యార్డు మధ్యలోని షెడ్డుల్లో కూడా ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన గేటు ఎంట్రీ కౌంటర్‌ను చూసి పంజాబ్ బృందం సభ్యులు ఆనందం, ఆశ్చర్యం వ్యక్తంచేశారు. మార్కెట్ యార్డుల్లో రైతులు, వ్యాపారస్తులు, కమీషన్ ఏజెంట్లతో మాట్లాడారు. వారి ద్వారా ఈ-నామ్ ఉపయోగాల గురించి తెలుసుకున్నారు. గతంలో ఉన్న విధానం కంటే ప్రస్తుత ఈ-నామ్‌తో సమయం ఆదా అవడమే కాకుండా పారదర్శకత ఉన్నదని రైతులు వివరించారు. సాయంత్రం హైదరాబాద్ చేరుకున్న పంజాబ్ బృందం సచివాలయంలో వ్యవసాయ, మార్కెటింగ్ కార్యదర్శి పార్థసారథితో సమావేశమైంది. మార్కెటింగ్‌శాఖలో అభివృద్ధి కార్యక్రమాల గురించి రాష్ట్ర అధికారులు వారికి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం రైతుల కోసం తీసుకుంటున్న చర్యలు చాలా ఉపయోగకరంగా ఉన్నాయని, వీటిని పంజాబ్‌లో అమలుచేస్తామని బృందం సభ్యులు తెలిపారు. పర్యటనలో పంజాబ్ రాష్ట్ర వ్యసాయ మార్కెటింగ్ బోర్డు కార్యదర్శి అమిత్‌దాఖా, సంయుక్త సంచాలకుడు దల్విందర్‌జిత్ సింగ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ కుల్‌దీప్‌సింగ్ బ్రార్, జిల్లా మండీ అధికారి మంజిత్‌సింగ్ సంధూ ఉన్నారు.

**దీర్ఘకాలిక రుణాలకు ప్రాధాన్యమివ్వాలి**

రైతులకు పంట రుణాలతోపాటు దీర్ఘకాలిక రుణాలు ఇచ్చేందుకు బ్యాంకర్లు ప్రాధాన్యం ఇవ్వాలని వ్యవసాయశాఖ కార్యదర్శి సీ పార్థసారథి సూచించారు. దీర్ఘకాలిక రుణాల వల్ల ఆస్తుల సృష్టి సాధ్యమవుతుందని, పెట్టుబడి రుణాలకు రైతుల్లో డిమాండ్ ఉన్నదని చెప్పారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమావేశం ఎస్ఎల్‌బీసీ రాష్ట్ర కన్వీనర్ ఎస్ మణికందన్ అధ్యక్షతన బుధవారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ దీర్ఘకాలిక రుణాల విషయంలో బ్యాంకుల లక్ష్య సాధన చాలా తక్కువగా ఉన్నదని.. లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు.



**OFFICE OF THE RECOVERY OFFICER
DEBTS RECOVERY TRIBUNAL-2
1st FLOOR, TRIVENI COMPLEX, ABIDS,
HYDERABAD- 500 001
R.P. No.1427/2017**
(OA No.185/2011 IN OLD O.A. No.828/2015)

**Canara Bank, RP Road Branch .......Certificate Holder**
**Versus**
**M/s. Apsara Constructions ...........Certificate Debtors**

**NOTICE OF DEMAND TO DEFENDANTS / CERTIFICATE DEBTORS**

**1. Mr. Survi Venkatesh Goud**, S/o Sr.S Mallaiah H No.11-14-250, New Alkapuri Colony, Road No.3 Ramakrishnapuram, Saroornagar, Hyderabad ..............Defendant No.3

Take notice that R.P.No1427/17 in OA No.185/2011 (Old O.A. No.828/ 2015) has been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal-2, Hyderabad for recovery of an amount of Rs.3,30,73,347/- (Rupees three crores thirty lakhs seventy three thousand three hundred forty seven only) plus interest and costs from you. You, the Defendants are hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of "Debts Recovery Tribunal-2, Hyderabad" within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.

Date 06.02.2018
Place Hyderabad

( P.C. THOMAS )
Recovery Officer-1
Debts Recovery Tribunal-2 Hyderabad

## ఆరంభ లాభాలు ఆవిరి

- +470 నుంచి -113 వరకు
- బుధవారం స్టాక్ మార్కెట్ల తీరు

**ముంబై, ఫిబ్రవరి 7:** స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో రోజు నష్టాలతో ముగిశాయి. మార్కెట్ ప్రారంభంలో భారీగా పుంజుకున్న సూచీలకు రిజర్వు బ్యాంక్ ద్రవ్య పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచడం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను వృద్ధిరేటు అంచనాను తగ్గించడం ఏ మాత్రం రుచించలేదు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో ప్రారంభంలో సూచీలు 470 పాయింట్లకుపైగా లాభపడ్డాయి. అయితే ఆర్బీఐ సమీక్ష క్రమంలో మదుపరులు లాభాల ఆర్జనకు మొగ్గుచూపారు. ఫలితంగా అప్పటి వరకు మిశ్రమంగా కదలాడిన సూచీలు ఒక్కసారిగా దిగువముఖం పట్టాయి. ఒక దశలో 34,450 స్థాయిని తాకిన సూచీలు.. చివరకు 113.23 పాయింట్ల నష్టంతో 34,082.71 వద్ద ముగిసింది. గడిచిన ఏడు రోజుల్లో సూచీ 2,200 పాయింట్లు కోల్పోయినట్లు అయింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 21.55 కోల్పోయి 10,476.70 వద్దకు జారుకున్నది. రంగాల వారీగా చూస్తే టెలికం, టెక్, ఐటీ, క్యాపిటల్ గూడ్స్ 1.12 శాతం వరకు పతనం చెందాయి. ఇదే సమయంలో చమురు అండ్ గ్యాస్, రియల్టీ, పీఎస్‌యూ, మౌలిక, ఆరోగ్య, కన్జ్యూమర్ డ్యూరబుల్, ఇంధనం, ఎఫ్ఎంసీజీ, మెటల్ రంగాలకు చెందిన షేర్లను కొనుగోలు చేయడానికి మదుపరులు ఆసక్తి చూపారు. భారతీ ఎయిర్‌టెల్ 2.03 శాతం పతనం చెందగా, విప్రో, ఎల్ అండ్ టీ, టీసీఎస్, హెచ్‌యూఎల్‌లు ఒక శాతంకు పైగా తమ మార్కెట్ వాటాను కోల్పోయాయి. కానీ, కోల్ ఇండియా 2.48 శాతం ఎగబాకి టాప్ గెయినర్‌గా నిలిచింది. ఓఎన్‌జీసీ, డాక్టర్ రెడ్డీస్, పవర్‌గ్రిడ్, అదానీపోర్ట్స్, ఐటీసీ, రిలయన్స్, ఇన్ఫోసిస్‌లు స్వల్పంగా పెరిగాయి.



## ఆకట్టుకోని అరబిందో ఫార్మా

**హైదరాబాద్, ఫిబ్రవరి 7:** రాష్ర్టానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ అరబిందో ఫార్మా నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను రూ.595 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. 2016-17 ఏడాది ఇదే కాలంలో నమోదైన రూ.578.6 కోట్ల లాభంతో పోలిస్తే మాత్రం రెండు శాతం పెరిగింది. సమీక్షకాలంలో కంపెనీ నిర్వహణ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 11 శాతం ఎగబాకి రూ.4,336 కోట్లకు చేరుకుంది. కీలక మార్కెట్లు ఆశాజనక పనితీరు కనబరుచడం వల్లనే ఈ మాత్రమైన వృద్ధిని నమోదు చేసుకున్నట్లు, అమెరికాలో పన్నుల చార్జీలు పెంచడంతో లాభాలపై ప్రభావం చూపాయని కంపెనీ ఎండీ గోవిందరాజన్ చెప్పారు. గడిచిన త్రైమాసికంలో ఫార్ములేషన్ విక్రయాలు 14.1 శాతం పెరిగి రూ.3,570.2 కోట్లకు చేరుకున్నాయి. కంపెనీకి వచ్చిన మొత్తం ఆదాయంలో వీటి వాటా 82 శాతంగా ఉన్నది. మిగతా 18 శాతం వాటా ఏపీఐ వ్యాపారానికి సంబంధించినవన్నారు.

# పటేల్.. మూడోసారీ

**కీలక వడ్డీరేట్ల ఊసేలేని ఆర్బీఐ ద్రవ్యసమీక్ష • ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటుపై ఆందోళనలే కారణం**

**ఈసారి వృద్ధిరేటు 6.6 శాతమేనని అంచనా • ఎంసీఎల్‌ఆర్‌తో బేస్ రేటు అనుసంధానం**

**గృహ రుణాలు తీసుకున్నవారికి ప్రయోజనం**

**ముంబై, ఫిబ్రవరి 7:** వడ్డీరేట్ల ఊసు లేకుండానే మరోసారి రిజర్వ్ బ్యాంకు ద్రవ్యసమీక్ష ముగిసింది. అంచనాలకు తగ్గట్టుగానే ఆర్బీఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ వరుసగా మూడోసారి రెపో, రివర్స్ రెపో రేట్ల జోలికి వెళ్లకుండానే పాలసీని ప్రకటించారు. ఈ ఆర్థిక సంవత్సరం (2017-18) చివరి ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షనూ ద్రవ్యోల్బణం, ద్రవ్యలోటు భయాలు వెంటాడగా, మంగళ, బుధవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ పాలసీ మీటింగ్.. వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు నిరాశే మిగిల్చింది. పటేల్ నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్యవిధాన కమిటీ (ఎంపీసీ)లో కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఉంచడానికి పటేల్‌తోపాటు మరో నలుగురు మద్దతు పలుకగా, ఒక్కరు మాత్రం పావు శాతం పెంచడానికి ఓటేశారు. దీంతో ఈసారీ వడ్డీరేట్ల కోతల్లేకుండాపోయాయి. కాగా, సమీక్ష అనంతరం ఇక్కడి ఆర్బీఐ ప్రధాన కార్యాలయంలో ఉర్జిత్ పటేల్ విలేఖరులతో మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్‌లోని ముడి చమురు ధరల ప్రభావంతో జనవరిలో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు బాగా పెరిగాయన్నారు. డిసెంబర్‌లో ద్రవ్యోల్బణం 17 నెలల గరిష్ఠాన్ని తాకుతూ 5.21 శాతంగా నమోదైన నేపథ్యంలో ముున్ముందు మరింతగా పెరుగవచ్చన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2018-19)గాను ఈ నెల 1న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన బడ్జెట్.. ద్రవ్యలోటు లక్ష్యాన్ని పెంచడమే ఇందుకు కారణమన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం జీడీపీలో ద్రవ్యలోటును 3.2 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని బడ్జెట్‌లో 3.5 శాతానికి మోదీ సర్కారు సవరించింది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కోసం, ఆరోగ్య సంరక్షణ కోసం మరింతగా ఖర్చు చేయాలన్న నిర్ణయానికి కేంద్రం వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బడ్జెట్‌లో ఆయా అవసరాలకు కేటాయింపులు పెరుగగా, ఇది ద్రవ్యలోటును, ద్రవ్యోల్బణాన్ని పెంచవచ్చన్నారు. అయితే గ్రామీణ, మౌలిక రంగాలకు బడ్జెట్‌లో పెద్దపీట వేయడాన్ని స్వాగతిస్తున్నట్లు పటేల్ ప్రకటించారు. ఇక బ్యాంకింగ్ రంగాన్ని ప్రమాదంలో పడేసిన నిరర్థక ఆస్తుల పరిష్కార ప్రక్రియను వేగవంతం చేయాలని బ్యాంకర్లను ఈ సందర్భంగా కోరిన ఆర్బీఐ.. ప్రభుత్వ మూలధన సాయం తో రుణాల మంజూరు పెరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేసింది. వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) స్థిరీకరణ అవుతున్నదని, నిస్తేజంలో ఉన్న పెట్టుబడులు త్వరలోనే పుంజుకోగలవని, మందగమనంలో ఉన్న అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు కొలిక్కివస్తే భారతీయ ఎగుమతుల్లో వృద్ధి పరుగులు పెట్టవచ్చన్నది.



**ద్రవ్యసమీక్ష ముఖ్యాంశాలు**

- 6 శాతం వద్దే రెపో రేటు
- 5.75 శాతంగానే రివర్స్ రెపో
- ఎంఎస్ఎఫ్, బ్యాంక్ రేటు 6.25 శాతం
- జనవరి-మార్చిలో రిటైల్ ద్రవ్యోల్బణం 5.1 శాతంగా అంచనా
- 2018-19 ప్రథమార్ధంలో 5.1-5.6 శాతం మధ్య ఉండొచ్చు
- ద్వితీయార్ధంలో 4.5-4.6 శాతానికి తగ్గొచ్చు
- ఏప్రిల్ 4-5 తేదీల్లో తదుపరి ద్రవ్యసమీక్ష

**6.7 కాదు.. 6.6 శాతమే**

జీడీపీ అంచనాను ఆర్బీఐ తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్థూల విలువ ఆధారిత (జీవీఏ) వృద్ధిరేటు 6.6 శాతంగానే నమోదు కావచ్చని ఉర్జిత్ పటేల్ అంచనా వేశారు. డిసెంబర్‌లో జరిగిన గత ద్రవ్యసమీక్షలో 6.7 శాతంగా అంచనా వేయడం గమనార్హం. కాగా, వచ్చే ఆర్థిక సంవత్సరంలో 7.2 శాతంగా నమోదు కావచ్చన్నారు. జీఎస్టీ స్థిరీకరణ జరుగవచ్చని, రుణాల మంజూరు పెరుగవచ్చని అభిప్రాయపడ్డ పటేల్.. జీడీపీ పుంజుకోగలదన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

**ఎంసీఎల్‌ఆర్‌తో బేస్ రేటు లింకు**

ఏప్రిల్ 1 నుంచి మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధారిత రుణ రేట్ల (ఎంసీఎల్‌ఆర్) విధానంతో బేస్ రేటును అనుసంధానం చేయనున్నట్లు ఆర్బీఐ ప్రకటించింది. 2016 ఏప్రిల్ 1న ఎంసీఎల్‌ఆర్‌ను ఆర్బీఐ పరిచయం చేయగా, అంతకుముందు వరకు గృహ రుణాలపై వడ్డీరేట్లు కేవలం స్థిరమైన బేస్ రేటు ఆధారంగానే ఉండేవి. తాజా నిర్ణయంతో 2016 ఏప్రిల్ 1 కంటే ముందు బేస్ రేటు ఆధారంగా గృహ రుణాలు తీసుకున్నవారికి ప్రయోజనం కలుగనున్నది. వారందరికీ తక్కువ ఎంసీఎల్‌ఆర్ లాభం ఉంటుందన్న ఆర్బీఐ.. దీనివల్ల గృహ రుణ భారం తగ్గుతుందని పేర్కొంది. రుణ గ్రహీతలకు పాలసీ రేట్ల మార్పుల ప్రయోజనం త్వరగా చేకూరాలనే లక్ష్యంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆర్బీఐ తెలిపింది.

**పెట్టుబడులు, పొదుపుపై పన్నుల ప్రభావం**

స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన దీర్ఘకాలిక మూలధన లాభాల (ఎల్‌టీసీజీ) పన్ను వివాదాస్పదం అవుతున్న నేపథ్యంలో మూలధనంపై పన్నులు.. పెట్టుబడులు, పొదుపును ప్రభావితం చేస్తాయని ఉర్జిత్ పటేల్ అభిప్రాయపడటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఎల్‌టీసీజీతో మూలధనంపై మొత్తం ఐదు రకాల పన్నులున్నట్లు పటేల్ వివరించారు. ఇప్పటికే కంపెనీలపై కార్పొరేట్ పన్ను, రూ.10 లక్షలు మించిన డివిడెండ్ ఆదాయంపై డివిడెండ్ పంపిణీ పన్ను, సెక్యూరిటీల లావాదేవీ పన్ను, స్టాక్ మార్కెట్‌లో కొనుగోలు చేసిన షేర్లను తిరిగి ఏడాదిలోపే అమ్మితే విధించే మూలధన లాభాల పన్నులు ఉన్నాయని గుర్తుచేశారు.

**ఎవరేమన్నారు**

- ముడి చమురు ధరల్లో అనిశ్చితి, ద్రవ్యోల్బణం పెరుగుదల భయాల మధ్యే వడ్డీరేట్ల జోలికి ఆర్బీఐ వెళ్లలేకపోయింది. కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) పెంపు రిటైల్ ద్రవ్యోల్బణంపై ప్రతికూల ప్రభావం చూపవచ్చు
  – సందీప్ జజోడియా, అసోచామ్ అధ్యక్షుడు
- గడిచిన ఆర్థిక సంవత్సరంలో రెపో రేటును ఆర్బీఐ ఒక్కసారే తగ్గించింది. అదికూడా కేవలం పావు శాతమే. ఈసారి తగ్గిస్తే బాగుండేది. దానివల్ల పెట్టుబడులకు కలిసొచ్చేది
  – రాశేష్ షా, ఫిక్కీ అధ్యక్షుడు
- కీలక వడ్డీరేట్లను యథాతథంగానే ఆర్బీఐ ఉంచుతుందని ఊహించిందే. వచ్చే ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతుందన్న అంచనా మాత్రం బాండ్ మార్కెట్‌కు లాభదాయకం
  – రజ్నీశ్ కుమార్, ఎస్బీఐ చైర్మన్
- పెట్టుబడులు, ఎగుమతులు, రుణాలకు సంబంధించి ఆర్బీఐ సానుకూల దృక్పథం దేశ ఆర్థిక వ్యవస్థ వృద్ధిపట్ల ఆశావాహ తీరుకు దోహదపడుతుంది
  – చందా కొచ్చర్, ఐసీఐసీఐ బ్యాంక్ సీఈవో

**ఎంఎస్ఎంఈ రంగానికి చేయూత**

తాజా ద్రవ్యసమీక్షలో సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థల (ఎంఎస్ఎంఈ) రంగానికి ఆర్బీఐ చేయూతనిచ్చింది. నిధుల కొరతతో బాధపడే ఈ రంగం.. బ్యాంకుల రుణాలపైనే ఆధారపడి మనగలుగుతున్నదన్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే బ్యాంకులకు బకాయిలను చెల్లించేందుకు అదనంగా 180 రోజుల వరకు సమయాన్ని ఎంఎస్ఎంఈలకు ఆర్బీఐ ఇచ్చింది. జీఎస్టీ, పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయాలతో ఎంఎస్ఎంఈ రంగం ప్రభావితమైన నేపథ్యంలో బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించడానికి ఉన్న గడువును ఆర్బీఐ పెంచింది. బడ్జెట్‌లో ఎంఎస్ఎంఈలకు కార్పొరేట్ పన్ను 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిన సంగతి విదితమే.

## స్పైస్‌జెట్ లాభం 240 కోట్లు




**ముంబై, ఫిబ్రవరి 7:** చౌక విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించింది. డిసెంబర్ 31తో ముగిసిన మూడు నెలల కాలానికిగాను సంస్థ రూ.240 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. అంతక్రితం ఏడాది ఇదే సమయంలో నమోదైన రూ.181.14 కోట్ల లాభంతో పోలిస్తే 32 శాతం ఎగబాకినట్లు కంపెనీ బీఎస్ఈకి సమాచారం అందించింది. ఒక త్రైమాసికంలో ఇంతటి స్థాయిలో లాభాలను ఆర్జించడం కంపెనీ చరిత్రలో ఇదే తొలిసారి. అక్టోబర్-డిసెంబర్ మధ్య కాలంలో ఆదాయం ఏడాది ప్రాతిపదికన 27 శాతం ఎగబాకి రూ.2,081.95 కోట్లకు చేరుకున్నది. వరుసగా 12 త్రైమాసికాలుగా లాభాలను ఆర్జించడం విశేషమని, నూతన రూట్లలో సేవలను అందించడంతో ప్రయాణికుల సంఖ్య పెరుగడం ఇందుకు కలిసొచ్చిందని స్పైస్‌జెట్ సీఎండీ అజయ్ సింగ్ తెలిపారు. గడిచిన త్రైమాసికంలో 17 శాతం ఇంధన ధరలు పెరిగినప్పటికీ ప్రయాణికుల ద్వారా ఆదాయం అధికంగా సమకూరినట్లు ఆయన పేర్కొన్నారు.

## చౌక గృహ కొనుగోలుదారులపై జీఎస్టీని వేయవద్దు

- బిల్డర్లకు కేంద్రప్రభుత్వం సూచన

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** చౌక గృహ కొనుగోలుదారుల నుంచి జీఎస్టీ వసూలు చేయవద్దని బిల్డర్లకు ప్రభుత్వం సూచించింది. దాదాపు అన్ని చౌక గృహ ప్రాజెక్టులపై ప్రభావిత జీఎస్టీ రేటు 8 శాతంగానే ఉన్నందున దీన్ని హోం బయ్యర్ల నుంచి ఏ రకంగాను తీసుకోవద్దని బుధవారం బిల్డర్లను కేంద్రం కోరింది. గత నెల జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో క్రెడిట్ లింక్డ్ సబ్సిడీ స్కీం కింద నిర్మాణమయ్యే గృహాల కోసం జీఎస్టీలో 12 శాతం రాయితీ రేటును పొడిగించారు.

**బలవంతపు చర్యలొద్దు**

మరోవైపు స్టార్టప్‌ల నుంచి పన్నుల బకాయిలను రాబట్టేందుకు బలవంతపు చర్యలను చేపట్టవద్దని ఆదాయం పన్ను (ఐటీ) శాఖకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) సూచించింది. దేశంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ఇది అవసరమని సీబీడీటీ అభిప్రాయపడింది.

## 60 చమురు, గ్యాస్ క్షేత్రాల వేలం

- కేంద్ర మంత్రివర్గం ఆమోదం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** అరవై చమురు, సహజవాయువు క్షేత్రాల వేలానికి కేంద్ర క్యాబినెట్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో బుధవారం ఇక్కడ జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. వాటిలో డిస్కవర్డ్ స్మాల్ ఫీల్డ్ (డీఎస్ఎఫ్) రౌండ్ రెండో వేలంలో భాగంగా ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌లకు చెందిన 60 ఆయిల్, గ్యాస్ ఫీల్డ్స్ వేలానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అలాగే సూక్ష్మ, చిన్న, మధ్యతరహా (ఎంఎస్ఎంఈ) సంస్థల వర్గీకరణ కోసం ప్రామాణికత మార్పునకూ అంగీకరించింది. ఉజ్వల యోజన కింద లబ్ధిదారుల సంఖ్యను పెంచేందుకూ సుముఖత వ్యక్తం చేసిన క్యాబినెట్.. రూ.4,800 కోట్ల అదనపు నిధులతో అర్హుల సామర్థ్యాన్ని ఐదు కోట్ల నుంచి 8 కోట్లకు పెంచింది. క్వింటాల్ కొబ్బరి కనీస మద్దతు ధరను వెయ్యి పెంచగా, ఉపాధి, పని విలువలు పెరిగే వాతావరణం ఏర్పరుచడానికి అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) చేసిన సిఫార్సులను అమలు చేసేందుకూ ముందుకొచ్చింది. దివాలా చట్టం సవరణలకు సంబంధించి, మేజర్ పోర్టుల అథారిటీల బిల్లులో మార్పునకు అంగీకరించింది. ఇక నైపుణ్య అభివృద్ధిపై భారత్-బ్రిటన్ ఒప్పందానికీ క్యాబినెట్ సుముఖత వ్యక్తం చేసింది. భారత్-చైనా పన్ను సంధి సవరణకు ప్రోటోకాల్‌కూ క్యాబినెట్ పచ్చజెండా ఊపింది.


# ఆటో షో అదుర్స్

రెండేండ్లకొకసారి జరిగే వాహన పండుగ అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. గ్రేటర్ నోయిడా వేదికగా జరుగుతున్న ఈ ఆటో ఎక్స్‌పోలో దేశీయ, అంతర్జాతీయ సంస్థలు తమ నూతన వాహనాలను ప్రదర్శించడంలో పోటీపడ్డాయి. ఈసారి జరుగుతున్న ఈ షోలో ఎలక్ట్రిక్, హైబ్రిడ్, ఎకో వాహనాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మారుతి సుజుకీతోపాటు టాటా మోటార్స్, హ్యుందాయ్, మహీంద్రా, కియా మోటార్స్, మెర్సిడెజ్ బెంజ్, బీఎండబ్ల్యూలు తమ భవిష్యత్తు వాహనాలను ఇక్కడ ప్రదర్శించాయి. 65 నూతన వాహనాలను ప్రదర్శించగా, వీటిలో 14 కొత్త వాహనాలు ఉన్నాయి.




### హ్యుందాయి.. సరికొత్త ఎలైట్ ఐ20

కార్ల తయారీలో రెండో అతిపెద్ద సంస్థ హ్యుందాయి..ప్రీమియం కాంప్యాక్ట్ హ్యాచ్ బ్యాక్ ఎలైట్ ఐ20లో సరికొత్త వెర్షన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. పెట్రోల్, డీజిల్ విభాగాల్లో లభించనున్న ఈ కారు ధరను రూ.5.34 లక్షల నుంచి రూ.9.15 లక్షల మధ్యలో నిర్ణయించింది. భద్రత ప్రమాణాలను మెరుగు పరుచడానికి ఈ కారులో రెండు ఎయిర్‌బ్యాగ్‌లను ఏర్పాటు చేసింది.




### హీరో .. 200 సీసీ బైకు

ప్రముఖ ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ తొలిసారిగా 200 సీసీ సామర్థ్యం కలిగిన అడ్వెంచర్ మోటార్‌సైకిల్‌ను ఈ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. వీటిలో ఎక్స్‌పల్స్, రెండు 125 సీసీ స్కూటర్లు కూడా ఉన్నాయి. ప్రీమియం సెగ్మెంట్‌లో వాటాను పెంచుకోవాలనే ఉద్దేశంతో వీటిని విడుదల చేసినట్లు కంపెనీ సీఎండీ పవన్ ముంజల్ వెల్లడించారు.



### బీఎండబ్ల్యూ 6 సిరీస్ గ్రాన్ టురిస్మో

జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ బీఎండబ్ల్యూకి చెందిన 6 సిరీస్ గ్రాన్ టురిస్మో స్పోర్ట్స్ కారును ప్రముఖ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ ఆవిష్కరించారు. ఈ కారు ధర రూ.58.90 లక్షలుగా నిర్ణయించింది. ప్రస్తుతానికి పెట్రోల్ వెర్షన్ లభించనుండగా, ఈ ఏడాది చివరి నాటికి డీజిల్ వెర్షన్‌ను విడుదల చేయబోతున్నది.

### టాటా నుంచి ఆరు ఎలక్ట్రిక్ వాహనాలు

దేశీయ ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ ..రెండు కాన్సెప్ట్ కార్లతోపాటు ఆరు ఎలక్ట్రిక్ వాహనాలను ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. ఎలక్ట్రిక్ వాహనాలపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలకు అనుగుణంగా ఆరు ఈవీలను ప్రదర్శించినట్లు టాటా గ్రూపు చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ చెప్పారు. ప్రదర్శించిన వాటిలో ఎలక్ట్రిక్ బస్సు కూడా ఉన్నది.



### బెంజ్.. 2.73 కోట్ల కారు

జర్మనీకి చెందిన లగ్జరీ కార్ల సంస్థ మెర్సిడెజ్ బెంజ్..దేశీయ మార్కెట్లోకి రూ.2.73 కోట్ల గరిష్ఠ ధర కలిగిన 'మేబాచ్ ఎస్650' కారును విడుదల చేసింది. రెండు రకాల్లో లభించనున్న ఈ కారు మేబాచ్ ఎస్650 మోడల్ ధర రూ.1.94 కోట్లుగాను, మరో రకం రూ.2.73 కోట్లుగా నిర్ణయించినట్లు కంపెనీ వర్గాలు వెల్లడించాయి.



### దేశీయ మార్కెట్లోకి కియా మోటార్స్

దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ సంస్థ కియా మోటార్స్ దేశీయ మార్కెట్లోకి ప్రవేశించబోతున్నది. దీంట్లోభాగంగా తొలి కాంప్యాక్ట్ ఎలక్ట్రిక్ వాహనాన్ని ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది. ఈ వాహనాన్ని 2019-21 మధ్యకాలంలో దేశీయ మార్కెట్లోకి ప్రవేశపెట్టబోతున్నట్లు ప్రకటించింది. 100 కోట్ల డాలర్ల పెట్టుబడితో ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటు చేయబోతున్న ప్లాంట్లోనే ఈ వాహనాలను తయారు చేయబోతున్నది.






### మారుతి సుజుకీ కాన్సెప్ట్‌ఫ్యూచర్ ఎస్

కార్ల తయారీలో అగ్రగామి సంస్థయైన మారుతి సుజుకీ తొలిసారిగా కాన్సెప్ట్‌ఫ్యూచర్ ఎస్ మోడల్‌ను ప్రదర్శించింది. భావి తరాలను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన ఈ కాంప్యాక్ట్ కారును దేశీయ మార్కెట్లకు తగ్గట్టుగా రూపొందించినట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ కాన్సెప్ట్ కారుతో పాటు ఎలక్ట్రిక్ వాహనాన్ని సైతం సంస్థ ఈ ఆటో ఎక్స్‌పోలో ప్రదర్శించింది.

# హెల్మెట్ పెట్టుకుంటేనే బైక్ స్టార్ట్



బైక్‌ను నడుపుతున్న రూపకర్త వెంకటసాయి (ఇన్‌సెట్‌లో) హెల్మెట్‌లో అమర్చిన సర్క్యూట్

**జగిత్యాల క్రైం:** మనం బైక్ స్టార్ట్ చేయాలంటే తాళం చెవి ఉంటే సరిపోతుంది. కానీ, జగిత్యాల జిల్లాకు చెందిన ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు హెల్మెట్ పెట్టుకుంటే స్టార్ట్ అయ్యేలా ప్రత్యేక వ్యవస్థను రూపొందించారు. జిల్లా కేంద్రంలోని జవహర్ స్కూల్‌లో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వెంకటసాయి ఇన్ఫ్రారెడ్, రిసీవర్, యాంటెన్నా సహాయంతో రెండు సర్క్యూట్‌లను తయారు చేసి ఒకటి బైక్ ఇంజిన్‌కు, మరొకటి హెల్మెట్‌కు అమర్చారు. హెల్మెట్ ధరించినప్పుడు తల హెల్మెట్‌లోని సర్క్యూట్ తలకు తగిలి ఇన్ఫ్రారెడ్ ద్వారా సిగ్నల్స్ వెలువడుతాయి. ఆ సిగ్నల్స్‌ను ఇంజిన్‌కు అమర్చిన యాంటెన్నా గ్రహించి సర్క్యూట్‌కు పంపుతుంది. అప్పుడు పవర్ బటన్ నొక్కగానే వాహనం స్టార్ట్ అవుతుంది. హెల్మెట్ లేకుండా ప్రయత్నిస్తే బైక్ స్టార్ట్ కాదు. హెల్మెట్ వినియోగంపై బుధవారం పాఠశాలలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బీ అనంతశర్మ పాల్గొని స్వయంగా బైక్ నడిపి వెంకటసాయిని అభినందించారు.

## చలి వణుకు

| జిల్లా | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| మేడ్చల్ | 32.9 | 11.8 |
| కామారెడ్డి | 32.1 | 12.1 |
| సంగారెడ్డి | 35.2 | 12.6 |
| రంగారెడ్డి | 34.6 | 12.8 |
| భద్రాద్రి కొత్తగూడెం | 34.6 | 13.3 |
| వికారాబాద్ | 34.6 | 13.4 |
| సిద్దిపేట | 32.8 | 13.7 |
| మెదక్ | 33.3 | 13.9 |
| మహబూబ్‌నగర్ | 34.6 | 13.9 |
| రాజన్న సిరిసిల్ల | 34.6 | 14.0 |
| నిజామాబాద్ | 35.7 | 14.3 |
| నాగర్‌కర్నూల్ | 32.8 | 14.3 |
| నల్లగొండ | 34.6 | 14.4 |
| కుమ్రంభీం ఆసిఫాబాద్ | 34.6 | 14.5 |
| మహబూబాబాద్ | 34.6 | 14.9 |
| యాదాద్రి భువనగిరి | 32.8 | 15.0 |
| ఖమ్మం | 34.8 | 15.2 |
| కరీంనగర్ | 32.8 | 15.5 |
| జగిత్యాల | 35.1 | 15.6 |
| జనగామ | 35.1 | 15.6 |
| హైదరాబాద్ | 34.6 | 15.6 |
| జయశంకర్ భూపాలపల్లి | 34.6 | 15.6 |
| వరంగల్ రూరల్ | 32.1 | 15.8 |
| మంచిర్యాల | 34.6 | 16.0 |
| సూర్యాపేట | 34.7 | 16.0 |
| పెద్దపల్లి | 33.8 | 16.1 |
| ఆదిలాబాద్ | 34.6 | 16.2 |
| నిర్మల్ | 35.6 | 16.2 |
| వరంగల్ అర్బన్ | 32.2 | 16.3 |
| జోగుళాంబ గద్వాల | 33.3 | 17.1 |
| వనపర్తి | 33.1 | 17.9 |



**మేడారం హుండీ ఆదాయం రూ.4.87కోట్లు**

మేడారం హుండీ లెక్కింపు ఆదాయం రూ.4,87,40,000కు చేరినట్లు డిప్యూటీ కమిషనర్ రమేశ్‌బాబు తెలిపారు. హన్మకొండలోని టీటీడీ కల్యాణ మండపంలో రెండు రోజులుగా లెక్కిస్తున్నారు. బుధవారం 202 హుండీలను లెక్కించారు. - రెడ్డికాలనీ(వరంగల్)





మంచిర్యాలలో భగీరథ ట్రయల్ రన్ ప్రారంభిస్తున్న అధికారులు

## మిషన్ భగీరథ ట్రయల్ రన్ సక్సెస్

- మంచిర్యాల జిల్లాకు మూడు గ్రిడ్ల ద్వారా నీరు

**మంచిర్యాల ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మిషన్ భగీరథ పథకం కింద మంచిర్యాల జిల్లాకు మూడు గ్రిడ్ల నుంచి నీరందించేందుకు బుధవారం చేసిన ట్రయల్‌రన్ విజయవంతమైంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు వద్ద నిర్మించిన ఇంటెక్ వెల్ వద్ద 300 హెచ్‌పీ మోటార్లను కొబ్బరికాయ కొట్టి ఈఈ శ్రీనివాస్ ప్రారంభించారు. 300 హెచ్‌పీ మోటార్లను ఆన్ చేసి వాటి ద్వారా పంపింగ్ చేసుకుంటూ 95 ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కి పంపించారు. దీంతో ట్రయల్‌రన్ విజయవంతం అయినట్లు అధికారులు ప్రకటించారు. మరో 15 రోజుల్లో గ్రామాలకు నీరందిస్తామని అధికారులు వెల్లడించారు.

## బడిపంతులైన మంత్రి జూపల్లి



లెక్కలు బోధిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

**కొల్లాపూర్, వీపనగండ్ల నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కాసేపు బడి పంతులుగా మారారు. తాను చదివిన నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ రాణిఇందిరాదేవి ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం పదోతరగతి విద్యార్థులకు లెక్కలు చెప్పారు. ప్రాక్టికల్స్ రూపంలో అర్థమయ్యేలా బోధించాలని మంత్రి సూచించారు. వనపర్తి జిల్లా వీపనగండ్లలో ప్రెస్‌క్లబ్‌కు భూమిపూజ చేసిన ఆయన, సీఎం కేసీఆర్ ప్రభుత్వానికి మరో 20 ఏండ్ల తిరుగులేదని ధీమా వ్యక్తం చేశారు. పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని నియోజకవర్గాల వారీగా మిషన్‌భగీరథ పురోగతిపై ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి హైదరాబాద్‌లో సమీక్షించారు. వచ్చే వేసవినాటికి అన్ని గ్రామాలకు తాగునీరందించాలని అధికారులను ఆదేశించారు.

## భూరికార్డుల ప్రక్షాళనపై ఏపీ అధికారుల ఆసక్తి



కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో జగ్గయ్యపేట తహసీల్దార్, అధికారులు

**కోదాడ రూరల్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన భూరికార్డుల ప్రక్షాళన తీరు తెన్నులను బుధవారం ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగ్గయ్యపేట తహసీల్దార్ నర్సింహారావు, కార్యాలయ అధికారులు సూర్యాపేట జిల్లా, కోదాడ తహసీల్దార్ కార్యాలయంలో పరిశీలించారు. ప్రక్షాళన వివరాలు అడిగి తెలుసుకున్నారు. పహానీలు, ఎల్‌ఆర్‌యూపీ, ఆన్‌లైన్ రికార్డుల నమోదు ప్రక్రియను, ఏ-3 పహానీ సవరణలు పరిశీలించారు.

## సూర్యాపేట మార్కెట్‌కు పంజాబ్ అధికారులు



సూర్యాపేటలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న పంజాబ్ అధికారులు

**సూర్యాపేట వ్యవసాయం:** జాతీయ వ్యవసాయ విధానంలో భాగంగా ఈ-మార్కెటింగ్‌ను పరిశీలించేందుకు పంజాబ్ అధికారుల బృందం బుధవారం సూర్యాపేట మార్కెట్‌ను సందర్శించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ-నామ్ అమలును పరిశీలించేందుకు పలు రాష్ట్రాలను సందర్శిస్తున్నామన్నారు. ఇక్కడ అమలు చేస్తున్న విధానాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పంజాబ్ అదనపు ముఖ్య కార్యదర్శి విశ్వజిత్ ఖన్నా, వ్యవసాయ మార్కెట్ జాయింట్ డైరెక్టర్ దల్వీందర్‌జిత్ సింగ్, జనరల్ మేనేజర్ కుల్‌దీప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# జోరుగా టీఆర్‌ఎస్‌లో చేరికలు



హైదరాబాద్‌లో శ్రీరాం భద్రయ్యకు కండువా కప్పుతున్న మంత్రి హరీశ్‌రావు, చిత్రంలో మంత్రి చందులాల్

### బీజేపీ, కాంగ్రెస్, ఇతరపార్టీల నుంచి వలసలు

**నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ :** టీఆర్‌ఎస్‌లో భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. బుధవారం బీజేపీ, కాంగ్రెస్, వివిధ పార్టీలతో పాటు ఆయా వర్గాలు గులాబీ కండువాలు కప్పుకున్నాయి. కేసీఆర్ సూచన మేరకు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చందులాల్ ఆధ్వర్యంలో మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే శ్రీరాం భద్రయ్య హైదరాబాద్‌లో టీఆర్‌ఎస్‌లో చేరగా, భారీ నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలం అంబం గ్రామంలో మంత్రి పోచారం సమక్షంలో పలువురు, ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం బెల్గామలో 50 మంది యువకులు మంత్రి జోగు రామన్న సమక్షంలో చేరారు. బీజేపీ దళితమోర్చా నాగర్‌కర్నూరల్ జిల్లా ఉపాధ్యక్షుడు అబ్బుసల్లి వెంకటయ్య, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బాలయ్యతో పాటు పలువురు దళిత నాయకులు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లో, వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట మండలం నాగుర్లపల్లి పరిధి పర్శనాయక్‌తండాలో మంగళవారం రాత్రి కాంగ్రెస్, టీడీపీ నాయకులు సుమారు 250మంది సివిల్ సప్లయ్స్ కార్పొరేషన్ చైర్మన్ పెద్ది సుదర్శన్‌రెడ్డి సమక్షంలో చేరారు. మహబూబాబాద్‌లో టీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావు ఆధ్వర్యంలో 200 మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం మల్లాపురానికి చెందిన కాంగ్రెస్‌తో పాటు వివిధ పార్టీలకు చెందిన సుమారు 50మంది, రాళ్లజనగాంలో మరో 50మంది టీఆర్‌ఎస్‌లో చేరగా, వారికి విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి కండువాలు కప్పారు. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లకు చెందిన కాంగ్రెస్, టీడీపీ నాయకులు 100 మంది టీఆర్‌ఎస్ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొంగిడి మహేందర్‌రెడ్డి సమక్షంలో, నల్లగొండ జిల్లా హాలియాలో పెద్దవూర మండలం పెద్దగూడెం, చిన్నగూడెం, శిరసనగండ్ల తదితర గ్రామాలకు చెందిన 200మంది కార్యకర్తలు పెద్దవూర మండలాధ్యక్షుడు బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నోముల నర్సింహయ్య సమక్షంలో చేరారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం ముదిమాణిక్యం గ్రామానికి చెందిన పలువురు చేరారు.



మహబూబాబాద్ జిల్లా మానుకోటలో టీఆర్‌ఎస్‌లో చేరిన అంగన్‌వాడీ టీచర్లతో రవీందర్‌రావు



యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలో కండువాలు కప్పుతున్న సునీతామహేందర్‌రెడ్డి



నిజామాబాద్ జిల్లా రుద్రూర్ మండలంలో పార్టీలో చేరిన వారితో మంత్రి పోచారం



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలో పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న జోగు రామన్న



వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేటలో కండువాలు కప్పుతున్న పెద్ది సుదర్శన్‌రెడ్డి

# పేదలకు ఉచితంగా కంటి పరీక్షలు

- వైద్యరంగానికి ప్రభుత్వం పెద్దపీట
- రాష్ట్రవ్యాప్తంగా 40 డయాలసిస్ కేంద్రాల ఏర్పాటు: మంత్రి లక్ష్మారెడ్డి
- మెదక్‌లో డయాలసిస్ కేంద్రం ప్రారంభం



మెదక్‌లో డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి టీఎన్జీవో డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి లక్ష్మారెడ్డి. చిత్రంలో బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ దేవిప్రసాద్, టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, కార్యదర్శి రాజేందర్‌రెడ్డి

**మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వం వైద్యరంగానికి పెద్దపీట వేస్తున్నదని వైద్యారోగ్యశాఖ మంత్రి సీ లక్ష్మారెడ్డి తెలిపారు. మెదక్ జిల్లా కేంద్రంలో రూ.17 కోట్లతో నిర్మించనున్న మాతాశిశు సంరక్షణ కేంద్రానికి బుధవారం డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. తర్వాత ఏరియా దవాఖానలో డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. మెదక్ మండలం మాచవరంలో లబ్ధిదారులకు గొర్రెపిల్లలు, గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. మెదక్ కలెక్టర్, ఎస్పీ కార్యాలయాల నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులకు నష్ట పరిహారం కింద రూ.6 కోట్ల చెక్కులను పంపిణీ చేశారు. మెదక్ జిల్లా టీఎన్జీవోల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొని టీఎన్జీవోల రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, బేవరేజెస్ చైర్మన్ దేవీప్రసాద్‌రావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కారం రవీందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డితో కలిసి టీఎన్జీవో డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. అంతకుముందు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మంత్రి లక్ష్మారెడ్డి మీడియాతో మాట్లాడారు. వైద్యారోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పదివేల పోస్టులను టీఎస్‌పీఎస్సీ, డిపార్ట్‌మెంటల్ పరీక్షల ద్వారా భర్తీ చేస్తామన్నారు. ప్రభుత్వ దవాఖానల్లో సిబ్బంది కొరతను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. సీఎం కేసీఆర్ సూచన మేరకు ప్రస్తుతం అందిస్తున్న వైద్యసేవలతో పాటు కంటి చూపునకు సంబంధించిన చికిత్సలు అందించేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నట్టు పేర్కొన్నారు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో ప్రతిఒక్కరికీ కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స చేయించి ఉచితంగా కండ్ల అద్దాలను పంపిణీ చేస్తామన్నారు.

**నెలాఖరులోగా అందుబాటులోకి..**

రాష్ట్రవ్యాప్తంగా 40 డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ నెలాఖరులోగా అన్ని కేంద్రాలు పేదలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. గాంధీ, ఉస్మానియా, నిమ్స్ దవాఖానలకు వీటిని అనుసంధానం చేసినట్టు తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గాంధీ దవాఖానలో సంతాన సాఫల్య కేంద్రాన్ని ఏర్పాటుచేసినట్టు చెప్పారు. గాంధీ దవాఖానలో మూడు అడ్మినిస్ట్రేటివ్ అధికారుల పోస్టులు మంజూరయ్యాయని చెప్పారు. సిద్దిపేట, సూర్యాపేట, నల్లగొండలో మెడికల్ కాలేజీతోపాటు నిజామాబాద్ కళాశాలలో పీజీకి అనుమతి లభించిందన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ పర్యాద కృష్ణమూర్తి, జెడ్పీ చైర్‌పర్సన్ రాజమణి, ఇంచార్జి కలెక్టర్ మాణిక్కరాజ్‌కణ్ణన్ పాల్గొన్నారు.

## భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి



కిష్టన్న, చెన్నమ్మ (ఫైల్)

**హన్వాడ:** భర్త మరణాన్ని తట్టుకోలేక మానసిక వేదనకు గురై భార్య మృతిచెందిన ఘటన మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం కొత్తపేటలో జరిగింది. చింతకింది కిష్టన్న (90) మంగళవారం మధ్యాహ్నం మృతి చెందాడు. అప్పటి నుంచి మానసికంగా కృంగిపోయిన ఆయన భార్య చెన్నమ్మ బుధవారం అకస్మాత్తుగా కుప్పకూలి మృతి చెందింది.

## పాలిటెక్నిక్ విద్యార్థిని ఆత్మహత్య

**మధిర, నమస్తేతెలంగాణ:** ఖమ్మం జిల్లా మధిర వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల హాస్టల్ విద్యార్థిని గండు రవళి(17) బుధవారం ఆత్మహత్య చేసుకుంది. వరంగల్ జిల్లా ఐనవోలు మండలం గరిమళ్లపల్లి గ్రామానికి చెందిన రవళి మధిర వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా ప్రథమ సంవత్సరం చదువుతున్నది. సెమిస్టర్ పరీక్షలు జరుగుతుండగా, అగ్రోనమి పరీక్ష బాగా రాయలేదని రవళి మనస్తాపానికి గురైనట్లు తెలుస్తున్నది. రాత్రి హాస్టల్‌లో పడుకొని, బుధవారం అర్ధరాత్రి 1.30 గంటల సమయంలో ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. ఉదయం లేచిన తోటి విద్యార్థినులకు రవళి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వారు వెంటనే వార్డెన్, పోలీసులకు అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పంచనామా చేసి మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించారు.

# అన్నను చంపిన తమ్ముడు

### ఆస్తి వివాదం నేపథ్యంలో హత్య



ఘటనా స్థలంలో భూమయ్య మృతదేహం

**మల్యాల:** అందరూ చూస్తుండగా తమ్ముడు సొంత అన్నను నరికి చంపిన ఘటన జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలో బుధవారం సంచలనం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్యాలకు చెందిన దేశవేని చిన్నయ్య అలియాస్ రాజయ్యకు ముగ్గురు కొడుకులు. తనకున్న 99 గుంటల వ్యవసాయ భూమిని కొడుకులైన నర్సయ్యకు 45 గుంటలు, భూమయ్యకు 31 గుంటలు, లక్ష్మణ్‌కు 23 గుంటల స్థలాన్ని 30 ఏండ్ల కిందట పంపిణీ చేశాడు. ఏడేండ్ల కిందట ఇంటి జాగా పంపిణీలో చిన్న కొడుకు లక్ష్మణ్‌కు ఎక్కువ భాగం, మిగతా కొడుకులకు కొంత భాగాన్ని పంపిణీ చేశాడు. ఇటీవల రాజయ్య మరణించడంతో అన్నదమ్ములు కుల సంఘం ఆధ్వర్యంలో పంచాయితీ ఏర్పాటు చేసి వ్యవసాయ భూమిని ముగ్గురికి 33 గుంటల చొప్పున పంచుకోవాలని తీర్మానించారు. ఇటీవల లక్ష్మణ్ తన బిడ్డకు పెండ్లి చేయడం, అప్పులు పెరుగడంతో తన భూమిని వేరే వ్యక్తికి అమ్మాడు. దీంతో భూమయ్య భూమిని కొన్న వ్యక్తి వద్దకు వెళ్లి పంపిణీ పూర్తి కాలేదని, కొనుగోళ్ళు చెల్లింపులు చేయెద్దని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో లక్ష్మణ్ భూమయ్యపై పలుమార్లు పంచాయితీలు పెట్టించాడు. అయినా భూమి అమ్మకానికి భూమయ్య అడ్డుచెప్పడంతో కక్ష పెంచుకున్నాడు. బుధవారం మల్యాల అంగడి బజార్‌లో భూమయ్య చేపలు అమ్ముతుండగా లక్ష్మణ్ ఇంటి వద్ద నుంచి గొడ్డలి తీసుకొని వచ్చి అందరూ చూస్తుండగా దాడి చేశాడు. దీంతో తీవ్రంగా గాయపడిన భూమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. తర్వాత లక్ష్మణ్ నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్టు సమాచారం. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నాగేందర్ తెలిపారు.



భద్రాచలం బ్రిడ్జిసెంటర్ వద్ద పట్టుబడిన గంజాయి

## 30 లక్షల విలువైన గంజాయి పట్టివేత

**భద్రాచలం, నమస్తే తెలంగాణ:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణంలోని బ్రిడ్జి సెంటర్ వద్ద రూ.30 లక్షల విలువైన గంజాయిని ఎక్సైజ్ పోలీసులు బుధవారం పట్టుకున్నారు. ఒడిశా నుంచి ముంబైకి గంజాయి రవాణా అవుతున్నట్టు సమాచారం అందడంతో నిఘా వేశారు. ముందుగా ఆటోలో రవాణా చేస్తున్న 48 ప్యాకెట్లను, తర్వాత బొలోరోలో అక్రమంగా తరలిస్తున్న 200 ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని వాహనాలను సీజ్‌చేశారు. నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఒక్కో ప్యాకెట్ రెండు కిలోల బరువు ఉన్నదని, 500 కిలోల గంజాయిని పట్టుకున్నామని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సీ నర్సింహారెడ్డి తెలిపారు.

## గార్లలో బాంబుల కలకలం



ప్లాస్టిక్ సంచిలో ఉన్న బాంబులు

**గార్ల:** మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రంలో బుధవారం బాంబుల కలకలం రేగింది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు గార్లలోని రైల్వే స్టేషన్ ఎగువ ప్లాట్‌ఫారం వైపు ఓ కుక్క ప్లాస్టిక్ సంచిని ఎత్తుకొచ్చింది. నిర్జన ప్రదేశంలోకి తీసుకెళ్లి అందులో ఉన్న బాంబును తినేందుకు ప్రయత్నించగా పేలిపోయి అక్కడికక్కడే మృతిచెందింది. శబ్దాన్ని విని ఉలిక్కిపడిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై వంశీధర్ సిబ్బందితో అక్కడికి చేరుకొని సంచిని పరిశీలించగా అందులో నాలుగు బాంబులు బయటపడ్డాయి. వాటిని స్వాధీనం చేసుకొని నిర్వీర్యం చేశారు. ఆ బాంబుల్లో మాంసం ముక్కలు కలిపి తయారుచేయడంతో కుక్క తిని ఉంటుందని ఎస్సై తెలిపారు.

## ఎన్డీ దళ కమాండర్ ఐలయ్య అరెస్ట్?

**బయ్యారం:** న్యూడెమోక్రసీ రాయల వర్గానికి చెందిన మహబూబాబాద్ జిల్లా బయ్యారం ఏరియా దళ కమాండర్ బండారి ఐలయ్య అలియాస్ వీరన్నను మానుకోట పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం. బయ్యారం మండలంలోని కొత్తగూడెం పంచాయతీ మూలపోచారంలోని ఓ ఇంట్లో ఐలయ్యతోపాటు మరికొందరు దళసభ్యులు సమావేశమైనట్టు పోలీసులకు సమాచారం అందింది. ఏఎస్పీ గిరిధర్ ఆధ్వర్యంలో పోలీసులు గ్రామంలో సోదాలు నిర్వహించి దళ కమాండర్ ఐలయ్యతోపాటు దళ సభ్యుడు భీముడును అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. రెండు ఆయుధాలు, విప్లవ సాహిత్యం, కొంత నగదును స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. ఈ విషయాన్ని పోలీసులు ధ్రువీకరించలేదు.

## సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా మరోసారి తమ్మినేని

**నీలగిరి :** సీపీఎం రాష్ట్ర కార్యదర్శిగా రెండోసారి తమ్మినేని వీరభద్రం ఎన్నికయ్యారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని లక్ష్మీగార్డెన్స్‌లో నాలుగురోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర ద్వితీయ మహాసభలు బుధవారం ముగిశాయి. సుమారు 14ఎజెండాలకు మహాసభ ఆమోదం తెలిపింది. బుధవారం రాత్రి 60మందితో రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కార్యదర్శిగా తమ్మినేని వీరభద్రంతోపాటు 59మందిని కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. కార్యదర్శివర్గ సభ్యులుగా ఎస్ వీరయ్య, చెరుపల్లి సీతారాములు, జీ నాగయ్య, చుక్కా రాములు, నంద్యాల నర్సింహారెడ్డి, సున్నం రాజయ్య, బీ వెంకట్, టీ జ్యోతి, జూలకంటి రంగారెడ్డి, పీ సుదర్శన్‌రావు, జీ రాములు, డీజీ నర్సింగరావు, ప్రత్యేక ఆహ్వానితులతో పాటు మరో 27మందిని ఎంపిక చేశారు.

నమస్తే తెలంగాణ
# ఆట
[ హైదరాబాద్ ]
గురువారం 8 ఫిబ్రవరి 2018



పీబీఎల్ విజేతగా నిలిచిన సందర్భంగా రాష్ట్ర ఐటీ,మున్సిపల్ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావును మర్యాద పూర్వకంగా కలిసిన హైదరాబాద్ హంటర్స్ జట్టు ఓనర్లు. ఈ సందర్భంగా భారత బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, హంటర్స్ ఓనర్లతో కలిసి మంత్రి ట్రోఫీని ప్రదర్శించారు.

## రేపటి నుంచి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ :** రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను రామసహాయం విజయ మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామంలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు ఈ పోటీలు జరుగనున్నాయి. ఈ పోటీల ప్రారంభ కార్యక్రమానికి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపుడి నవీన్‌రావు, టీఆర్ఎస్ పార్టీ నాయకులు ధరంసోత్ రవిచంద్ర హాజరుకానున్నారు. ఈ టోర్నీ లో ప్రథమ బహుమతిగా రూ.25,116, 2వ బహుమతిగా రూ.20,116, 3వ బహుమతిగా రూ.15,116, 4వ బహుమతిగా రూ.10,116, 5వ బహుమతిగా రూ.8,116 అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## మాజీ హాకీ ఆటగాడు సత్యనారాయణ మృతి



**గాంధీ దవాఖాన, ఫిబ్రవరి 7:** అంతర్జాతీయ హాకీ ఆటగాడు, హైద్రాబాద్ హాకీ జట్టు మాజీ కెప్టెన్ కోట సత్యనారాయణ మంగళవారం బన్సీలాల్‌పేట్‌లోని తన స్వగృహంలో కన్నుమూశారు. సత్యనారాయణకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ ఆర్టీసీలో టికెట్ చెకింగ్ కలెక్టర్‌గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. కాగా బుధవారం ఆయన అంత్యక్రియలు బన్సీలాల్‌పేట్‌లోని స్మశాన వాటికలో నిర్వహించారు. ఈ అంత్యక్రియలకు బంధువులు, కుటుంబ సభ్యులు, హాకీ సంఘ సభ్యులు హాజరై నివాళ్లు అర్పించారు.

# మందన మెరిసెన్..



మందన (135)

అదే జోరు.. అదే స్ఫూర్తి.. ప్రత్యర్థి ఎంత పెద్దదైనా.. భారత మహిళల జట్టు ఆటతీరు మాత్రం చెక్కుచెదరడం లేదు. పరిస్థితులు కఠినంగా ఉన్నా.. పిచ్ అనుకూలతలు లేకున్నా.. సమష్టితత్వంతో కదంతొక్కుతూ తొలిసారి సఫారీ గడ్డపై వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. ముంబై మహారాణి స్మృతి మందన సెంచరీతో చెలరేగిన వేళ.. హర్మన్‌ప్రీత్, వేద అర్ధసెంచరీలతో ఆకట్టుకున్న తరుణంలో.. రెండో వన్డేలోనూ టీమ్ ఇండియా భారీ తేడాతో గెలిచింది. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-0తో సిరీస్‌ను చేజిక్కించుకుంది.

- రెండో వన్డేలోనూ భారత్ గెలుపు
- 178 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు
- 2-0 ఆధిక్యంతో సిరీస్ కైవసం



పూనమ్ (4/24)

**కింబర్లీ:** ఐసీసీ మహిళల వన్డే చాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు జైత్రయాత్ర కొనసాగిస్తున్నది. ఓపెనర్ స్మృతి మందన (129 బంతుల్లో 135; 14 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ బాదడంతో.. బుధవారం జరిగిన రెండో వన్డేలోనూ టీమ్‌ఇండియా 178 పరుగుల భారీ తేడాతో దక్షిణాఫ్రికాపై ఘన విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 2-0తో కైవసం చేసుకుంది. టాస్ గెలిచి సఫారీ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా, భారత్ 50 ఓవర్లలో 3 వికెట్లకు 302 పరుగులు చేసింది. పూనమ్ రౌట్ (20) విఫలమైనా.. మందన ప్రొటీస్ బౌలర్లను ఉతికి ఆరేసింది. హైదరాబాద్ అమ్మాయి, కెప్టెన్ మిథాలీ రాజ్ (20) నిరాశపర్చింది. ఈ ఇద్దరితో కలిసి 107 పరుగుల భాగస్వామ్యాన్ని జోడించిన మందనకు మిడిలార్డర్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ (69 బంతుల్లో 55 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) మంచి సమన్వయాన్ని ఇచ్చింది. ఈ ఇద్దరూ ప్రత్యర్థుల బౌలింగ్‌పై విరుచుకుపడటంతో మూడో వికెట్‌కు 134 పరుగులు జతయ్యాయి. సెంచరీ పూర్తి చేసుకుని మంచి ఫామ్‌లో ఉన్న మందన 44వ ఓవర్‌లో వెనుదిరిగింది. అప్పటికి జట్టు స్కోరు 241/3. ఈ దశలో వేద కృష్ణమూర్తి (33 బంతుల్లో 51 నాటౌట్; 6 ఫోర్లు, 1 సిక్స్) విరవిహారం చేసి కౌర్‌తో నాలుగో వికెట్‌కు 61 పరుగులు జోడించడంతో భారత్ భారీ స్కోరు సాధ్యమైంది.
తర్వాత లక్ష్య ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా 30.5 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ లిజెల్లీ లీ (75 బంతుల్లో 73; 7 ఫోర్లు, 3 సిక్సర్లు) టాప్ స్కోరర్. కాప్ (17 నాటౌట్) ఓ మాదిరిగా ఆడింది. 9 మంది సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. టీమ్‌ఇండియా స్పిన్నర్లు పూనమ్ యాదవ్ (4/24), దీప్తి శర్మ (2/34), రాజేశ్వరి (2/14) ప్రత్యర్థి ఇన్నింగ్స్ పతనాన్ని శాసించారు.

### స్కోరు బోర్డు

**భారత మహిళల ఇన్నింగ్స్:** పూనమ్ రౌట్ (సి) చెట్టి (బి) క్లాస్ 20, మందన (సి) చెట్టి (బి) నొజాకి 135, మిథాలీ (సి అండ్ బి) లూస్ 20, కౌర్ నాటౌట్ 55, కృష్ణమూర్తి నాటౌట్ 51, **ఎక్స్‌ట్రాలు:** 21, **మొత్తం:** 50 ఓవర్లలో 302/3.
**వికెట్లపతనం:** 1-56, 2-107, 3-241.
**బౌలింగ్:** ఖాకా 8-0-63-0, కాప్ 9-0-41-0, క్లాస్ 9-0-65-1, నికెర్క్ 10-1-38-0, నొజాకి 9-0-63-1, లూస్ 5-0-31-1.
**దక్షిణాఫ్రికా మహిళల ఇన్నింగ్స్:** లీ ఎల్బీ (బి) శర్మ 73, వోల్‌వర్ట్ (సి) వర్మ (బి) గోస్వామి 9, చెట్టి (సి) (సబ్) మేశ్రమ్ (బి) గైక్వాడ్ 6, స్టెయిన్ (సి) కృష్ణమూర్తి (బి) పూనమ్ యాదవ్ 3, లూస్ (సి) కృష్ణమూర్తి (బి) పూనయ్ యాదవ్ 2, నికెర్క్ ఎల్బీ (బి) గైక్వాడ్ 7, ట్రైయాన్ రనౌట్ 1, కాప్ నాటౌట్ 17, ఖాకా (బి) శర్మ 0, క్లాస్ (బి) పూనమ్ యాదవ్ 4, నొజాకి ఎల్బీ (బి) పూనమ్ యాదవ్ 0, **ఎక్స్‌ట్రాలు:** 2, **మొత్తం:** 30.5 ఓవర్లలో 124 ఆలౌట్.
**వికెట్లపతనం:** 1-32, 2-51, 3-64, 4-68, 5-89, 6-92, 7-113, 8-113, 9-124, 10-124.
**బౌలింగ్:** గోస్వామి 7-0-29-1, పాండే 4-1-23-0, గైక్వాడ్ 6-0-14-2, పూనమ్ యాదవ్ 7.5-1-24-4, దీప్తి శర్మ 6-1-34-2.

### జులన్ @ 200



భారత వెటరన్ పేసర్ జులన్ గోస్వామి మరో అరుదైన రికార్డును సొంతం చేసుకుంది. వన్డేల్లో 200ల వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డులకెక్కింది. రెండో వన్డేలో సఫారీ ఓపెనర్ లౌరా వోల్‌వర్ట్ వికెట్ తీయడం ద్వారా ఆమె ఈ ఘనత అందుకుంది. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. పురుషుల క్రికెట్‌లోనూ 200ల వికెట్లు తీసిన తొలి క్రికెటర్ కూడా భారత్‌కు చెందినవారే కావడం. అప్పట్లో బౌలింగ్ దిగ్గజం కపిల్ దేవ్ ఈ ఫీట్‌ను సాధించాడు. కెరీర్‌లో 166వ మ్యాచ్ ఆడుతున్న గోస్వామి.. గతేడాది మే నెలలో వన్డేల్లో అత్యధిక వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్‌గా గుర్తింపు పొందింది. క్యాథరిన్ ఫిట్జ్‌ప్యాట్రిక్ (ఆస్ట్రేలియా) పేరిట ఉన్న ఈ రికార్డును ఆమె బద్దలుకొట్టింది. జులన్.. 2007లో ఐసీసీ 'ఉత్తమ మహిళా క్రికెటర్' అవార్డునూ సొంతం చేసుకుంది.

# ఇది కోహ్లీ చరిత్ర



కోహ్లీ(159 బంతుల్లో 160 నాటౌట్)

- వన్డే సిరీస్‌లో మూడో విజయం అందించిన విరాట్
- చాహల్, కుల్దీప్ విజృంభణ
- దక్షిణాఫ్రికాపై భారత్ ఘనవిజయం

**కేప్‌టౌన్:** భారత్ వరుస విజయాల పరంపర దిగ్విజయంగా కొనసాగుతున్నది. సొంతగడ్డపై తమకు ఎదురే లేదనుకున్న దక్షిణాఫ్రికా ఆధిపత్యానికి గండి కొడుతూ టీమ్‌ఇండియా జయకేతనం ఎగురవేసింది. బుధవారం జరిగిన మూడో వన్డేలో కోహ్లీసేన 124 పరుగుల తేడాతో విజయదుందుభి మోగించింది. మరో మూడు వన్డేలు మిగిలున్న సిరీస్‌లో 3-0తో ముందంజ వేసింది. భారత్ నిర్దేశించిన 304 పరుగుల భారీ లక్ష్యఛేదనలో దక్షిణాఫ్రికా 40 ఓవర్లలో 179 పరుగులకు కుప్పకూలింది. స్పిన్ ద్వయం చాహల్(4/46), కుల్దీప్ యాదవ్(4/23) స్పిన్ విజృంభణతో సఫారీలను ఆటాడుకున్నారు. డుమిని(51) అర్ధసెంచరీ మినహా..ఎవరూ అంతగా ఆకట్టుకోలేకపోయారు. ఆదిలోనే ఆమ్లా(1) వికెట్ కోల్పోయిన దక్షిణాఫ్రికా ఏ దశలోనూ భారత్‌కు పోటీ నివ్వలేకపోయింది. తొలుత కెప్టెన్ కోహ్లీ(159 బంతుల్లో 160 నాటౌట్, 12 ఫోర్లు, 2 సిక్స్‌లు) అజేయ సెంచరీతో భారత్ 50 ఓవర్లలో 303/6 స్కోరు చేసింది. ధవన్(76) అర్ధసెంచరీతో ఆకట్టుకున్నాడు. డుమిని(2/60) రెండు వికెట్లు తీశాడు. సెంచరీతో విజృంభించిన కోహ్లీకి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఇరు జట్ల మధ్య నాలుగో వన్డే ఈనెల 10న జొహన్నెస్‌బర్గ్‌లో జరుగుతుంది.

**రోహిత్ మళ్లీ:** తొలుత టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా..భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. రబాడ వేసిన ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే టీమ్‌ఇండియాకు ఎదురుదెబ్బ తగిలింది. ఫామ్‌లేమితో తంటాలు పడుతున్న హిట్‌మ్యాన్ రోహిత్(0)ను రబాడ వికెట్ల ముందు దొరుకబుచ్చుకున్నాడు. దీంతో పరుగుల ఖాతా తెరువకుండానే భారత్ వికెట్ చేజార్చుకుంది.

నవచరిత్రకు నాంది పడింది. రెండున్నర దశాబ్దాల కల సాకారమయ్యే దిశగా ముందడుగు పడింది. దిగ్గజాలకు సాధ్యం కాని రికార్డును కోహ్లీసేన ఒడిసిపట్టుకుంది. టెస్ట్ సిరీస్ ఓటమికి ప్రతీకారమన్న రీతిలో చెలరేగుతున్న భారత్..వరుసగా మూడో వన్డే విజయంతో కొత్త చరిత్ర లిఖించింది. అన్నీతానై కెప్టెన్ కోహ్లీ అజేయ సెంచరీతో కదంతొక్కిన వేళ..కేప్‌టౌన్‌లో టీమ్‌ఇండియా భారీ స్కోరు అందుకుంది. మణికట్టు మాంత్రికులు చాహల్, కుల్దీప్ మాయాజాలంతో దక్షిణాఫ్రికా కకావికలైంది. ఆరు వన్డేల సిరీస్‌లో భారత్ 3-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**ధవన్ జతగా:** సున్నా పరుగులకే వికెట్ కోల్పోయి ఆదిలోనే ప్రత్యర్థికి తలొగ్గిన భారత్‌ను కోహ్లీ(160 నాటౌట్) నాయకునిలా నడిపించాడు. ఓపెనర్ ధవన్(76)తో కలిసి ఇన్నింగ్స్‌ను గాడిలో పడేశాడు. తానెదుర్కొన్న మూడో బంతికే ఔటయ్యే ప్రమాదం నుంచి డీఆర్ఎస్‌తో బయటపడ్డ కోహ్లీ మళ్లీ వెనుదిరిగి చూడలేదు. ధవన్‌ను అండగా చేసుకుని కోహ్లీ బౌండరీలతో ఆకట్టుకున్నాడు. ఈ క్రమంలో రెగ్యులర్ పవర్‌ప్లే ముగిసే సరికి భారత్ వికెట్ నష్టానికి 50 పరుగులు చేసింది. ఈ క్రమంలో 42 బంతుల్లో ధవన్ అర్ధసెంచరీ మార్క్ అందుకున్నాడు. ఈ దశలో డుమిని(2/60)దక్షిణఫ్రికాకు బ్రేక్ ఇచ్చాడు. భారీ షాట్ ఆడే క్రమంలో హిట్టింగ్ చేయబోయిన ధవన్..కెప్టెన్ మర్‌క్రామ్ క్యాచ్‌తో నిష్క్రమించాడు. దీంతో రెండో వికెట్‌కు 140 పరుగుల భాగస్వామ్యాన్ని తెరపడింది.

**కోహ్లీ ఒక్కడై:** ధవన్ ఔట్ తర్వాత కోహ్లీ గేర్ మార్చాడు. నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన రహానే(11) తీవ్రంగా నిరాశపరిచాడు. కోహ్లీకి మద్దతుగా నిలువాల్సిందిపోయి..డుమిని బౌలింగ్‌లో భారీ షాట్ ఆడబోయి ఫెల్కువాయో చేతికి చిక్కాడు. ఆ తర్వాత వచ్చిన హార్దిక్‌పాండ్యా(14) ఆదిలో కొంత దూకుడుగా కనిపించినా స్థాయి మేరకు ఆడటంలో విఫలమయ్యాడు. ఓ భారీ సిక్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేసిన హార్దిక్...మోరిస్ వేసిన మరుసటి ఓవర్లోనే కీపర్ క్యాచ్‌తో ఔటయ్యాడు. ఇలా 48 పరుగుల తేడాతో టీమ్‌ఇండియా 3 వికెట్లు కోల్పోయింది. ఓ వైపు వరుసగా వికెట్లు కోల్పోతున్నా చెదరని ఆత్మవిశ్వాసంతో కోహ్లీ పరుగులు కొల్లగొట్టాడు. ధోనీ(10)తో కలిసి సఫారీ బౌలర్లను కుదురుకోనీయకుండా స్కోరుబోర్డును పరుగెత్తించాడు. ఈ క్రమంలో వన్డేల్లో 34వ సెంచరీని తన ఖాతాలో వేసుకున్నాడు. అయితే ఎనిమిది పరుగుల తేడాతో ధోనీ, కేదార్ జాదవ్(1) ఔటయ్యారు. అయినా వెనుకకు తగ్గని కోహ్లీకి భువనేశ్వర్(16 నాటౌట్) మంచి మద్దతు ఇచ్చాడు. సమయస్ఫూర్తితో ఆడుతూ ఓవైపు..చెత్త బంతులను బౌండరీలకు తరలించాడు. రబాడ వేసిన ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో ఓ ఫోర్, సిక్స్‌తో 15 పరుగులు పిండుకుని దక్షిణాఫ్రికా ముందు భారీ లక్ష్యాన్ని నిర్దేశించాడు.

**స్కోరుబోర్డు**

**భారత్:** రోహిత్‌శర్మ(సి)క్లాసెన్(బి)రబాడ 0, ధవన్(సి)మర్‌క్రామ్(బి)డుమిని 76, కోహ్లీ 160 నాటౌట్, రహానే(సి)ఫెల్కువాయో(బి)డుమిని 11, హార్దిక్(సి)క్లాసెన్(బి)మోరిస్ 14, ధోనీ(సి) ఎంగ్డీ(బి)తాహీర్ 10, జాదవ్(సి)క్లాసెన్(బి)ఫెల్కువాయో 1, భువనేశ్వర్ 16 నాటౌట్; **ఎక్స్‌ట్రాలు:** 15; **మొత్తం:** 50 ఓవర్లలో 303/6; **వికెట్ల పతనం:** 1-0, 2-140, 3-160, 4-188, 5-228, 6-236; **బౌలింగ్:** రబాడ 10-1-54-1, ఎంగ్డీ 6-0-47-0, మోరిస్ 9-0-45-1, ఫెల్కువాయో 6-0-42-1, తాహీర్ 9-0-52-1, డుమిని 10-0-60-2.

**దక్షిణాఫ్రికా:** ఆమ్లా(ఎల్బీ)బుమ్రా 1, మర్‌క్రామ్(స్టంప్/ధోనీ)(బి)కుల్దీప్ 32, డుమిని (ఎల్బీ) చాహల్ 51, క్లాసెన్(ఎల్బీ)చాహల్ 6, మిల్లర్(సి)ధోనీ(బి)బుమ్రా 25, జొండో (సబ్/పాండే)(బి)చాహల్ 17, మోరిస్ (ఎల్బీ)కుల్దీప్ 14, ఫెల్కువాయో(సి)కోహ్లీ(బి)కుల్దీప్ 3, రబాడ 12 నాటౌట్, తాహీర్(సి) కోహ్లీ(బి)చాహల్ 8, ఎంగ్డీ(ఎల్బీ)కుల్దీప్ 6; **ఎక్స్‌ట్రాలు:**4; **మొత్తం:** 40 ఓవర్లలో 179 ఆలౌట్; **వికెట్ల పతనం:** 1-1, 2-79, 3-88, 4-95, 5-129, 6-150, 7-150, 8-158, 9-167, 10-179; **బౌలింగ్:** భువనేశ్వర్ 7-0-41-0, బుమ్రా 7-0-32-2, హార్దిక్ 8-0-35-0, చాహల్ 9-0-46-4, కుల్దీప్ 9-1-23-4.

**1** దక్షిణాఫ్రికా గడ్డపై వన్డే సిరీస్‌లో మూడో విజయం అందించిన తొలి భారత కెప్టెన్‌గా కోహ్లీ నిలిచాడు.



### ధోనీ @ 400

భారత వికెట్ కీపర్ ఎంఎస్ ధోనీ మరో ఘనతను సొంతం చేసుకున్నాడు. వన్డేల్లో 400ల ఔట్లలో భాగం పంచుకున్న నాలుగో వికెట్ కీపర్‌గా రికార్డు సృష్టించాడు. మూడో వన్డేలో మర్‌క్రామ్‌ను స్టంపౌట్ చేయడం ద్వారా ఈ ఫీట్‌ను అందుకున్నాడు. ఇన్నింగ్స్ 17వ ఓవర్‌లో కుల్దీప్ వేసిన ఫ్లైట్ బంతిని ఆడే క్రమంలో మర్‌క్రామ్ ముందుకు రావడంతో మహీ క్షణంలో బెయిల్స్‌ను పడేశాడు. ఓవరాల్‌గా ఈ జాబితాలో సంగక్కర (482), గిల్‌క్రిస్ట్ (472), బౌచర్ (424) ముందున్నారు.

## ఆఫ్ఘన్ సంచలనం

**జింబాబ్వేపై టీ20 సిరీస్ విజయం**



**షార్జా:** ప్రపంచ క్రికెట్‌లో తామెంత మాత్రం పసికూనలం కాదని ఆఫ్ఘనిస్థాన్ మరోమారు నిరూపించింది. నిలకడైన ప్రదర్శనతో ఒక్కో మెట్టు ఎదుగుతూ ప్రత్యర్థులకు దీటైన పోటీనిస్తున్నది. జింబాబ్వేతో రెండు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను ఆఫ్ఘనిస్థాన్ క్లీన్‌స్వీప్ చేయడమే దీనికి నిదర్శనం. జింబాబ్వేతో జరిగిన రెండో టీ20లో ఆఫ్ఘన్ 17 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఆఫ్ఘన్ నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యఛేదనలో జింబాబ్వే 20 ఓవర్లలో 141/5 స్కోరు చేసింది. సికిందర్ రజా(40) మినహా ఎవరూ ఆకట్టుకోలేకపోయారు. స్టార్ లెగ్ స్పిన్నర్ రషీద్‌ఖాన్(2/23), ముజీబ్ ఉర్ రెహ్మాన్(2/21) జింబాబ్వే పతనాన్ని శాసించారు. తొలుత మహ్మద్ నబీ(45) రాణింపుతో ఆఫ్ఘనిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లకు 158 పరుగులు చేసింది. నబీకి తోడు సాదిఖ్(28), స్టానిక్జాయ్(27), నజీబుల్లా జద్రాన్(24) రాణించడంతో ఆఫ్ఘన్‌కు గౌరవప్రదమైన స్కోరు దక్కింది. చతార(3/20), జార్విస్(2/22), క్రెమర్(2/20), ముజుర్‌బనీ(2/48) రెండేసి వికెట్లు తీశారు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆకట్టుకున్న నబీకి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. ఇరు జట్ల మధ్య ఐదు వన్డేల సిరీస్ ఈనెల 9న మొదలవుతుంది.

## హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు రెండు స్వర్ణాలు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ ఆట ప్రతినిధి:** తొలి ఖేలో ఇండియా పాఠశాల గేమ్స్-2018లో హకీంపేట్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు వెయిట్‌లిఫ్టింగ్‌లో రెండు స్వర్ణాలతో మెరిశారు. బుధవారం జరిగిన 85 కేజీల వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో హెచ్ కార్తీక్ స్వర్ణ పతకం సాధించి అదురగొట్టాడు. మంగళవార 69 కేజీల విభాగంలో శివలింగేశ్వర సాయి స్వర్ణాన్ని అందుకున్నాడు. అద్భుత ప్రతిభ చూపి ఖేలో ఇండియా గేమ్స్‌లో పతకాలు సాధించిన వీరిద్దరినీ తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ(సాట్స్)ఎండీ దినకర్‌బాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో హకీంపేట్ క్రీడల పాఠశాల వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ మాణిక్యాల రావు పాల్గొన్నారు.

## అంధుల క్రికెట్‌కు గుర్తింపు ఇవ్వండి

- బీసీసీఐకి సచిన్ లేఖ



**న్యూఢిల్లీ:** అంధుల క్రికెట్ అసోసియేషన్ (సీఏబీఐ)కి గుర్తింపు ఇవ్వాలని బ్యాటింగ్ దిగ్గజం సచిన్ టెండూల్కర్.. బీసీసీఐకి విజ్ఞప్తి చేశాడు. ఆటగాళ్లను బోర్డు పెన్షన్ పథకంలోకి తీసుకురావాలన్నాడు. ఈ మేరకు పరిపాలన కమిటీ (సీవోఏ) చీఫ్ వినోద్ రాయ్‌కు లేఖ రాశాడు. 'నాలుగుసార్లు ప్రపంచకప్ విజయాన్ని ఎంతో సంబురంగా జరుపుకున్నాం. దేశానికి పేరు ప్రతిష్టలు తెస్తున్న అంధుల క్రికెట్‌కు గుర్తింపు ఇచ్చే విషయాన్ని ఇప్పటికైనా పరిశీలించాలి. క్రికెటర్లు ఎన్నో కష్టాలను అధిగమించి ఈ స్థాయికి చేరుకున్నారు. వాళ్లు సాధించిన విజయాలు అందరికీ స్ఫూర్తిదాయకం. కాబట్టి బోర్డు వాళ్లకు మద్దతుగా నిలువాల్సిన సమయం ఆసన్నమైంది. గతంలో మాదిరిగానే ఈసారి కూడా ఎంతో కొంత ఆర్థిక ప్రోత్సాహాన్ని ఇవ్వాలి' అని సచిన్ లేఖలో పేర్కొన్నాడు. సుదీర్ఘంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశానికి బోర్డు ఇప్పుడైనా తెరదించుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. క్రికెట్‌పై వాళ్లకు ఉన్న ఆసక్తికి బోర్డు ఇచ్చే గుర్తింపే చక్కని నిదర్శనమన్నాడు. 'ఈ చాంపియన్లకు ఆర్థిక భరోసా కల్పించాలంటే వాళ్లను పెన్షన్ పథకంలోకి కూడా తీసుకురావాలి. సీఏబీఐకి గుర్తింపు ఇస్తే దేశ క్రీడా చరిత్రలో కొత్త అంకం మొదలవుతుంది. క్రీడల్లో పాల్గొనే శారీరక వికలాంగులకు ఎలాంటి ఇబ్బంది ఉండదనే ఓ సంకేతం అథ్లెట్లలోకి వెళ్తుంది. మమ్మల్ని గుర్తించేవారు లేరన్న ఆవేదన తగ్గుతుంది. చాలా మంది ధైర్యంగా క్రీడల్లో పాల్గొనేందుకు ముందుకు వస్తారు' అని మాస్టర్ వ్యాఖ్యానించాడు.

## కేరళ, బెంగాల్ మ్యాచ్ టై

- విజయ్ హజారే ట్రోఫీ

**నడౌన్:** బ్యాటింగ్‌లో చెలరేగిన కేరళ, బెంగాల్ జట్లు.. బుధవారం విజయ్ హజారే టోర్నీలో జరిగిన మ్యాచ్‌ను టై చేసుకున్నాయి. ఓపెనర్ జలజ్ సక్సేనా (100 నాటౌట్) సెంచరీతో చెలరేగడంతో ముందుగా కేరళ 50 ఓవర్లలో 6 వికెట్లకు 235 పరుగులు చేసింది. సంజూ శామ్సన్ (34)ఫర్వాలేదనిపించాడు. తర్వాత బెంగాల్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 235 పరుగులే చేయడంతో మ్యాచ్ టైగా ముగిసింది. కెప్టెన్ మనోజ్ తివారి (73 నాటౌట్), చటర్జీ (35), గోస్వామి (26) మెరుగ్గా ఆడినా ప్రయోజనం లేకపోయింది.
**యువరాజ్ ఆడినా..**
బెంగళూరులో జరిగిన గ్రూప్-ఎ మ్యాచ్‌లో పంజాబ్ 2 వికెట్ల తేడాతో హర్యానా చేతిలో ఓడింది. యువరాజ్ (43), గురుకీరత్ (42) రాణించడంతో పంజాబ్ 247/9 స్కోరు చేసింది. తర్వాత హర్యానా మరో బంతి మిగిలి ఉండగానే 8 వికెట్లకు 251 పరుగులు చేసి గెలిచింది. రోహిలా (96) చెలరేగాడు.

## మోతెక్కించిన మ్యాక్స్‌వెల్

**ఇంగ్లండ్‌పై ఆస్ట్రేలియా ఘన విజయం**




మ్యాక్స్‌వెల్ (103 నాటౌట్)

**హోబర్ట్:** ఆస్ట్రేలియా డాషింగ్ బ్యాట్స్‌మన్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తన పునరాగమనాన్ని ఘనంగా చాటుకున్నాడు. టెస్ట్, వన్డేలకు దూరమైన మ్యాక్స్‌వెల్..టీ20ల్లో తన ప్రతాపమేంటో చూపించాడు. బుధవారం ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టీ20లో మ్యాక్స్‌వెల్(58 బంతుల్లో 103 నాటౌట్, 10ఫోర్లు, 4 సిక్స్‌లు) అజేయ సెంచరీతో అదురగొట్టాడు. దీంతో ఆసీస్ 5 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై ఘనవిజయం సాధించింది. తొలుత మలన్(50) అర్ధసెంచరీతో ఇంగ్లండ్ 20 ఓవర్లలో 155/9 స్కోరు చేసింది. మ్యాక్స్‌వెల్(3/10) మూడు వికెట్లతో విజృంభించాడు. ఆ తర్వాత మ్యాక్స్‌వెల్ సూపర్ సెంచరీతో ఆసీస్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 161 పరుగులు చేసింది. 4 పరుగులకే కెప్టెన్ వార్నర్(4), లిన్(0) ఔటైనా డీఆర్సీ షార్ట్(30)తో కలిసి మ్యాక్స్‌వెల్ అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో రాణించిన మ్యాక్స్‌వెల్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది. డేవిడ్ విల్లే(3/28) మూడు వికెట్లు తీశాడు.

## సుప్రీంకోర్టులో నేటి నుంచి 'అయోధ్య' కేసు వాదనలు

**న్యూఢిల్లీ:** రామజన్మభూమి – బాబ్రీ మసీదు కేసులో గురువారం నుంచి సుప్రీంకోర్టు వాదనలు విననుంది. ప్రత్యేక బెంచ్ ఏర్పాటుకు చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రా నిరాకరించిన నేపథ్యంలో సున్నీ వక్ఫ్ బోర్డుతో పాటు మరికొందరు దాఖలు చేసిన ఈ కేసును సుప్రీంకోర్టు విచారించనుంది. ఫిబ్రవరి 8 నుంచి చివరి దశ వాదనలు వింటామని గత ఏడాది డిసెంబర్ 5 వ తేదీనే సుప్రీంకోర్టు తెలిపింది. సున్నీ వక్ఫ్ బోర్డు, నిర్మోహి అఖారా, రామ్ లాలాలకు భూమిని సమానంగా పంచి ఇవ్వాలని 2:1మెజార్టీతో అలహాబాద్ హైకోర్టు బెంచ్ 2010 లో తీర్పునిచ్చింది.

## డ్రోన్లు, విమానాల డిజైన్లకు ప్రేరణనిస్తున్న షార్క్ చర్మం



**బోస్టన్, ఫిబ్రవరి 7:** షార్క్ చేప చర్మంతో ప్రేరణ పొందిన అమెరికాలోని హార్వర్డ్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ కొత్త పదార్థాన్ని అభివృద్ధి చేశారు. దానితో విమానాల ఎయిరోడైనమిక్స్ పనితీరును, గాలిమరలు, డ్రోన్లు, కార్ల చలనాన్ని మెరుగుపరచవచ్చని భావిస్తున్నారు. రాయల్ సొసైటీ ఇంటర్‌ఫేస్‌కు చెందిన ఓ ప్రచురణలో ఈ పరిశోధన వివరాలు వెల్లడయ్యాయి. షార్క్ (సొరచేప)లు, విమానాలు వాస్తవానికి భిన్నమైనవి కావు. అవి రెండూ సునాయాసంగా ముందుకు కదులుతాయి. అవి తమ నిర్మాణాన్ని ఉపయోగించుకొని పైకి ఎగురగలుగుతాయని పరిశోధకులు పేర్కొన్నారు. షార్క్ చర్మంపై వేల సంఖ్యలో పొలుసులు లేదా దంతాలు ఉంటాయి. అవి శరీరమంతటా వేర్వేరు పరిమాణాలలో, రూపాలలో ఉంటాయని హార్వర్డ్ ప్రొఫెసర్ జార్జ్ లాడర్ పేర్కొన్నారు. షార్క్ బరువును తేలికపరిచే ఆ దంతాలకు గల లక్షణంపైనే పరిశోధనలు కేంద్రీకృతమయ్యాయన్నారు. ఆ దంతాలను కృత్రిమంగా రూపొందించి విమానాల రెక్కలకు ఉండే ఎయిర్‌ఫాయిల్స్‌కు అమర్చామని చెప్పారు. డ్రోన్లు, విమానాలు, గాలిమరల వంటివి గాలిలో పైకి లేవటానికి, ముందుకు సాగటానికి ఆ ఎయిర్‌ఫాయిల్స్ ఎలా దోహదపడుతాయో పరీక్షించాలనుకుంటున్నామని తెలిపారు.

## దక్షిణ కొరియా వింటర్ ఒలింపిక్స్‌కు కిమ్ సోదరి

- అధ్యక్షుడితో భేటీ కానున్న యో జోంగ్



**సియోల్:** దక్షిణ కొరియాలో జరిగే శీతాకాల ఒలింపిక్స్‌లో ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ సోదరి పాల్గొననున్నారు. పలు చర్చల అనంతరం ఉత్తర కొరియా తమ క్రీడాకారులను శీతాకాల ఒలింపిక్స్‌కు పంపేందుకు అంగీకరించింది. ఈ నేపథ్యంలో కిమ్ జోంగ్ సోదరి యో జోంగ్ ఈ వారంలో దక్షిణ కొరియాలో పర్యటించనున్నారు. కిమ్ కుటుంబసభ్యులు ఒకరు ఇలా దక్షిణ కొరియాలో పర్యటించడం ఇదే తొలిసారి. దక్షిణ కొరియా ప్యాంగ్‌చాంగ్ నగరంలో శుక్రవారం నుంచి శీతాకాల ఒలింపిక్స్ మొదలవనున్నాయి. ప్రారంభకార్యక్రమంలో ఇరుదేశాలు ఒకే జెండా కింద పాల్గొననుండటం విశేషం. ఇప్పటికే 280 మందితో కూడిన ఉత్తర కొరియా ఆటగాళ్ల బృందం దక్షిణ కొరియా చేరుకుంది. తన పర్యటనలో భాగంగా దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో యో జోంగ్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి.



## 80 అడుగుల బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించిన బీహార్ సీఎం నితీశ్

**ససారమ్ (బీహార్), ఫిబ్రవరి 7:** ఆధ్యాత్మిక గురు పైలట్ బాబా ఆశ్రమంలో ఏర్పాటుచేసిన 80 అడుగుల ఎత్తైన బుద్ధ విగ్రహాన్ని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ బుధవారం ఆవిష్కరించారు. అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించేందుకు ససారమ్ వచ్చిన సీఎం నితీశ్, పైలట్ బాబా ఆశ్రమానికి చేరుకుని బుద్ధ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆశ్రమంలో నిర్వహించిన ప్రార్థనల్లో నితీశ్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు కూడా అయిన జనతాదళ్ (యు) రాష్ట్ర అధ్యక్షుడు వశిష్టనారాయణ్ సింగ్‌తో పాటు సీఎస్ అంజనీ కుమార్ సింగ్, డీజీపీ పీకే ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

## మనమూ సైనిక సత్తాను ప్రదర్శిద్దాం!

- ఈ ఏడాది భారీ సైనిక పాటవ ప్రదర్శనకు ట్రంప్ ఆదేశం
- 1991 తరువాత అమెరికాలో ఇదే తొలిసారి



**వాషింగ్టన్/ టోక్యో, ఫిబ్రవరి 7:** అమెరికా సైనిక పాటవాన్ని ప్రదర్శించే విధంగా ఈ ఏడాది బ్రహ్మాండమైన పరేడ్ నిర్వహించాలని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రక్షణశాఖను ఆదేశించారు. 'మన సైనిక సత్తాను ప్రజలు తిలకించాలి. తమ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని రక్షిస్తున్న సైనికులను ప్రజలు కొనియాడే విధంగా ఉత్సవాన్ని నిర్వహించాలి' అని ట్రంప్ రక్షణశాఖను ఆదేశించినట్లు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ సారా సాండర్స్ తెలిపారు. భారత్‌తోపాటు, చైనా, ఫ్రాన్స్ తదితర పలు దేశాలు ఏటా సైనిక పాటవ ప్రదర్శలు జరుపుతుంటాయి. కానీ ప్రపంచంలో అత్యంత శక్తిమంతమైన దేశమైన అమెరికాలో అటువంటివి నిర్వహించడం చాలా అరుదు. లోగడ 1991 జూన్‌లో సైనికపరేడ్ జరిగింది. గత ఏడాది ఫ్రాన్స్ జాతీయదినోత్సవం సందర్భంగా ఘనంగా జరిగిన సైనిక పాటవ ప్రదర్శనకు ట్రంప్ హాజరయ్యారు. ఆ కార్యక్రమాన్ని చూసి అబ్బురపడ్డారు. తమ దేశంలో కూడా ఇకపై తరుచు అటువంటి ప్రదర్శనలు నిర్వహించాలని ఆయన భావించినట్లు సమాచారం. గత జనవరి 18న సైనికాధికారులతో సమావేశంలో ఆయన ఈమేరకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిసింది. అయితే ట్రంప్ ఆలోచనపై దేశంలో మిశ్రమ స్పందన కనిపిస్తున్నదని వాషింగ్టన్ పోస్ట్ పత్రిక తెలిపింది. ట్రంప్ ఆలోచన ఆయన నియంతృత్వ పాలనా ధోరణిని తెలియజేస్తున్నదని రిటైర్డ్ మేజనర్ జనరల పాల్ ఈటన్ విమర్శించారు.

**ఉత్తరకొరియాపై మరిన్ని ఆంక్షలు విధిస్తాం: మైక్‌పెన్స్**

ఉత్తరకొరియాపై మరిన్ని కఠినమైన ఆర్థికఆంక్షలు విధిస్తామని అమెరికా ఉపాధ్యక్షుడు మైక్‌పెన్స్ తెలిపారు. జపాన్ పర్యటనలో ఉన్న ఆయన బుధవారం ఈ సంగతి వెల్లడించారు. దక్షిణకొరియాలో జరుగుతున్న శీతాకాల ఒలింపిక్స్ ప్రారంభోత్సవానికి హాజరుకావడానికి ముందుగా మైక్‌పెన్స్ జపాన్‌కు వెళ్లారు. జపాన్‌తో కలిసి ఉత్తరకొరియాపై ఒత్తిడులను తీవ్రతరం చేస్తామని చెప్పారు.




**కర్ణాటకలోని శ్రావణబెళగొళలో పన్నెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే మహాకుంభాభిషేక ఉత్సవాలను బుధవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రారంభించారు. ఈనెల 17న గోమతేశ్వరుడికి మహాకుంభాభిషేకం జరుగనుంది. వేలాదిమంది జైనులు ఈ ఉత్సవాల సందర్భంగా స్వామిని దర్శించుకుంటారు. 57 అడుగుల ఎత్తయిన రూపంతో ఉన్న గోమతేశ్వరుడిని జైనులు బాహుబలిగా పూజిస్తారు.**

## ముస్లింలను పాకిస్థానీలు అని పిలిస్తే జైలు!

- ఆ మేరకు చట్టం చేయాలి: అసదుద్దీన్

**న్యూఢిల్లీ:** భారతీయ ముస్లింలను పాకిస్థానీ అని నిందిస్తే శిక్షించాలని ఎంఐఎం అధ్యక్షుడు, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. మూడేండ్ల జైలుశిక్ష విధించేలా చట్టం తీసుకురావాలని బుధవారం లోక్‌సభలో విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లును బీజేపీ ప్రభుత్వం తీసుకురాదనే ఉద్దేశ్యంతో ఇన్నిరోజులు మౌనంగా ఉన్నానని తెలిపారు. ట్రిపుల్ తలాక్ బిల్లు మహిళా వ్యతిరేకి అని అసదుద్దీన్ పేర్కొన్నారు. దీంతో ముస్లింల సామాజిక సమస్యలు తీరవన్నారు. ఈ బిల్లు ముస్లింలను జైలుకు పంపించేందుకు చేస్తున్న కుట్రగా అభివర్ణించారు. వరకట్న మరణాలు, ఇతర నేరాలపై కఠిన చట్టాలు తీసుకొచ్చినప్పటికీ అలాంటి నేరాలు జరుగుతూనే ఉన్నాయని గుర్తుచేశారు.

### భారత్‌లో ముస్లింలకు ఏం పని?: వినయ్ కతియార్

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 7:** ముస్లింలపై మరోసారి బీజేపీ ఎంపీ వినయ్ కతియార్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్‌లో ముస్లింలకు ఎలాంటి పనిలేదన్నారు. ముస్లింలు బంగ్లాదేశ్‌లో గానీ పాకిస్థాన్‌లో గాని స్థిరపడాలని సూచించారు. దేశాన్ని మూడుగా విభజించిన తర్వాత కూడా వారు ఇక్కడ ఉండాల్సిన అవసరంలేదని వినయ్ కతియార్ చెప్పారు. భారత్‌లోని ముస్లింలను పాకిస్థానీలు అంటే కేసు పెట్టాలని లోక్‌సభలో ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ చేసిన వ్యాఖ్యలకు వినయ్ కతియార్ ఇలా ఘాటుగా స్పందించారు.

## బాలీవుడ్ నటుడు జితేంద్రపై లైంగికదాడి కేసు

- 47 ఏండ్ల కిందట జరిగిన ఘటనపై బాధితురాలు ఫిర్యాదు



**ముంబై:** బాలీవుడ్ అలనాటి నటుడు జితేంద్ర(75)పై లైంగికదాడి కేసు నమోదైంది. అయితే ఈ దాడి జరిగింది ఇప్పుడు కాదు. దాదాపు 47 ఏండ్ల కిందట. జితేంద్రకు వరుసకు సోదరి అయ్యే మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సిమ్లా పోలీసులు చెప్పారు. 1971లో సిమ్లాలో షూటింగ్ సందర్భంగా ఓ హోటల్‌లో తనపై లైంగికదాడికి పాల్పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ తల్లిదండ్రులు బాధపడుతారన్న ఉద్దేశంతోనే ఈ విషయాన్ని ఇప్పటి వరకు బయటపెట్టలేదని ఆమె తెలిపారు.



# ఎయిమ్స్‌లో 700 స్టాఫ్‌నర్స్

- నర్సింగ్‌లో డిగ్రీ, డిప్లొమా ఉత్తీర్ణత.
- మంచి జీతాలు, ఉద్యోగ భద్రత
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ ద్వారా ఎంపిక

**భోపాల్‌లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) ఖాళీగా ఉన్న గ్రేడ్-II స్టాఫ్‌నర్స్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




**వివరాలు:**

- మొత్తం పోస్టుల సంఖ్య: 700
- **పోస్టు పేరు:** సీనియర్ నర్సింగ్ ఆఫీసర్ -100 పోస్టులు (జనరల్-51, ఓబీసీ-27, ఎస్సీ-15, ఎస్టీ-7)
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి నాలుగేండ్ల బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్), బీఎస్సీ నర్సింగ్ (పోస్టు బేసిక్)లో ఉత్తీర్ణత. నర్స్ అండ్ మిడ్‌వైఫరీలో సెంట్రల్/స్టేట్ లేదా ఇండియన్ నర్సింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వం లేదా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలి. 200 పడకలు గల ఏదైనా హాస్పిటల్/హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో స్టాఫ్‌నర్స్‌గా మూడేండ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 9,300-34,800 + గ్రేడ్ పే రూ. 4,800/-
- **పోస్టు పేరు:** నర్సింగ్ ఆఫీసర్ (స్టాఫ్‌నర్స్ గ్రేడ్ -II) -600 పోస్టులు (జనరల్-303, ఓబీసీ-162, ఎస్సీ-90, ఎస్టీ-45)
- **అర్హత:** ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి బీఎస్సీ (ఆనర్స్) నర్సింగ్ లేదా బీఎస్సీ నర్సింగ్ లేదా బీఎస్సీ (పోస్టు సర్టిఫికెట్)/పోస్టు బేసిక్ బీఎస్సీ నర్సింగ్ లేదా జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీలో డిప్లొమా ఉత్తీర్ణత. నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ స్టేట్/సెంట్రల్ నర్సింగ్ కౌన్సిల్‌లో సభ్యత్వాన్ని కలిగి ఉండాలి. 50 పడకలు గల ఏదైనా హాస్పిటల్/హెల్త్‌కేర్ హాస్పిటల్‌లో స్టాఫ్ నర్స్‌గా మూడేండ్లపాటు పనిచేసిన అనుభవం ఉండాలి.
- **పే స్కేల్:** రూ. 9,300-34,800 + గ్రేడ్ పే రూ. 4,600/-
- **వయస్సు:** 21 ఏండ్ల నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి (గ్రేడ్-I నర్స్ పోస్టులకు 21 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి). ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **వయస్సు:** 21 ఏండ్ల నుంచి 30 ఏండ్ల మధ్య ఉండాలి ( గ్రేడ్-I నర్స్ పోస్టులకు 21 నుంచి 35 ఏండ్ల మధ్య ఉండాలి). ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఐదేండ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేండ్లు, పీహెచ్‌సీ అభ్యర్థులకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **ఎంపిక:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్/ రాతపరీక్ష
- **అప్లికేషన్ ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులు రూ. 1000/- , ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మహిళా అభ్యర్థులకు ఫీజు లేదు.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో. పూర్తి వివరాలతోపాటు, వినియోగంలో ఉన్న ఈ-మెయిల్ ఐడీ, మొబైల్ నంబర్‌ను ఎంటర్ చేయాలి. నిర్ణీత ఫార్మాట్‌లోనే ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **చిరునామా:** Administrative Officer, All India Institute of Medical Sciences Bhopal, Saket Nagar, Bhopal - (MP)
- **దరఖాస్తులకు చివరితేదీ:** మార్చి 6
- **ఆన్‌లైన్ హార్డ్‌కాపీలకు చివరితేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** www.aiimsbhopal.edu.in




## ఐఐఎంలో పీజీ ప్రోగ్రామ్

**షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లో పీజీపీఈఎక్స్ కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**

**షిల్లాంగ్‌లోని ఐఐఎం, ఓషియన్ యూనివర్సిటీ ఆఫ్ చైనా సంయుక్తంగా ఈ కోర్సును నిర్వహిస్తున్నాయి.**

- **కోర్సు:** పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రామ్ ఫర్ ఎగ్జిక్యూటివ్స్ ఇన్ మేనేజింగ్ బిజినెస్ ఇన్ ఇండియా అండ్ చైనా (పీజీపీఈఎక్స్ - ఎంబీఐసీ)
- **కోర్సు కాలవ్యవధి:** 14 నెలలు
- ఇది ఫుల్‌టైం రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. చైనాలో ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- **అర్హతలు:** క్యాట్/జీమ్యాట్ స్కోర్, గ్రాడ్యుయేషన్‌తోపాటు ఐదేండ్ల అనుభవం ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** ఏప్రిల్ 30
- **వెబ్‌సైట్:** www.iimshillong.ac.in

## బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 43 ఖాళీలు

**జాతీయ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న ఆఫీసర్ (స్కేల్-I, స్కేల్-II) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




**వివరాలు:**

**పుణె ప్రధాన కార్యాలయంగా పనిచేస్తున్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర దేశవ్యాప్తంగా 29 రాష్ర్టాల్లో 1897 బ్రాంచి నెట్‌వర్క్‌ను కలిగి ఉంది. దీన్ని 1935 లో ఏర్పాటుచేశారు.**

- మొత్తం పోస్టుల సంఖ్య: 43 పోస్టులు
- పోస్టు పేరు: ఆఫీసర్ (స్కేల్-I, స్కేల్ -II)
- విభాగాల వారీగా ఖాళీలు: సాఫ్ట్‌వేర్ ప్రోగ్రామర్ - 4, సాఫ్ట్‌వేర్ టెస్టర్-3, ఒరాకిల్ డాటాబేస్ అడ్మినిస్ట్రేటర్-1, ఎంఎస్‌ఎస్‌క్యూల్ డాటాబేస్ అడ్మినిస్ట్రేటర్-1, నెట్‌వర్క్ అడ్మినిస్ట్రేటర్-4, డాటా అనలిస్ట్-10, ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్-5
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్), బీసీఏ, బీటెక్/బీఈ, ఎమ్మెస్సీ (కంప్యూటర్ సైన్స్), ఎంసీఏ, మాస్టర్ డిగ్రీ (మ్యాథమెటిక్స్, స్టాటిస్టిక్స్, కంప్యూటర్ సైన్స్, డాటా సైన్సెస్, అనలిటిక్స్)లో ఉత్తీర్ణత
- **పోస్టు పేరు:** చీఫ్ మేనేజర్-10 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి సీఏ లేదా బీఈ/బీటెక్‌తోపాటు ఎంబీఏ ఉండాలి.
- **పోస్టు పేరు:** హెచ్‌ఆర్/పర్సనల్ ఆఫీసర్-5 ఖాళీలు
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి హెచ్‌ఆర్‌లో మాస్టర్ డిగ్రీ/డిప్లొమాలో ఉత్తీర్ణత. ఎంబీఏ (హెచ్‌ఆర్)/ఎంఎస్‌డబ్ల్యూ, ఎంపీఎం, ఎల్‌ఎల్‌బీలో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 25 నుంచి 40 ఏండ్ల మధ్య ఉండాలి.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 600/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులు రూ. 100/-
- **ఎంపిక:** రాతపరీక్ష/ పర్సనల్ ఇంటర్వ్యూ
- **దరఖాస్తు:** ఆన్‌లైన్. నిర్ణీత నమూనాలో అభ్యర్థి ఫొటో, సంతకాన్ని అప్‌లోడ్ చేయాలి.
- **చివరితేదీ:** ఫిబ్రవరి 22
- **వెబ్‌సైట్:** www.bankofmaharashtra.in

## పీహెచ్‌డీలో ప్రవేశాలు



**రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నాలజీ (ఆర్‌జీసీబీ)లో పీహెచ్‌డీ ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదలైంది.**

**వివరాలు:**


**భారత ప్రభుత్వ రంగ సంస్థ. కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ పరిధిలో పనిచేసే స్వతంత్రసంస్థ. దీని ప్రధాన కార్యాలయం తిరువనంతపురంలో ఉంది.**

- ప్రోగ్రామ్: పీహెచ్‌డీ
- విభాగాలు: డిసీజెస్ బయాలజీలో పలు ఏరియాలు.
- ఈ అడ్మిషన్లు ఫిబ్రవరి 2018 కోసం.
- దరఖాస్తు: వెబ్‌సైట్‌లో
- చివరితేదీ: మార్చి 2
- వెబ్‌సైట్: www.rgcb.res.in

# విద్య, ఉద్యోగ సమాచారం

## గార్డెన్ రీచ్‌లో టీఎంఈ/జీఎంఈ ట్రెయినింగ్ కోర్సు

**కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ లిమిటెడ్ ఏడాది వ్యవధి ప్రీ సీ (సముద్రం) ట్రెయినింగ్ కోర్సు కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




**వివరాలు:**

**ఈ సంస్థ మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ పరిధిలో పనిచేస్తుంది. ఈ కోర్సు 2018 మార్చి 1 నుంచి ప్రారంభమవుతుంది.**

- కోర్సు పేరు: టీఎంఈ/జీఎంఈ
- మొత్తం సీట్ల సంఖ్య: 50
- కోర్సు వ్యవధి: ఏడాది
- ట్రెయినింగ్ ఫీజు: రూ. 1,82,000/- (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ. 1,72,000/-) ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ అభ్యర్థులకు ఫీజు లేదు.
- **అర్హత:** గుర్తింపు పొందిన బోర్డ్/సంస్థ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్, మెకానికల్ అండ్ ఆటోమేషన్, నేవల్ ఆర్కిటెక్చర్ ఇంజినీరింగ్‌లో బీఈ/బీటెక్‌లో ఉత్తీర్ణత.
- **వయస్సు:** 28 ఏండ్లకు మించరాదు. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అప్లికేషన్ ఫీజు:** రూ. 1000/-.
- **ఎంపిక విధానం:** అకడమిక్ మార్కుల ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **చిరునామా:** In-charge(TTC), GRSE Ltd., 5, R. N. Tagore Road, (Near Dunlop Bridge) Kolkata-700056.
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 12
- **వెబ్‌సైట్:** www.grse.nic.in

## ఐవోసీఎల్‌లో జూనియర్ ఆపరేటర్లు

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) నార్తర్న్ రీజియన్ పరిధిలో ఖాళీగా ఉన్న జూనియర్ ఆపరేటర్ (నాన్ ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.**




**వివరాలు:**

**ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ అనేది ఇండియాలోని ఫార్చ్యూన్ గ్లోబల్ 500 కంపెనీల్లో అతి పెద్ద వాణిజ్య సంస్థ.**

- మొత్తం ఖాళీల సంఖ్య: 56 పోస్టులు
- **పోస్టు పేరు:** జూనియర్ ఆపరేటర్ (ఏవియేషన్)
- **అర్హత:** హయ్యర్ సెకండరీ లేదా ఇంటర్‌లో 45 శాతం (ఎస్సీ, ఎస్టీ 40 శాతం) మార్కులతో ఉత్తీర్ణత. వినియోగంలో ఉన్న హెవీ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలి. సంబంధిత రంగంలో ఏడాది పాటు అనుభవం ఉండాలి.
- **వయస్సు:** 18 నుంచి 26 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌లకు పదేండ్ల వరకు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **పే స్కేల్ :** రూ. 10,500-24,500/-
- **ఎంపిక:** రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, స్కిల్ ప్రొఫిషియన్సీ ఫిజికల్ టెస్ట్ ద్వారా. అభ్యర్థులు రాత పరీక్షలో సంస్థ నిర్ణయించిన కనీస అర్హత మార్కులను సాధించాలి.
- రాతపరీక్ష ఆబ్జెక్టివ్ విధానంలో మొత్తం 100 మార్కులకు ఉంటుంది. జనరల్ ఆప్టిట్యూడ్ అండ్ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్-40, రీజనింగ్ ఎబిలిటీస్-40, బేసిక్ ఇంగ్లిష్ లాంగ్వేజెస్ స్కిల్స్-20 అంశాల నుంచి ప్రశ్నలు వస్తాయి.
- ఈ ఆబ్జెక్టివ్ పరీక్షను 90 నిమిషాల్లో పూర్తిచేయాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** ఫిబ్రవరి 20
- **రాతపరీక్ష తేదీ:** ఫిబ్రవరి 25
- **వెబ్‌సైట్:** https://www.iocl.com